# స్వేచ్ఛా కవిత్వం

## నాలుగో సంపుటం (2016-2017)



మాదిరాజు రంగారావు

2026

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

# స్వేచ్ఛా కవిత్వం

**నాలుగో సంపుటం**

**రచనా కాలం 2016 - 2017**

## మాదిరాజు రంగారావు

### నాన్నగారి జ్ఞాపకార్థం

మా నాన్నగారు, ఆచార్య మాదిరాజు రంగారావు గారి విశిష్ట సాహిత్య సేవలకు నివాళిగా, మాదిరాజు రంగారావు గారి స్వేచ్ఛా కవిత్వం నాలుగో సంపుటం **(Volume IV)** పునః ముద్రణ చేసి సాహితీ సహృదయులకు, శ్రేయోభిలాషులకు అందుబాటులోకి తీసుకొస్తున్నాము.

**మాదిరాజు సంతోష్ కుమార్**

**దేవులపల్లి హరిత**

**మాదిరాజు చరిత**

రసధుని

సాహితీ పరిషత్తు

**శాంతినగర్, హైదరాబాద్-28.**

**SWECCHAA KAVITHVAMU**
**Volume IV (2016 - 2017)**

**by**
**Prof. Madiraju Ranga Rao**

© **Dr. M. Santhosh Kumar**

Edited by Madiraju Santhosh Kumar
Devulapally Haritha
Madiraju Charitha

Frist Edition 2017
Second Edition 2026

ISBN : 978-93-5655-090-2

**Price : 1000/-**

*For Copies :*
Dr. Madiraju Santhosh Kumar
98499 79899

*Printed at :*
**Anupama Printers**
Shantinagar, Hyderabad - 28
Phone : 040-23391364
E-mail : anupamaprinters1978@gmail.com

# స్వేచ్ఛా కవిత్వం

## నాలుగో సంపుటం

## రచనా కాలం 2016 - 2017

## విషయ సూచిక


1. వర్తమాన స్వనం (65)...................................... (2016)
2. లైన్ క్లియర్ (66)........................................... (2016)
3. వర్తమాన వాస్తవం (67).................................. (2016)
4. వర్తమాన లహరి (68)....................................... (2016)
5. వర్తమాన యానం (69)...................................... (2016)
6. వర్తమాన సంకేతం (70).................................... (2016)
7. ఇదే దారి (71)................................................... (2016)
8. నవ మానవం (72)........................................... (2016)
9. ప్రపంచీయం (73)............................................ (2017)
10. హృది కిటికి నుండి (74)................................. (2017)
11. కార్నర్ కవితలు (75)......................................... (2017)

# ముందుమాట

## ఈనాటి కవిత్వం

కవిత్వం ఆధునిక కాలంలో సామాజిక రాజకీయ ఆర్థిక మనస్తత్వ కోణాల ప్రవేశంతో, మానవీయ తలంపై పూర్వం కన్నా ఎక్కువగా వేరుగా అస్తిత్వాన్ని పొందింది. దీనికనుగుణంగా రూపం కూడా మారింది. పద్యం స్థానంలో స్వేచ్ఛా కవిత్వం చోటు చేసుకుంది. కాలం గడచే కొద్దీ బలపడుతూంది. కేవలం వచనం కన్నా పద్యం గేయం వచనంలోని అంశాల ప్రమేయంలో ఒక విశిష్టమైన సంశ్లిష్టత (Complexity) ను పొంది రచనా శిల్ప సుందరతపైనా దృష్టి కలిగి ఉన్నదన్నమాట. ఇది పరంపరను మన్నిస్తూ, కొత్తదనాన్ని స్వాగతిస్తూ, తనదైన ప్రత్యేకతతో ప్రకాశిస్తూంది. ఈనాడు అవసరమైన భావ జాలాన్ని చక్కగా వెలిబుచ్చే ఉత్తమ సాధనంగానూ స్థిరపడింది.

ప్రతి కవి ఏదో ఒక కొత్తను చూపే ప్రయత్నం చేయడం జరుగుతూంది. (1) వస్తువులో సమాజం – విషయంలో జీవితం – లక్ష్యంలో మానవ వికాసం – విశ్వహితంతో (2) జీవన వాస్తవికతలతో (3) కళాత్మకమైన నిర్మాణాలతో ఆకర్షిస్తూంది. ఈ కాలంలో స్వేచ్ఛా కవిత్వం ఉపయోగకరమైన పాత్రను నిర్వర్తిస్తూంది. ఇది ఎప్పటికప్పుడు పొందే కొత్తదనం చేతనే సాధ్యమవుతుంది.

ప్రాంతీయ జాతీయ సీమలలో క్రియాశీల పాత్రను నిర్వహిస్తూ క్రమంగా విశాలమైన విశ్వ దృష్టితో మానవీయ భావనతో, ప్రధాన స్రవంతి ప్రాధాన్యాన్ని కలిగి ఉండటమూ జరుగుతూంది. అన్ని విధాలయిన కవిత్వాలూ ఆయా సందర్భాల్లో వివిధ స్థాయిల్లో ప్రయోజనాత్మకమైన పాత్రను చక్కగా పోషిస్తున్నాయి. ఇవి కనీస స్థాయిలో (1) కళ (2) దార్శనిక (3) భావ సౌందర్యాల యోజనలో ప్రమాణాల్ని పాటించడం అవసరం. దీనిచేత కాలాన్ని జయించే యశోరూపాన్ని పొందడం జరుగుతుంది. పరంపరలో భాగమై నిలుస్తుంది.

ఏదో ఒక విశిష్టత చేతనే కవిత్వం ఆకర్షిస్తుంది, రాణిస్తుంది. ప్రత్యేకతలతో ప్రయోగాలతో ఇప్పుడున్న స్థితి, కవిత్వం పట్ల అభిలాషను అభిమానాన్ని ఆలోచననూ పెంచేదిగా ఉంది. సమాలోచనానికి పురికొల్పేదిగానూ ఉంది. ఇది మంచి పరిణామం.

**మాదిరాజు రంగారావు**

స్వేచ్ఛా కవిత్వం - 65

# వర్తమాన స్వనం

మాదిరాజు రంగారావు

2016

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 28.

# VARTHA MAANA SWANAM

**(Telugu Poetry)**

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2016

Presented to
my son
**Dr. M. SANTHOSH KUMAR**
on his birthday
with blessings

## పీఠిక

# సృజన రచన - స్వేచ్ఛ

ప్రతి రచనకూ ముఖ్యంగా కవిత్వానికి అనుభవం - స్పందనంతో సందర్భం ఉంటుంది. ఆధునిక కాలంలో స్థూలంగా విషయం ప్రధానంగా

1) మనిషి - సమాజం 2) వ్యక్తి - జీవితం

3) విలువలు - వికాసం 4) లక్ష్యం - పురోగమనం

అంశాలతో విస్తారంగా కనిపిస్తుంది. దీనికి హేతు దృష్టితో కూడిన, మానవీయ దర్శనం అవసరం, కనీసం మానవీయ భావన అయినా ఉండాలి. ఈ కారణంగా స్థానికం నుండి ప్రపంచస్థాయిలో రచనకు విశాలత లభిస్తుంది. ఈ దిశలో అవకాశాలెక్కువగా కనిపిస్తాయి. మానవ జీవితమూ సమాజం గురించి ఆలోచన బాగా కనిపిస్తుంది.

ఈనాడు ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వేచ్ఛా వాతావరణంలో విషయం ఎన్నిక - దాని నిర్వహణం అభివ్యక్తితోపాటు లక్ష్యంలో ఎంతో వైవిధ్యం వచ్చింది. భిన్న భిన్న వాదాలు వివిధ రాజకీయ సిద్ధాంతాలు సామాజిక దృష్టి కోణాలు బాగా ప్రభావితం చేస్తూ ఉన్న మాట వాస్తవం. ప్రజల అభిప్రాయాలు ఆకాంక్షలు సమస్యలు ప్రయోజనాలు గురించి ఆలోచనలు పదునుగా వర్తించడమూ జరుగుతూంది. ఇది ఒక సమస్య విషయంలో నిజాన్ని నిగ్గు తేల్చే సాధనంగా ఉపకరించడమూ గమనించవచ్చు. కొన్ని సందర్భాల్లో మితి మీరిన స్వేచ్ఛ అపకారం చేస్తున్న మాట కాదనలేము. అందువల్ల సృజన చేతనలో కవి ఎంతో వివేకంతో సమయ సందర్భాల్ని బట్టి సమాజ హితకరంగా వర్తించడం అవసరం.

ఈ విషయాల్ని దాటి కవి అంతరంగ (Conscience) ప్రమేయం తప్పని సరిగా పనిచేస్తుంది. దీన్ని మరచిపోవడం కుదరదు. దీని ప్రాధాన్యాన్ని తక్కువ

చేయడమూ పనికిరాదు. ఇది సూక్ష్మ (subtle) స్థాయిలో చాల శక్తివంతమైంది. ప్రేరణ గుణం కలిగింది.

మరో క్షేత్రంలో పాఠకులు అభిమానులు కొత్తను కోరతారు. గౌరవిస్తారు. ప్రోత్సహిస్తారు. కవిత్వం లేని మానవ సమాజ జీవన దశ లేదనే చెప్పొచ్చు. నాగరకతలో సంస్కృతి స్థాయి పెరిగే కొద్దీ దీని ప్రాధాన్యం పెరగడం చరిత్రలో జరిగింది. ఎంతగా వీటికి చోటు దొరికితే అంతగా కవిత్వం సమాజంలో వస్తుందని విజ్ఞుల అభిప్రాయం. మనిషిలో సృజన చేతనను అణచడం కుదరదు. ఇలా చేస్తే మనిషి అస్తిత్వానికే ప్రమాదం. అందునా ప్రజాస్వామ్యంలో దీనికి ప్రోత్సాహకాలు అవకాశాలు ఎక్కువ.

## ఈనాడు స్వేచ్ఛా కవిత్వంలో

1. మనిషి – సమాజం గురించి ఆలోచన బాగా కనిపిస్తుంది.
2. సబ్ ఆల్టరన్స్ (sub-alterns) కూ అవకాశం లభిస్తుంది.
3. స్వేచ్ఛతో పాటు సమత – సమన్యాయంతో కూడిన నవతను కోరుతుంది. ఈ పరివర్తన దృష్టితో సంప్రదాయ బంధాల్ని విశ్వాస పరంపరల్ని వదలుకోవలసివస్తుంది. దూరం కావలసి వస్తుంది.
4. కళాత్మకతతోపాటు సామాజిక ప్రయోజనమూ అభిలషిస్తుంది.
5. కవి సమాజంలో ఒకరుగా బాధ్యతతో ప్రవర్తించవలసిన అవసరాన్ని బాగా విశ్వసిస్తుంది.
6. మానవ మనస్తత్వ పరమైన అంశాల్ని పరిశీలిస్తుంది.

సమాజానికి మేలు చేసే విధంగా సృజన చేతన అక్షర దర్పణంలో బింబిస్తూంది. మానవ ప్రపంచానికి ప్రతినిధిగా ఆకర్షణీయతను పొందుతూంది. ఈ ఆకర్షణ మనిషిలో సూక్ష్మమైన అనుభూతి స్పందనం కళాత్మకత సామాజిక

శ్రేయస్సుతో ఎప్పటికీ ఉండేదీ. ఇది మానవ సమూహాల పరిణతికి అద్దం పడుతూంది. సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తూంది. ప్రగతిని ప్రోత్సహిస్తూంది. అస్తిత్వాన్ని కాపాడుతూంది. కాబట్టి దీని విలువ అనితరమైంది. కొన్ని సందర్భాల్లో లౌకికమైన పరిమితుల్ని దాటి ఉంటుంది. ఉత్తమశ్రేణికి చెందిన కవిత్వ రచనలలో దీన్ని బహువిధాలుగా గుర్తించవచ్చు.

కవితలో దార్శనికం (Ideology) నిర్వహించే పాత్ర విలక్షణమైంది. విలువైంది. ప్రయోజనంలో విస్త ృతికి బాగా ఉపకరించేది. ఇది అనుభవ సుందరమైన రచనకు అంతస్సత్వాన్ని ప్రసాదిస్తుంది. పూర్ణతను చేకూరుస్తుందన్న విషయం మరచిపోకూడదు.

ఈ వాస్తవ దృష్టి కోణాల్లో ఈనాటి స్వేచ్ఛా కవిత్వాన్ని చూడవలసిన అవసరం ఉంది. ఇవి ప్రాథమిక (fundamental) మైన అంశాలు. రచనలో వాటి విలువల్ని గమనించవచ్చు. ఒక్కొక్క కృతిలో ఒక్కొక్క విధంగా చారిత్రకమైన సంబంధం సామాజికమైన ప్రయోజనం వైయక్తికమైన వికాసంతో దర్శన మిస్తాయి. దీని ఆధారంగా కళానిర్మాణం జరుగుతుంది. ఆ విషయం వేరు.

ఈ “వర్తమాన స్వనం” కృతి – జరిగిన జరుగుతున్న స్థితి చిత్రణం కలిగింది. సామాజిక వైయక్తిక మనస్తత్వ భూమికల్ని ఆశ్రయించి భావ రూపాలు ప్రకాశ మానాన్ని పొందాయి. స్వేచ్ఛా కవిత్వంలో ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికత(Ideology)తో అభివ్యక్తి ప్రత్యేకతను కలిగిందీ సృజన రూపం. ఇది నా కృతుల్లో మొదటి నుంచీ నేను అనుసరించే మార్గంలో, విశ్వసించే లక్ష్యంతో రూపొందింది.

**మాదిరాజు రంగారావు**

# 1. మనిషి వశంలో అదృష్టం

కాలి కింద అణగి భూమి తలం
శిరసు పైన వంగి గగన తలం
ఎదిగే తన రూపానికి ఎదురుగా
ఒదిగి ఒదిగి నిలిచిన క్షితిజం !
ఇవి తన వశ మై నాయని సంతోషం! గర్వం!
మనిషిలో అహంకార విజల్పనం! విస్ఫోటం!

చీకటిలో కన్నా వెలుగులో
భయ మెక్కువ! మనిషికి లో లోపల

వెలుతురులో దృష్టికి వచ్చే రూపాలెన్నో
దీనితో సమస్య లెన్నో! పుట్టుక వస్తాయి
అయినా చీకటి నెవరు ఎన్నిక చేస్తారు?
నిద్రా జడ మనో రూపాలు తప్ప!

వెలుతురులో ముసు ముందుకు సాగే నడక
శూన్యానికి క్షణ మొక అంకెను చేరుస్తుంది.

ఇల్లు ఊరు దేశం ప్రపంచం
ఈ నాలుగు శ్రేణుల సోపానాలపై
మనిషి ఊహ కదలుతుంది తన పరివారంపై
పరిచయాలతో కొత్తవారు తన వారవుతారు.

అందరికీ జీవిత మొక సుందర వన శోభను పొందాలనీ
అందరిలో తమ హృదిలో ఒక మొక్క మొలిస్తే మంచిది.
స్నేహంతో సంఘం కళకళలాడాలని అందరికీ
తమతో అది మొదలయితే కావలసిందేముంది?

నైతిక నిజ వ్యక్తిత అట్టడుగున పడిపోయి
విషాద పర్వం అందుకోక ముందే
వర్తమాన కశ్మలాల వడ పోతలతో కాలం
సుందర పరిమళతను పొందద మొక అదృష్టం.

## 2. సమాధానం దొరుకుతుంది

స్వేచ్ఛలో పిడుగు పాటుతో
ఏ మయ్యేదీ అందరికీ తెలుసు.
స్వేచ్ఛగా తుపాను వీస్తే
ఏ మయ్యేదీ అందరికీ తెలుసు.

మెరపు మెరుస్తుంది స్వేచ్ఛగా
మనసులో దాగింది గుర్తుకు తెస్తుంది
సాలీడు పటంలా నిశ్శబ్ద కథలో
తెగిన దారం కదలుతుంది గాలిలో.

చినుకు జారుతుంది స్వచ్ఛంగా
ప్రకృతిలో సృజన హృదయం స్పందిస్తుంది

రోజుకు రోజు చేరుతూ కాలం
మహా సౌధ నిర్మాణ శిల్పాన్ని తలపిస్తుంది
ఎవరి మినీ ప్రపంచం వారిది
మరొకరికి తెలియని విషయ రహస్యాలతో

కల పూయదు ఫలించదు మళ్ళీ కనిపించదు
మనసులో గుర్తులు వదలి మాయమవుతుంది
ఇసుక ఎడారిలో పారే సన్నని స్రవంతిలా
పగలు రైలు పట్టాలపై మెరసే తళతళలా

చంద్ర కాంతి సరస్సులో మునిగి తేలుతూ ఉండాలనీ
సూర్య కాంతి స్రోతసిలో ఈదుతూ కదలి పోవాలనీ
మనిషిలో కోరిక! సాకారం పొందే యత్నాలెన్నో
కలలో సూచిత మవుతూ; ఆశను పోనీయవు

కొన్ని ప్రశ్నలకు! సమాధానం దొరకుతుంది
స్వగతంలోనో ఆకాశ భాషణంలోనో అలవోకగా

## 3. ఆ రూపం మనిషిదే

ఆ వచ్చే రూపం మనిషిదే! సందేహం లేదు
మనిషికీ మనిషికీ అఖాతంతో వంతెన అవసరమవుతుంది

నీరులా చొచ్చుకొని పోయే
తీగెలా అల్లు కొని పోయే
మనిషికి అవకాశం అవసరం
పరిచయ మొక వెలుగు సూచి మాత్రమే

ఒక నాటి వాస్తవం మరో నాటికి నాటకమవుతుంది
రంగ స్థల వేదికపై నటనలో ఉన్నంత వరకే
పాత్రల ఆదర్శ ప్రమాణాల ప్రకాశాలు
ఊహలో మెరుస్తాయి బ్రతుకులో మసక బారతాయి.

స్విచ్ ఆన్ అయితేనే
బల్బు వెలుగుతుంది, యంత్రం పనిచేస్తుంది
మొబైల్ వినిపిస్తుంది; మనో జగం అదే విధం,
మనిషికి మానవతను మరీ మరీ జ్ఞాపకం చేయాలసివస్తుంది

ప్రశ్న లొకటే! మనిషి కొక తీరు జవాబులు
మానవ సమాజ ప్రతిరూపాలే గాథలు!
అద్దంలో మనిషి ముఖం చూచినట్లు
మనో రూప దర్శనం! ఎప్పటికీ అసమగ్రం

విపరీత చర్యలో మనిషిని చూచి
అగ్ని ప్రక్కకు తొలగుతుంది.
పక్క నున్న చెట్టు! వెల వెల బోతుంది
భయం కమ్మి! బూది ముఖం వేస్తుంది.

పొగలతో ఆకాశం కళ్ళు మూత బడతాయి.
ఆ వచ్చే మనిషి రూపం ! చాటయిపోతుంది.

## 4. తెలిసిందీ

నిరు పేదకు తెలియవు
భాషా భేదాలు దేశాల సీమలు
స్వచ్ఛశీలంతో తెలవారడం తెలుసు
విరామ సుందంగా, రాత్రి రావడం తెలుసు

ఆకలిలో అనల స్పర్శ తెలుసు
కాస్త చల్లబడేందుకు, ఊరట పొందేందుకు
ఎక్కడి కయినా వెళ్ళడం తెలుసు!
బ్రతుకుకై సంచారం అన్వేషణ తెలుసు

విజయమంటే,
శిథిలమైన దృశ్యాలతో వికలమైన ప్రజలతో
వినాశన చిహ్నం కాదు,
శ్రమ అంటే,
నిరంతర బాధానుభవం కాదు.

విధి రహస్య హస్తం గురించి తెలియదు
నిన్నను మరచి, నేటిపై దృష్టితో జీవితం!
రేపటి ఉత్సాహం, రిజర్వులో ఉంటుంది.
కష్ట ఫలంతోనే,
బొగ్గు అయినా నిప్పు అయినా మంచు అయినా

కొండలు, కోటలు నదులు అడవులు సీమలతో
భూమి పై ఎక్కడి కక్కడ హద్దులు! రాజ్యాలు
ఆకాశం హద్దులు ఎరగదు
ఇది ఎవరి హస్త గతం కాదు.

గగనం ఎత్తు అందదు, హృదయం లోతు తెలియదు
ఎదిగిన కొద్దీ ఇంకా ఇంకా పైపైకి చేరాలనే,
అందరికీ అవకాశం ఉంటుందని తెలుసు
అడుగుకు భూమి తలం అవసరమనీ తెలుసు

## 5. అనుమానం లేదు

చెట్టు నడవదు, నడవ లేదు
స్వాగత పత్రం ప్రదర్శిస్తుంది.
చిన్న పెద్ద తర తమ భేదాలు లేకుండా
ఆశ్రయం కయి చేరే ప్రాణులనెన్నో

మూలం నుండి పాకుతూ చీమలు
కొమ్మల పై తిరుగుతూ వానరాలు
గూటికి చేరి సుఖించే పక్షులు
నీడన చేరే ప్రాణులు! మనుషులు !

చెట్టు కన్న తాను గొప్ప అనుకునే మనిషికి
ఎన్ని అవసరాలలోనో! చెట్టుతో పని!
అనుమానంతో మనసు మరో మనసుకు దూరంగా
స్వార్థంలో చిమ్మే నిప్పు రవ్వల భయానికి ఎడంగా

వీధిలో జరిగే ఎన్నిటికో చెట్టు! సాక్షి
ఇది నడవక పోవడం ఒక సానుకూల వరం!
పక్క నుండి నినాదాలతో హోరెత్తే ప్రొసెషన్
హఠాత్తుగా మంట లెగసే, ఏ షాపో, నిలయమో
మంటల మధ్య మనిషి! ధైర్యంగా స్తంభంలా
మంటలలో మనిషి! ఆ వేళ కాకపోతే మరో వేళ!

నిరసన ప్రతిఘటన! ప్రజాస్వామ్య చర్యల్లో
పొగలు క్రమ్మి 'చెట్టు!', దీన ముఖం వేస్తుంది

మనిషిలో వివేకం! వెర్రి మొర్రి తీరులలో
పంజరంలోనో బోనులోనో బంధింపబడీ
విడుదల అయ్యే బాధ్యత సమాజానిదీ
విడుదలకై యత్నం ఆ మనిషిదీ.

## 6. ప్రాణ మిత్రం

గేటు దగ్గర మృత్యువు అలకిడితో
చేతిలో పనుల్ని ముగించే తొందరలో
ఎప్పటి కపుడు లోనికి దయ చేస్తుందనే,
నా ప్రాణ మిత్రం! నిశ్శబ్దంగా రావడం! ఎంత సంతోషం!

ఒక పని గురించి అనుకోవడం వేరు
అది నెర వేరే విజయ భావన వేరు
మృత్యువు గురించి అనుకోవడం వేరు
అది అనుకున్న సమయానికి రావడం వేరు.

నేలపై ప్రజల కన్నీరు తుడిచేందుకు
నీలి మబ్బులో ఆరాటం! అంతా ఇంతా కాదు
మెరపులతో గర్జలతో ఎంతో సంరంభం!
క్షణాలలో గాలి తరలించుక పోవచ్చు.

వద్దన్నా వదలదు, అంటుకొనే ఉంటుంది నీడ!
వద్దన్నా ఆగదు, రెప్పలు వాలుస్తుంది నిద్ర

కనిపించని మృత్యువు! గేటు వద్ద నిలిచి ఉన్న
గాలి వార్త లొకటొకటి! మెల్లగా చేరతాయి
మబ్బు జాడ లేక పోయినా
ఎడారిలో విరిసిన  గులాబిలా నాలో సుందర ప్రాణం!

ఏ మస్తిష్క శాల ఖాళిగా ఉండదు.
బీరువాలో ఉంచిన అమూల్యాల్లా
ప్రదర్శనలో పరచిన వివిధ వస్తువుల్లా
దీని కెవరి ఇష్టంతో రుచితో పనిలేదు!

తన ఇంటి ముందే ఉన్న ప్రాణ మిత్రంపై
చాలా ఏండ్ల వరకూ దృష్టి పడనేలేదు! విచిత్రం

ముసు ముందుగ తెలిస్తే? చేసేదేముంది?
గుడి కట్టి దేవతగా నిలిపేరా?

లో నుండి బయటికి నడచి రాలేదా?
మనిషి భక్తి యుక్తులకు విజయం లభించేనా?

కల్పనలో అందంగా బంధించిన అపాయ రూపం
రక్షణ కవచం కావడమొక చెప్పరాని విశేషం

దప్పిక తీరే జల శీకరాలతో
అప్పటి వరకు ప్రవహించిన కాలం
గడ్డ కట్టి శిలా రూపాన్ని తలపిస్తుంది అపూర్వంగా
మృత్యు సంకేతం కన్న, మృత్యు నిలయం రమణీయం.

అగ్ని నుండి బయట పడే స్వర్ణ ప్రతిమ
చల్ల బడేందుకు జల స్పర్శలా
బాధలో హృదయానికి కరుణ అవసరం.

తపించి తపించి చల్లబడడం ఒక తీరు
ఇది నిరంకుశ మతుల ప్రభావం,
అప్పటి కప్పుడు జల సేచనం ఒక తీరు
ఇది ఉదార చరితుల వర్తనం.

ప్రవాహంలో తేలే సూర్య బింబాన్ని
            అందుకోవాలని బయలు దేరిన మనిషి
ఈదుతూ ఈదుతూ సముద్ర తీరం తాకి
            వెనక్కి వెళ్ళ లేక! అక్కడే ఆగిపోయి,
తాకే అలల పరవశతలో శిలయై శిల్పమై
            మానవ కథలో పొందే మలుపును చూపేనా?

అనుకునేదీ జరిగేదీ పెట్టెలో భద్రమైన వాస్తవం.
మనిషి గురించి మనిషికి తెలియనిదే ఎక్కువ!
కాలం స్థలం సందర్భం భావనా జగంలో
సృజన రూపం మారుతుంది, అనుభవ యానంలో

## 7. సంశయ భ్రమణంలో

చింతనలో విభేదాలు వ్యక్తి స్థాయిలో
గమనంలో విరోధాలు సంఘ స్థాయిలో
తప్పనిదీ చరిత్ర! ప్రజాస్వామ్య విధానంలో
ఏ నాటికైన! పరిష్కృతికి సమన్వయం అవసరం.

ప్రపంచ గ్రామం రూపానికి యోజనలో
మానవతను మరవడ మొక విషాద సందర్భం
భవిష్యత్తులో సమాజ విషమతలకు సిగ్నల్
మానవీయ సమతను నిలపడ మొక కర్తవ్యం

అరచేతిలో చాలీ చాలని చుక్కలతో
మతిలో కోర్కెల నీడలు ముసురు కొనీ
అవసరాల వెనక నుండి చీకటి భూమికలు
గూటి నుండి గూటికి పక్షుల వలె మనుషులు

ఏ విధాన మయినా, ఏ స్థితి గతి అయినా
హింసకు పట్టాభిషేక భావన, ఒక తమో ముద్ర

చూపులో ఉత్సాహం దిశల కొసలు చూడాలని
కాళ్ళలో ఉబలాటం అవని సీమ చేరాలని

ప్రశ్నల తూణీరంతో మును ముందుకు! మనిషి
ఆలోచనలో మెరిసే దార్శనికం! ఫోకస్‌లో

అర్థవంతమయిన మాటకు
సుగంధ స్పర్శ ఎరగని మనసులు!
ఉన్న ఆలోచన గడ్డ కట్టి
స్పందన తెలియని ప్రతిమలు!

సంశయ గుణ భ్రమణంలో తిరిగే రోజులు
ఏ దారిని చూపుతాయి, ఏలోకం తెలుపుతాయి.

## 8. అంతా మనుషులే

ఏ అతీత శక్తులను తలచినా
అలము కొనే అనల శమనం! కరుణ జలం తోనే

గొడుగులా మేఘపంక్తి
ఎప్పటికీ తలపై కదలుతూ ఉండదు
ఎదిగిన పూల చెట్టు
ఏ రోజూ ఎదురుగా పూలతో స్వాగతించదు

ఇష్టమైంది పొందేందుకు
భయ చక్రం నుండి విడుదల కావాలి
మంచి పనులు చేసేందుకు
మనో వికాస భూమికను పొందాలి

అడుగులకు హద్దు అవని
శిరసునకు హద్దు నభం

నేర విధం ఏదయినా ఎప్పటికీ
నీలి రంగులో చీకటి గుణంతో
నీడలో పాములా కదలుతుంది
వెలుగులో తాడులా పడి ఉంటుంది.

ఒక చూపులో దూసిన బాణంలా ప్రశ్న
ఒక చూపులో జారే పుష్పంలా జవాబు
గుణా లెన్ని విధాలో!
చూపు లన్ని విధాలు!

ఎప్పుడెవరితో అవసరమో అని
ముందుగ మెట్టు మెట్టుగా మలచుకొని
బ్రతుకు గడప లేదు మనిషి
శిరసు ఎత్త లేని మొక్క, ఎదిగే దెట్లా?

గుంపులో కలిసి, మాయ మయ్యే భయం లేదు
అందులో ఉన్న వారు! తోటి మనుషులే!

## 9. వెదికే పనిలో

ఉదయ రశ్మి ప్రసారంతో జీవన యంత్రం
చలన వేగ మందు కొనీ
మనషుల సంభాషణతో రమణీయంగా
క్రియా శక్తిని పరుగులు పెట్టిస్తుంది

గాలి కదలుతుంది
పసి పాపల కేరింతలు హత్తుకొని
ధ్వనులను చీలుస్తూ సాగే ఏడ్పులు నింపుకొని
అనునయ స్పర్శతో! ఊరట నిస్తుంది కూడ

పగలు తగిలిన గాయాలను చీకటి కప్పేస్తుంది
కళ్ళు మూత బడినా రాత్రి నిశ్శబ్దంగా
మనసు అడుగు నుండి వెలుగు రూపాలు
కదలుతూ ఎగురుతూ ఈదుతూ తేలుతూ

రాత్రి పన్నిన రహస్యం పగలు బయట పడుతుంది
దిన కర కాంతిలో మెరసే వజ్రపు ముక్కలా
దీన్ని ఏ విహగమో! ముక్కున కరచుక పో చూస్తుంది
కళ్ళు అప్పగించి ప్రజలు! చూస్తూ ఉండాలి సిందే!

నిన్నటి దృశ్యం ఆనవాలు లేకుండా పోతుంది
నేడు కావలసింది సంశయంలో పడేస్తుంది
ఆశ! ఆకాశం వైపు చూపిస్తుంది, సులభంగా
వాస్తవం! నేల పైకి దింపుతుంది తేలిగ్గా.

ఒంటరితనం వినిపిస్తుంది 'సోలో'' వయొలా లా
కాఫీ సువాసనతో! పొద్దు పొడిచిన సంతోషం!

తెల్లని దుస్తులపై
నల్లని చుక్కలు కొందరికి అందం!
తెల్లని దుస్తులపై
ఎర్రని పూలు కొందరికి అందం.

# 10. సమయం నిలవదు

ఇక్కడ అందరికి అన్నీ తెలుసు!
తెలియనట్లు కనిపించడ మొక అలవాటు!
సుభాషితం తెలియని మనసులేదు.
వర్తనలో నీటిలో మూటలా జారిపోతుంది.

నిలువెత్తు ఎదగడానికి బ్రతుకులో ఘర్షణ
తప్తమై జలదమై చినుకై ప్రవాహమై
తనలో చేతన! రూపాంతరమై సాగితేనే
బ్రతుకులో అదృష్ట ఫలం, దొరకుతుంది.

గగనంలో రవి బింబంలా ఆదర్శం
ఎవరి చేతికీ అందేది కాదు.
అద్దంలో సరస్సులో ప్రతిఫలిస్తూ
తన వశమైనట్లు అనిపిస్తుంది!

అడుగు పడిన క్షణం నుండి భూమి
మనిషిని కట్టేస్తుంది! అవసర బంధంతో

ఎవరికీ కనిపించిన ఆ దైవం గురించి
ప్రతి హృదిలో గుప్తంగా! చిదంబర రహస్యం

వీధిలోనో మైదానంలోనో
తాళం చెవి పారేసుకొని
వెదకే పనిలో తిరిగే మనిషిలా
పైన చంద్రుడు! ఉదయం వరకూ

తలుపులు వేసిన ఇల్లు అట్లా ఉంచి
తలుపులు తెరచి ఉన్న ఇల్లు వైపు చూస్తే
వాకిలిలో మనిషి ముఖం స్వాగత మిచ్చేనా?
లోనికి ప్రవేశం సులభంగా లభించేనా?

## 11. ఎవరి నుండో

వెలుగుల్ని చుట్టు ముట్టిన నీడలు
ప్రభుతను చూపేందుకు వెనకాడవు

అనల జ్వాలల మధ్య గడిపే
సాహస మెవరిలో ఉంది?
ఒక హిమానీ హృదయానికి తప్ప!
అది అంత సులభం కాదు!

తెరచిన కిటికి నుండి
సుమ పరాగ పరీమళాలకు బదులు
వీధిలో ఇరువైపుల నుండి
చల్లుకొనే దుమ్ము! కళ్ళను మూసేస్తుంది.

ఏ సమయం! ఎంతటి గొప్పదయినా
నిలవదు! డేరాలా అదృశ్య మవుతుంది
ఏ సమయం! ఎంతటి ప్రియమైనా
నిలవదు! మబ్బులా కదలి పోతుంది

ఎవరో విసరిన తాడు
దారిన వెళ్ళే కంఠానికి ఉరి కావచ్చు

ఎవరో పన్నిన వల
పనిలో వెళ్ళే కాళ్ళకు బంధనం కావచ్చు

గెలుపులో ఓటమిలో గొప్పదనం
ఇరు వైపుల నుండీ వాక్చిత్రం, వెడలుతుంది
ఒకరు ధైర్యానికి ప్రతినిధియై, తెరపై
ఒకరు త్యాగానికి చిహ్నమై, తెర వెనక్కి

రెండూ కలిసిన రూపం సమాజం
రెండూ కలిసిన ఉత్సాహం మానవం

## 12. సమాజ చేతనలో

భౌతిక మానస క్షేత్రాలలో శ్రమ రూపాలు
సమాజ భాగ్యానికి విలువలతో అసంఖ్యాకాలు.

ఒక వర్గం ఒక సమూహం శ్రేణుల అభ్యుదయం
ఏ సమాజ వికాసానికి పూర్ణత చేకూర్చదు.

వాదం ప్రతి వాదం చెలగి చెలగి
ఎక్కడో! ఒక చోట ఆగక తప్పదు.
జరిగి జరిగి చర్యకు ప్రతి చర్యకు
ఎక్కడో! ఒక చోట నిలవక తప్పదు.

విసరిన ఖాళీ సీసాల్లా స్వార్థంలో కలహాలు
ఢీ కొని ముక్కలు ముక్కలయి ఎగిరి పడి
తమనే కాదు పక్క నున్న మరొకరినీ
గాయ పరచ వచ్చు, రక్త చిత్రం చూపవచ్చు.

రాజకీయ తంత్రంలో ఎత్తులు హద్దులు దాటి
విసరిన మృత్యు పాశమై ప్రశ్నగ మారవచ్చు
ఎపుడూ చూడని అనుకోని విషాద రచన
చూడాలిసి వస్తుంది! కళ్ళు తెరచి ఉన్నందుకు

ఏ హృదయం శిలా శకలంలా పడి ఉండలేదు
మనిషిని నడిపిస్తుంది సచేతనలో స్పందనతో

సంకల్ప శిఖరం నుండి ఆశయ జలపాతం
కిందికి జారి పాయలుగా పారుతుంది
తరలే జలపాతానికి పరిమితులున్నట్లు
కదలే జీవన గతులకు పరిమితులు తప్పవు.

అచలం ఒంటరి తనాన్ని మబ్బు రాక పోగొడుతుంది.
చెట్టు ఒంటరి తనాన్ని పక్షుల సందడి పోగొడుతుంది.
మనిషి ఒంటరి తనాన్ని సమాజ చేతన పోగొడుతుంది.

## 13. యానం

గతి సూత్రంపై చలనంలో అయనం
భూమి పై నీటి పై నింగిలో వాహనం
ఒకటొకటి ఒక్కొక విధంతో పరిమితం

పవన పథాన సాగే విమానం
పై నుండి చూస్తే కిటికి అద్దాల నుండి
చూపుల్ని అలంకరించే దృశ్యా లొకటొకటి!

కింద నదీ నదాలు తీర ప్రాంత గాథలతో
మానవ సంస్కృతి శిఖరాలను స్పృశిస్తూ
జ్ఞాపకాల మెరపులలో చరిత్ర శకలాలు!
మనసుకు వేలాడుతూ చిత్రా లొకటొకటి!

సమాజావసరాలను తీరుస్తూ సాగే నిలయాలు
పచ్చదనం పరుస్తూ పూవు ఫలం అందిస్తూ
సన్నని చల్లని అలల చేతులు చాచి స్వాగతిస్తూ

బాధితులకు పీడితులకు ఆకలిలో ఆదరువుగా
తాపం చల్లారుస్తూ ఉపశమనం కలిగిస్తూ
ఎగసే కెరటాల పతాకలతో ధైర్యం చేకూరుస్తూ
జీవన శక్తికి ప్రేరణ సంకేతం ప్రవాహం
గతిలో పరుగెత్తే రైలును తలపిస్తుంది

ఆగని కాల గతికి ప్రతీక విమానం
వదలిన బాణంలా దూసుకపోతుంది
అణువణువును శబ్ద మయం చేస్తుంది
నిశ్శబ్ద రూపాల్ని ధ్వనితో అలంకరిస్తుంది

తూరుపు పడమర హద్దులు తొలగిస్తుంది
పయనించే వారి మనసు విశ్వమయం చేస్తుంది.

పోను పోను క్షితిజంలో ఆప్తత విప్పారుతుంది
దిక్కులు చేతులు చాచి పాపను వలె అలరిస్తాయి

విమానంలో ప్రయాణికులు మౌన సుందరంగా
బయటి ప్రజ లెవరూ కనిపించే స్థితి ఉండదు.

వీర గాథలలో పాత్రల రూపాల్లా నిలిచి స్థిరంగా
దూరం నుండి కొండలు చెదరని ధైరాన్ని ఇస్తాయి.

మంచు పొరల నుండి ఉదయం వెలుగు
గాలిలో తేలుతూ ఉంగరాలుగా గొలుసులుగా
అప్సరసల నృత్య భంగిమలను తలపిస్తాయి
చూపుల్ని భ్రమావరణంలో తిప్పుతాయి.

మంచు తొలగి సందేహం మాయమై
వాస్తవ దృశ్యం! సందేశం ప్రసరిస్తుంది

పలు వాద్యాల ధ్వనుల సహ యోగం తలపించే
పలు వాహనాల ధ్వనుల సంకలనం బదులుగా,
గాలి దారిలో విమాన యానంతో ధ్వని రూపం
ఒంటరిగా 'సోలో'' పాత్రను సూచిస్తూంది.

సముద్రం దాటుతూ ఉంటే! తరలి పోయే కెరటాలు
క్రమ శిక్షణతో కదలే బృందంలో సైనికులను తలపిస్తాయి.

విమానం దిగగానే విశాలమైన అవనిపై
స్వాగత ముఖంతో! మానవ సమాజంతో
ఒంటరితనం అదృశ్య మవుతుంది
మనస్సు సమూహ వశమయిపోతుంది.

అలల వలె కదలుతూ మనషులు చల్లని వాతావరణంలో
ఒక్కొక మనిషి హృదయం! ఒక్కొక విధం, సుమ సదృశం

విమాన యానం ముగిసి
రాత్రి కిటికి నుండి చంద్ర బింబం
నా ముఖం లోకి తొంగి చూస్తుంది
నాలో చీకటి లోయల్ని వెన్నెలతో నింపుతుంది.

విమాన యానం నుండి మనో యానం లోకి
మనో యానం నుండి జీవన యానం లోకి

## 14. పయనం

కలహ చక్ర భ్రమణంలో సమాజ దృశ్యాలు
ఉదయం కన్నా సాయం సంధ్యా చిత్రాల్ని తలపిస్తాయి.

అగ్ని బీజాక్షరాలు నాటిన మనస్సు
జ్వాలా పంక్తుల పుస్తక వన మవుతుంది

లక్ష్య మెంత భాగ్య సుందర మయితేనేమి?
స్మరణ మెంత ఉచ్ఛ స్థాయి పొందితేనేమి?
పరిష్కార వికల్పాలతో సమస్యలు!
ప్రశ్నలు కొత్తవి! జవాబులు పాతవి!

నిద్రా జడంలో తప్ప విరామం లేని మనిషి
హృదయంలో అగ్నులతో, కరుణ జలంకై చూచేను

అధికార బలంతో శాసన పర్వం మొదలవుతుంది
హద్దులు దాటిపోయి నిరంకుశం ఏలుతుంది
సమాజ మొక మహా నదీ సమం
మానస మొక లౌకిక యంత్ర మయం

ఎవరి కల వారి వరకు స్వంతం అయినా
మరొకరి మదిలో నాటాలని! ఉత్సాహం.

చూపులో వెలుగుకు పగలుతోనే సార్థకం
చీకటిలో దీపంతో ప్రయోజనం! పరిమితం.
జీవిక కై పనిలో మగ్న మైన మనసుకు
ఆయుధ సన్నాహంపై ఆలోచన మరలదు.

నిన్న నాగలి మేడి పైన చేయి
నేడు యంత్రం బటన్ పైకి మారింది
వ్యక్తి కేంద్రం నుండి సమూహ క్షేత్రంలోకి
పయనం! సమాజ వికాస చరిత్రలో భాగం!

## 15. నేనే కాదు

కవి భావనా జగం కవితలో మొదటి పంక్తి
నిలయం గేటు ముందు ఉత్సవ తోరణంలా

చెలియలి కట్టను దాటే ఉద్వేగంతో
ఊహ పొంగుతుంది, స్వరం విస్ఫారుతుంది.
వాతావరణంలో మోడు చివురు వేస్తుంది.
మనసు విధం మారిపోయి
సరికొత్తగ, అనుభవ లోకం

చెట్టు ఎప్పటిదో! చిన్న నాటిది
కనిపించే పూలు పండ్లు ఇప్పటివి!
పరిమళ మందరిదీ, పూవు ఫలం కొందరిది.

క్షణాల మెట్లపై సాగే కవి పయనం
ఆరోహణలో మెట్టు గడచి గతమై కవితయై
అడుగు వేయబోయే మెట్లు భవిష్యమై దర్శనమై
వ్యక్తి నుండి సమాజానికి వర్తమాన చరణం!

మెట్టు మెట్టు పై కథ – మానుష జీవన దృశ్యం
అడుగడున కోరిక, మానస రీతుల చిత్రం
దాహం ఆకలి చుట్టిన అనల శిఖల మధ్య నుండి
బయట పడే దారికై, మనిషిలో ఆరాటం
తీరని ఆరాటం నుండి దూకుతుంది పోరాటం
బ్రతికే సంకల్పం నుండి మరో మనిషి! జీవితం

తరాలు కాదు యుగాలు గడచి పోతున్నా!
సమస్యలవే! తిండి బట్ట నివాసం కాస్త హాయి!

కాల మహా ప్రవాహంలో మునుగుతూ తేలుతూ
అదే పనిగ పోతూ! తీరం చేరే
సన్నివేశ సుందరతను చూడాలని నిరీక్షణం
నేనే కాదు, పైనుండి సూర్యుడు చంద్రుడు! కింద సమాజం!

## 16. రహస్యాన్ని ఛేదించే

ప్రతి క్రియలో ఒక రహస్యం దాగి
దాన్ని ఛేదించే యత్నంలో మరో క్రియ
ఒక దాని నుండి మరొకటి! కనిపించకనే
బిందువు నుండి రేఖలతో చిత్రమవుతుంది!

భూమిలో నీరులా నీటిలో విద్యుత్తులా
పంజరంలో చిలకలా గుహలో సింహంలా
చివరన పులి ఎదురు పడిన హరిణంలా
జరిగిన పరిస్థితుల జ్ఞాపకాలు మెరుస్తాయి
తెలియని జీవ రహస్యం అన్వేషణకు
రాబోయే కాలం ఎప్పటికీ రిజర్వులో

తనకు మించిన పని అని ఎవరూ ఊరు కోరు
తెలుసు కొనే కోరిక! జీవన ప్రక్రియలో భాగం

జడమూ చేతన కలిసిన విశ్వం!
బ్రతుకులో గిరి ధుని ప్రతీకలతో కనబడుతుంది!

అందని ఎత్తు నుండి జలద బిందువు జారి
మోడు తలపై సృజన మకుటం నిలుపుతుంది
చూపు నిలవని స్థలం నుండి కిరణ తేజం
గడ్డ కట్టిన మంచు శిలకు అందమైన నడక నిస్తుంది.

రాత్రి వస్తుంది చీకటిని పరుస్తూ
దీపం గురించి కాదు, ఆలోచన
మనిషిలో కావలసిన వెలుగు గురించి

పగలు వస్తుంది నీడల్ని వదలుతూ
వెలుగు గురించి కాదు ఆలోకనం
మనిషిలో దూకే చీకటి గురించి
చుట్టిన రహస్యాన్ని ఛేదించే పనిలో
మనసులో ప్రయోగశాల! ఎప్పటికీ.

## 17. మనిషిలో రుతువులు

భూమి కంపించిన మృత్యు రేఖపై శిథిలాలు
పవన ఝంఝ వీచి నంత మేరలలో బీభత్సం
రణ చక్రం సాగిన సమాజ క్షేత్రాల్లో
పేలికలై గాలికి ఎగిరి పోయిన బ్రతుకులు

మంచికీ చెడుకీ మధ్య సన్నని గీత చెదరి
బూది యైన సమూహాల చరిత్ర అంచున
పచ్చదనంపై ఆశ తొలగని ఎడారి హృదయం
అడుగున నీటి చాలు! జాలు వారుతూ.

అవసరానికి తగిన రుతువు
కావలసిన సమయానికి అందదు
విరామ వేళలో కాల చక్రం
కదల కుండ నిలిచి పోదు.

శాంతి పై ఆశ ఒక వైపున
రణం పై చూపు మరో వైపున
విరుద్ధ గతులలో వ్యతిరేక చర్యలతో
సమాజ వలయంలో మనుషుల భ్రమణం

శత్రుతలో మస్తిష్కం ఆయుధ శాల అవుతుంది
మిత్రతలో హృదయం సుమ వన మవుతుంది.
ఆయుధం పట్టిన చేయి పూలదండ వహించవచ్చు
లౌకిక తంత్రంలో ఆపై సర్పమై వేలాడవచ్చు.

ధగ ధగలాడే కొలిమి యైన హృదయం
'ఆర్ద్ర' మైన పవనం కై పరితపిస్తుంది.

బాధలకూ వేదనకూ గురి చేసే
భూ కంపం తుఫాను అలజడులకు చెట్టు
భూమిని నమ్ముకొనే నిలుస్తుంది బ్రతుకుతుంది
మనిషిలో రుతువులు గుణచిహ్నాలుగ మిగులుతాయి.

## 18. కల్పనలో వాస్తవం

చంద్రునిలో మచ్చ ఎప్పటిదో?
కింది నుండి పైకి
విసరిన రాళ్ళకు తగిలిన గాయాల మచ్చలేమొ?
పై నుండి కిందికి
విసరేందుకు పోగు చేసిన రాళ్ళ కుప్పలేమొ?
కల్పనలో వాస్తవం అపుడపుడూ కవితలో.

మనిషిలో మంచు శిలలు కరిగి నాద ధుని అవడం
ఒక కళ అయినా, అది ఒక ప్రతిభా ప్రసార రూపం
ఒక త్యాగయ్య ఒక తాన్‌సేన్ ఒక బెథొవెన్ మరో స్రష్ట!

మనిషిలోని గుప్త నిధిని బయటికి తీయడం
ఒక ప్రజ్ఞ అయినా ఒక త్యాగ హృదయ ప్రకాశం
ఒక బుద్ధుడు ఒక లెనిన్ ఒక గాంధి మరో ద్రష్ట!
మనిషిలోని దేవత భూమిపై నడుస్తున్నట్లు ఉంటుంది
నవ యుగ ముఖంతో చరిత్ర అవతరిస్తుంది.

మాట మౌనాన్ని ముక్కలు చేస్తుంది
ప్రతి ముక్కలో స్వర లహరి కదులుతుంది
శబ్ధం నిశ్చలతను కదలిస్తుంది
ప్రతి కదలికల్లో వాద్య విశేషం తరలుతుంది

రాళ్ళను లెక్క చేయకుండా పరుగెత్తే ప్రవాహంలా
వేచి ఉన్న కళ్ళకు దూకే ఉషస్సులా
తరలుతుంది వాస్తవం, మెరుస్తుంది నిజ ముఖం!

ఉదయా లెన్నో వచ్చాయి, ముందూ దయచేస్తాయి
పొందే అనుభవాల ఛాయా గుచ్ఛాలు వేరు
జీవన బింబం లో దృశ్యం! మారక తప్పని వాస్తవం

## 19. ధ్వని సౌందర్యం

మౌనం సమాధాన పత్రం కాదు
ముఖంలో పలకలా పరచుకొని ఉంటుంది.
నిశ్శబ్దం శాంతికి చిహ్నం కాదు
నలు వైపుల నుండి మనిషిని బంధిస్తుంది.

మౌనంలో కదలిక మనసులో నిశ్శబ్దంగా
ఆగని జలనిధిలా అంతర్లహరులతో

ఇంటి గేటుపై ఎక్కడి నుండో వచ్చి పక్షి
నిశ్శబ్దంగా వాలుతుంది, శబ్దిస్తుంది.
మనుషుల వైపు చూస్తుంది, వెళ్ళి పోతుంది,
అది నా కోసమే వచ్చినట్లు ఉంటుంది.

గేటు బయట ఎప్పటిదో చెట్టు
మమ్మల్ని కని పెట్టుకొని ఉంది.
ఎంతటి పనిలోనూ, ఇంట్లో పెద్ద మనిషిలా
తల ఊపుతుంది, హృదయం విప్పుతుంది

గేటు పక్కన ఉన్న ఈ చెట్టు కింద
సందడి! ఎందరివో మాటలు చెవిన బడతాయి
సంబంధం లేక పోయినా! ఇష్టం లేకపోయినా
నాలో సమాజ చలన రూపం నింపుతాయి
తగవు మాటలెన్నో? ప్రియ భాషణ లెన్నో?
ఉద్యమ ఘోషలు కొన్ని! చిటపట చేష్టలు కొన్ని!

ముఖంలోని మౌనం! గిరి శిఖరం చేరుతుంది
చుట్టు ఉన్న నిశ్శబ్దం! ఆకాశం తరలుతుంది

ఆటలో గాయపడిన పిల్లల ముఖాలలో
ధ్వని చక్రంపై సీతాకోక చిలక తిరుగుతూ!
ఏమీ జరగనట్లు! అల్లరిలో ధ్వని సౌందర్యం!

## 20. సమస్య! మనిషి ముఖంతోనే

నా చిన్న నాటి నుండి
బాగా ఆకర్షించిన వస్తువు పెద్ద అద్దం
ఇంట్లో హాలులో మించిన సైజులో !
లోని కెవరు వచ్చేదీ పోయేదీ చూపిస్తుంది.

ఎవరూ లేని వేళ తీరిగ్గా తృప్తిగా
అద్దంలో నా ముఖ లోకం చూడాలని.

ఎపుడో! అద్దం ముందుకు రాగానే
పగలు! కిటికి నుండి వెలుగుల తళ తళ
నా ముఖ బింబాన్ని మింగేస్తుంది.
రాత్రి హాలులో బల్బుల మిల మిల
నా ముఖ బింబాన్ని కమ్మేస్తుంది.

నిశి చీకటి! తన ముఖాన్ని
నా ముఖ దర్పణంలో చూచుకుంటుంది
తన అందానికి మురిసి పోతుంది
తనలో సంతోషం చిందుతుంది చుక్కలుగా

బయటికి వెళ్ళినపుడు దారిలో సెంటర్‌లో
నిలబెట్టిన మానవ విగ్రహాన్ని చూస్తే,
అది పాల రాయి అయినా నల్ల రాయి అయినా
ఏ భేదం లేకుండా ముఖం వెలుగు రేకలా

విగ్రహం వదలుతుంది చాల సులభంగా
అద్దం మాత్రం! బహు కష్టంగా వదలుతుంది
అద్దంలో మైనస్ మనిషి దృశ్యంతో
ఏ సమస్య లేదు! మనిషి ముఖంతోనే! అసలు సమస్య

## 21. హృదయ రశ్మి అవసరం

ఎవరికీ పట్టని వీరంతా ఎవరు?
అందరిలో, ఇన్నేళ్ళుగా మానవులే!

గడ్డ కట్టిన ఈ మెలకువ
ప్రవహించే బాధ్యత ఎవరిది?
ఆ మానవ హృదయ రశ్మి ఎక్కడ?

సాధారణ జీవన చలనానికి నిర్దేశాలతో
మానవ హక్కుల పాలన నిర్ణయ సమితులతో
వెలసిన రాజ్యాంగం సాక్షిగ పౌరులు

ఊరులో నగరంలో సమూహాలు! ఎండిన పొదల్లా
తిండికి పిడికెడు గింజలు ప్రాప్తమై
వంటకు చిదుకులు వెదకే పనిలో మహిళలు,
రోజు గడవడ మొక కొండను దాటే యాతన

దారి మూత బడిన చీకటి పొగల మధ్య
నిలిచి పోయిన అగ్ని కీలకు ఏడుపు రాదు.
కళ్ళ నుండి బాష్ప కణం జారి పడదు.
సమాజ బంధం వీడి, పోయే దెక్కడి కని?

తమలో నింగిని మింగే శూన్యంతో
తమలో సంధ్యను దాచే వేదనతో
మూతబడే తలుపుల్లా కనురెప్పలు వాలతాయి.

ఉదయం పక్షుల కోలాహల రవంతో మెలకువ!
మెలకువ ప్రవహించే హృదయ రశ్మి అవసరం

మాటు వేసి దెబ్బ తీసే వేటరిలా
మనిషిలో స్వార్థం, మార్పును రానీయదు.

సుగమ పరిష్కారానికి సాధన మొకటే
అది! ప్రజాస్వామ్య సామ్యవాద హృదయం

## 22. వర్తమాన యానం

ఒక నచ్చిన కృతి సంగీతం
దృశ్యమో శ్రవణమో వాద్యం లోనో గాత్రం లోనో
వర్తమాన ప్రవాహంపై మనసును
ఒక నావలో విహరింప జేస్తుంది.

తీరం నుండి తీరానికి తరలిస్తుంది
చరిత్ర అంచుల్ని స్పృశింప జేస్తుంది.

ఏ పనిలో ఉన్నా స్వర గతి ననుసరించి
పదమో చేయో పెదవో కదలుతుంది
ఉన్న స్థితికి ఉత్సాహ పాత్ర నందిస్తుంది.

లౌకికానుభవానికి సమాంతరంగా
లోపల పరవశతలో మరో అనుభవం!
దీనికి పాత లేదు, ఎప్పటికీ సరికొత్తగా

ఒత్తిడిలో హృదయం స్తిమితమై
చంద్ర బింబ హ్లాదం ఆవరిస్తుంది.

హ్లాదం వేదన శాంతి ఆర్తి
కరుణం హాసం ఉత్సేకం ఉత్తేజంతో
మనసును స్పృశిస్తుంది, ఒక పూవు పూస్తుంది
ప్రశ్నను మరపిస్తుంది! జవాబు పరిమళిస్తుంది

అమ్మ ఎదపై ఉన్న శిశువు! చంద్ర బింబం చూచి
చేతులు చాచి అందుకొనే ఆరాటంలో
అమ్మ ముఖం చూచి! చేతులతో తడిమినట్లు
తెలిసి నట్లయి, తెలియని విషయాలెన్నో.

వర్తమాన ప్రవాహంపై సుందర యానంలో
మనిషి అనుభవం! రెండు అంతస్తుల నావలో.

# 23. వర్తమాన చేతన

ప్రతి వ్యక్తిలో అంతో ఇంతో భవిష్యత్తు దర్శనం
ఆ క్షణంలో ఆకాశం మేల్కొంటుంది, ఆశ్వాసం నింపుతుంది
వర్తమాన స్వరంతో మనిషి! వెలుగు నీడలు దాటుతూ
ఒకరిపై మరొకరికి అనుమానం! మనస్తత్వ గుణయుతం
అదొక పిలుపుతో కేకతో మాటతో పాటతో కవిత
బీడు నేలను పూలతో నింపే ప్రతిభతో

కష్టాల చిత్రాలతో పొగల సెగల క్రియల మధ్య
కనిపించని సంకెల ఘలం ఘలలతో ప్రదర్శనం!
బాధలో వ్యథలో బందీ అయిన స్థితులలో
నినాదాలతో మూసిన తలుపులు తెరచే సన్నాహం!

దారి తప్పిన మనిషి మనసు దారికి వచ్చే అవకాశంతో
మాట మారిన మనిషి నాల్క సరి చేసుకునే అవసరమతితో
ప్రతి వ్యక్తిలో అంత కంత వికాస సందర్భం!
ఈ అవని పై ఆకర్షణ భౌతికం! భూమిపై నడిపిస్తుంది

బండ రాళ్ళపై నడచి, నడచి ముళ్ళ బాధలో నలిగి నలిగి
అగ్ని కథలతో వాడి, మాడి వాలి పోయే బ్రతుకులో
నీడల్ని నమ్ముకొని నిలయం వీడే ఆలోచన ఎప్పటికీ ప్రమాదం
సమాజ చలనంతో పురోగమనం! వాస్తవాన్ని స్వనిస్తుంది.

ప్రతిరోజు ! సువర్ణాక్షరాలతో ప్రత్యక్ష మవుతుంది
యథార్థ మేమంటే! నిష్క్రమణంలో బూది పొరలు రాలతాయి.

ఉత్తేజం పొందే రశ్మి స్పర్శపై చూపులతో
మాలిన్యం తొలగే మహా ఝరిణి వైపు పయనం!
నీడలు తొలగిపోయి, అగ్నులు చల్ల బడి
వర్తమాన స్పందనతో నవ చేతన కొత్తగా.

## 24. పేటెంటు కవి

ఒకడు తన కలం ముల్లు మొనతో పొడుస్తాడు
ఒకడు అక్షరాల అనల కణాలు చల్లుతాడు
తన మాటే! చెల్లాలని విసరుతూ పోతాడు
తన బాటే పట్టాలని మసలుతూ పోతాడు.

ఎవరి గమ్యం వారికి సార్థం సమాజంలో
ఎవరి అస్తిత వారికి రమ్యం సృజనలో
ఒకరి పయనం నిర్ణయించే అధికారం లేదెవరికీ
ఒకరి వ్యక్తిత నణచేసే హక్కు లేదెవరికీ

కవితకు ప్రాణ శక్తి, మనిషి జీవనం
జీవితానికి ఆశ్రయం, చలన సమాజం

కవికి పలు విధాల క్షణాల నెదుర్కోక తప్పదు
ఆ క్షణం పుష్పం కావచ్చు తూటా కావచ్చు రాయి కావచ్చు
మృత్యువు సయితం బెదరుతుంది వణకుతుంది చకితంగా
కవి హృదయం అన్నిటినీ సహనంతో స్వాగతిస్తుంది.

ఒకడు చిలుకను గొంతులో నిలుపుకొని చరిస్తాడు
ఫ్లవర్ వేజ్ ముఖాన "వసంతం" లేబుల్‌తో తిరుగుతాడు.

ఇవి రచనకు అవసరాలు కావు, అలంకారాలు కావు
కాలంపై ధూళిలో కలిసి కనబడకుండా పోతాయి.

ఊగే ఊయెల పై కాల క్షేపం చేసే కవికి
ప్రవాహ మంటే! మహాభయం! తటస్థం!

ప్రచార రథ ప్రదర్శనకు హక్కుదారు
సినీ భోగ భాగ్య రుచులకు పేటెంటు.

చిరు గంటల గణగణ తో తిరగాలని కాలం!
తన చుట్టూ ఉత్సాహ భ్రమలో జీవిత చక్రం!

## 25. ఏ రోజు కధి

ఏ రోజు కా రోజు తెలుపుతో మొదలై
ఎరుపు నుండి నలుపులోకి ముగింపు రేఖతో
నీడలు వస్తాయి పలు ఆకారాల్లో
వెలుగులో వస్తువు చుట్టు తిరిగి పోతాయి
వస్తువు లేంది! నీడకు అవకాశం లేదు
వస్తువు తోనే! నీడకు తన అస్తిత్వం

మనుషు లంతా ఒకటే కాళ్ళు చేతులు
చూపు చెవులు తల తో ఆకృతిలో
మానస ప్రపంచాలు వేరు! జీవన దృశ్యాలు వేరు
వేదిక నుండి వేదికకు! పాత్ర నుండి పాత్రకు

ఒక స్థితిలో హంతకుడు, ఒక స్థితిలో ప్రేమికుడు
ఒక దశలో అనలం, ఒక దశలో జలదం.
మానస సరసి అంచున హంస లేచి
ఉదయం రెక్కలు విప్పి ఎగురుతుంది
సాయం వేళకు తీరం చేరుతుంది

ఎవరూ మాట! చెప్పనవసరం లేదు
ఎవరూ దారి! చూప నవసరం లేదు

మనిషికి మనిషి మాట చెప్పే అవసరం
మనిషికి మనిషి దారి చూపే అవసరం

పాలను నీరును వేరు వేరు చేసే
జీవన సత్యం! ఉందని తెలిసీ తెలియనట్లు
బ్రతకడ మొక! జీవన వ్యవహార తంత్రం!

## 26. జైలు నుండి జైలుకు

జైలు నుండి బయటికి గేటు దాటాక
కాస్త దూరంలో మరో జైలు
అక్కడి నుండి గేటు గడిచాక! మరొకటి
ఆ పైన మరొకటి మరొకటి అనుకోకుండా

పెట్టె నుండి పెట్టె లోకి మనసు
స్వేచ్ఛ కోరే ఆలోచనలో నిరంతరం

అక్కర లేని వైరాగ్యం తాత్త్వికం
బోనస్ గా చేరుతుంది ఆలోచనలో
తృప్తికీ సంతోషానికీ కొలమానం లేదు
ఎవరి కొలత వారిది! ఎవరి విలువలు వారివి

సాఫీగా బ్రతుకులు గడచే కోరికతో
అప్పటికి తగిన బంధన మేదో! ఇష్టపడేవారూ!

సమాజాన్ని వీడి తీవ్ర పథంలో
జైలు పాలు అయ్యే వారు!
వర్తనలో తుపాను వేగంతో దూకి
జైలు గోడ కూల్చే వారు!

ఈ భూమి గాలి నీరు వెలుగు!
అందరివీ! అందరి కోసం ఉన్నవి
నీది కాదు నాది కాదు ఎవరివీ కావు
గాలిని నీటిని ముక్కలు చేసి ఎవరికి వారు
తమ పేరు ఊరు రాసుకొనే ఉబలాటంలో !

బ్రతుకులో కనుగొన్న గొప్ప సాధనం దైవం
ఒక సమయంలో ఇది! వంతెన అవుతుంది
ఒక సమయంలో ఇది! ఆయుధ మవుతుంది

## 27. చరిత్ర మనుషులతో

ముంజేతిపై వాలిన చిలకలా
దువ్వినంత సేపు "శాంతి" నిలుస్తుంది.
ఆ మరు క్షణం ఎగిరి వెళ్ళి పోతుంది.

ఏడుపు స్వరాన్ని గాలి ముందుగా వింటుంది.
ఆ వెచ్చని ముఖాన్ని చల్లగా స్పృశిస్తుంది
బాష్పంలో చిత్రం కనిపించే దొక మానవతా హృదికే !
కంటి నీరు తుడిచే ఉదార కిరణం వచ్చే దెప్పుడు?
లోపలి దు:ఖపు పొర తొలగే దెప్పుడు!

చీకటి నొకడు కరవాలంగా మారుస్తాడు
గోడకు తగిలింపబడీ, అవసర మొస్తుందనీ!
చీకటి నొకడు నాగలి కర్రుగా తీరుస్తాడు
పొలం దున్నే పని కోసం ! అవసరమవుతుందనీ!

అగ్ని తప్త మై రెండూ! మార్పుకు లోనై !
మానవ చరిత్రకు రెండు చేతులుగా!

బాధలో మంటల్ని శ్రమ జలంతో తడుపుతూ
దారిలో మంచును ఉత్సాహంతో కరగిస్తూ
వెంట బడే నీడల్ని తేజంతో తరుముతూ
అస్తమించక తప్పని రవిని ఆవాహనతో తనలో

కదలే కాలం పుటలకు చరిత్ర రూపం ఇస్తూ పోయే
వ్యక్తి బ్రతుకు! సమాజ విజయానికి అర్పణం!
వ్యక్తులు అదృశ్యమవుతూ, మిగిలేది! సమాజం!

ప్రదర్శన శాలలో శిల్పాలు! విపణిలో బొమ్మలు!
సమాజ కథలో మనుషులు! మనుషులతో చరిత్ర!

## 28. మేల్కొన్న మాట

గాలి కొత్త మాట అందిస్తుంది
మేల్కొన్న మాట వెలుగులో
కొత్త జగం చూపుతుంది

మనిషి బూది కావడమో మట్టిలో కలవడమో
ఎప్పటి కయినా ఉన్నదే! జరుగుతూ పోతుంది.
బూది నుండి మట్టి నుండి! పైకి లేస్తుంది
యశో విభవం! ఎద కంటికి సుందరంగా,

చిన్నదో పెద్దదో సామాన్యమో అపూర్వమో
పవిత్రమైన బ్రతుక్కి ప్రజ మెచ్చే కానుక!
ఈర్ష్యను అసూయను చెరగుతూ వడపోస్తూ
తరం నుండి తరానికి సందేశం అందిస్తుంది.

ఎంతటి చండ గ్రీష్మ తాప మయినా
అక్కడికి చేరగనే చల్ల బడుతుంది సవినమ్రంగా
ఎంతటి శీత పవన లహరి అయినా
అక్కడికి రాగానే వెచ్చ బడుతుంది ఉత్సాహంగా

కొత్త మాట వినిపిస్తుంది, గాలి!
ప్రతి ఫలించే సమాజ నవ నిర్మాణంలో
కొత్త తరం హృదయం స్వనిస్తుంది

బూది నుండి మట్టి నుండి మొక్క మొలిచి
కంటి ముందు పూవు ఫలం పై కోరిక సహజం!
పూవుతో ఫలంతో సమాజ బహుమానం
శ్రమ జీవన గుణ సమూహ ప్రజతోనే!

స్వేచ్ఛకు చిహ్నం గాలి! అంతటా ఒకటే
పులి అయినా మనిషి అయినా! జీవన యత్నం! ఒకటే.

## 29. ప్రజాస్వామ్య కవితయై

మనిషిలో చెట్టు
చెట్టు పై పక్షి
రెక్కలు ఆడిస్తూ స్వేచ్ఛగా ఎగరాలనీ

మనిషిలో జలధి
జలధిలో కెరటం
గట్టు దాటి ప్రజతో మాట్లాడాలనీ

మనిషిలో గగనం
గగనంలో చుక్కలు
అరచేతిలో ఆడుతూ ఉండాలనీ

మనిషిలో సూర్యుడు
సూర్యునిలో తేజం
ప్రతి పనిలో ప్రకాశ రూపం చూపాలనీ

మనిషిలో స్పందనం
విశ్వం భ్రమణ లయను అందుకోవాలనీ
మనిషిలో సంవేదన
సమాజ బంధు గణంలో మెలగాలనీ

పిడికిలి వీడిన రహస్యం
పావురమై ఎగరాలని

ఇంత కాలం దాగి దాగి కథలో
ఎవరికీ కనిపించని నిజం,
పచ్చని గుండె పై వాలి కనిపించాలనీ
భ్రమ గొల్పే పగలుకూ
భయపెట్టే రాత్రికీ
అతీత రూపంలో ప్రజాస్వామ్య కవితయై నిలవాలని

## 30. కవిత అమ్మబడదు

కవిత అమ్మ బడదు
చేతులు మారుతుంది

ఒకరి హృది నుండి మరొకరి హృదికి
హిమమై జలమై నిప్పై మణియై
తమ తమ ప్రభావాల్ని చూపుతుంది.

ఒకరి మతి నుండి మరొకరి మతికి
సింహమో! హరిణమో! మేఘమో! తాపమో
తమ తమ ముద్రల్ని వదలి పోతాయి.
ఏ కాంతానికి దారి తీయవచ్చు
సమాజ గతికి ప్రేరణ కావచ్చు.

నీడలు హ్రస్వంగా దీర్ఘ దీర్ఘంగా కదలుతాయి
ఏమయినా వస్తువునో మనిషినో చివరలు అంటుకొనీ

నీడ నుండి సమయ సమయం
తేజో బింబమో! వెన్నెల కళయో
నాగలి రూపమో! యంత్ర రూపమో!
అమాయకంగా బయట పడుతుంది

విశేష సమయంలో ప్రజాస్వామ్యంలో
యువకుని స్కూలు బాగ్ నుండి
పుస్తకంలో నెమలి ఈక బదులు రివాల్వర్! బయటపడవచ్చు!
కాల మహిమ కాదు! పరివర్తన మహిమ!

కవిత అమ్మబడదు; ఇది అపూర్వం
నవత అందరిదీ, ఇది అనన్యం.

స్వేచ్ఛా కవిత్వం - 66

# లైన్ క్లియర్

**మాదిరాజు రంగారావు**

**2016**

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 28.

# LINE CLEAR

## (Telugu Poetry)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2016

Presented to
my son
**Dr. M. SANTHOSH KUMAR**
with
affection and blessings

# భూమిక

కవిత్వానికి స్పందన గుణం సృజన చేతన రెండూ ముఖ్యమైనవి. ప్రతిభ చేత నవ నవోన్మేషాన్ని పొందుతుంది. ఇది విశేషమైన అనుభవ ప్రకాశరూపం. సాధారణమైన అనుభవంలో సంతోషాన్ని ఇచ్చే వస్తువులు ఎన్నో! అవి ఒక స్థాయి వరకు పని చేస్తాయి. కళలు కవిత్వం విజ్ఞానం మొదలైనవి పై స్థాయిలో పనిచేస్తాయి. కనీస స్థాయిలో గతం గురించి ఎంతో కొంత పరిజ్ఞానం, వర్తమానం గురించి అవగాహన భవిష్యత్తు గురించి ఆలోచన కవితకు ఉత్తమ స్థితిని చేకూరుస్తాయి. ఈనాటి స్వేచ్ఛా కవిత్వం పొందుతూన్న విశాలతను బట్టి వికాస ప్రత్యేకతలతో పాటు దార్శనికత (Ideological vision) కూడా అవసరం. ఇది కవిత్వాన్ని నిటారుగా నిలబెట్టే ముఖ్య లక్షణం. ఆలోచనకు పూర్ణత చేకూరుస్తుంది. జీవితానికి మార్పును తెస్తుంది.

కవిత్వంలో గభీరత / లోతు (depth) ఎంత అవసరమో, ఉన్నతం (height) కూడ అంతే అవసరం. 'నేలబారు' కవిత్వం అంటే నేలపై ప్రాకే తీగెలా అక్కడొక పూవు ఇక్కడొక పూవుతో అలరించవచ్చు. కాని ఉత్తమమైన ప్రమాణాల్ని అందుకోలేదు. దీనికి కవిలో మానసికమైన వాతావరణం స్వచ్ఛంగా ప్రకాశ వంతంగా ఉదారంగా మానవతా స్పందనం కలిగి ఉండడం అవసరం. ఇది సూక్ష్మ సూక్ష్మమైన రేఖలతో కవిత్వాన్ని శిఖర స్థానంలో నిలుపుతుంది. వీటివల్ల సాహిత్య విమర్శలో విశాలత ఏర్పడి సమాలోచనానికి ఎక్కువ అవకాశం కలుగుతుందని వేరే చెప్పనవసరం లేదు. పాఠకుల్ని ఎదగజేస్తుంది, సంస్కరిస్తుంది. ఆలోచింప చేస్తుంది నవీకృతం చేస్తుంది. పురోగమింప చేస్తుంది. "No great / good poem can be reduced to a single meaning" - T.S. Eliot

మానవ వికాస చరిత్రలో గొప్ప పాత్రల్ని నిర్వహించిన అనేక విషయ క్షేత్రాల వలెనే కవిత్వమూ సీరియస్ థాట్ & ఏక్షన్, తో కూడింది, కావడం ఆ

వ్యక్తి సంస్కారాన్ని సమాజ స్థాయినీ తెలియ జేస్తుంది. ఈ దిశలో చింతనం ఈనాడు చాలా అవసరమని తోస్తుంది.

రచనలో వ్యక్తి నుండి వ్యక్తికి భేదించే feeling కూ reaction కూ వశమైన మాటల ప్రకటనం ఆంతర జగత్తును స్ప ృశించాలి. సార్థకతకు ఉన్నతిని చేకూర్చాలి. ఆశయానికి ఉదాత్తత చేకూర్చాలి. సృష్టినీ సమాజాన్నీ, మనిషినీ అర్థవంతంగా చిత్రంచాలి. స్థితి గతుల్ని వివరించాలి. సౌందర్య దృష్టితో పాటు సహేతుకమైన ప్రయోజనాత్మక లక్ష్యాన్ని కలిగి ఉండాలి. హేతువు కందనిదీ వివేకాన్ని కోరే స్థితినీ గమనించాలి. ఈ మొత్తం లేదా కొంత భాగం కవులు మాటల్లో అందించడంలో నిపుణత చేత అవగాహనలో ప్రతిభ చేత రచనలో రామణీయకత సిద్ధిస్తుంది. అర్థాంతర స్ఫూర్తి పొరలు పొరలుగా ఏర్పడుతుంది. వీటిలో కొన్ని వశమైనా చాలు! కవిత్వానికి మాటల్లో ప్రకటించలేని ఆకర్షణ సిద్ధిస్తుంది. కొందరికి జీవితంలో ఆంతరంలో ఇది ఒక సాధనా రూపం! తపోమయం! బాహ్యంలోనయితే అనుభూతిని వ్యక్తీకరించే శబ్దంతో అర్థంతో కూడిన వ్యవహారం.

మంచి కవిత్వం ఒకే అర్థానికి confine కాదు. గొప్ప కవిత్వంలో కవిత్వ కళతో పాటు దార్శనికత రచనకు పూర్ణతను చేకూరుస్తుంది. ఈనాడు వస్తూన్న స్వేచ్ఛా కవిత్వ గురించి ఆయా ప్రత్యేకతల్ని గుర్తించే సమాలోచనం జరగవలసి ఉంది.

ఈ కృతిలో మానవ జీవితంలోని వర్తమాన స్థితులతో భవిష్యత్తు పై చూపుతో కవితలు, సామాజిక స్పందనంతో శబ్దిస్తాయి. ప్రజా స్వామ్య సామ్యవాద లక్ష్యాన్ని కలిగినవీ.

"Free - verse has its own nature. It has no finish. It has no satisfying stability. It is the instant quick and afresh" - D.H. Lawrance.

**మాదిరాజు రంగారావు**

## 1. కాలాన్ని అతిశయించి

కవితా ప్రస్థానంలో వివిధ దశలు గడచి
ప్రజా స్వామ్య సామ్యవాద దార్శనికం
స్వేచ్ఛా సమాజ ప్రవాహ గతి రూపం
మానసిక వికాసంతో సహ జీవన ప్రకాశకం

ప్రవాహ తీరాన కట్టు కొయ్యలు
మనిషిని బంధించే ఇనుప గొలుసులతో
తొలగించే యత్నంలో తరం వెంట తరం
పరివర్తన చేతనతో, ప్రగతి శీల భావనతో
ఇది ఒక నాటితో ముగిసే పని కాదు
సుదీర్ఘ చరిత్రతో ముడివడినవి పాతుకుపోయినవీ

తీరం వెంబడి అగ్గి పెట్టెల్లా ఆవాసాలు
ఎపుడు అగ్ని పుల్ల భగ్గు మనేదీ తెలియదు
సెగల పొగలు చుట్టుకొని! చీకట్లను తలపించేను

పొరలి వచ్చే వరదకు కొట్టుకు పోయే వారూ
దూకి వచ్చే ఝంఝుకు ఎగిరి పోయే వారూ
ఆ సమయం ఆర్త రవం! దూసిన అగ్ని బాణం!

మెరపు మెరసి ముఖాన భయ చిత్రం దింపుతుంది
పిడుగు జారి గుండెను శిథిలాల్లో తిప్పుతుంది

జనత ఎదురు చూస్తుంది మంచి వార్తకై
చూపు లెదురు చూస్తాయి కొత్త పాత్రకై
హృదయ మెదురు చూస్తుంది కొత్త కవితకై
వర్తమాన గాథలలో మానవీయ చేతనతో

ఒకరి ఓటమి కన్న తన విజయం కోరుతూ
కాలాన్ని అతిశయించి జీవన గమనంలో లైన్ క్లియర్.

## 2. పేకాటలో కార్డులా

మృత్యు ముఖం నుండి తప్పుకునే
ప్రయత్న విధానా లెన్నో యుగాలుగా
అమృత మనీ దైవ మనీ వైద్య మనీ పుణ్య మనీ
దేహంలో “ హంస”ను నిలిపే ఆశతో
మనిషి నుండి మనీషి దాక, పల్లె నుండి నగరం దాక

ఒకటి తరువాత మరొకటి రంగుల బెలూన్‌ల వలె
అందమైన ఆలోచనలు మనసులో పయనిస్తాయి.
ఎంత గొప్ప బహుమానం గానో మురిసిన జీవితం
క్షణంలో పనికి రానిదయి తిరస్కృతమవుతుంది.

పేకాటలో చేతికి లభించే కార్డులా
కొన్ని క్షణాలు! బ్రతుకును నడిపిస్తాయి.

ప్రశ్న లొక దిశ నుండి అయితే
జవాబులు మరో దిశ నుండి
రెండూ క్రాస్ అయి దేని దారి దానిదే అవుతూంది.

నుదురుపై చీకటి మూసిన తలుపులా
అది తొలగితేనే, గాలి వెలుతురు హ్లోదం
ప్రవాహానికి చీకటి అడ్డు కాదు
మనిషి నడకలో వెలుతురు ముసు ముందే ఉంటుంది
వెనక నున్న చీకటి ముందుకు రావాలని చూస్తుంది.
అక్షరాల నటనలో పదాల అభినయంతో
రచన ముగిసాక, కవిలో మిగిలేది సాధారణ పౌరుడు మాత్రమే

కవితకు స్పందన స్థానం సమాజం
మనిషికి జీవన విజయం మానుషం

చేతిలో ఆరెంజి రసం గాజు గ్లాసులా
మిగిలిన వెలుగుతో సాయం సంధ్యా క్షితిజం
ఇది విరామ సమయం – విశ్రాంతికి లైన్ క్లియర్.

## 3. కళ్ళు తెరచినపుడే

నిద్రా పదం నుండి మెలకువ జగంలోకి
అందమైన వెలుగులతో జీవన క్షేత్రం
హృది వనిలో విరిసిన పలు విధాల పూలతో

బయట సమూహాల అలజడి ప్రభావాలు
మధ్యలో కలహ ప్రియుల నీడల పొట్లాటలు
వెలుగు దయతో బయట పడిన నీడలకు
తామొక వెలుగు రూపం ధరించాలనీ

ఎదురుగా ఉన్న చెట్టుతో మాట్లాడడం ఒక సరదా
రాత్రి చుక్కలతో సంభాషణం ఒక ఊరట
హంసతో ప్రతిమతో చంద్ర బింబంతో మాట్లాడడం
మానసికంగా తృప్తితో పాటు అవసర కాలక్షేపం

జలధిపై తేలే పడవల్లా స్మృతులు
రాత్రులు వెలిగే దీపాల్లా జ్ఞాపకాలు
కష్టంలో వేదనలో మనిషి శక్తి నుండి
అస్తితకు కావలసిన వికాసమూ ఔన్నత్యం
ఘట్టాలను దాటాకే, గమ్యం చేరువ అవుతుంది

కొత్త యుగం సమాజ చరిత్రలో
కొత్త మాటతో కొత్త బాట తోనే
కలలో ఈదే పనికి స్వస్తి చెప్పి
వాస్తవ చరణాలపై సాగేందుకు
మేల్కొన్న కళ్ళు తెరచి బయట
నడచినపుడే ఉష సౌందర్యం చూడగలిగేది
చూపు ఆనినంత మేర నిరాటంకంగా
వెలుగు దారిన దృశ్యాలకు లైన్ క్లియర్

## 4. చింతనలో స్వేచ్ఛగా

పక్షులు గూళ్ళకు తిరిగి వచ్చే సమయం
శ్రమ ప్రకటనకు ప్రేరణ బింబం సూర్యుడు
తన విధి నిర్వహణంలో మరో వైపుకు
దిగి పోయే సుందర సాయం సమయం

రవి తేజం ఆరదు
నిజ ప్రకాశం మాయదు
ఏదో బరువు నుండి ముక్త మవుతున్నట్లు
ఒక మానసికాశ్వాసంతో వాతావరణం
ఆ సమయం చల్లారే సవన వేదికలా ఉంటుంది

వీధి మూల ఒక ప్రక్కన బిక్షువు
ఆ రోజు పొందిన చిల్లర లెక్క పెడుతూ
పగలు రాత్రి భేదం లేని అపాయాల మధ్య
ఒక దానితో ఒకటి పోటీపడుతూ వాహనాలు
వేడి మయూఖాల్ని మరచి పరిమళ పుష్ప గుచ్ఛమై
ఆ రాత్రి గడవాలని ప్రతి వ్యక్తితో కోరిక

యథా స్థితికీ మార్పుకు మధ్య పోరాటం
నిరంకుశానికీ ప్రజా స్వామ్యానికీ మధ్య ఘర్షణ
పరివర్తన అవసరాన్ని మరచిన జీవితాలు
ఎడారి ఇసుకలో కూరుక పోయే స్థితిలో

తలపై మోపిన బరువు క్రింద,
ఒక వ్యక్తి కాదు అణగింది
సమాజ సమూహ రూపం

ఈ విశాల విశ్వ నికేతనం లోకి ప్రవేశం
ఏ కవిత అయినా తెరచిన హృదయ ద్వారం నుండే
సమాజ చలనం ఆగదు, మానవ తేజం దాగదు
చింతనలో స్వేచ్ఛగా సూర్యుని వలె కవికి లైన్ క్లియర్

## 5. శ్రమ జల ప్రవాహమై

ఆగని అలలతో తెలియని లోతులతో
సమస్యల సుడులతో ప్రవాహం, పురోగమన సంకేతం

కాలం నడుస్తున్న కొద్దీ హృదయం విప్పారుతుంది
ఆకాశాన్ని తన లోకి స్వాగతిస్తూ పోతుంది
ఆకాశాన్ని అందుకునే ఆశతో పరుగిడుతూ
అంతలో మలుపులు తిరుగుతూ పోతుంది

గట్టుపై చెట్లను స్పృశిస్తూ పచ్చ దనం పరుస్తూ
మండే ఎండలకు చెక్ పెడుతుంది

కదలికలో కారుణ్యం
గమనంలో జన హితం
ఇక్కడ వసంత మొక శాశ్వత మైన అతిథి

తీరాన పడి ఉన్న రాయిని
తడిపి తళుకు ప్రసాదిస్తుంది

ఎన్ని జీవన దృశ్యాలకో సాక్షి
అపుడపుడు ఉగ్రాకృతి ధరిస్తుంది
ఇది ప్రకృతిలో జరిగే పరిణామంలో భాగం

ఎన్ని వేల ఏండ్ల నుండో
శ్రమ జల కణా లొకటొకటి చేరుతూ రాశియై
జీవన శిఖరాల నుండి జారుతూ
కిందికి దిగే ప్రవాహం సమాజం! పురో గతి సంకేతం

ఇరు వైపుల్ని కలిపే వంతెన
స్నేహ సుందర భాగ్య రేఖ!
భవిష్యత్తు రాతలకు లైన్ క్లియర్

## 6. జీవితమూ దార్శనికమూ ఒకటై

ప్రపంచీకరణ మొక విశాల వేదిక యై
కొందరికి ఆలంబనం, కొందరికి స్థాన చలనం
అవసరాల ఆకర్షణలో మానవతా వికర్షణలు
ఆర్థిక సూత్రాల చిక్కు ముడులలో సామాన్యుల జీవితాలు

భూమిలో తడి, తవ్వితే గాని తెలియదు
గాలిలో తడి, మబ్బుతో గాని తెలియదు
మనిషిలో తడి, బాధలో గాని తెలియదు
ఆర్ద్రత లేని ఆర్థిక విధానం, ఎడారి సమం

మనసును చూపే యంత్రం లేదు
అద్దంలో మనసు జాడ కనిపించదు
మనిషితో తూగే వస్తువు లేదు
మనసును తూచే త్రాసు లేదు

కళ్ళలో నీరుతో శిలయై చీకటిని తలపిస్తూ
క్షణం ఆగితే కాలం వెనక్కి నెట్టేస్తుంది
గతం లోకి గుహ లోకి వ్రెళ్ళి పోవలసిందే!
ఎంతటి నేరంలోనూ హనన క్రియ అమానుషం

భవిష్యత్తు కలల్ని మూట కట్టు కొని వచ్చి
కొత్త తరం ముందు వదులు తుంది ఆలోచన!
జీవితమూ దార్శనికమూ, ఒకటయితేనే
పూవులా పక్షిలా రెక్కలు విప్పారుతాయి మనిషిలో

కొత్త రాతల పుటల రోజు
పాత కథలకు పేటి కాదు
ఏ రోజు కారోజు కొత్త ముఖంతో
కొత్త వెలుగు జాడలతో లైన్ క్లియర్

# 7. నీళ్ళలో ఆయుధం

పగలు నదీ తీరం అంచున దిగి చూస్తే
నెత్తురు జీర ఎర్రని కిరణ ప్రసారంలా
నీటిపై తేలుతూ ముందుకు సాగుతుంది
ఆ నీరు తరలి పొలాలు తడుస్తాయి
ఆ నీరు మరలి మొక్కల కందుతుంది

తీరాన గట్టు పై చెట్టు క్రింద
మనిషి కంటి తడిని గాలి తుడి చేస్తుంది
గుండె తడిని నీరు గుర్తు చేస్తుంది.

కళ్ళలో సన్నని ఎరుపు చార
రవి కిరణాన్ని అతిక్రమించ బోతుంది

ఎవరు మెచ్చినా మెచ్చక పోయినా
నిశీథి, విశ్రాంతిని ఆహ్వానిస్తుంది
ఎవరు చూచినా చూడక పోయినా
ఉదయం, పనికై తొందర పెడుతుంది

పరివర్తనలో మారే కోణాలొకరికి ఇష్టమో! వరమో!
మరొకరి శాపం కావచ్చు మరొకరికి విలయం కావచ్చు

నదిలో మునిగి పోయే సామాన్యుల బ్రతుకులు
పైకి తేలి ఒడ్డుకు చేరేందుకు
పాలనా చణతతో పాటు! నైతికత అవసరం
అలజడిలో ఆక్రందనలో మానవీయం మరీ ముఖ్యం

నదిలో అడుగు వేయగనే దప్పికలో
చేతిలో ఆయుధం! నీళ్ళలో జారుతుంది
ఆప్యాయంగా అలలు కౌగిలిలో వహిస్తాయి
స్నేహ పతాకలవలె కదలుతాయి. 'శాంతి"కి లైన్ క్లియర్

## 8. సమరం - శాంతి

సమాజం ఆగని ప్రవాహ రూపం
క్రితం లిప్తలో స్థితి ఇపుడు కని పించదు
ఎవరి కోసమూ ఆగదు, ఎవరి అవసరమూ పట్టించుకోదు
చలనం దాని గుణం, గమనం దాని అస్తిత్వం

దీర్ఘమై దుర్గమమై సాగే ధారా సరణంలో
ఎక్కడో ఒకచోట కాలి బాట ఏర్పడుతుంది.
ఆవలి గట్టుతో సంబంధం నిలుపుతుంది
తీరం నుండి తీరానికి దాటే అవకాశంతో
ఆవలి భూమితో పడవ సంబంధం పెంచుతుంది
వంతెన పై నుండి సులభ సుందరంగా పయనం
ఆ పై నుండి విమానం మానవ విజయ సూచనగా
అనుకోని విశాలతను చూపుతుంది బ్రతుకులో

దాట లేనిది దాటుతూ ధైర్యంగా
పొంద లేనిది పొందుతూ భద్రంగా
చరిత్రలో ఆరోహణకు సోపానాలు
తరం నుండి తరం శక్తిని పొందుతూ

కనిపించని లోతులతో ప్రవాహమయ జీవితం
సృజన విలయ రూపాలు చర్యల ఫలితంగా
కనిపించే కొండల లోయల పృథ్విపై నివాసం
స్వార్థం క్రోధం అసహనం అశాంతి దృశ్యాలతో జీవితం
అపుడపుడు నదీ జలాలలో మలినం నుండి శుభ్రమవుతూ
మానవ వ్యక్తిత్వం! ఎప్పటికపుడు! పునర్నవం కోరుతుంది
శాంతి నుండి తప్పని కలహానికి
కలహం నుండి అవసరమైన శాంతికి,
మైదానం నుండి నదీ జలానికి,
నదీ జలం నుండి మైదానానికి

## 9. చూపులో ఆశలో

ఊరుకు ఊరుకు మధ్య దూరం ఉంటేనే
ఊరుకు గల ప్రత్యేకత నిలబడుతుంది
మనసుకు మనసుకు మధ్య ఎడం ఉంటేనే
మనుషుల వ్యక్తిత్వం ఏదో తెలుస్తుంది

ఈ దూరం అఖాతం కాకూడదు
దుర్గమం అవకూడదు
ఈ ఎడం శిలా పంక్తి కారాదు
అనల సర్పం కాకూడదు

వీరానికి అలంకారం అహంకారం
సృజనకు ప్రేరణ మూలం అహంకారం
కవితకు దార్శనికం లక్ష్యంలో వెలుగు స్తంభం
నవతకు శిల్పంలో నిపుణత కవి స్వేచ్ఛాధీనం

ప్రియమైన గులాబి పుష్పంలా "శాంతి"
గొప్ప ఆశయానికి విప్పారిన హృదయంతో
ఉత్సాహం ఉంటే సరి పోదు
సాధించే నైపుణి అవసరం
పూర్తి నిశ్శబ్దం ఎవరికీ ఇష్టం ఉండదు
ఏదో ఒక శబ్దం అలంకృతం కావలసిందే
మనుషుల మధ్య! సమాజంలో మనిషి!
మాటలతో సందడిలో తగవులతో కలకలంలో

బయట బ్రతుకులు! సశబ్దంగా
మ్రోగే వాద్య విశేషాలొకటొకటీ
ఇష్టమున్నా లేకపోయినా వింటూ పోవలసిందే

బయట పూలు! నిశ్శబ్దంగా
గాలికి కదలుతూ! రాలుతూ
చూపులో ఆశతో చూస్తూ పోవడమే!

# 10. నీడల నిర్బంధంలో

కలలో కనిపించిన కుర్చీకై
మేల్కొగానే వేట మొదలవుతుంది
ఏదో ఒకటి చేతికి అందగానే
భ్రమణంలో మనుషులు ! తమ హక్కుగా
అధికార చక్రం అరలపై బొమ్మల్లా
ఆవరణంలో పరిమిత వలయంలో

ఇజాని కొక రంగులో ముంచి తీసిన
ఆలోచన! దేని కది గొప్ప! శరణ్య మనుకుంటూ
బుజాన జెండా కర్రలతో పోరు బాటలో పార్టీలు
మైలు రాయి దాటని మతితో, లక్ష్యం మరచీ!

ఎన్ని ఇజాలు వెలిగినా జరిగేది జరుగుతూ
వైరం పీడన హననం చీకటి డొంకలలో
జాలి లేదు భీతి లేదు మానవత లేదు
తప్పు దారులలో సాహసం, స్వార్థంలో వీర ప్రదర్శనలు!

జైలు నుండి విడుదలై పాత అనుభవంతో
మళ్ళీ జైలుకు వెళ్లే పనిలోనే జీవన గమనం

నడుస్తూన్న ప్రజాస్వామ్యంలో ఇజాని కొక ముఖోటా
ఏది నిజం? ఏది మృష? సందేహంలో నలుగుతూ కాలం గడుస్తుంది.

ఒకరు నినాదాలతో వీధులలో తిరిగేరు
ఒకరు దైవం విధి పాత్రలలో బ్రతికేరు
ఒకరు అడవి దారి పట్టేరు
ఒకరు మౌన పీఠ మెక్కేరు

మనిషిలో మానుషాన్ని వెదికే పనిలో రాజ్యం
అనల కీల దాటో! ప్రేలిన ధ్వని వైపో
రక్త చిత్రం వెనకో! తన వెనకనో
తన నీడల నిర్బంధంలో ! తానే ఒక బందీయై

## 11. అడుగు జాడలు - ఆనవాళ్ళు

ఈ అడుగు జాడ లెవరివి? ఎచటికి?
ఇవి దేనికి ఆనవాళ్ళు! ఎవరి కోసం
సామాన్యుని ముఖాన ఉదయ చిత్రం ఆశిస్తూ
అభాగ్యుని ఫాలంపై అక్షరాలు వెదకుతూ
మౌన నిస్ఫోటంలో భూమిపై చెదరిన శరీరాల్ని పరికిస్తూ
నిశ్శబ్దంగా పడి ఉన్న దేహాలపై గాయాల్ని లెక్కిస్తూ
ఎంత దూరమైనా! గుర్తిస్తూ పోవడమే పని!
అడుగు జాడలు! ఆనవాళ్ళు! బ్రతకలేని బ్రతుకులవి!

చిన్న చిన్న మంచు పొరలు! మబ్బు తెరలు
హఠాత్తుగా అడ్డమై ! రవి రాకలో సందేహం!

నడచి నడచి అలసటలో శ్రమ బిందువులను
పవమానం తుడుస్తుంది, పునర్జవం కలిగిస్తుంది
ఇది మనుషులు మరచిన దయా వర్తనం
ఇది సంఘం చేయాలిసిన బాధ్యతలో భాగం.

తప్పిన గుండె లయ శబ్దం విని గాలి నుండి
కరుణతో పైన చుక్కలు! పూలుగ మారేను.
మనిషి మాత్రం నిశ్శబ్దానికి అలంకార సుందరంగా
శిల వలె నిలిచేను, ఉలి కోసం ఎదురు చూచేను.

అడుగు జాడలో జీవన కథలు విలోకిస్తూ
చావ లేని బ్రతక లేని మానుష గాథలు వింటూ
ఉరి తీయబడే గళ రవంలో విషాదం వింటూ
ఎంత దూరమైనా! మానవ విజయం పై ఆశతో

అక్షర సత్యం వైపు పయనించే కవిత
చావుకు భయపడదు! బాధకు వెరవదు
ఎదురపడే మృత్యువు సాహసం చేయలేక
దూర దూరం జరుగుతూ పోతుంది.

## 12. అలసట లేని కిరణం

వర్తమాన స్పందనతో కవితలో సృజన చేతన
దోసిలి నుండి సూర్యుని వెలుగు జారి నట్లు
పిడికిలి నుండి చంద్రుని వెన్నెల చల్లి నట్లు
ఆలోచన! సమాజానికి కొత్త రూప మిస్తుంది.
అనుభవ జలాలకు అలల అంద మిస్తుంది.
అలల నయన జలధి! రెప్ప వాల్చి ఎరగదు.

మేల్కొన్నది మొదలు సమాజ గ్రంథంలో విషయం
మనసుకు అంటేది కొంత
అంటించు కునేది కొంత!
బ్రతుకులో రహస్యం సొరంగంలో నిధిలా
మౌలిక సత్యం ఎప్పటికీ బయట పడని రహస్యం

గత మంతా ఎన్నో ఖాళీల పజిల్
రోజు రోజుకీ ఖాళీలు చేరుతూ! పెరుగుతుంది రాశిగా,
ఖాళీలను పూరించే పనిలో
ఉద్యమాలు! వాదాలు! పార్టీలు! సంఘాలు

వందల సమస్యల మధ్య వ్యక్తిలో ఏకాంతం
ఎత్తైన శిలా శిఖరంపై చేరుతుంది
గాలి గోపురాగ్రంపై వాలుతుంది
అలంకార రూపాన్ని తలపిస్తుంది

ఆలోచనలో అన్వేషణలో మానవ ప్రస్థానం
మనిషి మనిషితో కలిసే యత్నాలెన్నో
భవిష్యత్తు దర్శనం యథార్థ మయ్యే ఆశతో!

చరిత్ర శిల్ప రూపాల మ్యూజియమ్ కాదు
ఎంతటి గడ్డ కట్టి హిమ రాశి అయినా
అలసట ఎరగని రవి కిరణ ప్రతాపంలో
కరుగుతుంది! జీవన ప్రవాహాన్ని పొందుతుంది

## 13. అక్షర మేఘం

సంకల్పం నుండి కవిత ప్రభవిస్తుంది
కలం నుండి కాగితం పై సిరా
అక్షర రూపంలో మేఘ పంక్తి అవుతుంది
ఆహ్వాన ముఖంతో ఎదుట నిలుస్తుంది

ఎద కంటికి మరపు రాని దృశ్యం
మెరపు చూపుల తళ తళలతో
ఇంత వరకు చూడని సత్యతతను చూపిస్తుంది
ఇంతవరకు చేరని దేశాలు చేరుస్తుంది
ఇది ఒక విమానంపై తరలే
జీవన భాగ్యం! సుందర యానం
వేగ శీల గమనంతో ఇది మనో మయం!
సృజన సాధ్యం కాని పయనం లేదు.
ఆకాశం విశాలత చెప్పనలవి కానిది
భూమిని వీడని గమ్య స్థానంతో పయనం

ఆకాశం కిందికి దిగ లేదు
దీన్ని చేరడం మేధ ఉన్న మనిషితోనే సాధ్యం

అవనిపై దారి దొరకని
దొరకిన చోటున చూడలేనివి ఎన్నో
ఇంత వరకు అందనివి, ఎన్నో
స్తిమిత మైన నయనాలకు కనిపిస్తాయి
మనసును ఆలోచనలో పరిభ్రమింప జేస్తాయి.

శూన్యం అనుకున్నది సాకారం పొందుతుంది
నిశ్శబ్ద క్షణాలను శబ్ద మయం చేస్తుంది
నాలుగు దిశలలోని నిద్రా ముద్రలు చెరపుతుంది
ఉపదేశం బదులు బాధ్యతను ఒలుకుతుంది.

సంకుచితం నుండి మనసును విస్తృత పరుస్తుంది
భూమి నుండి పట్ట రాని పరిమళాన్ని వహిస్తుంది

ఆకాశం అవసరం ఎన్నటికో
మేఘానికి రవికి శశికి చుక్కలకు గాలులకు!
వివిధ వస్తు చయం ఈ భూమితో
నేలపై ప్రజల అవసరాలకు తోడ్పడే నిలయం!

పృథ్విపై సమాజం! సుదీర్ఘ చరిత్రతో
అనుమానం ఆవేశం అసహనం హననం
చయనం త్యాగం వైరం స్నేహం క్షామం భాగ్యం
స్థలమూ కాలం స్థితి తో తప్పనివీ! జీవితంలో

విమాన యానంలో ఒంటరి తనం!
వర్తమానాన్ని చుట్టుకొనీ!
గతాన్ని తలపుకు తెస్తుంది.
వ్యక్తిని సమాజ వలయంలో తిప్పుతుంది!

అనుభవంలో వర్తమానాన్ని హత్తుకొని
ఊహలో భవిష్యత్తును దగ్గరకు తీసుకుంటుంది
ఈ సమయంలో మనో నయనం తెరుచుకొనే ఉంటుంది
కలలకు అవకాశం లేనే లేదు.
కింద ఉన్నా మనుషులు కనిపించక పోయినా
మనసు మాత్రం మనుషులపై భూమిపై వస్తువులపై
తరులు గిరులు నదులు ప్రజలు ఊళ్లు నివాసాలు
శూన్యతను పూర్ణం చేసే సజీవ దృశ్యాలు!
మౌన శిఖ నుండి వెలుగు విరిసి, కలతలో కన్నీరు జారి
మానవత మేల్కొంటుంది. సృజన ముఖం వికసిస్తుంది
స్వేచ్ఛా కవితా రచనా రూపం, ఒక విమాన యానం
జీవన చేతనతో సృజనకు లైన్ క్లియర్

## 14. అమర రూపం

పురా భావ గంధంతో ధరా బంధు సూత్రంతో
వర్త మాన తేజంతో మానవీయ సంస్కృతిలో
భాగమైన కవిత! నవ సమాజ చేతన రూపం
ఇది అద్దం కాదు, అద్దంలో బింబం కాదు

చీకటిని ఎక్కడి కక్కడ కట్టేసి
చుక్కల్ని తన చుట్టు సమావేశ పరిచే
మచ్చ ఎరగని పూర్ణ చంద్ర బింబం
మనో మయం స్వేచ్ఛా కవితా రూపం!

విప్పారిన మయూర పింఛం నీడకు
తాపంతో ఫణి! చేరే కాళిదాసు దృశ్యం
సృజన మనో రూపంతో రమణీయం
ఇది స్నేహ సహన సమాజ చిహ్నం!

సంఘంతో కవి భాషణం నిరంతరం సాగుతుంది
పలు రంగుల సన్నివేశ సుందరతను వదలుతుంది
మౌనంలో అర్థం హృదయానికి తెలుస్తుంది
అవసర సందర్భంలో ఆలోచన మెరుస్తుంది

మనిషి నీడ నేలపై గోడపై సమయ సమయం మారుతూ
మనిషి నుండి వెలుగు! మరో మనిషి లోకి! సమాజంలోకి!
బిందువుకు బిందువు చేరుతూ మంచి నీరు
తనకే కాదు ఎందరికో దప్పిక తీరుస్తుంది

జలనిధిలో అల అంత సహజంగా
గగనం లో జలద మంత ఉపయోగంతో
మృత్యు ఛాయ లేని అమర భావ రూపం
సృజన యశో బింబం తోనే లైన్ క్లియర్

పవన పదవి విమాన యానం ! నిరాఘాటంగా
నిర్నిబంధ గమనంతో ఈనాటి స్వేచ్ఛా కవిత్వం !

## 15. పయనం ఎటు?

పయనం ఎటు ?
ఇటు వైపా? అటు వైపా ?
ఈ దారిన అయితే? అనుమానం !
ఆ దారిన అయితే? పెను భూతం !
తృటిలో మరో వైపు చూపు !
డోలాయమాన లోలంగా మనస్సు
సంకల్పంలో స్థిరత చేకూరే వరకూ

కాలం జారి పోతుంది ఊపిరి మెట్లపై
కాలం అందరిదీ, ఎవరి వశం కాదు.
తాపంలో కోపంలో స్నేహంలో వైరంలో
క్షణాలు మునుగుతూ తేలుతూ వెలుగుతూ
సమయ సమయం ప్రశ్నావళి వదలుతుంది
వెనక నుండి సూచన సందేశం ఉపదేశం హెచ్చరిక !

అక్షర పంక్తులతో నిండిన
మడచిన కాగితాల కట్టలా
మస్తిష్కంలో మతి రూపం.
ఏది ఎపుడు బయట పడేదీ తెలియదు
గాలిలో మబ్బుల్లా నీటిలో పడవల్లా

పరిచయాలు స్నేహాలు బంధుతలు
మతాబా చిచ్చుబుడ్డి పూవుల్లా వెలిగి
కనుమరుగై ఎపుడో బూది మిగిలి పోతుంది
హృదయానికి మాట్లాడే అవకాశం లభిస్తుంది.

ఆ ఊరు లేదు, ఆనవాళ్ళు మిగిలాయి
అక్కడికి వెళ్ళితే, మాటలు వినిపిస్తాయి గాలిలో
ముక్కలయిన దృశ్యాలను అంటి పెట్టుకోనీ
కణ కణంలో, ఏర్పడే భూమి బంధంతో

నియతమైన కాలం లేని ఆయువు పిడికిలిలో
మనుషులు ! ఎవరి జీవిత పరిమితులు వారివి.

పుట్టుక తో జీవ రూప నిర్మాణ విధంలో
నిర్ధారిత మవుతూ ఆలోచన ఆవేదన మధ్యలో !
తన శక్తి సమీకరణంతో ఎదుర్కొనే ఉత్సాహం !
మానసిక తృప్తి కై సరిదిద్దే ఆర్భాటాలు
మానవ నాగరకత స్థాయికి దీటుగా

జీవన స్తంభంపై ఎగర బోయే హంస
రెక్కలు చాచి క్షితిజంలో చూపులతో
మనిషి మనసు అద్దంలో ప్రతి బింబిస్తుంది
మనిషి మౌన ముఖాన్ని శబ్ద మయం చేస్తుంది

జన్మ భూమి నెవరు తిరస్కరిస్తారు!
ఉన్నతి కై చేరుతూ ఎంత పెద్ద దేశమయినా
తమ సంస్కృతి నెవరు వదలేస్తారు?
ఏ దార్శనిక మెంత ఇష్టమైన పథ మయినా

డబ్బు కెంత తెరచిన గొప్ప ఖజాన అయినా
జన్మ భూమి ముందు పక్కకు తొలగాలిసిందే !

మరో రోజు ఎంత మంచి దయినా
ఎంత తప్పని సరి అవసరమయినా
జన్మ దినాన్ని ఎవరు విస్మరిస్తారు
ఇది పాత బడని, మార్పులేని లగ్నయుతం

దీని ముందు మిగతా రోజులన్నీ
తల వంచుకొని పోవలసిందే !
నిరాటంకంగా జన్మ దినానికి లైన్ క్లియర్

## 16. స్పందన గ్రాఫ్‌తో

స్పందన ఉన్న చోటే చేతన సుమిస్తుంది
మనోజ్ఞ జీవన సుందర వనమవుతుంది.

గుండెను హత్తుకొనీ
మేధను చుట్టుకొనీ
ఎప్పటికీ నవ్యంగా ప్రియంగా
బాధా గాథలలో వ్యథా దృశ్యాలలో
దశా చక్ర భ్రమణంలో మార్పులతో
జన్మ భూమి జన్మ దినం ! రెండు రైలు పట్టాల్లా

తుపాను ఆలోచనలతో
హింసకు ఆయుధమవుతూ
పేరుకో పీఠానికో సుఖానికో
అడవి జంతు సమమయితే
మనిషి బ్రతుకు అర్థం లేని వ్యర్థం
కోటు మార్చి నంత సులభంగా దార్శనికం

జన్మ భూమిపై జారిన వెచ్చని బాష్ప కణం
ఎప్పటికీ అగ్నిమయం గానే నిలుస్తుంది.
జన్మ భూమి పై జారిన చల్లని బాష్ప కణం
ఎప్పటికీ అమృత కళ గానే నిలుస్తుంది.

వ్యక్తి చరిత సమాజ చరిత్ర రెండూ
జీవిత నాణానికి ఇరు వైపులు
ఓటమి గెలుపులతో బ్రతుకులో
కాలానికి క్రియా రూప మిస్తాయి!

జలధిలో కెరటంలా సమాజంలో వ్యక్తిని
సుగమంగా పయనింప జేస్తుంది స్వేచ్ఛా పవనం

ప్రశ్నించే సహజ మైన హక్కుతో హేతు దృష్టి
వ్యవస్థతో విభేదింప జేస్తుంది, ఎదిరింప జేస్తుంది.

మండే ఎండలో కురిసే వానలో
గొడుగు అవసరం గురించి చెప్ప నవసరం లేదు
ముళ్ళ దారిలో రాళ్ళ నేలపై
పాద రక్షల గురించి చెప్ప నవసరం లేదు

సర్వం సహా పై అన్నిటికీ అవకాశం
పంట చేను గడ్డి మొక్క పూవు ఫలం కంటకం !
జీవన రూపానికి ప్రయోజన ఫలాల నిస్తూ

ఎన్నిటితోనో ! కలిసి మెలసి సమాజం.
రాత్రి కూడ బెట్టిన మంచుతో బాగా ఎదిగిన
హిమాలయం కరుగుతుంది పవలు ఎండకు
జారుతుంది పాయలై కిందికి దిగుతుంది
పంటలు పండేందుకు దప్పిక తీరేందుకు

కాలం గతమై నిలుస్తుంది, శిరసు మాత్రం మిగిలి
తన కతీతమైన హృదయంతో మాట్లాడుతుంది.

ప్రియం కాని జరుగుతూన్న విషమ స్థితులకు
దైవం పై బాధ్యత మోపేందుకు, సిద్ధంగా మనుషులు
ఆ దైవానికి ఈ విషయం తెలిస్తేగా.
మానవ జీవన గతులకు దైవం హేంగర్ కాదు

మనిషి తరువాత మనీషి సమాజ చరిత్రలో
పయనంలో దీప స్తంభాల్లా దారి పొడవునా

ఉగాది వస్తుంది !
సంస్కృతీ తరువుకు పూచిన పూలతో
మనసు నావ హిస్తుంది
ప్రేమ కరుణ శాంతి స్పందన "గ్రాఫ్" తో లైన్ క్లియర్

## 17. మనిషి పట్ల మనిషి నుండి

విషాదా లెన్ని ఎదురయినా మునిగి తేలుతూ
ఈహలు ఆశలు ఆనందం వైపే, మనిషిలో
సాయం సంధ్య జ్వలించే చితిలా ఎదురయినా
ఉదయ సంధ్య మంగళ కర తోరణంపై ఆశ

మాటలో ఫణి మెలికలు తిరుగుతూ
మాటలో పులి చకితంగా దూకుతూ
తాపంలో మంచు బిందువులా మాట
తలపై చల్లని మబ్బు నీడలా స్పర్శ

ఒక భయదం ఒక సుఖదం అనుకోనివి
మనసును అనుమానంలో నలు వైపుల తిప్పుతాయి

ఇంటి ముందు బిక్షువు చేతిలోని పాత్రలో
పక్క నున్న చెట్టు నుండి ఆకు రాల వచ్చు
ఇది ఆకలి తీరేది కాదు
బహు మానం అనుకోవచ్చు

ఇంటి గోడ అవతల బొగ్గులా వాస్తవం
నిప్పు రవ్వ అంటి మండే అవకాశం
ఇంటి గోడ కివతల వజ్రంలా ఆంతరం
దాచుకునే విలువైనది ఘనమైనది.

ఇంటి వెనక నుండి కనిపెట్టే "ఎక్సరే" చూపులు
చీకటి ఊరి తాడు కాదు, తప్పును దాచేస్తుంది.
పడగ విప్పి ధర్మం, కాటు వేయదు
కత్తి యై న్యాయం, వేటు వేయదు.

పై నున్న సూర్యుడు ఏదీ పట్టించుకోడు
తళ తళ మెరసే చుక్కలు కన్నీరు కార్చవు

మృత్యు ముఖం వెలుగును బింబించదు, ఉపదేశం వహిస్తుంది.
మనిషి పట్ల సానుభూతి మనిషి నుండే లభిస్తుంది, లైన్ క్లియర్

## 18. ఈ కవిత

మానవ తత్త్వం లోతు చూడమంటుంది
మానస లోకం అంచు చేర మంటుంది
చీకటి దారిని వెలుగు చేయ మంటుంది
అనుమానాలకు స్వస్తి పలక మంటుంది

జీవిత మొక సుందర వన రూపం ధరించి
జనతకు పరిమళ లహరులు అందించాలని
మంత్రంతో తంత్రంతో పని లేకుండా
అనుభవ సుందర లక్ష్యం తో దార్శనికం

కవనానికి విభవానికి తొలి అవసరం హృదయం
కదనానికి విజయానికి తొలి తోరణం త్యాగం
పద పదాన అడుగు జాడ లొకటొకటీ
జాడలలో నిజ చరిత్ర ! స్మృతి చిహ్నం !

నిశి నిశి వెన్నెల కరుణా మయమై
బుద్ధుని ఆశయ రూపం తలపిస్తుంది
పవలు ప్రకాశం తేజో మయమై
మనిషి యశ శ్శిఖరం చూపిస్తుంది

ఎపుడో కనిపించే మేఘం ఎదలో కదలుతూ
నిరంతరం ఒక ఆశకు చిహ్నం కావాలనీ
మనిషి మనిషిలో మానవతా కుసుమంతో
వసంత కళ ఎప్పటికీ ఉండాలనీ

ప్రగతికి భౌతిక శక్తుల ప్రమేయంతో
విజయానికి నైతిక మానస మవసరం
సమాజ నిలయానికి సింహ ద్వారం
సుస్వాగత బంధువు ! ఈ కవితకు లైన్ క్లియర్

## 19. కదలే రైలు

కవిత అవతరించే అమృత క్షణం కవిలో
బంధానికి ద్వేషానికి దూరంగా స్వేచ్ఛా హృదయం
కవిత బయట పడుతూంటే ! అనుభవంలో
శిఖరా రోహణమో దూకే జల పాతమో
సెట లైటొ స్పుట్నికొ అతిశయ రమణీయం
సమాజ వశమై కవిత, ప్రేక్షక పాత్రలో కవి!
గీసాక అవసరం తీరి పోయి పారేసే
అగ్గి పుల్ల కాదు, కవితా క్షణంలో పదం
భద్రంగా ఉంచే రత్నంలా మిగులుతుంది
ఎప్పటికీ టేబిల్ పై పరచి ఉంచేది కాదు

కిటికీలు తలుపులు లేని విశాల శాల
సమాజ నిలయం! అందరికీ ఆశ్రయం.
ఎంత గొప్ప వారయినా ప్రయాణికులు
రైలు ఆగే ఉంటుంది పట్టాలపై
ప్రజాభిమతం సిగ్నల్ వాలే వరకూ !

కవితలో కనిపించే కవి వ్యక్తిత్వం
కనిపించని అంతరంగం మొన మాత్రమే

నలు మూలల నుండి ఎగసే నిప్పు కణాలను
దోసిలిలో పూలుగ మార్చాలని తొందర
తరగని స్మృతి పరిమళం ఎప్పటికీ సమాజ వశమే!

మానసిక వికాసం, నాగరక ప్రకాశం
ఆర్ద్రతా విలసనం కవితకు ప్రయోజనం
మానవత అలంకారం కాదు, అది ప్రాణ సమం
మూర్ఛాసమ సమయంలో కవితకు సంజీవని

## 20. నిజం మండుతూంది

నిజం మండుతూంది
మంటల ధగ ధగలకు సంతోషంతో ఒకరు
చలి కాచుకొనే అనుభవ సమయంతో ఒకరు
వజ్రం తళ తళ భ్రమలో గడిపే రొకరు
భగ భగ లయలో తబలా శబ్దం వినే దొకరు

నిజం మండుతూంది
పై కెగసే పొగ చుట్టిన పాగాతో
రవి రశ్మిని ఆక్రమింప జూస్తూంది
ఎరుపు తెలుపు పసుపు మంటలలో
ఎవరికి వారు తమ 'ఇజా'లను దర్శించేరు

నిజం మండుతూంది
గుడిసెలు కాలిన వాసన ! నిరాటంకంగా
ఎక్క దెక్కడికో వార్తను చేరవేస్తుంది.
పక్క నున్న రెండు రాళ్ళ సందున తడితో
ముఖ మెత్తిన మొక్క విస్తు పోయి చూస్తూంది.

నిజం మండుతూంది
యోగంలో ఆకాశం మౌనంగా ఉంది
వస్తూ పోయే ప్రజలు ! ఎవరి నమ్మకంలో వారు
రహస్యం లేదు, అందరికీ తెలిసిందే
మానవ చరిత్రలో నీలి మరకలు మిగులుతూ.

నిజం మండు తూంది
దగ్గరలో చెట్టుపై పక్షి ఎగిరి పోతూంది
ఆకులు మాడిన తరువును తలపించే ప్రజాస్వామ్యంలో
క్షణంలో పైకి దూక బోయే పులిలా మంటలు
చెట్టు నీడ బోనుతో సిద్ధంగా రాజ్యం, ఆన్ లైన్ లో

## 21. కాలం వేసే టాస్

సమాజ గమనంలో వైషమ్య స్థితిలో
మౌనంలో సమస్యకు సమాధానం దొరకదు.
కావలసిన గమ్యం చేర్చ లేదు తటస్థం.
మాటో వ్రాతో సైగో సూచనో ఇవి
తృప్తికి సుఖానికీ సంతోషానికీ పయనింప జేస్తాయి
లక్ష్యం పొందేందుకు మానసికంగా చేతన అవసరం.

చలి గాలి వీస్తుంది సన్నని కోతలా
శరీరాన్ని వెచ్చగ ఉంచే యత్నం చాలు
ఉత్సాహం లభిస్తుంది, ఉద్వేగం పెరుగుతుంది
పెనుగాలికి చెట్టు కూలుతుంది
దారికి అడ్డంగా పడి అంతరాయ మేర్పడుతుంది
తగిన చర్యలతో ఆటంకం తొలగుతుంది.

ఒకరి స్వేచ్ఛకు భంగంగా ఒకరి భాగ్యానికి అడ్డుగా
ఒకరి హక్కుల్ని అణచివేస్తూ
ఒకరి విలువల్ని కాలరాస్తూ
సాగే విషాద జీవన సమాజంలో
మౌనం ఆమోదం కాదు
తటస్థం సమ్మతం కాదు ఉదాసీనత పనికి రాదు

క్లిష్ట మైన స్థితిని ఎదుర్కొనే మతికి
విజృంభణం ఆశ్రయ రూప మవుతుంది
మనసు గుహ నుండి బయట పడి
సింహం చకితంగా పైకి దూక వచ్చు

మౌనం ఫలకం ముక్కలై చెదరి పడుతుంది
తటస్థ స్తంభం కుప్ప కూలి పోతుంది
గాలి బరువెక్కుతుంది, ప్రశాంతి కోల్పోతుంది
ఉక్కిరి బిక్కిరి అయి ప్రాణం ముడుచుక పోతుంది

సౌహార్దం సౌభ్రాత్రం సౌభాగ్యం సమ భావన
నాలుగు స్తంభాల మహా నిలయం ప్రమాదంలో

తుపాను రాక ముందు
నిశ్శబ్దం బద్దలయిన సందర్భాలెన్నో ?
మనుషులు నిశ్శబ్దంగా
అగ్ని గోళా లయిన స్థితు లెన్నో?

పీడితులు పీడకుల మధ్య
ఉన్న వెలుగు రేఖ పొగ బడుతూంది
పాలితులు పాలకుల మధ్య
ఉన్న ఆర్ద్ర రేఖ ఎండి పోతూంది

జన సమూహ పంక్తులలో ఉత్తేజం ఆవేగం
పెను మార్పుకు సంకేతంగా మారే సమాజ రూపం!
ఇదొక సమాజ సంధ్యా సన్నివేశం
అటో ! ఇటో ! ఏమయినా, నలిగేది ప్రజలు !
చీకటి అనివార్యం! అది పై బడినా
ఉదయం పై విశ్వాసం! తప్పనిదీ

చివరి శ్వాస సాగేంత వరకు గురి తప్పని
బాణంలా మిసైల్ లా దూసుకపోతూ
చేయాలిసిన పని ఒకటే ! ప్రగతి హితం
గెలుపూ ఓటమి చరిత్రలో లభిస్తుంది
కాలం వేసే టాస్ పై ఆధారపడీ !

మనిషి జీవ నిర్మితిలో సృజన గుణం వల్ల
అశాంతి నిలవ లేదు బహు కాలం సమాజంలో
మనిషి పై విశ్వాసం పెరిగి, “శాంతి” కి లైన్ క్లియర్.

## 22. కృతజ్ఞతతో

నాలుగు దారులు చీలిన చోటే సమస్య
పోయే దారి నెన్ను కోవడంలో సందేహం!
అవసరం చెబుతుంది, అంతరాత్మ సూచిస్తుంది
సూచన విన బడక పోవచ్చు తల కెక్కక పోవచ్చు

చేపట్టిన దారిలో అనుకోని ఘటన లెన్నో
యానం కొన సాగవచ్చు లక్ష్యంగా
మార్గం కని పించ వచ్చు! విషమంగా
రెండిటికీ మనసు సిద్ధంగా ఉంటుంది.

అడ్డ దారి తొక్క వచ్చు సులభతకై
అది బాగ లేక పోతే విధి రాతకు బలం.

పూవు చేతి కందినా ముల్లు గుచ్చు కున్నా
తనతో నడచే ఎదురు పడే వారితో కాదు
వీరిలో పరిచయం ఉన్నవారు ఉండవచ్చు
ఉదయ హృదయంతో చీకటి ఊహ తో!
మనసును కదలించే వారు కొందరు
గుండెను పిండేసే వారు! కొందరు

చిట్ట చివరి గమ్యం అంటూ లేదు జీవితంలో
ఎక్కడి కక్కడ పరిమితమై అవసరాలు తీర్చేవే

నేడైనా రేపయినా సంఘం గుర్తించే పనితో
దార్శినిక గుణంతో కల నిజ మవు తుంది

జలధి లోతులో సబ్ మెరిన్‌లా, అలలపై పడవలా
కలలు లేని మనసు లేదు మనిషి లేడు బ్రతుకు లేదు.

పరిచయంతో మొదలవుతుంది మానవ బంధం
ఆప్తత తో దృఢ మవుతుంది హార్దిక బంధం
సాటి మనిషికీ ఈ భూమికీ సమాజానికీ
కృతజ్ఞతా స్పందనతో సమాప్తి! లైన్ క్లియర్

స్వేచ్ఛా కవిత్వం-67

# వర్తమాన వాస్తవం

మాదిరాజు రంగారావు

2016

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

# VARTHAMAANA VAASTHAVAM

Free-Verse

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2016

Presented
to
my son
***Dr. M. Santhosh Kumar***
on his
***Birthday***
with affection

# వర్తమాన వాస్తవం

## పీఠిక

ఈ కవితా సంపుటి భౌతిక మానసిక దార్శనిక స్థాయిల్లో రూపొందింది. ఇవి సందర్భాన్ని బట్టి చేరుతూ వర్తమాన ప్రవాహానికి ఆకృతిని కలిగిస్తున్నాయి. విషయం వాస్తవ జీవన సమాజానికి సంబంధించింది. కవిత్వంలో భావ రూపాలు ప్రతీకలు చోటు చేసుకోవడం జరిగింది. అభివ్యక్తిలో అవలంబించిన ఈ విధానం నిర్మాణ కళకు చెందింది. ఒక విధంగా కవిత్వానికి స్థాయిని చేకూరుస్తాయి.

కవిత్వం ప్రధానంగా మన: ప్రపంచానికి సంబంధించింది. ఆలోచన అనుభూతితో పాటు దార్శనిక ప్రకాశం దృష్టికి వస్తుంది. స్వేచ్ఛా కవిత్వంలో ఒక నియతమైన నిర్మాణ విధం లేకపోవడం వల్ల, కవి అప్పటికప్పుడు తనకు తానుగా, తనదైన రచనా విధానాన్ని ఏర్పరచుకోవలసి వస్తుంది, దీని చేత స్వతంత్రమైన ఆవిష్కారంతో ప్రత్యేకత సిద్ధిస్తుంది.

ఈ పద్ధతిలో ఈనాటి 1) జీవితం – సమాజం 2) ఆలోచనలు – అనుభవాలు 3) మార్పు అభిప్రాయాలు 4) తాత్త్వికత – ప్రజాస్వామ్య దార్శనికతతో కూడిన సృజన కళ విశ్లేషణ కందుతుంది. ఈనాటి సమాజంలో అవసరాల్ని బట్టి వ్యక్తి స్వేచ్ఛ – సంస్కరణం – పరివర్తనం – లక్ష్యం మొదలుగా ప్రజాస్వామ్య సామ్యవాద భావనతో స్వేచ్ఛా కవిత్వం స్వతంత్రమైన అస్తిత్వాన్ని పొందింది. సమాజ చలనంతో రాజకీయ ప్రభావంతో ఏర్పడే రూపంలో మానవీయం స్పష్టంగా కనిపిస్తుంది.

ఈ కృతి ఇపుడు వస్తూ ఉన్న స్వేచ్ఛా కవిత్వం పొందుతూన్న విస్తృతినీ వైవిధ్యాన్ని సూచిస్తూంది. ఇది వర్తమాన వాస్తవం పొందే ప్రవాహ రూపాన్ని ప్రతిబింబిస్తూంది. ఒక విధంగా భిన్నమైంది, విశిష్టమైంది. కవిత్వంలో మెయిన్ స్ట్రీమ్ కు చెందింది. వ్యక్తి – సమాజం – మానవం – మానవతతో సంపన్నమైందీ. కథా రూపం లేదు. కానీ జీవన యానంలో సన్నివేశ దృశ్యాలతో సంఘటన స్థితులతో విషయాకృతిని పొందింది.

**– మాదిరాజు రంగారావు**

# వర్తమాన వాస్తవం

## 1. శాంతికి చోటు లేదు

శాంతికి చోటు లేదు
హింసకు దారి తీసే అసహనంతో
వికార చర్య లొకటొకటి సమాజంలో
శాంతికి చిర వాసం లేకుండా చేస్తున్నాయి

నలు వైపుల ఆక్రమించే
అలజడి ఘోరం నేరం! అశాంతిలో
వర్తమాన యానంలో విరామ చిహ్నంలా శాంతి

అదుపు లేని స్వేచ్ఛలో
అనుకోని అపాయ భయ శంకలలో
శాంతి! బొటన వేలుపై నిలిచి

వరద పొంగు ఆవేశం ఆవేగంతో
చెదరిన సమాజం! అభద్ర భావంతో

నేతలు చతురులు విజ్ఞాన ఘనులు
సమాజ చలన చక్రంపై భ్రమిస్తూ
చూచే వారిని భ్రమింప జేసేరు

కల్పనలో దివి మార్గం పట్టించేరు
వాస్తవాన్ని శిలా ఫలకంగా మార్చేరు
సూది మొనలా శాంతి! అక్కడక్కడ

శాంతి చేతికి చిక్కి నట్లయి
తీరని కోర్కెలతో అనుకోని ఘటనలతో
కథ మొదటికి వస్తుంది సమస్యను విసరుతుంది
ఎవరి దారిన వారు! అశాంతి ముద్రలతో

❃

## 2. శాంతికై నిరీక్షణం

మానుష సంబంధాలతో మారే జీవన గతిలో
విషమంలో శాంతికై ఆరాటం ఆవేదన!

విద్యా నిలయాలు విజ్ఞాన శాలలు తత్త్వ వేదికలు
శాంతికై ద్వారాలు తెరచి పరిశోధనలో!
రణ మారణ శామన కామనతో
మాటలు రాతలు చర్చలు ప్రసంగాలు
'శాంతి'కై స్వాగత ముఖాలతో ఎదురు చూస్తూ,
అది తమ నీడ వెనక ఉన్నది, తెలియదు
వెలుగు ముఖం కనిపెట్టే వివేకం అవసరం

పార్లమెంటు సౌధ శిఖరంపై
రెక్క లార్చుతూ చేరిన పావురం
'శాంతి'పై నమ్మకం నిలుపుతూంది

చెట్టు కింద పురి విప్పిన నెమలి
అడుగులు వేస్తూ నృత్యం తలపిస్తూ
బ్రతుకులో హ్లాద చిత్రం దింపుతూంది

సరసిలో హంసలా హృదయంలో 'శాంతి'తో
జీవన లహరులపై ఆనందం! పై కోరిక!

మనిషి గుండె మండే కొలిమి అయితే
'శాంతి'కి చోటు ఎక్కడిది?
చల్లగా అడవికి చేరుతుంది

చెట్ల చాటు నుండి ప్రేలే
ఆయుధ శబ్దానికి నిశ్శబ్దంగా
పచ్చని తెర చాటు నుండి
శాంతి! నింగి వైపు తరలుతుంది

❋

## 3. అవసరం

సమాజాన్ని వదలి వేసి ప్రకృతికి దూరమైన
శాంతికై నిరీక్షణం! అన్వేషణ సాగుతుంది

క్షోభలో మనిషి మనసునూ
సంక్షోభంలో సమాజాన్నీ వదలి
వీడిన శాంతి! కవితలో కళలలో కనిపిస్తుంది
ఈదుతూ ఎగురుతూ వాలుతూ తేలుతూ

చిరంజీవి శాంతికి ఆవాసం
సృజన సుందర మనోనిలయం!

వృథా వ్యధల కథలతో
ఆయువు గడచే సమయంలో
హృదిలో సంస్పందన చేతనతో
బ్రతుకును సార్థకం చేస్తుంది,

ఉరుములు పిడుగులు! సాకుతో మేఘం ఆగదు
భయాన్ని తరుముతూ వస్తుంది చకచ్చకితంగా
ఉదారమైన కరుణామయ వర్షం
చల్లని శాంతికి! స్వాగతమిస్తుంది

మనసుకు అవసరం "శాంతి" జీవ ధాతువు
ఇది అంతరంగ లోకానికి ప్రకాశ రూపం!

వ్యక్తి నుండి విశ్వం దాక
చిర సత్యం, ప్రియ రూపం, శాంతి!

ప్రేమకు పూచే పుష్పమై
ఆత్మకు వ్రేలే ఫలమై
సమాజ చరిత్రకు ప్రేరణం
మానవ సంస్కృతికి అవసరం

❋

# 4. అపూర్వ విశేషం

దోసిలి నీరులో నావలా రవి బింబం
నా కోసం దయ చేసినట్లు ఉంది
దీనిపై 'శాంతి' తీరం చేరాలని
మనసు కెంత ఉబలాటమో! ఏ రోజూ!

నావ నుండి విమాన రూపం దాకా
సహ ప్రయాణికులతో జీవన యానం,
అవసరానికి మారుతూ మనుషుల్ని కలుపుతూ
దూరాన్ని దగ్గర చేస్తూ విశ్వమయం చేస్తుంది

ఎక్కడో ఒక చోట రోడ్ క్రాస్ చేయక తప్పదు
జన వాహన కోలాహల సంరంభంలో
భయం వదలి ధైర్యంగా కదలడమే కర్తవ్యం
సుఖంగా దాటితే అది శాంతి క్షణం!

ద్రోహులు హంతకులు రక్షకులు శిక్షకులు
నిర్ణేతలు! నేతలు! హేతుమతులు! కళాహృదయులు
ఎక్కడెక్కడి నుండో వచ్చి చేరే
దారులన్నిటికీ! కేంద్ర బిందువు, 'శాంతి'

వీరం చివరి అంచు నుండి
కరుణతో మొదలైన శాంతి
స్నేహ సుందర గమనంతో
దేశ దేశాలు తిప్పుతుంది

ఆయుధానికి అలంకారమై అమృత శక్తి నిస్తుంది
రాజనీతి కవచంతో భాగ్య దశను వరిస్తుంది

చరిత్రలో కనిపిస్తూ మాయ మయ్యే అదృష్టాన్ని
పొందడం మొక అపూర్వ విశేషం! అది శాంతి ముఖం

❊

## 5. శాంతి-మూలకణం

సువర్ణ వర్ణం లోకి మారక ముందు
ఉషస్సు తొలికిరణం తెలుపు, శాంతి చిహ్నం
శిశువు ముఖంలో స్వచ్ఛమైన
స్నిగ్ధమైన మనో వికాస రూపం!

సువర్ణ వర్ణం లోకి మారిన వెలుగుతో
విలువలు మొదలవుతాయి బ్రతుకులో,
మనిషి ముఖం వర్ణ చిత్రయుత మవుతుంది
పలు రంగుల కలయికతో జీవితం సంశ్లిష్ట మవుతుంది

ఆదర్శం నుండి వాస్తవానికి దిగడం మొదలవుతుంది
'శాంతి'కి పరీక్షా సమయం వేగవంతమవుతుంది

ఆటలో బంతిలా వర్తమాన క్షణం
మానుష చర్యలతో సమాజ సందర్భం
వ్యక్తి కేంద్రం నుండి సమాజ వలయంలో
చలనం ఒక అవసరం, ఆశయ మొక లక్ష్యం

మితి మీరిన వ్యక్తి స్వేచ్ఛలో
చెలరేగిన అలలు వరదలవుతాయి
స్వేచ్ఛ లేని, పరికుంచితమైన బ్రతుకు
శిలా స్తూపంతో సమానం

మానుష ధర్మంతో సమాజ సంస్కృతి విలసనం
పరివర్తన రూపంలో శాంతిని కోరుతుంది

వ్యక్తికి ముఖ్యం నిర్మల హృదయం
స్వేచ్ఛా మనోజ్ఞమైన సమాజ శ్రేణిలో
విశ్వహితం కోరుతుంది శాంతి!
ఈ మూల కణానికి విజయరూప అవసరం

❊

## 6. అగ్ని పరీక్ష

ఎంత కాదు, కూడదు అనుకున్నా
కలగిన మనిషి వేసే అడుగులు
అగ్ని పరీక్ష వైపే! కావచ్చు
అడుగులు ఆగవు! పరీక్ష తప్పదు

అనల వీచి ఊహలతో
అనుమానం పొగల మధ్య
ఎరుపు నీలి రేఖలతో
ముఖం నిండ చిత్ర పటం!

అనల కణం మణి శకలం కాదు
నీరు తాకితే బొగ్గవుతుంది
అనల స్పర్శతో మరల కణకణలాడుతుంది
చివరకు బూది పొరలతో! ప్రతి దశ వాస్తవం

పరీక్ష పర్యవసానం మోదమో ఖేదమో తెలియదు
ఏదైనా జరగవచ్చు, నిశ్శబ్దంగా అనుకోకుండా
ఎందరికో జవాబు చెప్పాలిసి ఉంటుంది,
తన ప్రశ్నకు మాత్రం జవాబు ఇచ్చే వారు లేరు

రాత్రి లేని రోజు లేదు
దోషారోపణం లేని బ్రతుకు లేదు
తన దారిన పోతూ రాత్రి
నీడ వదలి పోతుంది, సాక్షిగా,

రవి ఉదయించే దిశ తెలిస్తే, చాలు
చీకటిలో మిగతా దిశలు తెలియడం సులభం
శాంతి లేని దశలో! సందేహ పథంలో
అడుగులు మాత్రం! ఏదో ఒక పరీక్ష వైపు!

❊

## 7. ఏ కవికో ఏ నేతకో

అభద్ర వాతావరణంలో ఇప్పుడు
దేశ సీమల కన్న సమాజ స్థితి అశాంతిగా
తుఫాను ముక్కల్లా! బాధ పెట్టే ఘటనలు
తీవ్ర భావ ఉగ్ర వాద బీభత్స దృశ్యాలు

దారిలో అణువణువున అనుమానం! భయం!
ఏ విపరీత వర్తనమో? ఏ విపరీత కృత్యమో?
కరుణ లేని సాహస చర్యల ఫలితం
నిప్పంటు కొని పొగలు ఎగసే నగర దృశ్యం!

మెరపులతో వస్తుంది ప్రచార మేఘం
నీటి చుక్క రాల్చకుండ! వెళిపోతుంది

ఈ భూమిపై ఈ దేశం ప్రతి పౌరునిదీ
అందాలిసిన భాగ్యంలో వంతు! చిటారు కొమ్మన!
అక్షరాల అర చేతుల్లో రాజ్యాంగం భద్రంగా
శూన్యంలో వదలుతుంది, మాటలతో మేల్పొతుంది

కొందరికి నిలువ జగా లేదు
కొందరికి నిలిచింది చాలనిపిస్తుంది

నీడకు చేర్చే మిషతో
చెట్టుకు కట్టేయ బడీ
నిలువ నీడ చూపినందుకు
సంతోషించాలని, హితవు!

సంధ్యా సందేహాలతో స్వార్థం ఏలుతూంది
సమస్యల ముళ్ళు విప్పే పనిలో మునిగిపోయి
తల ఎత్తి చూచే తీరిక ఎక్కడుంది?
ఏ కవికో! ఏ నేతకో! తప్ప
ఏ కబుర్ల రాయుడికో? తప్పకుండా

❊

## 8. అంతా ఒకటే

పగలు ఎంత తేజో యుత మయినా
వస్తువుతో నీడ తప్పని సరిగా
వస్తువు ఉనికిని తెలుపుతుంది నీడ
ఉపశమన గుణంతో తోడును తలపిస్తుంది

ఆటల్లో పిల్లలూ మాటల్లో పెద్దలూ
ఎవరి పనులలో వారు కాలాన్ని మరచి
విషాద జ్ఞాపక మయినా ఏడ్పును మోసుక రాదు
ఆర్ద్రమైన తలపుతో మనసును అలరిస్తుంది

రెక్కలు లేని మనిషి, ఊహలపై విహరిస్తాడు
ఊహలు రాని మనిషి, శిలల మధ్య గడుపుతాడు

ప్రతి వ్యక్తి జీవిత మొక డైరి
చిన్నదొ! పెద్దదొ! పుటలు నిండో! నిండకో
ఇష్టమైనవీ కానివీ వివిధ విషయ శీర్షికలతో
ఒక వాక్యం వెనక! దాగిన వాస్తవా లెన్నో!
పుట్టలో పాములా, గూటిలో పక్షిలా
చెరువులో చేపలా స్మృతిలో ఒకటొకటీ!

బరువును భరించలేక స్మృతికి దూర మయ్యేవారూ
బాధ్యత తెలియక ఏకాంత శిఖరం చేరే వారూ

ఇల్లు వదలినా, సమాజం వదల బడదు
సచేతనతో మానుష విజయం! కోరుతుంది
ఇష్టంగానో తెలియకనో ఒత్తిడిలోనో
అశాంతిలో అడుగులు! పరీక్షలో శాంతి వైపు!

సమాజం తలుపు లెప్పటికీ ఎవరికైనా మూతబడవు
హతులూ హంతకులూ ఉన్నవారు లేని వారు ఒకటే!

❋

## 9. సమయానికి తగి

నా మాటకు పిల్లల ఆటకు
నా కవితకు పిల్లల మాటకు
చక్కగా సరిపోతుంది, సందర్భానికి తగి
ఇది కాలాన్ని అవలీలగ దాటిస్తుంది

ఇది ఎవరి మెప్పుకు ఎదురు చూడదు
ఎదురుబడే ఆటంకాన్ని అధిగమిస్తూ పోతుంది

మనిషి మాటలు గాలిలో కదలి
మనిషి రాతలు నీటిలో కలిసి
క్షణంలో అదృశ్యమయి పోతాయి
మనసులో జాడలు వదలి పోతాయి

తలుపులు మూసిన నిలయం గతం
తలుపులు తెరచిన నిలయం వర్తమానం
బ్రతుకు గడచే పనిలో కాలం
శ్రమ చక్రంపై తిరుగుతుంది వేగంగా

రాబడి పోబడి ప్లస్ మైనస్ పట్టికతో
రోజు గడుస్తుంది! తెలిసీ తెలియని విలువలతో
ఏ రోజూ మరో కొత్త అంకె చేరే పనిలో
నడుస్తుంది, నడిపిస్తుంది! జీవన చలన యంత్రం

అవసరం ఉన్న నీటి చుక్కను
అవసరం లేని నెత్రు బొట్టును
సమంగా స్వీకరిస్తుంది, భూమి!
తనలో సంపదతోపాటు అస్థి పంజరాలూ

సృజన విలయ పరంపరా రూప సమాజం
కొత్త నీరు వెనక పాత నీరుతో ప్రవాహ వాస్తవం

❋

## 10. లేని అవకాశం

అనుభవ గతిలో నడచే పవన లహరితో
ఆలోచనలో కదలే జలద పంక్తితో
క్షణ మొక కుసుమంలా విరిసి కవిత
అందం గంధంతో అలరాలి అనీ

విశాల శాలా నిలయాలు అవాసాలెన్నో!
ఉన్నా, నగరం ఫుట్ పాత్‌పై రాత్రి వేళ
ఆద మరచి నిద్రించే మనుషు లెందరో!
అనుభవం వేరవుతుంది! ఆలోచన మారుతుంది

వీరూ ఈ దేశ వాసులు పౌరులే
చిర మానవ సంస్కతికి వారసులే

రాజ్యాంగం రక్షణ ఉన్నా
జీవన గమ్యం తెలియని వారూ
ఓటు హక్కు ఉన్న వారు
తిమిరంలో వెలగని దీప శిఖలు!

పగలు శ్రమ చక్రంగా మారి
రాత్రి పేవ్‌మెంటుపై శిలా సదృశులు
వర్తమాన ద్వారం మూత బడి
జీవిత మంతా బ్రతుకులు బయటనే,

ఆటంకాల కంటకాల్ని దాటడమే కాదు
ఎగిరి పడే నిప్పు రవ్వల నుండి తప్పుకోవాలి

జన హిత కర రూపంతో తీర్చిన రాజ్యాంగం
పౌరుల హక్కుల రక్షణలో అభయ వరం
ఇది తెలిసిన వారెందరు వీరిలో
విజయంలో భాగం అయ్యే అవకాశం ఎందరికి?

❋

## 11. సంపదలో భాగం లేదు

రైల్వే స్టేషన్ నుండి రాత్రి వేళ
ఇంటికి వస్తూ ఉంటే ఆటోలో
నాతో ఉన్న చిన్న పిల్లడు అడిగే ప్రశ్న
"వీళ్ళు ఇక్కడ ఎందుకు పడుకున్నారు?
గాలి బాగా వస్తుందనా?"

దీనికి జవాబు చెప్పే ధైర్యం లేదు
సాహసించలేక మౌనంలో తేల్చేసా
ఆ క్షణం నుండి నను బంధించిన
ప్రశ్నతో ఇంటికి చేరా! అది క్షణంలో
మస్తిష్కాన్ని స్తూపంగా మార్చేసింది

ఇలాంటి ప్రశ్నలెన్నో! సమాజం నుండి
కొందరిలో బరువులు దింపుతాయి
కొందరిలో దూది పింజల్లా తేలతాయి

ఒక చోటు నుండి మరో చోటికి
ఎండిన ఆకుల ముఖాలతో ఎందరో!
ఎక్కడెక్కడో తిరుగుతూ చెల్లని నాణాల్లా
పగలు, నీడ ఇచ్చే చెట్టు కింద
రాత్రి, పరచి ఉండే ఫుట్ పాత్ పైన

రాత్రి అనుకోకుండా పడే చినుకులకు
అక్కడి నుండి ఏ బస్ స్టాండ్‌కో రైల్వేస్టేషన్‌కో
ఆ సమయంలో తల దాచుకొనేందుకుకు
ఎక్కడ వీలయితే ఆ పంచన! గడపడమే

ఓటరు జాబితాలో పేరు ఉంది
సమాజ సంపదలో భాగం లేదు

❋

## 12. మనిషిలో వెలుగు మనిషి

ఎన్నికల్లో పనికి వచ్చిన వేలి గుర్తు
తర్వాత పనికి రాదు, చెరిగిపోతుంది
ఇది భుక్తికి అక్కరకు రాదు
కాని దేశ వాసిగా నిలుపుతుంది

రాత్రి గస్తీలో లాఠి శబ్దం హెచ్చరిక
ఆ సమయంలో చల్లని గాలి తగిలి
చక్కని నిద్రను చెదరగొడుతుంది

కలలు కంటూ పడుకుంటే
మరునాడు కడుపు నిండే దెట్లా?
నిద్ర నుండి మెలకువకు, మెలకువ నుండి నిద్రకు
తీరం నుండి తీరానికి ఒక్క గంతులో

అడుక్కోవడం ఎవరికి ప్రీతికరం?
చేసేందుకు చేయ గలిగిన పని దొరకాలి,
అందాక చెట్ల ఆకులు నమలుతూ బ్రతకాలా?
చెట్ల ఆకులు లెక్క పెడుతూ గడపాలా?

వాస్తవ మొక అయస్కాంతం
దీని ఆకర్షణ నుండి ఎవరూ తప్పించుకోలేరు

దీపం నుండి దీపంలా, దీపంతో దీపంలా
వెనక చీకటితో, మనిషి! మనిషితో
మానవీయ ప్రకాశంకై యుగాల భూమికతో

మస్తిష్కాన్ని హృదయాన్ని వేరు చేస్తే
భౌతిక మానసికాలకు దూరం! పెరుగుతుంది
గుర్తించినా గుర్తించకపోయినా, కోరినా కోరకపోయినా
మనిషిలో మనిషి! వెలుగు చీకటి రెండూ కలిసి!

❋

## 13. సంతోషం - విచారం

కష్టంలో లొంగి పోయి వెదురు బద్దలా
తమలో మానుష ధనుసును మరచేరు
తమలో ప్రతిభా తేజం కనిపించదు
విజయ ఫలం రుచి పొందే దెట్లా?

విశాల సరో జల తలంపై
పగలు సూర్య బింబం బంతిలా
ఆడుకునే పిల్లల్లా చిన్ని చిన్ని అలలు
ఈ చివరి నుండి, ఆ చివరి దాకా స్వేచ్ఛగా

రాత్రి చంద్ర బింబం నావలా
సూర్య చంద్రు లిరువురు! హ్లాదంగా

ఆశించే గమ్యం దగ్గరయ్యే కొద్దీ
బయలు దేరిన స్థానం దూరమవుతుంది

ఆశ్చర్యం లేదు అతీతం లేదు జీవితంలో
అంతా కారణ సహితమైన వాస్తవానుభవం

కార్య క్షేత్రంలో ప్రవేశం మొదలుకొని
విధిపై విశ్వాసంతో బాధ్యతను మరవడం,
అస్తితకు పలు రంగు లద్ది మురవడం
లోతు తెలియని బావిలోకి నేరుగా దిగడం

ఒకపుడు అరణ్యమై ఒకపుడు సముద్రమై
రెండిటి సుందర దృశ్యంతో జీవితం
ఏకాంతం కొన్ని సందర్భాల్లో
ఇంద్ర ధనుసులా సంతోషం విప్పుతుంది
ఏ కాంతం కొన్ని సందర్భాల్లో
సాయం సంధ్యలా విచారం చుడుతుంది

❋

## 14. తెలిసిన రహస్యం

తెలిసిన రహస్యం నలుగురికీ చేరాలని
వీడ లేని సమాజ సహజ బంధంతో మనిషి!

మనిషిపై ప్రేమ, సృజన హృదికి ఉదయం
మనిషిపై ద్వేషం, నిశా మతికి ద్వారం

లోన నీల మేఘం కదలే మనిషి!
తన కెదురు పడే మంటలకు
భయ చకితం కానవసరం లేదు
వెనక్కి అడుగు వేసే, ఊహ అక్కర లేదు

మనిషిలో పచ్చదనం పక్షితనం
మానస స్థాయిలో బ్రతుకును నిలుపుతాయి

విగ్రహం వెనక నిలిచి విశ్వాసంతో
ముందు నుండి వచ్చే బాణాల
గాయాల నుంచి తప్పుకునే వారూ
ఇలా గడపడ మొక తప్పనిదవుతుంది

భూమిపై హింసలు ఘోరాలు చూడలేక
రాత్రి వేళ చంద్రుడు హఠాత్తుగా
మబ్బుల చాటు మాటుగా! కదలుతూ పోయేను
ఉదయం వెండి తెరపై బొమ్మల్లా పత్రికలో వార్తలు

చుట్టూ కోటలా పరంపరా రూపం
భద్రతకు రక్షణకు భరోసాగా
యధాస్థితిలో నలిగిన దారి, ఇష్టమైనా
మార్పులో అశాంతిలో కొత్త దారి! తప్పదు

❈

## 15. హృదయ భాష

హృదయ భాషను ఎవరూ
ఎవరికీ నేర్ప నక్కర లేదు
మానవీయంతో ఇది సహజాతం
మానవతా స్పందనతో సాధ్యం

చెట్టుతో కుసుమంలా అందంగా
సంఘంతో మనిషిలో విప్పారుతుంది
మార్పులో సృజన రూపం! ప్రకటిస్తుంది
మెత్తని ఎదతో స్వంతం అవుతుంది

నేలలో విత్తిన బీజంలా కోరిక
చినుకుకై ఎదురు చూస్తుంది ఓపికగా
ఎదగడానికి అవసర స్థితులన్నీ ఒకటొకటీ
పాత్రలతో వీలు వెంట క్షేత్రంలో ప్రవేశిస్తాయి!

మార్పులలో విలయ చర్యలు కొన్నిటిలో
ఫలితం సుగమం చేసే పద్ధతిలో తప్పనివీ

వెలుగు రేకలు మాయమై సమాజ ముఖంలో
చీకటి పేలికలు వ్రేలాడే సందర్భం వస్తుంది

తన చుట్టూ జరిగే ఎన్నిటికో సాక్షి మనిషి
అవసరమయినపుడు ఏమీ తెలియని! అమాయకం!
మరపు ఆవహిస్తుంది! చెప్పేది వేరొకటవుతుంది
ఈ సాక్ష్యానికి మరొక సాక్ష్యం కావలసి వస్తుంది

వైరం గీతలు గీసి నిలిపేస్తుంది
కలహం సీమలు తీర్చి తరిమేస్తుంది
అసహనం అనల కణం చిమ్ముతుంది
కోపం జ్వాలా రూపమై దహిస్తుంది

నీలి ముసుగు మనసు నుండి
హృదయ భాష! వెలువడదు

❁

## 16. వార్త పత్రికలో గ్రాఫ్

శిశిరంలో ఇంటి ముందు ఆకు రాలి
ఎండి పోయి దీనంగా నిలిచిన చెట్టుకు
ఎవరు వీడ్కోలు చెప్ప జూస్తారు?
ఆలోచనలో గొడ్డలి నెవరు కదలిస్తారు

చరిత్రలో మానవీయ మనోజ్ఞ పతాకం
రక్త సిక్తమై విశీర్ణమైన సందర్భాలెన్నో!
ధూళి క్రమ్మి కనిపించని స్థితులెన్నొ!

నీలి మబ్బులో మెరపులా బయటపడి
స్వేచ్ఛకై తపించి హక్కులకై తెగించి
సార్థక మయ్యే దశలు కొన్ని మాత్రమే!

ఒక వైపు వ్యక్తిలో అవసరాలు
ఒక వైపు సమాజ ప్రయోజనాలు
విరుద్ధ గతులతో! ఎదురవుతాయి

ఈ రెండిటి మధ్య ప్రవహించే జీవితం!
ఆగవచ్చు ఇంక వచ్చు మేట వేయవచ్చు!
పురోగమనానికి వెనక నుండి జల బల మవసరం
ఆశకు ఎదురుగ అవకాశం ఉంటే సరిపోదు

ప్రేమ కరుణతో మానవత కరువై
భయం హింస అలజడి పెరిగిపోయి
నిరంతర సంక్షోభంతో వర్తమాన సమాజం!
శాంతికి చోటులేని సందర్భం రాకూడదు
అశాంతికి సింహాసనం అవకూడదు సమాజం

ఏ దిశ పయనించేది, ఏ రూపం పొందేదీ!
వార్తా పత్రికలో ఏ రోజూ! ప్రజాస్వామ్యం గ్రాఫ్

❋

## 17. నిరంతర పయనం

ఇంటి నుండి బయటికి గేటు దాటితే
పూర్తిగా భిన్నమైన వాతావరణం లోకి ప్రవేశం
సరి కొత్త సామాజిక బంధాలతో
ఎవరిని కలిసేదీ, ఏమి జరిగేదీ తెలియదు

స్టేషన్ నుండి స్టేషన్‌కు
జంక్షన్ నుండి జంక్షన్‌కు
పయనానికి సమాప్తి లేదు
ఎక్కడో ఒక చోట దిగవలసిందే!

బొమ్మల్లా ఆశలు అపుడపుడు
ఒకదాని తరువాత మరొకటి
మనుషుల్ని పక్కకు పెట్టి
తాము ముందుకు వచ్చి నడిపిస్తాయి

ఎవరి వాద్యాన్ని వారు భిన్న భిన్నంగా
మ్రోగిస్తూ బ్రతుకు సాగవలసిందే
సమాజ సమ్మేళనంలో భాగమై
ఏ రోజు కా రోజు! కొత్త ప్రపంచంతో

ధ్వని చిత్రం బయటికి వస్తుంది
నాద మనోహరం కావడం విశేషం!
మంచులా చల్లగా ఎండలా వెచ్చగా
సన్నగా నీటి పాయలా, తిన్నగా తీగెలా

అన్నిటికీ సిద్ధంగా ఉంటుంది మనస్సు
ఋతువు ఋతువులో మార్పు పేరిటో
బ్రతుకులో సరికొత్త అనుభవంగానో!
దేని కేది సంకేతమో! తరువాత గాని తెలియదు

❊

# 18. హృదయ భాష అమృతం

తొలి కిరణ స్పర్శతో తలుపులు తెరచుకొనీ
మనో రాగ స్ఫూర్తితో తలపులు విప్పారీ
హృదయ భాష ఎక్కడయినా ఒకటే
ఇది అర్థం కాని మనిషి ఉండడు

ఎవరెస్టు శిఖరంపై చేరుస్తుంది
విశ్వ సమాజంతో బంధం కూరుస్తుంది

మానవతా పద్మం రేకులు విప్పారుతాయి
ఉదయ కిరణంలో రాగం ఆర్ద్రత కలిసీ

సత్యానికి దగ్గరగా సుందరతకు నిలయంగా
హృదయ రూపం! మనిషికి కొత్త చరితనిస్తుంది

స్పందనలో తంత్రీ నాదం వినిపిస్తుంది
గమనంలో ప్రవాహ స్వరం ధ్వనిస్తుంది
వ్యక్తి అస్తితకు ఆశా రూపం ఇస్తుంది
అన్నిటినీ సార్థం చేసే అమూల్య సాధనం

మనుషుల మధ్య, సమూహాల దేశాల మధ్య
తరాల మధ్య వర్గాల మధ్య సమాజంలో
హృదయ భాష వినలేనప్పుడు విననప్పుడు
అసమానత నిర్బంధం ఘర్షణ అశాంతి జగం!

దైన్యంలో హైన్యంలో బాధలో వేదనలో
ఉదయ కిరణమైనా ముల్లులా గుచ్చుకుంటుంది
ఆ క్షణంలో రాత్రి వేళ చీకటి మేలనిపిస్తుంది
హృదయం గులాబి పుష్పమై విప్పారాలనిపిస్తుంది

హృదయ భాష ఎప్పటికీ అమృతాయమానం
మానవ సంస్కృతిలో అనివార్యమైన చేతన రూపం

❊

## 19. స్నేహంగా అవకాశం

ఇది నగరం ధ్వనులకు కొదవ లేదు
కొత్త మనిషిని పలకరించే దెవరు?
అనుమానం వెనక్కి లాగుతుంది
జిజీవిష ముందుకు నడిపిస్తుంది

ఎవరు వీరు? మనుషులే! సాటివారే!
చిన్నతనం నుండీ చూచే రూపాలే!

చుట్టు ఎత్తైన – మేడల గోడలు
చూపుకు హద్దులు నిలుప జూస్తాయి
ఆలోచన పరిమితులను దాటాలనీ
విస్తరణంలో అనుభవ ప్రపంచం!

బ్రతుకు తెరువుకై వచ్చే వారూ
మెరుగు బ్రతుకుకై చేరే వారూ
పగలంతా తిరిగి నీడ తోడుగా
రాత్రికి నిలయం! తప్పనిదీ, ఎక్కడో!

ఎవరి వ్యవహార జగత్తులో వారు
మాట్లాడే అవకాశం లేకుండా
పక్కన మనిషితో నడవడం
ఒక చెప్పరాని సంతోషం మనిషిలో

కొత్త కొత్త మనుషులతో పరిచయం
తనలో ధైర్యాన్ని నింపుతుంది
అనుకోని అనుభవాలతో అనుబంధం
తనలో సమాజ శక్తిని పెంచుతుంది

అసమంగా విషమంగా తోచిన సమాజం
క్రమంగా స్నేహంగా అవకాశం తెరుస్తుంది

❊

## 20. నిదుర రాని గాయం

నగరం ఇంకా మేల్కొనే ఉంది
రాత్రి సగానికి సమీపిస్తున్నా!
విపణిలో జన సంకుల సందడి!
వాహనాల ధ్వని! వినిపిస్తూనే ఉంది

రాత్రి అవగానే దేహం వాలే నిద్ర మరచి
మెలకువలో జీవన భాగ్యం పెంపుకై
చేతిలో పని అయితే గాని కదలని! మనుషులు
నగరం అస్తితకు, ఇది ఒక శోభా రూపం!

నిద్రకు దూరమై కాలం గడిపేందుకు
బయటికి వచ్చి చూస్తే! దృశ్యం వెనుక దృశ్యం
వీధిలో వేగంగా నడచే మనుషులతో
పగలుతో రాత్రి పోటీ పడుతున్నట్లుంది

హఠాత్తుగా ఎక్కడి నుండో ఆర్త రవం
గాలిని గాయంతో బరువెక్కిస్తూంది
సాధారణ ధ్వనులను చీల్చుకొని పోతూంది
వాడి కత్తి మొనలా ఆకాశాన్ని గుచ్చుతూంది

తుపాను వీచిలా వికల పరుస్తూ
రాత్రి సమయ భయాన్ని సార్థకం చేస్తూంది

నింగిలో చక్కర్లు కొట్టే హెలికాప్టర్‌లా
బాధా రవ చక్రం! అనుభవాన్ని ఆక్రమిస్తూంది
కదల్లేని చెట్లు! ఇండ్లు! ఎదురైన అడ్డునూ
లెక్క చేయకుండా! మనిషిని కదిలిస్తుంది

ఏక్సిడెంటు కావచ్చు, సామాన్యంగా
ఉగ్ర చర్య కావచ్చు, అనుమానంలో
మృత్యువు కిది ప్రియమో? కాదో? కాని
నగరానికి మాత్రం! నిదుర రాని గాయం

❃

## 21. జీవన వాస్తవం

టప టప సన్నని వాన చినుకులు అంతలో
లోపలికి వచ్చి వరండా అంచున నిలబడి,
విషాదాన్ని మరపించే చల్లని చేతులు చాచీ
చల్లగ తాకే చిరు జల్లుతో కొత్త మలుపు!

చిరు వానలో దూసుక పోయే వాహనాలు
ముందు నుండి పడే లైట్ వెలుగులో
చినుకులు! ముత్యాల హారాల్లా కిందికి జారుతూ
గబగబ వెళ్ళి దోసిలిలో నింపుక రావాలనిపిస్తుంది

వాన వెలిసి మబ్బులు జరిగిపోతూ
ఆ దొరికిన అవకాశంలో చంద్రుడు!
లేచి నిలబడే యత్నంలో శిశువులా
ఇక నడవడమే తరువాయి అన్నట్లుగా

కిందికి దిగి నగరంలో నడవాలనీ
సమాజ జీవనంలో భాగమై పోవాలనీ
తన కిష్టమైంది పంచుకోవలనీ! ఆశతో

ఉదయ కిరణంతో కోరిక మాయమై
జరగనివీ పొందనివీ కల్పనలో వేలాడుతూ
మనసు మాత్రం వచ్చే రాత్రి గురించి
ఆశా చిత్రం గీస్తూ గీస్తూనే ఉంటుంది

రాత్రి వేళ లోపలనే ఉండి పోయి
కోల్పోయే బయటి స్థితుల అనుభవాలెన్నో!
అవి పగలు వెలుగులో కనిపించనివీ
ఆ సుందర సమయంలో ప్రత్యేకతయే వేరు!
ఇది మరో వైపు! జీవన ప్రవాహ వాస్తవం!

❋

## 22. మనిషి అందకుండా

చెట్టు నుండి గాలికి రాలి పడే ఆకులు పూలు!
తమ తమ వీడ్కోలు స్వరాల్ని వినిపిస్తాయి

ఉపశాంతికై దారిలో చెట్టు కింద చేరిన
మనిషి దృష్టి పడుతుంది పూవుపై పండుపై
కాస్త ప్రాణం తేరుకొనీ మదిలో చిత్రం!
తనకో ఇల్లు! ఆ ఇంటికి కిటికీలు దర్వాజాలు!

ఆలోచన మొదలవుతుంది, అనుకోకుండా
కలప చుట్టూ తిరుగుతుంది, అదే పనిగా
చిత్రం తొలగుతుంది, వాస్తవం చేరుతుంది
"లేమి" స్థానంలో "ఉంది" చోటు చేసుకోవాలనీ

చేతిలో గొడ్డలి ఉంటే బాగని పిస్తుంది
ఆ పనిలో ఊహల గూడు! సిద్ధమవుతుంది
ఇది జీవన చలనంలో భాగమై
ఒక అవసరంగా మనిషిని ప్రేరేపిస్తుంది!

వెలుగూ చీకటి జీవన పార్శ్వాలు
ఎగిరే కాల విహగం రెక్కల్లా
స్వేచ్ఛా పథంలో ఎంత దూరమయినా
నిర్మాణం వినాశనం, వంతులు మారుతూ!

సాయం సంధ్య! బూది దిబ్బపై దిగిన
చీకటి చెట్టు ఆశ్రయంలో అభాగ్యులు
అతికిన పాత ముక్కల డ్రెస్‌లో
తరాల చరిత్రలో విస్మృత పాత్రలు!

చెట్టు నీడకు చేరగనే అవసరాలు తోచీ
ఒకటొకటీ కోర్కెలు చేరి! మనిషి! అందకుండా!

❋

## 23. ఎవరయినా చేసేది

ఒకపుడు సగం నిద్రలో తూగుతూన్నట్లు ఉన్న
నగరం ఇపుడు గుర్తు పట్టరాని కోలాహలంలో

వశం కాని కాలాన్ని అధిరోహింపజేస్తూంది
నవ జీవన వాస్తవికతకు లక్ష్యం చూపిస్తూంది

తాము ఒకరుగా ప్రత్యేకత ఉండడమే కాదు
అవసరానికి సమాజ వికాస ప్రకాశ పాత్రలో

మునివేళ్ళపై ఊగే మహా సముద్రం సమాజం
పయనం మాత్రం భయం నుండి విజయానికి

జీవ రూపంలో రహస్య విషయాలతో
తరాల ఆర్జిత గుణ సంకలనంతో
ప్రతి వ్యక్తి! వర్తమాన ప్రభావాలతో
మంచి చెడు మెట్లపై దిగుతూ అధిరోహిస్తూ

ఎవరి కోసమూ ఆగని బ్రతుకులో
కన్నీరును తుడిచే సాహస మెవరు చేస్తారు?
తాకితే చేతి వేళ్ళు చకితంగా
విద్యుత్ షాక్‌కు గురి అయ్యే భయం! భయం!

కన్నీరు వెనక నుండి ప్రశ్నలు!
వాడిగా వేడిగా! బాణాల్లా
ప్రాణం నిలపవచ్చు, ప్రాణం తీయవచ్చు
బాధ మాన్పవచ్చు గాయ పరచవచ్చు,

ఇది ఎవరి గెలుపు! ఎవరి ఓటమి అన్న
ప్రశ్న! లేదు, ఉన్న స్థితిని బట్టి మలచుకోవడమే!
అప్పుడు ఇప్పుడూ ఎపుడైనా సరే!
ఎవరయినా చేసే పని! అవసరంలో నిపుణంగా

❋

## 24. మానవ శక్తితో

యథార్థం ఎప్పటికీ ఒకటే
ఆ నాడయినా ఈ నాడయినా ఏ నాడయినా
మంచు పొరలా చీకటి తెరలా
ఆటంకం ఆవరించవచ్చు, దాచవచ్చు

కసితో చెలరేగిన వ్యక్తులతో ఈనాడు
పగిలిన అద్దం ముక్కలయ్యే జీవితాలు
ధూళి ధూమంతో కళ్ళముందు వికృతంగా
సమయం! కదలుతూంది భయపెడుతూ

కారణ కిరణంతో వివేక ప్రకాశంతో
తెరపై బొమ్మల్లా వాస్తవ నిజ రూపాలు!
చర్యల వెనక నున్న మనుషుల్ని బయటపెడతాయి
ఆగిన చరిత్ర చక్రాలను ముందుకు నడిపిస్తాయి

మూసిన కిటికీ తెరిస్తేనే స్వేచ్ఛలో
బ్లాక్ అయిన ఆలోచన విడుదలవుతుంది

మార్నింగ్ వాక్‌లో పచ్చిగా ఉన్న లిప్తలు
ఈవినింగ్ వాక్‌తో పండిపోయి కనిపిస్తాయి
ఇపుడు పగలు! పరుగు పందెంలో లేదు
నెమ్మదిగానో! కొంచెం వడిగానో ఇంటికి చేరుస్తుంది

సౌభ్రాత్రం సౌజన్యం సంస్కృతి మానవత
రెక్కలు ముడుచుకొనీ మనసులో భద్రంగా

దగ్గరగా వచ్చేసే చీకటి
ముళ్ళ కంచెలా! దాట రానిది కాదు
దూరాన నిలిపేసే చీకటి
రాతి గోడలా! కదల రానిది కాదు
చేతిలో ఆయుధంతో పని లేదు
మానవ శక్తితోనే విజయం! ప్రజాస్వామ్యంలో!

❋

## 25. పక్క నున్న మనిషి

విరిసిన ఒడిసెల రాయి తగిలి
పిట్ట నేలపై రాలుతుంది
విల విల లాడి ఒరిగి పోతుంది
గిల గిల లాడి ప్రాణం పోతుంది
అన్నీ తెలుసు! తెలియని దెవరికి?
అంతా జరిగిపోతుంది! ఏదీ ఆగదు

రైఫిల్ నుండి విడుదలయిన బులెట్
ప్రాణం పైకి తెస్తుందనీ తెలుసు!
ఇందులో తెలియని అద్భుతమేమీ లేదు
చేసే పని కేదో కారణం దొరకుతుంది

వానతో పాటు మేఘం! వదలే
పిడుగుకు స్వాగతమెవరూ పలకరు!
చెట్టు పైనొ ఇంటి పైనొ, మనిషి పైనొ
విధ్వంస దృశ్యం! అనుకునేది కాదు!

కలలు నిజం కావని అందరికీ తెలుసు
అయినా అందరూ కలలు కనే వారే!
తెలియకుండా మనిషిని భ్రమింపజేస్తాయి
ఆశా శిఖరంపై మనసును చేరుస్తాయి

తెలవారితే బ్రతుకు బాటలో
చేసే వన్నీ మనిషి తెలిసి చేసేవే!
తెలియని వాటికి మాత్రం!
కార్య కారణ సంబంధంపై చర్చ

ప్రక్కనున్న మనిషి! మినీ చంద్ర బింబంలా
చూపులో వెలుగుతో ముఖంలో మౌనంగా

❉

## 26. ఇప్పటి అనుభవంలో

ఒక విజయంతో ఆగదు, మరో గెలుపుపై కోరిక ప్రబలుతుంది
విజయ పరంపర హారం తన మెడలో నిలవాలనీ

అసహనం క్రౌర్యం ఎత్తిన ఇరు చేతులు
వినాశ రేఖలతో కాలాన్ని తీర్చి దిద్దుతాయి

జరిగిన కథలో వాస్తవం! గుహలో సింహంలా
ఆకలేసి ఎపుడో బయటికి వస్తుంది! పోతుంది
వేటలో కనిపిస్తుంది, పుకార్లలో వినిపిస్తుంది
ఇది అందరికీ కనిపించని యథార్థం

సమాజానికి ముఖ్యమైనవి! ఎన్నో ఉన్నా
రాజుల దృష్టి చరిత్రలో! రణ చర్యల పైనే

తన ముఖం మరొకరి కెట్లా కనిపిస్తే నేం?
అద్దంలో తన కయితే అందంగా కనిపిస్తే చాలు!

కాలానికి నిద్ర లేదు, కదలిక లేకుండా ఉండలేదు
మెల్లగనో వడిగానో ప్రవాహ గమనం వీడదు
కదలిక లేకుండా మనసు ఉండలేదు, ఉండదు
ఏదో ఆలోచన రేకులు విప్పారుతూ! ఉంటుంది

కాలంతో ఆలోచన మానవ హిత యుతమై
సృజన పాత్రలో జీవిత మొక అద్భుత విషయం
సులభంగా ఉన్నది అనుకున్నది కాస్తా
జటిలంగా మారడం! జీవన గమనంలో సహజం

శిలలా కాకపోతే చెక్కిన శిల్పంలా గతం
వర్తమాన చలనానికి తోడ్పడే అమూల్యం
నిన్నటి అనుభవం ఈ రోజుకు పాఠం కాదు
ఇప్పటి అనుభవం ఈ రోజున వాస్తవ పథం

❊

## 27. బయటికి వస్తుంది కవిత

నేను రాత్రి అతిథిని
ఆనంద ధ్వనులతో పాటు
విషాద స్వరాలు వినబడతాయి

నేను పగలు ప్రభువును
కమనీయ దృశ్యాలతోపాటు
విస్ఫోట చిత్రాలు కనబడతాయి

రాత్రి వేళ నేను అతిథి పాత్రలో
పగటి వేళ నేను ప్రభువు పాత్రలో

సృష్టిలో మనిషి కన్న అందమైంది లేదు
ఆకృతి పొందికలో మతి నిపుణత లక్ష్యంలో
శైశవ దశ నుండి పరిణత శిఖరం దాకా
కాలాన్ని రూపం ఇచ్చే జీవన చరితతో

ఎక్కడో ఒక చోట కుటిల జటిల చర్య
మనిషి నుండి మనిషిని బాధకు గురి చేస్తుంది
ఘర్షణ! మారణ వాతావరణంతో నింపేస్తూంది
మానుష సుందరతను గాయాలతో కప్పేస్తూంది

ఏ రోజూ దాటాలిసిన మెట్లు ఇంకా మిగిలీ
ప్రవాహాల్ని దాటే అవసరాలు ఒకటొకటీ!
ఏదో ఒక కొరత లేని బ్రతుకు లేదు
భౌతికమో మానసికమో ఆర్తిని ఎగ చిమ్ముతుంది

నుదుటి పై రాత బయటికి కనిపించదు
అనుభవ తలంపై అర్థవంతంగా దిగుతుంది
కాగితంపై కవిత! అక్షర పంక్తుల్లో
మనిషి మనిషికీ! ఒక్కొక్క తరహాగా

ఎదలో ధగధగ లాడే అగ్నికణంతో
కవిత! బయటికి వస్తుంది! నీలి మబ్బులా

❋

## 28. మానవ నిలయం

ఇంట్లో ఒక ప్రపంచం ఉన్న పరిమితులలో
బయట ఒక ప్రపంచం పెరిగే వైశాల్యంతో,
లోక మరొకటి గుప్తంగా! మనోమయం
మూడు అంతస్తుల నిర్మాణం! ఈ జీవితం

నిలయంలోని వారు! బయట నున్న వారు
బంధువులు మిత్రులు పరిచితులు అతిథులు ఎందరో

గేటు దాటి బయటికి ప్రశ్నల బాగ్‌తో
ఇల్లు చేరడం కొన్ని జవాబుల దండతో

దరిద్రానికి వ్యతిరేకంగా మనిషి పోరాటం ఎప్పటిదో
కనీసపు అవసరాలు తీరడమొక సమస్య! ఎప్పటికీ
భౌతిక మానసిక స్థాయిల్లో ఎప్పటికీ కొరతే!
భాగ్యానికి మితం లేదు! ఒక నిర్ణయ విధం లేదు

సమస్యల మూటలు చేరి పోతూ
సమస్యల మూటలు విప్ప బడుతూ
వ్యక్తి నుండి సంఘానికి సంఘం నుండి వ్యక్తికి
అనుమానాల పొరల నుండి ముందుకు అడుగులు!

అందం మతి నిపుణత చేతనతో
మనిషి! ఒక అద్భుత సృజన భవం
మారణ చర్యలతో నేల కొరిగి పోతూ
క్షణంలో జడమై! నిరాకరణం పొందుతూంది

జాతి కరుణ ప్రేమ దయ నాలుగు స్తంభాలు
కుప్పకూలి! మానవ నిలయం అదృశ్యమవుతూంది
మనిషి పట్ల మనిషిలో క్షమా గుణం గొప్పదే
అది! పొందద మొక అలవాటుగ చేయడం ప్రమాదం
మానవతను హత్య చేసే వికృత మతికి
విలువలతో పని లేదు గమ్యం అసలే తెలియదు

❊

## 29. మనిషికి తోడు

లోకం తెలియని శిశువు
మూసిన పిడికిలి తెరచి
అర చేయి ఆట స్థల మవుతుంది,
చేతిలో రేఖలు జీవన రూపానికి దారులు
పారాడేందుకూ ఆ పైన పని చేయడానికీ

శ్రమ నుండి ఎదిగిన నాగరకత సంస్కృతి
దశ దశలో, ఉన్న మనిషి నుండి
కొత్త మనిషి! విజయ రాశికి చిహ్నం

ఒంటరిగా మనిషి ఉండ లేడు బ్రతకలేడు
వలయంలో తిరిగినా కలహంలో గడపినా
కదలని బిందువు అయినా దూరంగా తరలినా
సమాజ చలన శక్తి ప్రభావ క్షేత్రం లోనే

మనిషి దిష్టి బొమ్మ కాదు నాటకంలో పాత్ర కాదు
సజీవ వాస్తవ దృశ్యంలో వర్తమాన అనుభవ తేజం
లాభంలో నష్టంలో ప్రేమలో ద్వేషంలో గెలుపులో ఓటమిలో
నిరతం మీట బడే అనుభవ తంత్రుల వాద్యం

వీరునిలో ఉత్సాహం కుసుమిస్తుంది
పరిమితుల్ని దాటతాయి పరిమళాలు
చూచే కళ్ళను నిలుపుతుంది అందం
ఆర్ద్రమైన త్యాగం గుండెను పలికిస్తుంది

ఉగ్రవాదం ముసుగుతో బందిపోటు ఘాతుకంతో
క్షోభ పెట్టే ఘోష పుచ్చే విషమ క్షణం రాకూడదు
లయ తప్పిన నడక నుండి బీభత్స ముద్రలు జార రాదు
నిలకడ లేని నీడ ఆశ్రయమీయ లేదు! కాపాడలేదు

మనిషికి ప్రత్యామ్నాయం యంత్రం కాదు
పరివర్తన శీలంతో మనిషికి తోడు మనిషి మాత్రమే!

✲

## 30. ఈనాటి అవసరం

ఒక కవి గరుత్మంతుని వారసుడు కావచ్చు
ఒక కవి ఆదిశేషుని వారసుడు కావచ్చు
ఒక కవి అగ్ని కీల అయితే
ఒక కవి జలద మూర్తి కావచ్చు

ఎవరి తీరు వారిది, ఎవరి బాట వారిది
ఎందరు సృజన కారులో
ఎన్ని గుణ రూపాలో ఎన్ని చలన శక్తులో
ఎవరి పాత్ర వారిది, ఎవరి బాట వారిది
ఒక సందర్భం తిన్నగా ఘర్షణలో నిలబెడుతుంది

మనిషిలో మానవతా మందారం సులభం కాదు
విశ్వబంధువు అయితేనే, అది హృదిలో సాధ్యం
స్వేచ్ఛకు సీమలు, భూమి ఆకాశం దిశలే
అయితే బ్రతుకులో పట్టు తప్పే అవకాశం ఉంది

మనిషిలో సృజన బీజం ఈనాడు హైబ్రిడ్‌లో
మంటల చివురుల్ని! చూపుతుంది, పొగలతో

ఒక క్షణం విష బిందువు చిమ్మి
మనసు దెబ్బ తిని, వికలమై సమాజం,
కథ మలుపు తిరుగుతుంది విషమంగా
ఆలోచనలో వైతరణి ఎదురుపడుతుంది

మహా వ్యాధికి ఇచ్చే మందు
మోతాదు మించితే అనుకోని అపాయం
సైడ్ ఎఫెక్ట్‌స్‌తో బహు ప్రమాదం
మనో భయంతో పడే బాధ కఠోరం

ఇది తీరే ఉపాయం ఒకటే! అది
సమాజాని కయితే మానవతా సుధారసం
పాల సంద్రాన్ని చిలక నక్కర లేదు
హృదయ పద్మం విప్పారితే అలవోకగా
తళతళలాడుతూ జారుతుంది మధు బిందువు

❋

## 31. యానానికి సాధనం

స్వచ్ఛమైన సృజన మతికి
మాటా మనసూ చేతా మూడు ఒకటే
మానవతా మనోజ్ఞ సిద్ధి ఒక తపః ఫలం
చేతిలో వచ్చి చేరే అద్భుత దీపం కాదు

ఏ దేశ మయినా ఏ భాష అయినా
ఏ వర్ణ మయినా ఏ స్థాయి అయినా
అందంతో గంధంతో ప్రయోజన రూపంతో
వాస్తవానుభవాల ప్రపంచం, కవిత్వం.
అక్షరం పూవు కావచ్చు, ఆయుధం కావచ్చు
గాయ పరచవచ్చు, హ్లాద పరచ వచ్చు

కఠోరమైన విస్ఫోటక మారణ వర్తనం
మహా మానవ సంస్కృతిలో ఒదిగేది కాదు

శాఖోపశాఖలుగా పలు రకాల చెట్ల వనం
వివిధ భావ ప్రసారాల మానవ సమాజం
చెదరకుండా కాపాడే బాధ్యత ఎవరిది?
మానస గుణ పరివర్తన దిశలో ప్రతి వ్యక్తిదీ
దార్శనిక విశేష రూపంతో రచయితదీ
రాజనీతి నిపుణతతో చలనంలో నేతలదీ

హృదిలో ఉషః కాంతి ప్రసారానికి
ఏ చీకటి మంచు తెరలు అడ్డు కావు!
చీకటి శిథిలాల నుండి సృజన దృశ్యం
శాంతి విజయ క్షణాల తోనే సాధ్యం
ఈనాటి ప్రజాస్వామ్య స్థితిలో అవసరం

నిరోధాల్ని విరోధాల్ని అవలీలగ దాటించే
యానానికి సాధనం, స్వేచ్ఛా కవిత్వం

❋

## 32. వమొలిన్ రూపంలో

వమొలిన్ రూపంలో కవి! నాలో
స్పందమాన జీవన వాస్తవ స్వరంతో
ఊహల తీగెలపై అనుభవ రమణీయంగా
అక్షర పంక్తుల్లో శబ్ద లహరి కదలికలతో
వర్తమాన క్షణాల్ని ముందుకు నడిపిస్తుంది

గుప్త మనో జలధి నుండి
తాపంలో జలదమై రస సేచనతో
సాగుతుంది! కవితా నవ చేతనతో

ఆరోహణలో మొదటి మెట్టు దాటడం
ఒక సుందర విశేషం! శైశవ సమం
ఎంత దూర మనేది తెలియ దెవరికి
ఎంత కాల మనేది అసలు తెలియదు

మోదానికి సమాంతరంగా సంవేదన
జీవన వాహన గమనంలో రైలు పట్టాల్లా

గుండె లేని మేను లేదు
మెదడు లేని మనిషి లేడు
అయినా హింసను చూడాలిసే వస్తుంది
ఎపుడూ బాధను మోయాలిసే వస్తుంది

మానుష రాగం బదులు నెత్తురు చిమ్ముతూంది
అమృత కణం బదులు మృత్యు ఛాయ కనబడుతూంది

నిన్నను గుర్తు పెట్టుకోవడ మొక సంస్కారం
నేడును అందుకోవడం తప్పని అవసరం
కాలం అందరిలో ఒకే విధం
మాటలతో చేతలతో మారినట్లు అనిపిస్తుంది

పారిస్‌లో స్టేడియం అయినా
అడవిలో ఎన్‌కౌంటర్ అయినా
ఆర్త స్వరం ఒకటే
మరణ ధ్వని ఒకటే

కొందరిలో సాయం సంధ్యను దింపుతాయి
కొందరిలో వెన్నెల చిత్రం నింపుతాయి

మితి మీరిన చర్యలతో స్వేచ్ఛలో
అదుపు లేని అశ్వంలా జీవితం!

తలపుల అల్లికలో క్లిష్టతతో
మనిషి శక్తి ప్రకటన లెన్ని విధాలో
అవసరాలు తీసే దారులన్ని విధాలు!

ఒక ప్రశ్న పూవులా తాకుతుంది
ప్రాణం పోయిన ఘట్టాలు ఉన్నాయి
ఒక ప్రశ్న కత్తిలా ఎత్తబడీ
ప్రాణం నిలిచిన ఘట్టాలు ఉన్నాయి

ఇతిహాసం గోడకు ఆని ఉన్న ఆయుధం
ఉత్సాహం నింపుతుంది, ఉద్రేకం రగిలిస్తుంది
సక్రియకు సాహసాన్ని పురి కొల్పుతుంది
నిర్వచనానికి లొంగని దవుతుంది జీవితం

తగిలిన గాయంపై జారే
కన్నీటి బిందువులో మనిషి ముఖం
గ్రహణంలో చంద్ర బింబం

చిరు తుపానుతో సుగమత చెదరి
చిరు కంపానికి సుస్థితి తొలగి
లోపలి వయొలిన్‌కు ఎక్కడ లేని పని!
అది! వాస్తవ స్వర చిత్రం! స్వనించాలిసిందే

❊

## 33. స్వేచ్ఛలో కవి హృదయం

భూమికి నింగికి మధ్య క్షితిజంలా
వాస్తవానికి ఆదర్శానికి మధ్య ఎడం
స్వేచ్ఛకు అవకాశ మిస్తుంది, వ్యక్తిలో

తల ఎత్తిన బీజం ఎదిగేందుకు
నాలుగు వైపుల అవకాశం! అనంతం! ఉన్నా
అది మాత్రం! తన పరిమితిలోనే పెరుగుతుంది

వర్ష రుతువు శూన్య హృదయంతో రాదు
త్యాగ ధునులతో వస్తుంది నిండుగా
వసంతం శుష్క హస్తాలతో రాదు
భాగ్య రుచితో వస్తుంది రమ్యంగా

బారులు బారులుగా చీమలు!
తరలుతాయి కొత్త నివాసంలోకి
పాములు! ఒకటొకటి తిన్నగా
చెరతాయి ఆ ఆవాసాలలోకి!

మనసు! నిలయం కాదు నగరం కాదు
గగన ఖండ మంత విశాలమైన పాత్రతో
ఎందరికో చేరే అవకాశాలతో
బ్రతుకులో తృప్తికి సీమలు చెరపేస్తుంది
ఆశలో నిడివికి దూరం పెంచుతుంది

కవి హృదయం ఎప్పటికీ సృజన మనోజ్ఞం
గుడిసె ముందు పూచిన పూల చెట్టుతో
దారి ప్రక్క నిలిచిన చెట్టు నీడతో
అనల శిఖల మధ్య కూడ! హ్లాద బింబ మొకటే

❋

## 34. రణ సమానం

ప్రవాహం వెనక్కి మరలదని అందరికీ తెలుసు
అయినా గతం గురించి ఊహలు వదలవు

మంచు పలకలా కాలం పరచు కొని ఉంటే
దీని కొక ప్రవాహ రూప మిచ్చే బాధ్యత మనిషిదే
అనుకున్నట్లుగ జరగడ మొక యంత్రం పని
హేతువుతో జరగడమొక జీవన వాస్తవం

ధూమంతో అనలం చిమ్ముతూ వరసగా
ఉగ్రవాద బీభత్సం హఠాత్తుగ ప్రత్యక్షం
ఒకే సమయంలో వేరు వేరు స్థలాల్లో
క్షణాల్ని ఆటవిక యుగం లోకి నెట్టేస్తుంది

అందమైన కళలకు బంధువైన నిలయం
పారిస్‌లో స్టేడియం ఒకటే కాదు, టార్గెట్
ఎక్కడెక్కడో గుప్త చరంగా పైకి తేలుతూ
కన్నీరును మంటలతో మెరపిస్తుంది

విలువైన జీవన రీతుల ప్రాణాలు
నెత్తురు చారల్లో విలవిల జారేను

ఓటమి తలపుకు రాగానే ఆయుధం
మనసుకు సాహస కవచం అందిస్తుంది
గెలుపుపై ఆరాటంతో క్రోధం
ప్రముఖ పాత్ర వహిస్తుంది! వ్యథామయం చేస్తుంది

తాడో! పేడో! తేలక తప్పని వైషమ్య స్థితిలో
వ్యక్తులు! హింసకు హారతి నిచ్చే విలయ రూపాలు!
చాటు మాటు నుండి బయట పడే చర్యకు
అనుచర్యలు! ప్రతి చర్యలు! రణ సమాన సంధ్యా రూపాలు

❊

## 35. హృదయాశయం

రాత్రి గడచి పొద్దునే తలుపు తీసే సరికి
చల్లని గాలి కర్ చీఫ్ ముఖాన్ని అద్దుతుంది
మనిషిలో ధైర్యం నింపుతుంది
అడుగు ముందుకు సాగుతుంది

రాత్రి ప్రశ్నకు జవాబుగ పగలు
తొలి కిరణం కన్నీరును తుడుస్తుంది

మంచి చెడు విచక్షణ తోనే మనిషి మనుగడ
ప్రాణం ఉన్నంత వరకు సమాజ చలనంలో భాగం
తమ తమ బాధ్యతల్ని మరవడ మొక విషాదం

విహగం రెక్కలపై ఎగిరి నంత అవలీలగ
అశ్వం రింఖలపై దూకినంత వేగంగా
గడచే కాలం మానుష దుశ్చర్యలతో
ఆ సమయం శిల అవుతుంది, మోడు అవుతుంది

భూమిపై వెలుగు! మానవతా స్పర్శతో
బాధలో గుండెకు చందనమై అలరి,
కొత్త కథా నిర్మాణం మొదలవుతుంది
మానుష చరిత్రకు కొత్త మలుపు వస్తుంది

కవి నిశ్శబ్దంతో మాట్లాడతాడు
నిశ్శబ్ద ప్రపంచాన్ని శబ్ద మయం చేస్తాడు
కవి ఆయుధంతో మాట్లాడతాడు
ఆయుధ గుణాన్ని పుష్ప మయం చేస్తాడు
సంఘాన్ని సృజన చేతనతో తీర్చడమే లక్ష్యం

హింస నుండి ప్రేమ కరుణ శాంతి దారులలో
జన హిత హృదయాశయం! నవ సంస్కృతి విజయం

❋

## 36. వాస్తవ కళతో

లాన్‌లో కూచొని ఉంటే
పూల కొమ్మలపై వాలి వాలి
విసుగు చెంది! ఎగిరి వచ్చి,
నా తల పైనొ! చేతి పైనొ! ఎద పైనొ!
వాలుతుంది సీతా కోక చిలుక!

నా చేయి, నేను అనుకోకుండానే
దాన్ని వదలించు కొనే తొందరలో,
ఇది! ప్రమాదకరం కాదని తెలుసు
ఆ క్షణాన చేయి లేచి విసరుతుంది

బాల్కనిలో కూచొని ఉంటే
పూల దిమ్మెలపై నిలిచి నిలిచి
విసుగు చెంది! ఝుంకారంతో
నా చుట్టు పరిభ్రమిస్తుంది భ్రమరం!

నా చేతులు హఠాత్తుగా చాచి
దాన్ని దూరం తరిమే పనిలో,
భయంతో అక్కడి నుండి లేచి
మరో చోటికి! దూరంగా!

వరండాలో కూచొని ఉంటే
ఎక్కడెక్కడో తిరిగి తిరిగి పిచుక
రెక్కలతో నా బుజాన్ని తాకుతూ
రివ్వున లోనికి దూసుక పోతుంది

ఒళ్ళు జలదరిస్తుంది! అంతలో యథాతథం
నిర్భయతను సాహసాన్ని స్వేచ్ఛను కలిపి పేనుతూ
వాస్తవాన్ని అందమైన కళతో తీరుస్తూ
నాలో కదలిక! సృజన ముఖంతో!

❋

స్వేచ్ఛా కవిత్వం-68

# వర్తమాన లహరి

మాదిరాజు  రంగారావు

2016

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

# VARTHAMAANA LAHARI

Free-Verse

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2016

Presented

to

my wife

***Smt. M. Indira***

on her

***Birthday***

28th March

# వర్తమాన లహరి

## పరిచయం

ఈ చిన్న కృతి ఇరవై ఆరు కవితల సంపుటి. ఇవి వర్తమాన స్థితులు కేంద్ర బిందువులుగా ప్రసరించిన అనుభవ రూపాలు, ఆలోచనా విశేషాలు. చాలా సుగమంగా సాగాయి. చదవడానికే కాక, గొంతెత్తి కాస్త చెవికి ఇంపుగా, హృదయానికి హ్లాదంగా స్వనించడానికీ వీలయినవి. పాటలు అనలేం కాని, పాటలోని ప్రవాహకత ఉంది. పాఠకుల్నీ, శ్రోతల్నీ ఆకర్షించే ప్రసార గుణాన్ని కలిగినవి. దీని ఉద్దేశం కూడా ఇదే..

ఇక విషయానికి వస్తే, ప్రస్తుతం మన చుట్టూ నెలకొని ఉన్న పరిస్థితుల్ని సూచిస్తూ, ప్రేమ శాంతి సహనం స్నేహం కరుణ ఉదారత మొదలైన సానుకూల వాతావరణం అవసరాన్ని, భావింప చేస్తుంది.

"దోష మేది అయినా
వాద మేది అయినా
ప్రాణంతో చెలగాటం అమానుషం"

ప్రకృతి – ప్రాణి – మనిషి – సుందరమైన సృజన రూపాలు. మనిషి ప్రాణం తీస్తే, ఆ రూపం మళ్ళీ అవతరించదు. ప్రాణంతో పాటు, మానుష గుణమూ మానవశక్తి అంతరించినట్లే. ఇలా బలవంతంగా తొలగించడం అమానుషం.

"ఏ పక్ష మయినా ఏ దారి అయినా
ఇది మానవ సుందరతకు క్షతియే"

మానవ జీవితంలో మంచి చెడుల కలయికతో ఈ కృతిలో ప్రతిపాదించిన మానవ సౌందర్యాన్నీ (భౌతిక మానసిక అతీత స్థాయిల్లో) గరిమనూ, వికాసాన్నీ, శ్రేయోరూపాన్నీ సులభంగా గుర్తించవచ్చు.

'స్వేచ్ఛా కవిత్వం'లో ఈ రచన ఉత్తమ శ్రేణికి చెందిందిగా, భావిస్తాను. ఉన్నతమైన విలువలకు చెందిన ప్రజాస్వామ్య దార్శనికతను పొందింది. స్వేచ్ఛా శీలమైన కళా రూపాన్ని కలిగింది. విషయంలో మనోమయమైన ప్రత్యేకతతో స్థాయిని స్పృశించేదీ.

28.3.2016 **– మాదిరాజు రంగారావు**

# వర్తమాన లహరి

## 1. ఆరని అనలం

ప్రాణంలో ఆరని అనల గుణం
ఈహకు నిలయం! జీవన చిహ్నం

మంటలతో ఎగసి ఎగసి
అనల మన్న భయం భయం

ఎన్ని బూది పొరలయినా
ఆదరణం మానసికం
ఎన్ని విలయ గతులయినా
సృజన ముఖం ఆంతరికం

ఎరుపు తెలుపు పసుపు నీలి
రంగులలో గుణ పతాక
సమ సమాజ భావ జగం
చేతన కిది నిజ చిహ్నం

కష్టానికి నష్టానికి కారణమై
హ్లాదానికి తేజానికి హేతువుగా
మానుష శక్తికి ప్రేరణ చిహ్నం
జీవన రూపానికి ప్రాణ సమం

ఎగసిన సీతా కోక చిలుకల వలె
సన్నని మంటల వెలుగులు దూరంలో
వేదన రెపరెపలాడే ఊహల వలె
చెలరేగే చిరు మంటలు దగ్గరలో

చీకటి  తాకిడిలో చెదరని మతితో
కటు తర వాస్తవ పథాన అడుగులతో
వరసగ జీవన లిప్తలపై గురితో
ముందుకు సాగడ మొకటే కర్తవ్యం

❋

## 2. ఇలపై

బయట అగ్ని సమిధలో
లోన అగ్ని బాధలో

రుధిర రేఖ కనిపిస్తే, అదో భయం
బాష్ప కణం కనిపిస్తే, అదో జాలి
ఈ సమయం మానుష ధర్మం వెలిగేనా?
జలద హృదయ సంస్పందన వినిపించేనా?

మంటలు దాటిన మోదం, అంచులలో
పరచిన ఎడారి వలయం, ఆరంభం

ఎడారి దాటిన ధైర్యం ముంగిలిలో
ఉన్నత పర్వత రూపం తల ఎత్తీ

ముందుకు వెళ్ళే దారి లేదు, వీలులేదు
తలపై కనిపించే, గగనం ఒకటే

వాస్తవ గమనంలో
సాధ్య మవనిదీ పథం

జీవన యానంలో శిలా శ్రేణి నుండి
రస ధునియై ఇలపై దూకడ మొకటే
పాయలు పాయలుగా మలుపులతో
జన రుచి కథలో బ్రతకడ మొకటే

విశ్వానికి అర్పితమై
సంఘానికి అంకితమై
విజయానికి నవ కళయై
హృదయానికి రుచి యుతమై

రస ధునియై ఇలపై సాగడ మొకటే
నిజ గతితో కథలో వెలగడ మొకటే

❊

## 3. ఆ సమయంలో

పీడన గాయంతో ఎగసిన నిజ తేజం
దహిస్తుంది చలన సమాజంలో భాగం
హృదిలో వేదన అగ్ని మయంగా
ముఖాన కోపం నిప్పు కణంలా

అగ్గి పుల్ల గీసి
మనిషి ఈహ మెరసి,
దీపం వెలగడమో
పొయి రాజేయడమో!

ఒకరికి అందించడమో
సిగరెట్ అంటించడమో
నిప్పులతో చెలగాటం!
మృత్యు ముఖం వెలగడమో!

పేద గుడిసె అంటుకొని
భయ వలయంలో మనుషులు
ఏ నీడనొ! చేరే రనుకుంటే
బొగ్గు కణికలయి! వీధులలో!

ఆట లెన్ని విధాలో
జీవన వ్యవహారంలో
ఎవరే ఆటను ఆడేదీ తెలియదు
నిర్ణయ మేదో, ఆ సమయంలోనే

ఆటలలో చేరాలని ఒకరిలో
ఆటను నడిపించాని ఒకరిలో

ఇష్టంలో కష్టంగా జీవన తేజం
మానుష శక్తికి వాడిని వేడిని పెంచేను!

వ్యక్తుల ఆచరణంలో చరిత్రగా
మానస గుణ సంపదతో సంస్కృతిగా

❋

# 4. మనిషిని నిలిపే

పగలు చెట్లపై ఆకులు లెక్కిస్తూ
రాత్రి నింగిలో చుక్కలు లెక్కిస్తూ
జడతకు నిలయం అవడం దౌర్భాగ్యం

కాలం విసరే మండే ప్రశ్నలచే తరుమ బడీ
పని దొరకని మనుషులు మృత్యువు దరిలో
దారి తప్పి తెలువులు జారడ మొక మైనస్

చెలరేగే ఆకలి సెగలకు
తాళలేక బయట పడీ
అనలు శిఖలుగా మారి
అడవులలో భ్రమించేరు!

ఎవరిని బాధించేది, ఎవరిని హింసించేది
తెలియని పరి గుప్త చరులు, మన వెనకనే!

జలద సమం ఈ సమాజ హృదయం
అనుకుంటే! శాంత భావ సుందరమై
మానవతా మధు బిందువు రాలేనా?
అనల పథంలో వైరం ఆరేనా?

కత్తులు బాంబులు నది లహరులపై కదలేనా?
అగ్నులు శమించి పూల గుత్తులుగా మారేనా?

ఆయుధాల కొనలపై అడుగులతో కాలం
పేదను ఫుట్ పాత్ పై వదలి కదలి పోతూంది
భయ వలయంలో చిక్కిన మనిషికి
ఆగామిక ఎప్పటికీ అందని ఫలమే!

ప్రేమ కరుణ శాంతి సహన శీలంతో
మానవీయ సంబంధం రమణీయం
సమాజ చలనంలో రాపిడిలో
జారిపోవు మనిషిని నిలిపే సూత్రం!

❊

## 5. మారే బ్రతుకులో

ప్రతి ఒక్కరి జీవిత మొక పరిమితిలో
ప్రతి ఒక్కరి మానస లోకం విడిగా
వ్యక్తి నుండి సంఘానికి చేరికలో
తలపుల తలుపులు మూస్తూ తీస్తూ

ఇంటికి వచ్చే ప్రతి మనిషిలో
పతంగి దారంలా మానవం
కలిసిన ప్రతి వ్యక్తి నుండి
చేరదు! ఆంతర గంధం

వ్యక్తికి సంఘానికి ఉన్న ఎడంలో
వెన్నెల అద్దం చీకటి కర్టెనుతో
కనిపించీ కనిపించని దృశ్య పథం
ఏ గమ్యం చూపుతుంది?
ఏ బంధం పెంచుతుంది?
దృష్టి భేద మెరగని స్థితిలోనూ
అక్షర మొక చేతన కిరణం కవితలో
నిదురించే మనసును లేపే, ప్రియకరం

నిర్భయ ముగ నడిపించే
సందేశం వినిపించే
ఉదార చరితకు రూపం
వ్యయ మెరుగని నిధి నిలయం

కొత్త వెలుగు కొత్త మనిషి దారిలో
లోన గుండెలో స్పందన కొత్తగా
పాత మాటలో అర్థం కొత్తగా
రోజు రోజుకీ మారే బ్రతుకులో

❈

# 6. వెహికల్‌లో మౌనంగా

ఊపిరి ఊయెలపై ఊగుతూ
ఆశలు తాకాలని కాళ్ళతో
రేసు లోన పలువురిలో తానొకడు
చివరి రౌండులో గెలిచే దొకరే

మార్పులతో జీవితం
క్షణం నుండి క్షణానికి
సృజనకు వీడ్కోలు లేదు
విరామ మొక విభూషణం

తృప్తి లేని విషయంలో మార్పుకు ఆలోచన
చివరి మార్పు కాదేదీ! ప్రతిదీ మారేదే

తన గురించి, ఇతరులకే తన కన్నా
ఎక్కువగా తెలిసేదీ, తోచేదీ

మృత్యువు ఒక మిత్రం! శత్రువు కాదు
ఏ రోజూ నాపై ఒక మారైనా
చిరు నవ్వు విసరి పోతుంది
తనతో పయనంపై ఆశతో

ఎగిరే పావురంలో, శాంతి కళను చూస్తూ
కదలే ప్రవాహంలో, జీవితాన్ని చూస్తూ
శాంతి ఎంత ప్రియమయినా
పావురాన్ని పిడికిలిలో
బహు కాలం నిలపలేరు
స్వేచ్ఛ దాని జీవ గుణం

భద్రంగా శాంతి రక్షణ కవచంతో
బులెట్ ప్రూఫ్ వెహికల్‌లో మౌనంగా

❈

# 7. నవతకు ఆయువు

మనిషి నుండి మనిషి మానుష పయనం
లిప్త నుండి లిప్త ఆయువు గమనం
ఘటన నుండి ఘటన ఆశల చలనం
వీటి తోనే! బ్రతుకులో అస్తిత్వం

అజ్ఞానం భ్రమ మోసం వేషాల్లో తలపడే
నీడలతో పోరాటం అనివార్యం అవుతుంది

మెట్టును దాటే ముందు
తనకు తాను ఒక సమస్య
మెట్టును దాటే సరికి
తనకు తాను, ఒక జవాబు

ఆరోహణలో వెలుగుల దృశ్యంలో ఒక సమయం
క్రిదికి చూస్తే నీడల బొమ్మలలో తన రూపం

సూర్యుడెంత తేజో మయు డయినా
రోజు లోన సగమే, తన రాజ్యం

మనిషి లోని శక్తి యుక్తి ఎంతటి దయినా
శిరసు పైన ఎవరి కినీ అందని గగనం
తన చుట్టూ ప్రకృతి, తన కోసం అన్నట్లుగ
తన చుట్టూ మనుషులు, తన వారే అన్నట్లుగ
అవసర నిమిషంలో ఎవరి దారి వారిది
ఊహకు దిశ లెన్నో, తప్పు కొనే దారులన్ని!

కాలం అంచులలో నడచే ప్రతి కవికీ
ఒక వైపు దివా బింబం, ఒక వైపు నిశా బింబం!

ప్రతి కవిలో కొత్త సన్నివేశం
ప్రతి ఫలనంలో మనో విశేషం!
కవితకు జీవిత మిస్తుంది!
నవతకు ఆయువు నిస్తుంది!

※

## 8. ఆశయ నిలయం

రాతిరి వస్తుంది
చీకటిలో ముంచుతుంది
మరునాటికి ఎప్పటి వలె
తనువు! నిష్కళంకంగా

రాతిరి వస్తుంది
వెన్నెలలో తడుపుతుంది
మరునాటికి ఎప్పటి వలె
తనువు! వెలుగు శిల్పంలా

తనువుకు, చీకటి వెన్నెల ఒకటే
మనసుకు, మాత్రం ఎన్ని తీరులో
బరువు బరువుగా, భయం చీకటిలో
అలలు అలలుగా, నిజం వెన్నెలలో

బయటికి కనిపించే కనులే కాదు
లోలోపల నయన మొకటి గుప్తంగా
చూపొకటే, చూచే వస్తువులు వేరు
మనసొకటే, పొందే భావాలు వేరు

ఒక సమయం
కూలే వంతెనపై నిలుపుతుంది
అపుడపుడూ
ఊపిరి ఊయలపై ఊపుతుంది

ఒక సమయం
అలంకరణ రూపం తలపిస్తుంది
అపుడపుడూ
బాధారుణ బింబం కనిపిస్తుంది

రేకులు విరిసిన జన చేతనతో
స్వేచ్ఛా కవిత లోన దార్శనికం
అందరినీ కలిపే మానవీయ కేంద్రం
వర్తమాన స్పందనలకు ఆశయ నిలయం

❋

## 9. దైవం దిగుతుంది

రోజూ కనిపించే దృశ్యంలో
చూడనివీ! సరికొత్తవి ఎన్నో

యుగాలలో వెలుగు రేక కై
ఊహలలో సృజన పదం కై
ఆరాటం అన్వేషణ కవులలో
శబ్దం అర్థంలో క్రీడా లోకం

ఇంటి ముందు చెట్టు ఎంత ఇష్టమైనా
హక్కులతో నేల ఎంత స్వంత మయినా
కావలసిన సమయానికి చివురులు వేసేనా?
కోరిక ననుసరించి లిప్తలు కుసుమించేనా?

ఆకు రాలుతుంది
చెట్టు బరువు జారుతుంది

బరువు వెంట బరువుతో
మనిషి మనసు నిండుతుంది
ఎన్ని బరువులయినా
వహిస్తుంది! సహిస్తుంది

మనిషి నుండి ప్రశ్నకు
మనిషి తోనె జవాబు

ఏ దృశ్యం లేకుండా మనసు లేదు
ఏ కోణం లేకుండా చూపులేదు

అందరి తలపై, సూర్య చంద్రు లొకటే
మనిషి మనిషిలో, వేరు వేరు మానసం
మనిషి మనిషిగా, జీవిస్తే చాలు
తనలో దైవం, రూపం దిగుతుంది

❈

# 10. ఆల్బం కవి మస్తిష్కం

సామాజిక సందర్భంలో చేతనతో
దృశ్యం ప్రసరించే అనుభవ రేఖలతో
భావ జగంలో భాగం కవితా రూపం
స్వేచ్ఛా గతిలో సృజనకు అక్షర హృదయం

మండే తలపై, కదలే మేఘంపై
జల సేచనపై, ఆశలు అల్లుకొనీ

కష్టాల గాజు ముక్కలపై
దు:ఖాల నిప్పు కణికలపై
నడచే బ్రతుకుల వాస్తవ దృశ్యం
మనిషికి తప్పని ప్రశ్నాలోకం

కత్తి మొనలు తేలిన పథాన పయనం
ఇనుప పాద రక్షల తోనే సాధ్యం

అవని పైన మనిషి నడక జలధి వరకు
జలధి పైన వంతెనయొ! విమానమొ! నావయొ!

భూమి పైన నివాసాలు బ్రతుకంతా
ఎవరి కైన భూమితలం తప్పనిదీ
దారి పొడవునా రుచికర ఫలాలకై
చెట్ల వైపు చూపులతో పయనం!

నిప్పుల నది దాటే అవసర యానం
జలద సమ విమాన హృదయంతోనే!

పగలు రాత్రి భేదం లేని ప్రయాణంలో
కాలాని కతీతంగా, ఆల్బం! కవి మస్తిష్కం

❋

## 11. విషాద భావ మయం

సన్నగ కోసే, రాతిరి చలి తాకిడిలో
ఉదయం సోకే, వెచ్చని వెలుగులతో

నిలువున ముంచేసే, వడి జడి వర్షంతో
పూర్తిగ కప్పేసే, మంచు తెరలతో

పలు రుతువులు కలిసిన అల్లికతో
కవిలో వాస్తవ నవ శ్రమ రూపం

సస్యంతో పోలిక, ఒక సుందరమైన నిజం
శైశవ దశలోని రుచిర ప్రియతను పొందిందీ
ఆపై బ్రతుకులు గాయాలతో గాట్లతో
కల్పనకు దూర మయిన వాస్తవ స్థితిలో

ఊపిరి తీగెకు పూచే పూలే, కాదు
ఎదపై బాధల నిప్పుల కుంపటి కూడ

బీడును సస్యమయం చేసే పనిలో
కవిలో శ్రమ విభవం సంస్పందనతో

సంఘంలో జరిగే ఘటనల కదలికలో
కవి హృదయం ఉండ లేదు నిశ్శబ్దంగా

జ్ఞాపకాలు ఎప్పటివో, మతి కోశంలో
ఎక్కడైన వదలేసే, బరువులు కావు
జీవిత మెప్పటికీ, వ్యాపకాల బాటలో
పొందే రూపం, ఒక అనుభవ రమణీయం

అడుగులు మనిషిని నిలబెడతాయి
వెలుగులు కవితను పలికిస్తాయి
తన ఎద మెచ్చేదేదయినా హ్లాద సమం
బాధా హననంతో విషాద భావ మయం

❊

## 12. సమాజ పాత్రలలో

నిశీధి వస్తుంది
అమాయక ముఖంతో
ఒక సమయంలో
వెన్నెల తెలివితో

చీకటి బదులుగ నీడలు
విసరుతుంది కాలం
అవి వలలుగ పరచుకొనీ
అపాయమో! ప్రమాదమో

తోటి మనిషి కన్న ముందు
మృత్యు పదం కళ్ళ ముందు
నన్ను చూచి చూడనట్లు
నెమ్మదిగా జారుతుంది

తడవ తడవ కొక విధం
సమయానికి తగిన పాత్ర
నన్ను చూచి తరలుతుంది
ముఖాన పరిచయ కళతో

వెల్‌కమ్‌తో సుమ గుచ్ఛం
బాంబు పేలి భయ శబ్దం
బ్రతుకులు ఛిన్నా భిన్నం
మనసులో చీకటి చిత్రం

తనతో పరిచయ విధం మనోవేదిపై
స్నేహంగా మారి కలసి పోవాలని

చతుర ముఖంతో, రహస్య రూపం
విలయ పదంతో, మృత్యు వినోదం
ఊహ కన్న క్రియ తోనే బ్రతుకు గడచి పోతుంది
ఇది సమాజ పాత్రలతో కవితను ప్రకటిస్తుంది

❊

## 13. ట్రోఫీలా

ఆలోచనకూ ఆలోచనకూ మధ్య ఎడం
చీకటి వెలుగులు చీలిన రేఖలతో అనలం
చంద్రునిలో వెలుగులతో సృజన దర్శనం
చంద్రునిలో మచ్చలపై విమర్శ కిరణం

గాలికి భయపడి మేఘం కదలిక ఆగదు
గాలికి భయపడి పతంగి ఎగరడ మాగదు

ఆవేదన ఆత్మీయం అభిమానం అనుభూతికి
నాలుగు వైపుల దారులతో జీవన నగరం

శబ్దం ఒక సమయం సంకెల అవుతుంది
నిశ్శబ్దం! తరగని భూషణ మవుతుంది

మనిషికి మనుషులు దూర దూర మయినా
తీగెల వలె అల్లుకొనీ స్మృతులెన్నో!
అపుడపుడూ తూగి ఊగి గాలికి
కలిసే పూవుల వలె మనుషుల స్థితి!

పూవు వాడి పోతుంది, పట్టు తప్పిపోతుంది
మట్టిలోన కలిసి, అస్తిత కోల్పోతుంది

అక్షర మెప్పటికీ, సరి కొత్తగా
అనుభవ రూపంలో, ప్రతి మనసులో

వేరొక జగతికి తలుపులు తెరచీ
నేలను నింగిని కలిపే మానసికం
గెలిచిన టీమ్ లీడర్ చేతులలో
పైకెత్తిన ట్రోఫీలా రవి బింబం

నవ కవితా ముఖమై
హృదయాశయ నిభమై

❋

## 14. విభాత రూపం

క్షణాలపై అనుభవ నవమై
కాలం! ఎప్పటికీ కొత్తే

వ్యక్తిలో 'నేను'తో మొదలై ఈ జీవితం
సంఘంలో భాగమయి 'మన'మవుతుంది

ఈ రోజున ఉదయించే రవి బింబం
కొంచెం ఆలస్యంగా రావాలని
నిదుర చాయలో కోరిక
నెరవేరేనో? లేదో? కానీ

బయటికి వచ్చేసే అవసర గతిలో
ఈ లోపల నేనే ఒక కిరణంగా,
నిదురించే మనిషిని మేల్కొల్పుతూ
చేతనతో మనోజగం నింపుతూ

అగ్గి పెట్టె నుండి సూట్ కేస్ వరకు
సైజులలో జీవితాలు సమాజంలో
ఉన్న కాస్త వీలుతో ఆకాశ విశాలతలను
పొందే కోరిక! ఇప్పటిదా? ఎప్పటిదో?

కోరికపై సందేహం
నిప్పు రవ్వ విసరుతుంది
అద్దంలో ముఖ బింబం
ప్రశ్నకు గురి చేస్తుంది

వర్తమాన క్షణం జారి, గతమై
మిగులుతుంది స్మృతిలో దృశ్యం!
అక్షర బీజంతో భావ ప్రపంచం
కవిలో చేతనతో విభాత రూపం

❊

## 15. మేఘంలా నిర్ఝరిలా

శ్రమ పతాక నీడలలో
దుర్భర నిజ బాధలలో

రాతి కొనలపై
సూది మొనలపై
నడవక తప్పని బ్రతుకులు
సుఖద క్షణం స్వప్నంలో

ఫోటోలో, కళ అందం
శబ్దంలో, కవి విభవం
కళా డోలికా మయూర సౌందర్యంతో
స్నేహ దూతయైన హంస సౌజన్యంతో

ఎవరూ చూపంది, చూపాలని
ఎవరికి తోచంది, చెప్పాలని
కళలలో ప్రయోగం
కవితలో వివాదం

జీవిత మొక సినిమా కాదు
మరల రాని అనుభవ రూపం
చలనంలో నిర్ణయ గతి ఎరగదు
మార్పుకు ఏ సూచన పని చేయదు

అపుడపుడూ బాల్యం లోకి దూక వచ్చు
మబ్బులలో ఒకటై స్మృతి గతిలో
హత్తు కొన్న "అమ్మ" ఎదను తలపిస్తూ
ఆయువు తీగెకు కుసుమంలా సమయం!

శ్రమ జీవన సౌందర్యంపై ఆలోచన
కవి లోను కళాకారులలో
నీటి చుక్కపై ఆశలు పెంచే మేఘంలా
దాహంలో నాలుక తడిపే నిర్ఝరిలా

❊

## 16. మెలకువలో

మెలకువలో చూపులలో విప్పారిన ప్రపంచం
స్వప్నంలో వెండి బరిణె లోని పట్టు చీరలా

మెలకువలో ఒంటరిగా పూర్వజుల ఖజానా
చలనంలో సామాజిక చరిత్రలో భాగం
మెలకువలో మీటుతుంది
విశ్వమయత లోని మాట
నినాదాలు ప్రవాదాలు ప్రసంగాలు మాటలు!
మొగలి రేకు పొత్తులవలె ప్రభావాలు! దారిలో

మూసిన కళ్ళను తెరచే సరికి
పాత నుండి కొత్తకు ఉదయం
ఊరు నుండి నగరం, చేరిన ఉత్సాహం
చెరువు నుండి జలధికి, చేరిన ఉల్లాసం

విరామ సుందరమై పునర్నవం ఇచ్చే
నిద్రా రూపం మనిషికి! ఒక స్టాప్ గ్యాప్

రాత్రి మట్టిలో నాటిన విత్తుల్లా
జ్ఞాపకాల చినుకులతో మానసికం

జైలు నుండి విడుదలయిన బందిలా
పంజ రాన్ని వీడిన చిరు చిలుకలా
బోను నుండి బయట పడిన మృగంలా
మెలకువలో స్వేచ్ఛా నవ యాన జగం

ప్రతి పనికీ ప్రేరణయై మెలకువ పయనంలో
మంచీ చెడు నాలో! రైలుకు పట్టాల్లా
మంచు నుండి శుభ్రమైన ఉదయ రశ్మిలా
మానవతా పూర్ణమైన ప్రియా ముఖం నాలో

❋

# 17. నాలో రవిచంద్రులు

నాలో రవి చంద్రులు మంచి చెడును వీక్షిస్తూ
ఏ మబ్బులు దాచ లేవు
ఏ హిమమూ కప్ప లేదు

బయటి కళ్ళు మూసినా, తెరచినా ఒకటే
అంత రంగ మెప్పటికీ
తెరచిన ఆంతర నయనం

జలదంతో పాటు రాజ హంస ఎగురుతుంది
హృదయానికి ఆర్ద్రతతో శాంతిని ఇస్తుంది
ఎవరి పనులలో వారు, నిమగ్నులై
చూచే కోరిక తీరిక, ఎక్కడిది?

సర్పం వీపు పైన విహగం తొలి దశలో
విహగం కాళ్ళ క్రింద సర్పం మలిదశలో

సితార్ తీగెలపై ధగ ధగ జారే రాగం
అవే తీగెలపై వర్షం కురిసే నాదం
ఎక్కడుంది ఈ సుందర రహస్యం?
మట్టి జాడ లేని మనసు
గగన సరసి పుష్ప సమం
మనో వికాస విధంలో!
దారి తెరవ బడని చోట
విహగమై ఎగురుతుంది

మెప్పును పొందే మంచి కెంత యశసో
నిందలు పొందే వాటి కంత యశస్సు
మహా నదీ తీరాల్లా రెండు సమాజంలో
స్నేహం వైరం అంచులలో మానుష వ్యక్తిత్వం

❋

## 18. ఆ సమయంలో

చిందిన కన్నీటి లవం చెక్కిలిపై
చుక్కలతో రాత్రిని తలపిస్తుంది
ఎరుపు రంగులో ముఖాన గాయం
వెలుగు తూన్న దీప శిఖమ చూపిస్తుంది

ఊరు నుండి నగరానికి, మనిషి కొత్తగా
జారి పడిన కలలా, ఆగి నట్టి అలలా
ఇది నగరం ఎవరెవరో తెలియదు
అర్థ మవని ఆధునిక “ఆహా” కవితలా

ఏదో ఒక దారైతే దొరికిందను కుంటే
జన తతి నుండి మరో దారి పిలుస్తుంది

పుట్టుకతో మొదలై ఘర్షణ దశ దశలో
పెద్దయి పోయే కొద్దీ రణ రూపంలో
గెలుపూ ఓటమి లో గళ్ళు మారుతూ
రోజు వెంట రోజు కొత్త ఆటలా!

వెలుగుతో పాటు చీకటి పరిచయ మవుతుంది
బంధువుతో పాటు  శత్రువు ఎదురెదురుగా

ఎరుపు లైట్‌తో, ఆగే సూచన
పచ్చ లైట్‌తో, సాగే సూచన
రెండూ జీవన పయనంలో స్నేహంగా
ఆ సమయంలో వంతెన దాటిస్తాయి!

విశాల జన కోలాహల శబ్ద తరంగం
శరీరాన్ని తాకుతుంది వెచ్చ వెచ్చగా

దొరికిందనుకున్న  దారి మూసుక పోతుంది
నగరం కన్న అడవి నయ మనిపిస్తుంది!

❊

## 19. సుందరతకు క్షతియే

దోష మేది అయినా
వాద మేది అయినా
ప్రాణంతో చెలగాటం అమానుషం
మరలి రాని జీవితాన్ని మంట కలపడం
మానవ కథలో విషాద రేఖలతో
మతి చెదరే ఓటమి రుచి చూపడం!

పంట నుండి పాలన దాక
విద్య నుండి భద్రత వరకు
దశలు దశలుగా సాగిన ఆరోహణలో
జన సంస్కృతి! మానవ వికాస ప్రతినిధియే

వాదం సూచించే, భేదం చూపించే
పలు నీతులతో, బహు రీతులతో
శ్రమ సమాజ చింతనతో, అయనం
అనుభవ నవ దృశ్యంతో, సార్థం

నిస్తరంగ కాసారం విరామ రూపం
ఎగసి పడే లహరులతో మెలకువ రూపం

సమూహాల సమస్యలను ఖజాన వేసికొనీ
సమాజ సీమల్ని దాటి అడవిలోకి ప్రవేశం
బాధల బ్యాగ్ హృదయంతో
తామే ఒక ఆయుధమై
రణ చక్ర భ్రమణంలో
కాలానికి సవాలుగా

అడవి నుండి విసరే మృత్యువు పాశంతో
కొందరి చావులు! విజయానికి గుర్తు కాదు.
ఏ పక్ష మయినా, ఏ దారి అయినా
ఇది మానవ సుందరతకు క్షతియే!

❊

## 20. యుగ రమణీయం

ఝరిణి ఎంత వేగ వంత మయినా
ఎదురు పడిన శిలను చుట్టి రావలసిందే
అనల మెంత తీవ్ర రూప మయినా
జల సేచన ముందు వాలి పోవలసిందే

ఉగ్ర వాదమయినా
భగ్న శక్తి అయినా
మానవతా స్పందనతో
మన వలసిందే, లేనిది
ఎంత గొప్ప శిల్పమయినా!
శిలా మయం! దారు సమం

రచ్చ బండ అయినా సరె!
సుమ వన కళ పొందుతుంది
వివిధ వాద ఘన చర్చల
ప్రజా స్వామ్య బంధువులా

పనికి రాని ఏ విత్తును
చినుకులు మొలిపించలేవు
శిలల పైన ఏ మేఘం
పంటను పండించ లేదు

పగలు రాత్రి రెక్కలపై, కాల విహంగం
తిప్పు తుంది మనసులోని, మనిషిని దివిలో
భూమి పైకి వచ్చేసిన అవసరాలలో
నడక లెన్ని విధాలో! నడతలన్ని విధాలు!

నాలుగు వైపులలో మాటలు ఒకటొకటి
అర్థంలో భేదం, మతి మతికీ భిన్నం
పలు రంగుల అమరిక తోనే
నవ యుగ సమాజ రమణీయం!

❊

## 21. మనిషికి స్వాగతం

ఆలోచన ఆచరణం
ఇరు వైపుల నాణెంలా
మనిషి విలువ జీవన గతిలో
ఊపిరిలో అమృత లహరితో

ఊహ లెన్ని విధాలో
గళా లన్ని రీతులు
అక్షరాలలో ఆయువు
నిలుపుతుంది ఉగాది

అనల కిరీటంతో
రాజకీయ మతి శిఖరం
ధగ ధగ మంటలలో
పగటి కలలు కంటుంది

ఎదిగే తరువు నుండి
మాదిరి పిస్టల్ నుండి
లేదు, లేదు! అపాయం

ఎగిరే నిప్పు నుండి
దూకే పిడుగు నుండి
ఉంది, ఉంది! ప్రమాదం

పిడుగులలో ఒకరై
ధ్వంస రచన కన్నా
మెరపులలో ఒకరై
పథ సూచన మంచిది

నినాదమో! వివాదమో! హద్దులలో
సమాజ లక్ష్యంలో జనహితమై
చీకట్లకు వెలుగులు పూయిస్తుంది
దైవానికి గుడ్‌బై, మనిషికి స్వాగతం

❈

## 22. మాసిన చరిత్ర పేజి

భౌతికం మానసికంతో పాటు, అతీతం
అందీ అందని అంచులతో, నవలోకం

రిటైరయిన పెద్ద మనిషి జీవితం
బైండింగ్‌నకు సిద్ధమైన పుస్తకం,
తెరచే అవకాశం అందరికీ
పూర్తిగ వినియోగం కొందరికే

పుట్టిన రోజున కేక్‌ను
కట్ చేసి తరహాగా
ప్రతి రోజూ గడవదు
ఉత్సవ కళ పొందదు

తెలియని దేశం గురించి
తెలియని దైవం గురించి,
మతిలో దృశ్యం కల్పనలో
ప్రతి మానవ కథలో ఒకటై

లేడి ముఖంతో, పులి నడకలతో
ఒక రొకరూ, కొర కంచు ఊహతో

శిథిలమైన నివాసాలు కథలలో
అనుమానం అన్వేషణ! సాగుతుంది

పదిలంగా మనుషుల ఎముకల తీరులు
గడచిన కాలంలో బ్రతుకుల గుర్తులు
మచ్చలతో చారలతో
మాసిన చరిత్ర పేజీ
నిప్పు పూల క్షణాలతో, దేహమేమొ కానీ
దండ లాగ మనిషి గుండెపై అలరక తప్పదు

❊

## 23. అధికారానికి చిహ్నం

హింసకు హత్యకు మధ్య
పీడన వేదన మధ్య
చల్లారని శత్రుత పిడుగులతో
అణగారని ఘర్షణ మెరపులతో

ఉదార జలాల బదులు
నెత్తురు చుక్కలు చల్లి,
కాలాన్ని పండించాలని ఒకరు
దేశాన్ని నడిపించాలని ఒకరు

అనుకునేది జరిగేందుకు
దేవతలకు బలి! పిల్లలు
ఉదయ ప్రభను కప్పే మంచులా
వివేకాన్ని చుట్టిన! మౌఢ్యం

దూసిన బాణం గురి నుండి బయటపడీ
ప్రేలిన రైఫిల్ గురి నుండి తప్పుకొనీ
ప్రాణ సమం! శాంతి పావురం! వడిగా
భయం నుండి పొగల నుండి అడవిలోకి

సమాజ వలయం నుండి బయట పడీ
అరణ్య రంగంలోకి ప్రవేశం,
నిశ్శబ్ద పథంలో రణ రూపం
జన గణ తంత్రంలో స్వేచ్ఛా మయం

చంపడమే! అయితే
వ్యక్తిగతం! బహు సులభం
గొంతు నులిమి! విషం పెట్టి
ఆ పని చేసేయవచ్చు
రక్షణలో ఆయుధ మొక ఉపకరణం
రాజ్యంలో అధికారానికి చిహ్నం

❋

## 24 ఎగిరేందుకు

అలసటలో, చెట్టు నీడలో
దప్పికలో, నీటి చుక్కకై
పరితాపం నుండి ముక్తమై
అవసరాలు తీరు దారిలో

చీకటి బాధలు గతమై, మరపున బడి
వర్త మాన సుందరతను, పొందాలని
తనలో ఎడారి సస్యమయం కావాలని
భయ మెరగని పావురం, ఎగరాలని మనసులో

మేధావులు నేతలు పాలకులు సామాన్యులు
కళ్ళూ చేతులు కాళ్ళూ సమాజ రూపానికి
మానుష ధర్మాచరణంలో భాగమై
అంతరంగ ప్రతినిధులై కదలాలనీ

విరామ సమయంలో అద్దాల నిలయంలో
జన బంధువుగా ఉండాలని ఆయుధం

జడానికీ చేతనకూ మధ్య రేఖ
చూపడ మెవరికిని సాధ్య పడని మాట
శక్తి లేని, నీరు లేని విత్తు లాగ
ప్రతిభ లేని, మనసు నుండి కవిత రాదు

అంతరంగ స్పందనం
అంతరంగ ప్రకాశం
అంతరంగ భాషణం
జీవితాన అవసరం

స్వేచ్ఛా స్వాతంత్ర్యం రెక్కలున్న చాలదు
ఎగిరేందుకు జీవ శక్తి లక్ష్యమవసరం

❊

## 25. ఊపిరి లహరిపై

ఒక ఊపిరి లహరితో
మృత్యువు ఎడ మవుతుంది
ఒక హృదయం పిలుపుతో
మనిషి బ్రతుకు మారుతుంది

ఒక చల్లని చూపుతో
రవి తేజం తగ్గుతుంది
ఒక వెచ్చని స్పర్శతో
గుండెలు ఒకటవుతాయి

భూమి పైన ఒక సమయం
తరువూ పూలూ పండ్లూ అనుభవ దృశ్యం
నింగిలోన ఒక సమయం
రవి శశి తారలు మబ్బులపై ఆలోచన

ఈ రెండిటి మధ్య జీవితం
మంచి చెడుల లోని వాస్తవం,
నాలుగు మెతుకులపై ఆశలతో
తరగని రాసులకై ఆరాటం

ప్రవాహ మనగానే వచ్చే వరదలు తప్పవు
పవనం అనగానే వీచే తుపాను తప్పదు

మనిషి మనిషి మధ్య రేఖ
అలకు అలకు మధ్య ఎడం
అవసరమే కాదు, అందంగానూ
చేతనకే కాదు, జీవన గతికీ

పగలంతా హార్స్ రేస్‌లా పోటీ
జీవన శిఖరాల మధ్య దారులలో
పుట్టిందేదో ఒక పనికే అయినా
చేసే పని కవకాశం! ఒక అదృష్టం

❊

# 26 అక్షర యానం

ఊహ నుండి చర్యలతో, ఎప్పటికీ
సృజన విలయ రేఖలతో, జ్ఞాపకాలు

వర్తమాన గమన పదంతో కలిసీ
మానవీయ సృజన చరితతో హృదయం

ఒకే మనిషి, ఎన్ని సార్లు కనబడినా
అన్ని సార్లు, మార్పులతో కొత్తగా
పాత అనే మాట లేదు మనసులో
తృప్తి అనే మాట లేదు బ్రతుకులో

క్షణం క్షణం అలలా కదలితేనే జీవితం
ఒక్క క్షణం కలలా చెదరిపోతే మరణమే
కాలంతో కవిత నడుస్తుంది విడువ కుండ
పద పదమూ సమాజ చలనానికి సూచనయై

రణ తంత్రంతో శాంతిని పంచుతుంది
కనిపించని నిజ రూపం చూపుతుంది
కత్తి అంచు చివర, వెలుగుతుంది కిరణమై
అనల శిఖల పైన, కదలుతుంది మేఘమై

మంచుకు తడిసిన గులాబి హృదయంతో
గాయాలను అద్దుతుంది హ్లోదంగా,
మనసులోని కవిత జన మతమై
పద పదాన ఆమని కళలతో

అస్థి పంజరాన్ని మాటలాడిస్తుంది
భస్మ వేది పైన మొలకను మొలిపిస్తుంది

ఆవలి తీరంలో తరణిని
ఈవలి తీరం చేరుస్తుంది
అక్షర యానంలో మానవ రూపం
కదలే చరిత్రలో దాగిన వాస్తవం

❊

స్వేచ్ఛా కవిత్వం-69

# వర్తమాన యానం

మాదిరాజు రంగారావు

2016

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

# VARTHAMAANA YANAM

Free-Verse

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2016

Presented

to

my wife

***Smt. M. Indira***

# వర్తమాన యానం

## పీఠిక

ఇపుడు వస్తూన్న స్వేచ్ఛా కవిత్వంలో వస్తువు రూపం ప్రయోజనం దార్శనికం పార్శ్వాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఇది సమాలోచనంలో సాహిత్య విమర్శకుల బాధ్యతను పెంచుతూంది. ఈ కాలంలో సమూహాలు సమూహాలుగా ఒక్కొక విధమైన కవిత్వం వివిధ పార్శ్వాలలో అవతరిస్తుంది. ఇది కవిత్వ నిర్వచనాన్ని విస్తరింపజేస్తుంది. దీనికి అవగాహన సహనం సూక్ష్మమైన కళా దృష్టితోపాటు స్పందన గుణం వివేచనా ప్రకాశం సమాలోచనంలో బాగా ఉపకరిస్తాయి.

1953లో ఖమ్మం పట్టణంలో గ్రంథాలయ సభలు జరిగాయి. చివరి సమావేశంలో కవి సమ్మేళనం జరిగింది. ఆ సమయానికి మూడు రోజులు ముందుగా మాన్యులు గోరాశాస్త్రి సంపాదకులుగా మద్రాసు నుండి వెలువడే "స్వతంత్ర" వార పత్రికలో నా కవిత "విషాద స్రవంతి" పేరుతో ప్రకటితమయింది. ఆ కాలంలో తెలంగాణ నుండి వచ్చే రచనలకు అవకాశం కలిగించిన సహృదయులు శ్రీ గోరా శాస్త్రి. ఈ కవితను ఆ కవి సమ్మేళనంలో వినిపించడం కొత్త అనుభవం. స్వతంత్ర వార పత్రికలో ప్రచురితం కావడం, దానికి కవి సమ్మేళనంలో మంచి అవకాశం రావడం, రెండూ నాలో బలమైన ఆరంభ ప్రేరణలుగా పని చేసాయి.

పత్రికల ప్రసక్తిలో మొదట గుర్తుకు వచ్చేది "భారతి" సాహిత్య మాస పత్రిక సంపాదకులు మహా మనస్వి శ్రీ శివలెంక శంభు ప్రసాద్ మాన్యులు శ్రీరాధాకృష్ణ ఇరువురూ ఉదార చరితులు. పరిచయం లేకపోయినా ఒక రచయితతో వ్యవహరించిన తీరు చాలా గొప్పది. ఇంతవరకు ఈ స్థానంలో మరొకరు కనిపించలేదు. ముందు ప్రచురణకు అంగీకరిస్తే స్వీకరించినట్లు ఎప్పుడు ప్రచురించేదీ తెలియజేస్తూ కార్డు వచ్చేది. ఆ తర్వాత పోస్టులో ఒక పత్రిక కాపీతో పాటు పది పదిహేను రోజులలో మనియార్డరు ద్వారా పారితోషికం అందేది. రచయిత అభిలషించే గౌరవం ఆనందాన్ని

కలిగించే విషయం. నా రచనలెన్నో పుస్తక రూపంలో రాక ముందు “భారతి” పత్రికలో ప్రకటితమైనాయి. ఇదొక మధురమైన స్మృతి విశేషంగా నిలిచింది. గొప్ప సంస్కారంతో పాటు వ్యవస్థను చక్కగా నిర్వహించే సామర్థ్యంతో కూడిన ఉత్తమ వ్యక్తిత్వం అభినందనీయమే కాదు ప్రశంసనీయమూ. ఇతరులకు మార్గదర్శక మయింది. ఇప్పుడు ఈ జ్ఞాపకం మరీ మరీ అవసరంగా తోస్తుంది.

ఈ కృతి ముప్పై కవితల సంపుటి, “వర్తమాన యానం”. నడుస్తూన్న కాలంలో ఇప్పటి ప్రజాస్వామ్య వ్యవస్థలో విషమమైన వికృతమైన విపరీతమైన అసమంజసమైన స్థితిగతుల విషయంతో వస్తువు సామాజికమైంది. ఇందులో 1) జీవితం – సమాజం 2) మానవత – మానవీయం 3) మనస్తత్వం – తాత్త్వికత 4) అభిప్రాయం – దార్శనికంతో కవిత్వ కళకు ప్రాధాన్యం ఉంది. కవితలలో పలు విధాలుగా వీటి కలయిక కవిలో Critical Sensbibility తో ఆ సందర్భానికి తగిన విధంగా ఏర్పడింది. వ్యక్తి నుండి సమాజానికీ  సమాజం నుండి వ్యక్తికి ప్రభావ ప్రసారాన్ని కలిగింది. ఇది వర్తమానంపై అభిలాషనూ భవిష్యత్తుపై ఆలోచనా ప్రకాశాన్ని కలిగింది.

“నిశ్శబ్దం నుండి శబ్దంలోకి ప్రవహిస్తాడు కవి.
శబ్దం నుండి నిశ్శబ్దంలోకి పయనిస్తారు పాఠకులు.”

రోజూ చూచే వినే చదివే విషయాలతో వీటి వెనుక నుండి ఉన్నతమైన విలువలతో కూడిన సామాజిక లక్ష్యంలో మానవ చేతన ప్రకాశిస్తూంది. ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనిక ఛాయలతో వెలువడే ఈ స్వేచ్ఛా కవిత్వంలో “వర్తమాన యానం”, అరవై తొమ్మిదవది, ఇది రచనలో ఒక ప్రత్యేకతను కలిగింది. దీన్ని భావుకులు సులభంగా గుర్తించే ఉత్తమ కృతిగా భావిస్తాను.

**– మాదిరాజు రంగారావు**

# వర్తమాన యానం

## 1. రోజు వెంట

వర్తమాన యానంలో రోజు వెంట రోజు
అనుభవాల సంకలనం ఈ కవితా రూపం
నిశీథి వెనుక నున్న వెలుగును గుర్తిస్తుంది
అసలు మనిషి అస్తిత చీకటి నుండే మొదలు

ఇది ఆంతర చింతన వేదిక కాదు
జీవన గమనంలో అవసర దృశ్యం

అదుపు లేని వ్యక్తి స్వేచ్ఛ బ్రతుకులో
పీడన నాశన బీభత్స కథలతో
రాజరికం గుర్తులతో ఇంకా
నియంతృత్వ రీతులతో నిండీ

ప్రజా తంత్ర దార్శనికం ఈ సమయం
గ్రహణం పట్టిన రవిలా, మసకగా
వెలుగులు మాసిన ఈ ధూమ పథం,
ఏ గమ్యం చేర్చగలదు? ఈ రోజున

మెడలో అందంగా వేలాడే నెక్టై
బిగిసిన కంఠంలో ప్రాణం విలవిలగా
శిరసు చుట్టు తిరిగి తిరిగి అందమైన పగిడి
మేధను జడ శిల్పంగా మార్చి వేయ చూస్తుంది

ఎన్నిటికో ముఖ్యమైన మనిషిలో మనీష
అన్నిటిలో వెలుగు లేని "ఓటు" పాత్రలో

దాగిన నియంత రూపం మనసులో
కాలాన్ని ఏలాలని, తానే!..
పీడని ఎత్తిన ఖడ్గం ఊహలో
దేశాన్ని నడపాలని, తానే!

❋

# 2. మిక్స్‌డ్ బ్యాగ్

జీవన చరిత్రలో మానుష హననం
వికాస భూమికలో విషాద ఘట్టం
మానస జల నిధిలో ఆంతర సహనం
మానవ విజయానికి ఆశా నిలయం

చిత్రం వేసే పనిలో కళలో ఇప్పుడు
రంగుల కన్నా ప్రభ, నెత్తురు గీతలదే

హననం సహనం చెరొక వైపు నుండి
విలయ సృజన విభాగాలు మతిలో
వ్యక్తులలో దేని కదే అరలతో
సంఘంలో మిక్స్‌డ్ బ్యాగ్ ఘటనలతో

చాచిన వెలుగుల చేతులతో దీపం
మౌనంగా విప్పుతుంది చీకటి మూటను
ఆడే బంతుల వలె అందులో రహస్యం
దూకుతుంది బయటికి చకితంగా

ఆకలి తీరే ఆహారం పొట్లం ఒకటి
సంపద చిహ్నం బంగారం బిస్కెట్ ఒకటి

మనిషికి నిర్వచనం ఆ మనిషి నుండే
వివరణ మాత్రం మరో మనిషి నుండి

సృష్టికి ప్రతినిధి! మానవ రూపం
వస్తువు లన్నిటిలో అగ్రిమమై
తనలో కోర్కెకు సుందర భావనతో
బ్రతుకును సుఖవంతం చేయాలని

విధ్వంసం విడుదల చేసే యంత్రం
కారాదాతని మనోజ్ఞ మస్తిష్కం!

❊

# 3. అక్షర నిలయం

తన కవితకు మొదటి శ్రోత ఆ కవియే
దాని పైన మొదటి వ్యాఖ్య ఆ కవిదే
ఈ అక్షర నిలయం లోకి ప్రవేశం
అందరికీ తలుపులు తెరవబడీ!

శబ్దానికి అర్థం చాచిన రెక్కలతో
అర్థంలో భావం ఎగిరే విహగం వలె

బ్రతికి నంత కాలం! ఆగని పయనంలో
మనుషులతో మనుషులు తమ వ్యథలతో,
ఆయువు వెనక్కి తరలే కొద్దీ
తీరం ఆవలి వస్తువుపై ఊహలు!

సరిహద్దుల అనుబంధంతో దేశం
లెక్క లేని దారులతో సమాజం
శిథిలాలను చూచి దారిలో
గుండె కలత చెందుతుంది
నిర్మాణం మెరిసి తలపులో
మనిషి శక్తి పెరుగుతుంది

బూది కుప్ప కెలుకుతూ గడపలేరు!
పవన తంత్రి మీటుతూ బ్రతకలేరు!

కాలి నడకతో పాటుగ
బండిలో పడవలో రైలులో
విమానమో! మరొకటో! వెళ్ళే సాధనం
అవసరాల దారులలో! వర్తమానం!

తరు గిరి నది జీవులు! మనుషులు
సమావేశ దృశ్యంతో! అక్షర లోకం!

❋

## 4. కవితలో బింబాలై

మట్టి నుండి లేచి మొక్క ఎదుగుతుంది
మట్టి కణం లేని పూలతో పండ్లతో

మనిషి ముఖంలో ఒలికే నవ్వు
సుమ నిలయం చేరుతుంది, ఎగిరి.
మనిషి ముఖంలో జారే కోపం
అనల కణం చేరుతుంది, దూకి.

ఆకాశంలా ముఖాన పరచుకొన్న
నిరాశ నుండి వేరయి ఆశలు
బాధలో తప్తమై కరుణలో శుభ్రమై
అక్షర యానంలో హృది వశమవుతాయి

మృగాలతో కలిసి మృగం చరిస్తుంది
అవే! వేష గతులతో మనుషులు కూడ
పద పదాన ప్రశ్నలు! అనుమాన భయాలు
పనులెన్ని విధాలో! అన్ని ఉపాయాలు

తోటను కాపాడే బాధ్యతలో
ముళ్ళ కంచె తప్పదు రక్షణగా

ఈ భూమి తలం అందరిదీ
అందరికీ అవకాశం విప్పారీ
ఒకరు అడుగు వేసి నంత
అది స్వంతం కాదని తెలిసీ
చుక్కలలో చంద్రునిలా వెలగాలని
బింబంలో మచ్చల సంగతి మరచి

రాగం మోసం కోపం దయ ప్రేమలు
అద్దంలో ముఖ బింబాలై కవితలో!

❊

## 5. పుట్టుక మొదలు

పుట్టుకతో మొదటి ప్రశ్న బ్రతకడం
బట్ట కట్టి బ్రతుకులోన నిలవడం
మృత్యువు నీడకు దూరంగా జరుగుతూ
మరచే మరపించే ఉపాయాలు మనిషిలో

ఊహ నుండి చర్యకు పరిణామం
మనిషి నుండి మనస్వి అవతరణం
స్పందనలో చింతనలో ప్రేరణలో
వర్తమాన యానంలో దార్శనికం

స్మృతిలో బాల్యం జ్ఞాపక దశ నుండీ
ఉదయం అద్దంలో బాల భాను రశ్మిలా

మండే ఎండకు ఎండిన తరువు చూచి
ఎవరి పైనొ కోప కణం చిమ్మేకన్నా,
జల సేచనతో పచ్చదనానికి
తలుపులు తెరచే చర్యలు ముఖ్యం

మ్రింగే భూతం కాదు ప్రపంచీకరణం
సులభంగా అవసరాలు తీరు విధానం,
విశాల ప్రాతిపదికపై దేశాలకు
ఊతం ఇచ్చే ఒక ఆర్థిక రూపం

వలయంలో తిరిగే వేగం
ఎంతటి దయినా, గతిలో
చక్ర భ్రమణ విధంతో
లక్ష్యం చేరదు యానం!

వర్తక విస్తరణం ఈ యుగ ధర్మం
ఆర్థిక వ్యవహారం యంత్ర సమం కాదు

❊

## 6. సీక్రెట్ బాక్స్

శత మానానికి పది పది మెట్లు మిగిలి
నను నడిపే ఆయువు ఒక ప్రవాహ మయం

వదలే ఊపిరితో గతమై స్మృతిలో
తీసే ఊపిరిలో మెలకువ స్పృహతో
భయం కరగి ప్రాణదమై ధైర్యం
కదలుతుంది కాలం! అమృత మయం

క్రితం రోజు కన్న పెరిగిన సంస్కారంతో
రోజు వెంట రోజు మార్చింగ్ క్షణాలతో
మానవతా గంధంతో బ్రతుకులో కదలనీ
మానవీయ కిరణంతో మనసులో నిలవనీ

మనసు పుటలలో రాతలు
తనకు తప్ప తెలియ వెవరికి?

గోడ లేంది భూమిపై నిలయం లేదు
ఇది స్వేచ్ఛకు ఆటంకం కానే కాదు
మనిషిలోని అవసరాల్ని తీర్చేది
సుఖదమైన జీవితాన్ని కూర్చేది

ఒక పూవు రాలి, విషాదం
ఒక పూవు పూచి, ప్రమోదం

ఎవరికైన సాగే జీవిత కాలం
ముందుగ తెరవ రాని సీక్రెట్ బాక్స్

బహుమానం మరపున బడి పోవచ్చు
గాయం మాత్రం స్మృతిలో జ్ఞాపికగా,
విజయంపై హృదయంలో విశ్వాసం
దెబ్బను అలవోకగ మరపిస్తుంది

❊

## 7. కవి హృదయం

జీవన రణ చలనం ప్రతి మనిషిలో
వ్యక్తి స్థాయిలోను సమాజ కోణంలో
మానవతా నిలయం ప్రతి హృదయం
పుట్టుకతో సమ సమాజ బింబంతో

గాలి వెలుగు కలుపుతాయి స్వేచ్ఛలో
మనుషుల నందరినీ ఒకటిగ హృదిలో,
గాలికి ఆహ్వానం అవసరమేమీ లేదు
వెలుగుకు స్వాగత తోరణ మవసరమే లేదు

జీవన గమనంలో సమ న్యాయంకై
ప్రగతికి లక్ష్యంలో ఉత్తేజం కవిత!
నిశ్శబ్దంగా కదలే లయ లహరులతో
సమాజ చేతనలో వేగం నిలుపుతుంది

మంద్ర మధ్య తీవ్ర స్థాయిలలో
వాద విభేదాల మలుపులతో
మనిషి మనిషిలో ఒక నిర్మాణ నవం
ఘటన వెనుక కనిపించని హేతుబలం

జలధిలో అలల వలె స్థితులు ఊగిపోతూ
మనసు భయావరణంలో, పడవపై ఆశతో
పాత క్షణం నుండి కొత్త క్షణంలోకి
ప్రగతి శక్తి నడుపుతుంది నిరంతరం

మనసుకు సంకెళ్ళు పడవు
ఊహకు తీరాలు లేవు,
సీమలు లేని ప్రపంచం
కవి హృదయం ఆత్మీయం!

❁

# 8. చివరి ఓవర్‌లో

సృజన విలయ భావ జగం కవితలో
ప్రకృతికి రూపాంతరమై బ్రతుకులో,
జీవన యానంలో దశ దశలో
మానవ చేతనతో ప్రతి హృదిలో

నలుపు రంగు దారిని దాచేస్తుంది
తెలుపు రంగు స్పష్టత రూపిస్తుంది
పచ్చ రంగు పయనం పొడిగిస్తుంది
ఎరుపు రంగు ఆపద సూచిస్తుంది

పగలుకు రాత్రికి భేదం లేకుండా
కదలుతుంది కాలం కొత్త కొత్త వార్తలతో

సుముఖం ఎదురుగ విముఖం
సహనం పక్కన జ్వలనం,
తనలో శక్తికి రూపం ఇస్తూ
సమాజ చరితకు విస్తృతి నిస్తూ
తమ గుప్పిలిలో సంపద అధికారం
పంజరాన చిలుకల వలె నిలవాలని

ప్రతి ఉదయం సూర్యుని కిరణాల్లా
పూవు ఫలం కనిపించవు! తరువుకు,
ఆ వచ్చే సమయానికి రానే వస్తుంది
భూమికి హర్షంతో, సృజనకు విజయంతో

జీవన సౌందర్యంకై వ్యక్తి బ్రతుకు
పుట్టుక మొదలుగ భూమిపై అభిలాషతో,
చివరి ఓవర్‌లో! గగనంపై చూపులు
కనిపించే ఎత్తులో సిక్సర్‌పై ఆశ!

❋

# 9. విమాన యానంలో

తెలుపు కాగితంలా ఉదయం పరచుకొనీ
రక్తం బిందు రేఖలతో సాయం ప్రత్యక్షం

రెప రెప లాడుతూ వెలుగులు
దడ దడ లాడుతూ గుండెలు
ఘర్షణలో మెరపులతో కలహంలో పిడుగులతో
బ్రతుకులు మారణ క్రియలో తేలుతూ!

జలద ఛాయ తెలియని విలయ వేదు లెన్నో
బూడిద రూపంతో పరిచయం పెంచుతాయి

పూల నొసలు రేకులపై
కత్తి మొనల చివరలతో,
హృదయ వనం మాట మరచి
గ్రీష్మ పదం వెడలు తూంది

వికార మతులచే భగ్నమైన మానవం
మసి బట్టిన సంస్కృతిని తలపిస్తూంది
జైలు నుండి బయటికి వచ్చిన వ్యక్తికి
ఇంత కన్న అదే! భద్రం అనిపిస్తూంది

బ్రతికి  ఉన్న రుజువుకు, వేసే ప్రశ్నలే గుర్తు
వెలుగుతూన్న గుర్తుకు, పొందే జవాబే గుర్తు!
ఏ ప్రశ్నను గాలికి ఒప్ప జెప్పరాదు
జవాబు ఇచ్చే బాధ్యత! మరవ రానిదీ

అద్దంలో తన ప్రతి బింబంతో
కన్నులలో తన మతి చిత్రంతో
ఫోటోలో జ్ఞాపక రూపంతో
మనసు ఇపుడు! విమాన యానంలో

❊

## 10. జీవ శక్తి చిహ్నం

మబ్బు నుండి రాలే చినుకులతో
గుండె లయను ఎవరు కలపగలరు?
మబ్బు నుండి వెడలే మెరపులతో
కంటి చూపు నెవరు నిలుప గలరు?

మబ్బు నుండి తరలే పిడుగుల వలె
నోట మాట నెవరు విడువగలరు?
మబ్బు నుండి జారే ధారల వలె
గళ రవాన్ని ఎవరు వదల గలరు?

ఎప్పుడు బడితే అప్పుడు ఎదురుగ
జలదం తారాడదు క్షితిజంలో
ఒక పరిణత వాతావరణంలోనే
చల్లని హృదయం విప్పారుతుంది

కరువును దాటించే, వాన వెనకనే
వరదలు తుపాను విలయం బీభత్సం
ఆపదలోనే అనుకోని ప్రమాదాలు
ప్రకృతి వశంలో సమాజ భవిష్యత్తు

జల జల చినుకులలో మనుషుల మాటలు
గల గల పాయలలో మనుషుల నడకలు
ఆ మనిషి! తలపై పిడుగు పడవచ్చు
అన్నిటికీ మనుషులు! సిద్ధంగా

షార్ట్ సర్క్యూట్‌లో ఎగసిన నిప్పు రవ్వ
ఎవరి పైనో పడి దేహం కాలుతుంది
ప్రక్క నున్న ఇల్లు దగ్ధమవుతుంది

ఊపిరితో ప్రాణం జీవితమై
సృజనతో కవిత మానవమై
ఇది సమాజ శక్తికి వశమవుతూంది

❊

## 11. ఆశానవమై

ఉగ్ర వాద మారణ రూపాలొకరొకరు
విలయ ఘటన చర్యలలో శిక్షితులై
పిల్లలు పెద్దలు సమయం స్థానంతో పని లేదు
నర హంతక చర్యలతో చీకటి శకలాలు!

సూది మొనంతయినా సూచన కూడా లేని
చాచిన మృత్యువు నీడలు కబంధ హస్తాల్లా
జఘన్య పథకాలలో ఆరి తేరి
తల తిరిగే రహస్య పథక రచనతో

విధ్వంసం విడుదల చేసే యంత్రం!
తీవ్ర వాద దారుణాగ్ని మస్తిష్కం

హఠాత్తుగా ఉక్కిరి బిక్కిరి చేసే
ధూళితో పొగలతో ఎగసే హాహాకారం,
నాగరక సమూహాలు భయ భ్రాంతిలో
పరుగులు తీసే దృశ్యం! వికలంగా కుపితంగా

పెను తుపాను హోరులా ఏడ్పులు
విస్ఫోటం ధ్వనుల వెంట కేకలు,
లయ తప్పిన జలధిలా సమాజం
బీభత్స విలోలమై ఆ సమయం
కూలి పోయే అగ్గి పెట్టె వరసలా టవర్

మనిషిని హత మార్చే ఘోర కృత్యవాదం
మానవ గుణ నీతిని మంట కలుపు వైరం
దయకూ క్షమకూ అర్థం కాదీ నేరం

మృత్యు విపుదు ఒంటరి మనుషులతో కాదు
పదులు వంద సంఖ్యలతో తరలుతూంది
అలజడిలో నలు వైపుల ప్రసరించిన శోకం
మౌనంలో హిమ శిలలను తలపుకు తెస్తూంది
వెలిగే కొవ్వొత్తులతో పలికే కరుణ గళంతో
చెదరని సంకల్పంతో దృశ్యం ఆశా నవమై..

❊

## 12. పూరించే ఖాళీ బ్లాక్

ఆలోచన తిరుగుతుంది విషయం చుట్టూ
తెలుసుకునే దారులలో అన్వేషణలో

ఆయుధాన్ని చూస్తే రణ స్ఫురణ మతితో
తనలో మిత్రత శత్రుత పోటీ దృశ్యం!
మృగమో జంతువొ! కనిపిస్తేనో?
దానికి బదులుగ మనుషుల రూపాలిప్పుడు

దెయ్యంలా తల విరబోసుకొనీ
చీకటి! భయ జలనిధిలో ముంచుతూ
బయట పడే ఎత్తులతో పాటుగ
మనసులు! దైవం చుట్టూ తిరుగుతూ

నిరంకుశంలో ఎత్తిన ఇనుప పాదం!
స్వార్థంలో బోనై పంజరమై వలయై

చీకటిలో నిద్రా మతితో కొందరు
అగ్నులలో వెలుగుల భ్రమలో కొందరు

ఒక దీపం వెలుగు ముఖం కనబడి
బయట పడే ఆలోచన మెరపులా
ఒక బిందెడు నీరు ఒలకడంతో
చల్లని మానుష సూచన మబ్బులా

లేవగనే వార్త! తొలి కిరణంతో
విషాద చిత్రం తొలగిన తృప్తితో

ఏ ప్రశ్న అయినా జవాబు కొంత వరకే!
ఏ సమస్య అయినా తృప్తి కొంత వరకే!
ఆ పై ఎవరికి వారు పూరించే ఖాళీ బ్లాక్!
మనిషిలో ప్రశ్నకూ సమస్యకూ అవకాశంతో

❊

## 13. ఏ ఇద్దరు ఒకటి కాదు

ఏ ఇద్దరు ఒకటి కాదు
వేరు వేరు మనో మూర్తులు!
బాష్ప బిందువుల లోనే పోలిక!
ఆ వెనుక నున్న కథలు వేరు!

ఒక వైపున స్నేహం ఒక వైపున భేదం
ఇరువురిలో సమయ సమయ గతులతో

ధూళి పొరలు దట్టమై కనిపించక పోవచ్చు
కరుణ జలంతో నిర్మలమైతేనే తెలుస్తుంది
మలిన రేఖ లెక్కువై కనిపించక పోవచ్చు
ప్రేమ రశ్మి సోకి తళతళతోనే తెలుస్తుంది
చూచిన కొద్దీ చూడాలనిపిస్తుంది
దీని కోసమైనా బ్రతకాలనిపిస్తుంది

స్త్రీ పురుషులు సగం సగం పాత్రలతో
క్షితిజంలో ఒకరుగ కనిపించినా
ఎన్నటికీ ఒకటి కాదు, వేరు వేరు
విభేదాలతో స్వతంత్ర మతులతో

మట్టి పొరలలో నుండి తాగు నీరు
మట్టి పొరలలో వేరులతో పంటలు
మట్టి పొరలలో సంస్కృతి శిథిలాలు
మట్టి పొరలలో మనుషుల అస్థికలు!

జ్వాలా వలయంలో నయినా సరే!
విరిసిన పద్మంలా బ్రతకాలనీ!
కష్టమైన నష్టమైన మన వలసిందే
లోన పూవు వేరు, బయట అగ్ని వేరు

❊

# 14. శబ్దం నుండి

సమాజ మెప్పుటికీ శబ్ద మయం
శబ్ద మయం సమాజ మెప్పుటికీ
ఇష్టమైంది చక్కగ వినబడుతుంది
ఇష్టం లేనివి తిన్నగ వెళిపోతాయి

జలధి నుండి ఎగసిన త్యాగం మేఘం
మబ్బు నుండి జారిన త్యాగం వర్షం
వర్షంతో పంటలు! ప్రాణం! భాగ్యం
ఆ వెనకన తిరిగే శ్రమ జీవన చక్రం

ప్రకృతి ననుసరించి జీవితాన సమాజాన
క్రియతో అనుక్రియతో ప్రతి క్రియతో పరిణామం
తాపంలో కష్టంలో బాధలలో మానుషమై
కృషి అయితే మనిషిది, దైవానికి క్రెడిట్

కల్పనలో మరో జగం మానస పరితృప్తికై
వాస్తవ మనిపించే భౌతికతల బంధంతో
వివేకవంతమైన హేతువు ప్రకాశంతో
బయటికి రావడ మొక అపూర్వ విశేషం

ఆయువు బ్రతుకులు సంఘం దైవం
దేని తీరు దానిదే జీవన చలనంలో
ఇవి మొదలై కలిసే పాయింట్ మాత్రం!
యానం ఆరంభంలో బిందువు ఒకటే

శబ్దంతో మనిషి అర్థంతో అవసరం
జీవిత మొక అన్వేషణయై పగలు రాత్రి!
నిశ్శబ్దం నుండి శబ్దానికి కవిత
శబ్దం నుండి నిశ్శబ్దానికి పాఠకులు!

❋

## 15. స్వాగతమిస్తుంది

కవిత ఒక హరువు మాత్రమే! బరువు కాదు
పూవు కన్న రమ్యం, మబ్బు కన్న ఆర్ద్రం
కత్తి కన్న నిశితం, బాంబు కన్న భయదం
పద పదాన కళతో హృది విశ్వమయం

ఎదకు హత్తుకొని శిశువులా
వెలుగు నింపుకొని అమ్మలా
ప్రియమతి సుమ హృదయంలా ఎప్పటికీ
బంధు భావ బంధంతో ఆంతరమై

ఇంట్లో గోడకు గడియారం
నను కని పెట్టుకొనే ఉంటుంది
నాలో కవితకు ప్రేరణయై
గుండె లయకు తోడుగ నిలుస్తుంది

శబ్దంతో ఆయువును పొడిగిస్తుంది
నిర్భయతకు ఆధారం అవుతుంది
ఇరు చేతులలో ఆడే బంతుల వలె
నిమిషాలను నడుపుతుంది కవితగా

తన లయతో బ్రతుకును పలికిస్తుంది
గోడలు సీమలు జలధులు దాటిస్తుంది
పూర్వం బాణంలా దూసుక పోయేది
ఇపుడు మిసైల్‌లా మేధను చుడుతూంది

సృజన ప్రపంచంలో, సంస్కృతి భావనతో
మనిషి విజయ కథలలో ఒకటై పోయింది

బీద బిక్కి నుండి పై శ్రేణుల దాక
ఎందరికో నిలయమై స్వాగత మిస్తుంది

❋

## 16. మేలుకొన్న హృదయం

హృదయం నిదురించే మనిషితో దోస్తీ
మనిషిలో శిలలతో గిరులతో నీడలతో
హృదయం మేలుకొనీ మనిషితో దోస్తీ
మనిషిలో నదులతో మొయిలుతో వెలుగుతో

చీకటి వెలుగుల రెక్కలపై కాలం
తిప్పుతుంది మనిషిని జీవితమంతా

తెలుపు రంగు మారడం బహు సులభం
తెలుపు లోకి రావడం బహు కష్టం

స్థలమూ కాలం మనస్సు మూడూ కలిసి
మనిషిలో మరో మనిషి జీవన వేగంలో
చతురుడుగా మనస్విగా మనీషిగా
కల్పనలో చిత్ర కథా పరంపరలతో

గ్రంథం పుటలో పదాల వలె లిప్తలు
వీటి వెనుక కనబడని రహస్య ప్రపంచం
తెలిసిన అర్థం కన్నా తెలియనిదే ఎక్కువ
ప్రతి చరిత్ర ముఖంలో మౌన సుందరంగా

ఒక పద్ధతిలో చెక్కకు యోగంతో
తీగెలపై నైపుణితో మీటే రూపం
అమరే వాద్య విశేషం జీవిత మనిపిస్తుంది
సహభావం లోపిస్తే, ఈ విశేష మెక్కడుంది?

ఎచట నుండి అయినా, సమయమేది అయినా
కూలే శిఖరం ధ్వనితో ఆర్త రవం
ధ్వంసంతో కేకలతో గళ రావం
మేలుకొన్న హృదయానికి! వినబడుతుంది

❃

## 17. ఎవరికైన స్వాగతం

ఆటలో బంతిలా ఆడ బడీ
వదలి వేయ బడుతూ ఒకరొకరు
కర్షకులూ కార్మికులూ కర్మకులూ
ఇప్పటికీ అణగి మణగి జీవితాలు!

గుండె లోని బరువును
చంద్రకళకు తగిలిందీ
ఆశ లోని శాంతిని
చల్లని గాలికి వదలీ
రాత్రి నిదుర కొదుగుతుంది
సామాన్యుని శ్రమ రూపం

సంఘంలో వైర భావ బింబం
సూర్యునిలో కలిసి పోయి ఒకటై
ఎప్పుడు దిగుతుందో సందర్భానికి తెలుసు
ఏ పని చేయాలో ప్రగతి మనసుకే తెలుసు

నీతి న్యాయం రెక్కలపై రాజ్యాంగం
నింగిలో విహరణం చేస్తుందీ సమయం

జలధిలో లోతుల వలె పోయిన కొద్ది గతం
ఎగసి కదలు అలల వలె ఉపరి వర్తమానం
గట్టు తెంచుకొని లౌకిక వ్యవహారం
వరదలుగా సంపద విభవం పోటీలో

నాల్గు దిశల నుండి ఎవరికైన స్వాగతం
వాణిజ్యానికి దేశం! సుందర నిలయం
ఇపుడైతే ఏ సుమ వనిపై చూపులేదు
బ్యాగ్‌లో కరెన్సి! తలపై అధికార వరం

❊

## 18. చరితకు చిహ్నం

విగ్రహం ఒక ఆదర్శ పథానికి చిహ్నం
ప్రతి రూపం పరివర్తన నీతికి బింబం
నిద్రిత మనసును మేల్కొలిపే ఘన సాధనం
సమాజ యానంలో ఒక మలుపుకు సిగ్నల్

విగ్రహ సంస్కృతికి బుద్ధుడు వ్యతిరేకం
అయినా కాలంపై అంతట వెలసాయి
తన ప్రతిమను నిలప రాదని "విల్"లో నెహ్రూ!
అయినా ప్రియ జన మతం ఆపరాని దయింది

చేసిన పని సత్కీర్తి ప్రవహమై సాగి
మరణంతో నవ రూపం వహిస్తూంది

ప్రజలో నిలిచిన మహనీయమైన అనుభవం
విగ్రహ రూపంలో సాకారం పొందుతూంది
ఎదలో నిండిన కృతజ్ఞతా రమణీయం
కళ్ళ ముందు శిల్పాకృతి పొందుతూంది

విగ్రహాన్ని చూచినపుడు మనసులో
సమస్య పరిష్కృతిపై విశ్వాసం పెరుగుతుంది

పరిణామ వికాసాలకు హేతువయిన
గుణ కర్మల నిజ అస్తిత్వాలతో
సరస్సులో జలతలాన రవి లానో
కిందికి దిగి ఎదురుగ చంద్రుని లానో!
ప్రతి విగ్రహ మొక సమాజ కోణంలో
మనసును శిల్ప నిలయ మొనరిస్తుంది

శీలంలో ఆచరణం లేని బ్రతుకులో
మౌఖిక ప్రకటనతో పని అయిపోతుంది
ఏ స్థితిలోనూ విగ్రహాల రక్షణ
సంస్కృతిలో ఉదార చరితకు చిహ్నం!

❊

## 19. దార్శనిక రూపం

సమాజ లక్ష్యంగా వివిధ దశలలో ప్రతిమలు
వికాస పాత్రలుగా చిన్నవియో పెద్దవియో
సమూహాల ప్రయోజనం వర్గం ప్రాంతం మంచికి
క్రియా శక్తి కేంద్రమై స్థిరతను పొందినవీ

మత మయినా కళ అయినా సామాజిక మయినా
దేని కదే ప్రత్యేకం సంస్కృతిలో భాగం
భౌతికాన్ని విస్మరించ నీయనివీ విగ్రహాలు
జన తతిలో వికాస కారణ ప్రేరణ మూర్తులు

కనిపించని పూర్వ పూర్వ క్షణాల హారం
మెడలో ఒక పూల దండ రూపంలో
మానవ బంధం దృఢ తర మొనరిస్తుంది
అర్పిత హృదయంతో జవం పెంచుతుంది

అందరి మౌలికమౌ అవసరాలు తీరడం
అదనపు ఉత్పత్తులు లాభాలను పెంచడం
కోరే మార్పులకై సాహస చర్యలతో
ఏ పర్యవసానం పూర్ణ ఫలం ఈయలేదు

పరంపరగ సాగుతుంది పరిణామంలో
వివిధ విభాగాలకు ప్రతినిధులీ విగ్రహాలు
శాంతి పథం వరించినా పోరాటం పట్టినా
ఈ రెండు విధాల ప్రగతి! వంతెన కిరువైపులలో

కాలం తల వంచుతుంది, వంతెన దాటే అశ్వం
నింగి ముఖం అద్దుతుంది ఎగసే మానవ తేజం
ఎంతటి సంక్లిష్టతలోనూ చరిత్ర ఆగదు
వెనక్కి నడవదు ముందుకు సాగడమే ధ్యేయం

పనిని బట్టి ఫలం! దోపిడి లేని సమాజం
విగ్రహాల చూపులలో బింబం వ్రేలాడుతూ

❋

## 20. వికాస చిహ్నం

ఎక్కడనో మొలకెత్తిన వికాస వృక్షం
శాఖలుగా ముందుకు సాగడ మొక పరిణామం
ఇవి విశ్వం విస్తరించి మనిషిని మేల్కొల్పుతాయి
శాఖలతో దేశ దేశ వార్తా స్వర సంచారం!

అనుభవాల పరంపరా ప్రసారాల ఆదర్శం
మారుతుంది మార్పుతుంది వెలుగు ప్రభావంతో
అనుభవమూ ఆదర్శం మధ్యలో విగ్రహం!
ఇరువైపుల తన ప్రభావ ఛాయలు ప్రసరిస్తూ

లేమి నుండి కలిమిలోకి అదనపు ఉత్పత్తులతో
మిగిలే సంపదతో సామాజిక రాజకీయ సాంస్కృతికం
నాగరకతలకు నిలయం విగ్రహ రూపంలో నిలిచీ
రాజ్యం రేఖలతో జీవన రూపానికి ముడివడింది

పూర్వం రణ చర్యకు ముక్కలయి ప్రతిమలు
పురావస్తు చయంలో భాగమై బ్రతికినవీ
చరిత్రలో దృశ్య మాన భూమిక నిర్వహణంలో
చోదక శక్తుల ప్రత్యేకతలను కలిగినవీ

పాతకు పొడిగింపుగ కొత్తది పక్కనే
వర్తమాన గమనానికి ఉత్సాహం ఇస్తూ
ఒక విధం పరిస్థితులకు తగిన విధానంతో
తప్పని మార్పుకు సంకేతాలుగ ప్రతిమలు!

పాతలోని అవశేషం కొత్తలోని ఆకర్షణ
అంచెలు అంచెలుగా సామాజిక పాత్రలతో

చంపడం దోచడం నాశనం చేయడం
ముఖ్యమైన సమాజం కావ్యమైన చరిత్రలో
విగ్రహ దీపాల వెలుగు, ఆంతర ప్రకాశంతో
సమాజాన్ని ఆగకుండ, ముందుకు నడిపిస్తుంది

❋

## 21. భాగ్య దశలో

ఏ ఎండకు ఆ గొడుగు కుదరని పనియై
ఏ మనిషికి ఆ పాట వెడలని పలుకై
'ఆత్మ గౌరవం' ఒక స్వతంత్ర శిఖరమైంది
రాజకీయ స్వేచ్ఛలో, నేడు తెలంగాణ!

ఎండిన ఆకుల వలె క్షణాలు
స్మృతిలో గల గల లాడుతూ, పాతవి
పచ్చని ఆకుల వలె క్షణాలు
వర్తమాన యానానికి శుభదమై!

ఎండలలో "జలం" కరువు
అలజడిలో 'శాంతి' కరువు
కరువు నుండి ముక్తంకై యత్నంలో
ఉత్తమ సంకల్పానికి పరీక్ష లెన్నో!

మలుపులు తిరిగిన కొమ్మలతో
చెట్టుకు ఆకృతి! విస్తృతి! అందం!
పచ్చదనం నీడలలో గాయం మరుపున బడి
అభయ హస్తమవుతూంది! వర్తమానం!

శిథిలాల పొరలు ఒలిచి తీసి
తన చరిత్ర కనుగొనే కోరిక!
ఇది హంగుల చలన చిత్రం కాదు!
కఠినమైన వాస్తవాల కంటక యానం

స్వేచ్ఛా పథంలో! మెలకువలో
కల లెరుగని ప్రజల గాథతో!
బంగరు రాష్ట్రంకై సంకల్పం!
సుందర జీవన రుచిపై కోరిక!

❈

## 22. పరిణామ నవం

క్రామిక శాలలో మండే కొలిమిలా సూర్యుడు
పని వారికి పని ముట్లను తయారు చేస్తూ

తలపై చుట్టిన గంగ పాయలా
ఎండకు తెల్లని గొడుగు, "సహన" చిహ్నం
సూర్యుని తీవ్ర కిరణ ప్రశ్నకు
సులభమైన చల్లని జవాబులా

ఎండలో నిలిపిన మామిడి పండ్ల బండి
కష్ట జీవి గుండెలో ధైర్యం నింపుతూంది

రాళ్ళ నేల గరుకు నేల బీడు నేల
ఇసుక నేల గరిక నేల ఇవి అన్నీ
మైదానంతో పాటుగ భూమికి ప్రియమే
తన బిడ్డలె! సీమలు రాష్ట్రాలు పిల్లల్లా

మనిషి తెలివి శ్రమ పథాన పని కల్పిస్తుంది
ఆకలి గొన్న సమాజానికి ఊరట నిస్తుంది

మితిమీరిన మనిషి అవసరాల మిషతో
పర్యావరణానికి భంగం! ఆమోదం కాదు
ప్రమాదాల అంచులోకి జారుస్తుంది
సమత తప్పి కష్టాల్లో ముంచుతుంది

అస్తమయంలో సూర్యుడు
కత్తికి తెగి పడే వీరుని తలలా
ఉదయ వేళలో సూర్యుడు
తూరుపు దిశ చేతుల్లో జారే శిశువులా

ఇది పునర్జన్మ కాదు, విధి విలాసం కాదు
కాల చక్ర భ్రమణంలో పరిణామ నవం!

❊

## 23. తల ఎత్తిన

భాష ఒకటి అయినా స్పందన ఒకటైనా
తప్పని మైత్రీ బంధం బంధుత కొనసాగినా
చరిత్రలో తెలంగాణ అస్తిత ఒక ప్రత్యేకం
మనోమయం రుచి భిన్నం, స్వయం శక్తిగతం!

చిన్ని చిన్ని గిరులతో కొసరు కొసరు తోటలతో
రాళ్ళను పేర్చిన గోడల ఆవాసాలతో
దాటరాని ముళ్ళ పొదల గుబురులతో
అడుగు వేయరాని వాగుల వర్రెలతో
మార్పుకై చూచే చూపుల కిరణాలతో
అరణ్య భావన నుండి బయటపడే జన దృశ్యం!

చరిత్రలో చీకటి దశ తప్పనిదై
ఒక స్థితిలో చీకటిదే శాసనమై
ఇది ముసుగై మోస పుచ్చ వచ్చు
వెలుగు నుండి వేరు చేయవచ్చు

జేబు నుండి తీసిన సిగరెట్‌ను
అంటించే పనిలో గీసిన అగ్గిపుల్ల
వెలుగు దారి చూపుతుంది! చీకటిలో
గమ్యం చేరుస్తుంది, సూర్యుని చూపిస్తుంది

గ్రీష్మంలో పగిలిన బండల సందులలో నుండి
పచ్చని మొలక నవ్వుకై
చూచే కళ్ళు! ఆకాశం ముక్కల్లా!
మబ్బు మెరపు అన్వేషణలో

ఈ మొక్క తరువై వనమై
రానున్న తరాలకు ఫల రుచి చూపాలనీ
ప్రకృతి కరుణతో, మనిషి శక్తితో
జనత బలంతో, తల ఎత్తిన తెలంగాణ

❋

# 24 చేతనతో బాధ్యత

సమయానికి ఉదయం! తప్పని సరిగా
తన విధిలో అనుమానం లేకుండా
సమయానికి అస్తమయం జరుగుతుంది
శ్రమ విరామ సమయం పాటిస్తూ!

అర్ధరాత్రి ఉదయ శోభ దేశానికి స్వాతంత్ర్యం
పట్ట పగలు రాత్రి మాట దేశంలో ఎమర్జెన్సి
ఊహల కందని చరిత్ర పరిణామంలో
పరివర్తన క్రియలో చూచే దృశ్యాలెన్నో!

ప్రాణాలను మెట్లుగ మలచి వరసగా
గమ్యం చేరిన స్వేచ్ఛా యానంలో
ఎంత సన్న సన్న నయినా నది
ఎంత మంద మంద మయినా గతి
నిలచి పోదు వెను తిరగదు! ఇంకిపోదు
ఉద్యమ ఫల రుచులను చూపాలనే!

ఇంత వరకు ప్రశ్నలతో గడచి గడచి
ఇంత వరకు హక్కులకై నడచి నడచి
కర్తవ్యానికి సిద్ధం కావలసి ఉంది
చేతనలో తన బాధ్యత నిలపాలిసి ఉంది

క్షణం నుండి కష్ట నష్ట గాధలలో
తరం నుండి విశాల దార్శనికంతో
వర్తమాన చలనం! మనిషి శక్తి పరిధిలో
రంగులవే కలయికలో భేదం! ప్రతిభచే

ఆదర్శ తెలంగాణ! అనుభవ రూపం
ప్రాభాత సంపదలకు అభ్యుదయ పథం
కణ కణాన సృజన గుణంతోనే
పద పదాన శ్రమ విజయంతోనే

❊

## 25. ప్రజాస్వామ్య రుచి

దుర్ముఖి అనగానే తలపులలో
ఒక వత్సర భయ భావం ఎదలో
కాల చక్ర భ్రమణంలో
ఎవరి కయిన తప్పనిదీ

విప్పరాని చెప్పరాని
బరువు మూట గుండె పైన
ఇది తొలగే సాధన మొకటే
అది మానవ చేతన శీలం!

వెలుగులో సన్ముఖం స్వర్ణ రేఖతో
నీడలో దుర్ముఖం నీలి రంగులో
దుర్ముఖాన్ని సుముఖంగా
మార్చి వేయు ఈ సమయం
మానవీయ స్పందన వినిపించనీ
మనిషిలోని హృదయం తలపించనీ

రావలసిన సమయానికి ఈ ఉగాది రాకకై
ప్రకృతితో పాటుగా మనిషి ఎదురు చూచేను
కశ్మలాన్ని కల్మషాన్ని ఎగిరి పోజేస్తూ
జనాలోలమై పరిమళ లహరి కదలనీ

విరామ మంటే చేసే పనిలో స్వతంత్రం
ఇష్టమైన పనిలో ఫలితం అమూల్యం
నిన్నటి మానని బాధకు ఉపశమనం ఈ ఉగాది
చల్లని సుమ స్నేహంతో మనోజగం హ్లాద మయం

జీవన గమనంలో అక్షర యానంలో
చరిత్రలో కొత్త పుట నలంకరించనీ
నిజ నైతిక సమరానికి సిద్ధమై
ప్రజాస్వామ్య జీవన రుచి పొందనీ

❊

## 26 డ్రా అయ్యే ఛాన్స్

ప్రకృతిలో, కాలానికి ఒదుగుతుంది దృశ్యం
మనిషిలో, మానవతకు కరుగుతుంది హృదయం
హెచ్చు తగ్గులేవి, ఎరుగనిదీ ఈ ఉగాది

బ్రతుకులో, ఉగాదితో సృజన వసంతం
మనిషిలో రావలసిన పరివర్తనతో
పునర్భవం మనోమయం గుర్తుకు వస్తుంది

ఎత్తిన పిడికిలితో రవి బింబం
సాగే నడకలలో అలల రయం
శ్రమ చక్ర భ్రమణంలో జీవితం
మనిషి లోని శక్తికి ఛాలెంజిగా

పెట్టెలో భద్రంగా దాచిన వస్తువులా
బ్రతుకులో కనిపించని మానవతా వజ్రం
ఇది బయటికి విచ్చేసే అవసరం
ఈ సమయం మరీ మరీ ముఖ్యమై

పేరేదయినా ఈ సమయం విభవం
ఉత్సవ కళతో తోరణమై నిలవనీ

నిన్నటితో  పాత ముఖం తొలగి పోయి
నేటి నుండి కొత్త ముఖం వెలుగు చూచి
ఉదయ కిరణ స్పర్శతో సృజన శక్తి మేల్కొనీ
ధూమం బదులుగ! శాంతి కపోతం ఎగరనీ

జీవుని ఆకలికీ
ఆమని అందానికి
ఈ రోజున వీధి మనిషిలో
పోటీలో వాస్తవ దృశ్యం
గెలుపెవరిదో? నిర్ణయమయ్యేనా?
"డ్రా" అయ్యే సూచనకే "ఛాన్స్"

❇

## 27 రైలు - రైల్వే స్టేషన్

ఆధునికానికి సంకేతం రైల్వే స్టేషన్
ప్రయాణ సుందరతకు నిలయం
విజ్ఞానం అందించిన బహుమానం రైలు
సమాజ గమనానికి చిహ్నం

వానల కాలాన సమార్ద్రమై
బరువెక్కిన వాతావరణంలో
ఊరులో ఉన్న మాకు కొన్ని మైళ్ళ దూరంలో

పరుగెత్తే రైలు శబ్ద వీచికతో
అది వేసే విజిల్ హెచ్చరికలతో
విధి నిర్వహణంలో బాధ్యత తలపిస్తుంది

ఎన్నిసార్లు పయనించినా రైలులో
ఎవరి కైన ప్రతి సారి కొత్త అనుభవం!
కిటికీ నుండి చూచే చూపుల ముఖాలలో
ఆనని దృశ్య పరంపరలో అందని చిత్రం!

ఎవరెవరో మనుషులతో కొత్త జగంతో
రైలు ప్రయాణం! ఒక సామాజిక సౌందర్యం!
రైలును చూడాలని ఉబలాటం! మొదట్లో
ఆ పై రైలులో పయనించాలని కోరిక!

ఊరు నుండి నగరానికి ఆ పై చదువులకై
ప్యాంట్ కమీజ్‌తో సులభంగా చేరుస్తుంది
గమ్యం చేరే తొందర కన్నా
రైలును వదలే బెంగ! మొదట్లో

ఈ అనుభవ సుందర నవ్యత
జీవన భాగ్యంలో పై మెట్టు
విశేష సంచికగా నిలుస్తుంది
మానవ బంధాలను చదివిస్తుంది

❊

# 28 రైలు - రైల్వే స్టేషన్ -2

ఊళ్ళు అడవులు కొండల అంచులు నదులు
పట్టణాలు దాటుతూ చూడని దృశ్యాలతో
వీడ లేని వీడ రాని వర్తమాన యానం
రైలు కదలికతో కనబడే! విశేషాలెన్నో!

జీవితాన ఎదుర్కొనే సమస్యలకు
ఒక్కొక్క ప్రశ్న కొక జవాబులా
ఒక్కొక్క స్టేషన్ దాటుతూ పయనం
ఇంకా ఎన్నో ప్రశ్నలు మిగిలీ

శ్రమ చక్రాలపై సమాజ మొక వాహనం
జీవన వ్యవహారంలో తప్పని సరి అవుతూంది
శ్రమ చక్రం నిలిచిపోదు నడకైనా రైలయినా
సమాజ గమనం ఆగదు మిత్రమైనా శత్రువైనా

పనులకు వేగంగా తరలించే సాధనం
ప్రజలకు ఉపయోగంలో ఒక విభవం! రైలు
ఇది మానవ మతి దీప్తికి అను రూపం
నవ సమాజ బంధాలకు కొలమానం

రైల్లో నిద్రకు సులభమైన విధంగా
నీరు నిండిన కుండల్లా వ్యక్తులు
గాలికి ఆకుల్లా గల గల క్షణాలు
ఉదయం! మెలకువను తట్టి లేపుతాయి

వర్తమాన క్షణాల్ని నడిపించే
మానవ సంబంధ ఝరిణి రూపం,
మనిషిని గమ్యానికి చేర్చే పనిలో
మిత్రం బంధువు ఆప్తం రూపమై
పయనంలో వాస్తవ జీవన గతిలో
మానవ సుందర విజయానికి తార్కాణం

❊

## 29 స్వతంత్ర శకలల

రైలు స్టేషన్ బయట వీలు చేసుకొని
ఒక పక్కన ఒదిగిన స్వతంత్ర శకలం
మానవ రూపం స్పష్టాస్పష్టంగా నిలిచీ
వెలుగుల చరిత్రలో నీడ బొమ్మలా

చంద్ర బింబం నుండి
నీలి మచ్చ ఊడి పడి నట్లుంది
కిరణ ప్రభావం నుండి
తప్పిన చీకటి ముక్కలా ఉంది

పెను గాలికి విరిగి అలాగే
పడి ఉన్న ఎండిన చెట్టు కొమ్మలా
జీర్ణ మైన దుస్తులతో ఒంటిపై
రంగు మాసి చెదరిన చిత్ర పటంలా

ఎవరేమిటి? అందరికీ తెలిసిన నిజం
కవితలో పరిచయం కొత్తగా ఉంటుంది

సంపన్నులకూ నిరుపేదలకూ
సంచారంలో పరిమితులు లేవు
సమాజ మేదయినా ప్రాంతం ఏదయినా
ఇక భిక్షు గణం గురించి  చెప్పే ఛాన్స్ లేదు

భిక్షువు గళం నుండి ఆర్త రవం
గాలిలో మునిగి తేలి పోతూంది
కాస్త దూరం పోయే లోగా
మరో రవం కెరటంలా సాగుతుంది

ఈ విషాద జలధి చివర తెలియ దెవరికీ!
ఇది దాటే సాహస మెవరు చేయగలరు?

❊

## 30. పేజి ముక్కలా

ఏ బస్ స్టేషన్ లోనో బయటో
నగరంలో సందడి కార్నర్‌లోనో
పనికి రాని రాళ్ళలా
బొగ్గు కణిక లెందరో?

పక్కనే వంతెనపై మనుషులు
ఇటు వైపు నుండి అటు వెళ్ళే
అటు వైపు నుండి ఇటు వచ్చే
ఎందరయినా? అంతా ఒక లాగే!

కొందరిలో అనుకోకుండా తీగె కదలుతుంది
స్మృతులు కదలుతాయి వేడి వాడి స్పర్శతో
కాసేపటికి తమ దారిన వెళ్ళిపోతారు
ఆ పరిసరాలు దాటాక! అంతా సాధారణం

మనిషిలో మానవత, నూనె లేని వత్తిలా
మనసులో ఉదారత, గ్రీష్మంలో ఎడారిలా

అపుడపుడూ రైల్వే వంతెనపై అందంగా
విరిసిన ఇంద్ర ధనుసు! నేటి ప్రజాస్వామ్యంలా
అందని హ్లాద జగం! ఆకాశంలో దూరంగా
పక్కన చూడక తప్పని దయా భావ దృశ్యం

ప్రతిరోజూ కనిపిస్తారు
ఇదే మోస్తరుగా! ఎందరో!


నిర్మాణం నీడలలో ఒదిగిన భిక్షువు
తవ్వకాల నుండి బయట పడిన వస్తువులా!
భారత రాజ్యాంగం గ్రంథంలో
చినిగిన పౌర హక్కుల పేజి ముక్కలా!

❊

స్వేచ్ఛా కవిత్వం-70

# వర్తమాన సంకేతం

మాదిరాజు రంగారావు



2016

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

# VARTHAMAANA SANKETHAM

Free-Verse

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2016

*Presented*

*to*

*my wife*

**Smt. M. Indira**

# వర్తమాన సంకేతం

## పీఠిక

స్వేచ్ఛా కవిత్వంలో ఇటీవల స్వల్పమైన గ్యాప్‌లతో వెలువడిన 1) వర్తమాన స్వనం 2) వర్తమాన వాస్తవం 3) వర్తమాన లహరి 4) వర్తమాన యానం ఇపుడు వీటి పక్కన చేరింది 5) వర్తమాన సంకేతం. ఈ అయిదు కృతులు కలిపి ఒకే కావ్యాన్ని తలపిస్తాయి. వర్తమాన సమాజాన్ని బింబిస్తాయి. ఈ సంపుటిని "వర్తమాన హృదయం"గా పేర్కొనడమయింది. హృదయమంటే స్పందనతోపాటు అభిప్రాయమన్న అర్థంలోనూ భావించవచ్చు.

ఇది ప్రగతిలో పై దశలకు చేరే మార్పును కోరుతుంది. మానసికంగా చేతన పరిధిని పెంచుతుంది. సమాజాన్ని గురించి ఆలోచనకూ మనుషుల్ని గురించి అవగాహనకూ తోడ్పడుతుంది.

వీటిలో వస్తువు – విషయం – అభివ్యక్తి – లక్ష్యం – దార్శనికంలో ఐక్యత స్పష్టంగా కనిపిస్తుంది. స్థూలంగా అనుభవ తలంపై కనిపించే 1) సామాజిక గతులతో 2) జీవన స్థితులతో కూడిన దృశ్య పరంపర ఆవిష్కృతమైంది. ఇది పూర్తిగా వాస్తవ భూమికపై ఏర్పడింది. లక్ష్యంలో ప్రజాస్వామ్య సామ్యవాద ఛాయల్ని కలిగింది. భావ రూపాలు ప్రతీకలు తగిన పాత్రలను నిర్వహించాయి. అక్కడక్కడ తాత్త్విక స్పర్శ చోటు చేసుకుంది. ఈ విధంగా రచన అభివ్యక్తి విశేషాన్ని తలపిస్తుంది.

సృజన చేతనలో స్వతంత్రమైన రూపం కవిలో ఆంతరమైన స్వేచ్ఛా గుణంతో వర్తిస్తుంది. అందువల్ల ఎవరి ఇష్టాన్ని బట్టి ఆదేశాల్ని సూచనల్ని అనుసరించడం జరగదు. కవిలో 1) స్వయం వ్యక్తిత్వం గల మనిషిగా 2) సామాజిక బాధ్యతల్ని వహించే పాత్రగా 3) నిఖిల మానవీయ రూపంగా దేనికది సందర్భాన్ని బట్టి వ్యవహరిస్తాయి. మొత్తం మీద సమైక్య రూపాన్ని పొందుతాయి. తన చుట్టూ ఉన్న గోడలు సీమలు దాటిన ఆలోచనతో స్థానికమైన సమస్యల పట్ల చింతనతో వర్తిస్తూంది. అందువల్ల తెలుగులో కవుల సృజన చేతన చేత ఎంతో విషయ వైవిధ్యంతో కూడిన మంచి కవిత్వం వస్తూంది.

ప్రస్తుతానికి వస్తే 1) స్పందనతో 2) చింతనతో వర్తమాన జీవన దృశ్యమయమైందీ కవిత్వం. సమాజ సుస్థితికీ ప్రగతికీ దార్శనిక లక్ష్యంతో పాటు నైతికత కూడ అవసరం. దీనిపై వెలుగునూ గమనించవచ్చు. అన్నీ కలిసి ప్రత్యేకతను తలపిస్తాయి. తన దైన అస్తిత్వ రేఖలతో ఉపయోగకరమైన పాత్రను నిర్వహిస్తూంది. ప్రగతికి చెందిన విలువల్ని స్థాపిస్తూంది.

**– మాదిరాజు రంగారావు**

# వర్తమాన సంకేతం

## 1. అందుకున్న సిక్సర్

సామాన్యుని కలయే కవి కలం నుండి కవిత
సంకల్పం సంవేదన ఆలోచనతో
శబ్ద లహరి శ్రేణులపై సాగే హృదయం
వాస్తవ భూమికలో వర్తమాన సంకేతం

జ్ఞాన శక్తి విప్పారిన తొలి దశ నుండి
వ్యక్తిలో జీవిత కాలంలో అడుగడుగున
బ్రతుకును అర్థం చేసుకునే యత్నం
తెలియనిదీ పొందనిదీ రహస్య మెంతో!

యుగాల జీవన సంపదను ప్రగతిని
తరం నుండి తరం పొందుతుంది, ఖండ ఖండంగా,
పరివర్తన గుణంతో ఉపయోగ విశాలతతో
శ్రమ విశాల ప్రపంచం, జన విలోల సమాజం

సీమలు దాటిన ఊహలతో మనుషులు
రంగులతో చిత్ర మయం జీవితం
సమయం సందర్భంలో పాత్రలు వేరై మనుషులు!
జీవన గమనంలో పొందే దృశ్యం కొత్తది

జీవితాన జారి మాయమైన ప్రియ రూపం
సరస్సులో ఈదే శశి బింబం! చూపిస్తుంది

కాలం వెలుగుతుంది మనిషి నవ్వు ముఖంతో
కాలం పలుకుతుంది మనిషి మాట బాటలో
కాలం బ్రతుకుతుంది మనిషి హృదయ బలంతో
కాలానికి మానవ జీవిత మొక సుందర నిలయం

సిక్సర్‌లో పై కెగసిన బంతిలా చంద్రుడు
అందుకునే ఆరాటంలో చేతులెత్తి శిశువు!
శిశువు ముఖం చేతులలో హత్తు కొన్న అమ్మలో
సిక్సర్‌లో బంతిని అందుకున్న మహదానందం!

❋

## 2. తెలియని స్థితిలో

ఆడ బడే బంతి అయిన సృజన లిప్తలో
ఎవరి మాట వినిపించదు
ఎవరి రాక కనిపించదు
వినబడేది కనబడేది కవితయే

మనసొక పుష్పక విమానం
పరిచయం ఉన్నవారు లేనివారు
మిత్రులు బంధువులు ఎవరెవరో?
ఎక్కడెక్కడి నుండో ఎందరెందరో?
లోనికి వస్తూ బయటికి వెళుతూ
మజిలి మజిలి కొక కొత్త సన్నివేశం

అనుక్షణం చలన గుణంతో
ప్రతి క్షణం నిరీక్షణంలో
క్షణం వీడి గతంలో చేరుతుంది
క్షణం చేరి వర్తమాన మవుతుంది

ఆగిన స్థితిలో యథాతథం
కదలే స్థితిలో పరివర్తనం
ప్రతి ఊపిరిలో మోదమో! ఖేదమో!
ఆరోహణలో పవన వీచితో తప్పదు

వ్యక్తి జీవితంలో ఎక్కువ సమయం
గడుస్తుంది! కల్పనలో తనకు తెలియకుండా!

పూవు పూస్తుంది అందంగా
అది ఎవరి కోసమో? అనేది
పూవుకు తెలియదు, చెట్టుకు తెలియదు

అగ్గిపుల్ల గీయబడీ
అది దేనికోసమో? అనేది
అగ్గిపుల్లకు తెలియదు, ఆ పెట్టెకు తెలియదు

❀

## 3. వెనక నుండి నీడ

జీవిత మొక మనోజ్ఞ పరిణామ నవం
ఆయువు ఒక జీవ భావ స్పృహ రూపం
భౌతిక మానస శక్తులు కలిసినదీ
చేతన కాధారం! మానవ రూపం

దృష్టికి వేలాడుతూ సుందర జగత్తు
నేలపై సర్పం కదలిపోతుంది
పైన విహగం ఎగిరి పోతుంది
ఎవరి దారి వారిది జీవన గమనంలో

పది తలలున్నా పని చేసే తల ఒకటే
మిగతావి! తోడుగ ఉండేవి మాత్రమే!
ఒకటి ఎగిరిపోతే దాని బదులు కొత్తది
కల్పితమొ! సహజమొ! తెలియని సంభ్రాంతం

ఏ బ్రతుకున కది ఆ పథంలో ఒక విధం
స్వేచ్ఛా భావనతో! మానుష బంధంతో

మనిషిలో రూపొందే అస్తితకు
మూల బలం తనలోని అహంకారం!
ఇది పరిమితి దాటితే అగ్ని సమం
భాగ్య రేఖకు బూది అంచు చూపుతుంది

తెలియని దారి పక్కనే కొంత తెలిసినదీ
తెలిసిన దారి పక్కనే కొంత తెలియనిదీ
ఎంతటి పరిణతిలోను సమగ్రతకు ఆటంకం
ఎక్కడో లోపం మినుకు మినుకు మంటుంది

నడిచే వెలుగు మనిషి బుజాన
కిందికి జారిన నీలి కండువాలా
వెనక నుండి నీడ జీరాడుతుంది
చీకటి తలపుల వలను విసరుతూ

❊

# 4. సృజన ముఖంతో

ఉదయం దిన పత్రిక తెరిస్తే టి.వి. ఆన్ చేస్తే
చీకట్లను చిమ్ముతూ రంగుల వార్తా విశేషాలు
స్పందన ఆలోచన చర్యల సంపుటం జీవితం
ముందుగ ఏదీ తెలియని సుందర బహుమానం

ఏడుపు వినడం సంతోషం కాదెవరికీ
తన ఏడుపు అయితే అంతా వినాలనీ
పిలిస్తే ఆకాశం బదులు పలుకుతుంది
మనిషి! విషమ వాతావరణంలో అచలంగా
తనలో మంచు పలకయై శిలయై శిల్పమై
మెడలో సమాజ బంధు చిహ్నం వేలాడుతూ
మదిలో మ్రోగని తంత్రుల నిశ్శబ్దంతో
మనిషి ఉనికి ఉన్నట్లా? లేనట్లా? అనుమానంతో

కొన్ని ధ్వనులు శూన్యాన్ని పలకరిస్తాయి
వాద్యం నుండి అయితే సుఖనాదం పలకరిస్తుంది
అపుడపుడు! ఆయుధ శబ్దం భయపెడుతుంది
అన్నిటిలోను మనిషి మాట! ప్రాణానికి ప్రియం

మాట కలుపుతుంది, మనుషుల మధ్య సంబంధం
మాట నడుపుతుంది, మనుషుల జీవన వ్యవహారం
స్వర భేదాలెన్ని అవసరంలో బయట పడినా
అన్నీ మానవీయ ఆర్కెస్ట్రా ప్రకటనలో భాగాలే!

మనిషి మనిషికి మధ్య ఎడం
ఎంత? అంటే ఒక పెన్సిల్ గీత అంత!
కాలంపై బిగిసి జటిలమైన సమస్యలు!
కంచెగా గోడగా కోటగా మారవచ్చు
జవాబు నుండే కాదు సమస్య నుండీ
కవిత ఉద్గమిస్తుంది! సృజన ముఖంతో

❋

## 5. రాత్రి గడిస్తేనే

ఒక రోజు వెచ్చని బూది పొరల నేలపై
అడుగులు పడుతూ నడుస్తున్నట్లు ఉంటుంది
దారిలో గాలి వెచ్చగా ముఖాన్ని తాకినట్లు ఉంటుంది

బాంబుకు తెలిసిన అర్థం! ఒకటే విధ్వంసం!
కత్తికి తెలిసిన అర్థం ఒకటే రక్త చిత్రం!

దేశానికీ దేశానికీ మధ్య ఎడం
ఎంత అంటే అనల సూత్రమంత!
ఇది కాలంపై ప్రబలిన శత్రుతతో
రుధిర రేఖగ మారవచ్చు, పాములా

పై అంతస్తు నుండి చూచే చూపుకు
వేలాడుతూ జగత్తు ఎంత సుందరంగానో

పక్కనే పేలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ శబ్దం
దగ్గరే రోడ్‌పై ఏక్సిడెంట్ కోలాహలం
చకితంగా ఆ వైపు మనసు మరలుతుంది
అపాయ శంకలో ఆలోచన శిల అవుతుంది
వేదన అలలపై హృదయం ఊగుతుంది

పది తలల రావణుడయినా
నడిచేది రెండు కాళ్ళ పైనే
వేయి పడగల సర్పమయినా
కదలేది రెండు బుజాలపైనే
ఆయువు పరిమితిలో మనిషి బ్రతుకు సిద్ధంగా

సరస్సులో ఈదే చంద్ర బింబం ఉనికితో
వెనక నున్న రవి బింబం కనిపించదు
రాత్రి గడిస్తే కాని వాస్తవం తెలియదు

ఏదీ ముందుగ ఎన్ను కొనే వీలు లేదు
కోరికపై ఏదీ! వచ్చి ముందు వాలదు!

❊

## 6. మరో దారి అవసరం

ఒక వైపు నుండి ఖాళీ అవుతూ
ఒక వైపు నుండి చేరిపోతూ
మని పర్సులా మనిషి జీవితం
ఎప్పటికీ నిండుగ ఉండాలని కోరిక

చేతిలో అణగి ఉండలేని కరెన్సీ
కనిపించే వస్తువుపై చూపును తళ తళలాడిస్తుంది

పంటలు పండి కష్టానికి ఫలితం
లెక్కలలో కొదవ లేదని పించినా
ఆకలితో చిరు మంటలతో పొట్టలు!
నోటి దాక కబళం చేరే పనిలో
మిగిలిన రాత్రి చీకటి ముక్కలా
ఉదయం ఇంటి ముందు భిక్షువు!
అనల గుణంతో మాడిపోయి మానుషం!
సజల నయన తీరాన పడవలా మానవత!

శ్రమ రెక్కలు విప్పారిన సందర్భంలో
సమయం! మనిషిని తనపై తిప్పుతుంది
దీని ముందు విమానం బలాదూర్
దీని ముందు గరుత్మంతుడు పనికి రాడు

పూర్తిగ ఎవరికీ! పరిచయం అవదు సమాజం
ఏదారి ఎటు తీసేదే! ఎవరికీ తెలియదు
పాత దారి జ్ఞాపకంతో సరిపోదు
మరో దారి అవసరంలో ఎదురుగ దారులెన్నొ!

పీడనలో నియంతలా గ్రీష్మ ప్రతాపానికి
తర తమ భేదాలతో తీక్ష ప్రభావంలో
చట్టం గొడుగై న్యాయం నీడై తమను
కాపాడేనని సామాన్యులు! ప్రజాస్వామ్యంలో

❋

# 7. కవితను వినిపించేది

ఎవరి గురించి ఎవరికీ పూర్తి పరిచయం ఉండదు
తెలియని విషయాలే ఎక్కువ జీవితాలలో
ఏ దిశ నుండో నియంత స్వరం వినబడుతుంది
శాసనమో! హెచ్చరికో! పిడుగుపాటొ! విధ్వంసమొ!

జేబులో చిన్న చాకు! ఆఖరుకు బొమ్మ పిస్టల్
మనిషికి ధైర్యం ఇస్తూ తోడుగ ఉంటుంది,

ఉదయం! ఉపదేశం కనిపిస్తూ వస్తుంది
విభేదాలలో మానవతను గుర్తుకు తెస్తుంది
రాత్రి! సందేశం వినిపిస్తూ వస్తుంది
విభేదాలు కనబడకుండా ఒకటి చేయ చూస్తుంది

పేదరికం ఎప్పటి నుండో చేరుతూ రాసులుగా
ఆకలితో పరుగెత్తి కనుగొన్న సమాధానాలెన్నో!
నాగరక సమాజానికి సోపాన క్రమంలో! నిలిచీ
ఇరువైపుల ఇంకా పేదరికం! దృశ్యాలు!

పలికే నాలుక ఒకటే! మాటలెన్ని విధాలో
మాట కొక అర్థం పూవులా జారుతుంది
మాట కొక అర్థం బాంబులా దూకుతుంది
ప్రాణం నిలిపే దొకటీ, ప్రాణం తీసే దొకటీ

వ్యక్తులతో సమాజానికి ప్రేరణ! అంతో ఇంతో
సంఘంతో వ్యక్తుల సంబంధం తప్పనిదీ
విశ్వమయంలో భాగం! ప్రతి మానవ విజయం
విశ్వరూపానికీ వ్యక్తి దేహానికీ మూలం ఒకటే

కవి వ్రాసే కవిత! తన కోసమే కాదు
పక్కనున్న ఇతరుల కోసం కూడా
దగ్గరలో మనుషులు! కనిపించకపోతే
శిలకో చెట్టుకో పక్షికో వినిపించేను

❊

## 8. రాత్రి మరచింది

మెడలో పూల దండ నిండుగా హ్లాదంగా
శత్రువు చిరు కత్తి పోటుకు గురి కావచ్చు
పరిమళం ఎగసి దూరం ప్రసరించవచ్చు
గాయం నుండి నెత్తురు చుక్క చిందవచ్చు

మల్లె తీగె పొదులో చుట్టుకున్న సర్పం
మోదంలో చకితంగా అనుకోని ఘటన! భయం!
హృదయం పొందే బరువు అందరికీ ఒకే విధం!
విజయానికి చేరిక మనిషి మనిషికీ భిన్నం!

మితి మీరిన సహనంతో శాంతితో
పోరాడే పటిమ చేయి జారుతుంది
వైరానికి తెలిసిన వాస్తవం! అగ్ని నృత్యం
యుద్ధానికి తెలిసిన వాస్తవం! రక్త చిత్రం

మతి మతిలో భేద భావ ప్రసారంలో
కాలం గడిచే కొద్దీ ఇచ్చి పుచ్చుకొనే
విధంలో కొత్త రూప మవతరిస్తుంది
సంఘానికి వ్యక్తి జీవితం ఉపద
వ్యక్తికి సమాజ పరిసరాలు ప్రేరణం

ఇంటి ముందు పూచిన పూవు అయినా
తోటలో పూచిన పూవు అయినా
అడవిలో పూచిన పూవు అయినా
అందం పరిమళం ఒకటే! విశ్వమయం

దాత చేతిలో మెరసే రూపాయి నాణెం
లోభి చేతిలో దాచిన రూపాయి నాణెం
విలువలలో భేదం లేదు! రెండు ఒకటే
ఉపయోగంలో పొందే ఉత్తమ స్థితులొకటే
రాత్రి మరచింది! రవి కిరణం జ్ఞాపకం చేస్తుంది

❀

## 9. పూడ్చరాని అఖాతం

బావిలో నీరు లోతులో! దాహంలో
తొడేందుకు బొక్కెనతోపాటు తాడు అవసరం

ఉన్నది ఏదో ముందుగ తెలియాలి
కావలసినదేదో! యత్నం చేయాలి
కోరికలు లేని జీవితం లేదు
రెక్కలు లేని విహగం లేదు

అవసరాలకు పరిమితులను దాటాలనిపిస్తుంది
దారి తప్పవచ్చు! అనుకునే గమ్యం మారవచ్చు
ప్రతి వ్యక్తి సమాజ ప్రగతిలో భాగం
నిర్ణేత నేత ప్రవర్తకుడు దర్శకుడు కావచ్చు

చేతలతో విభేదాలు సమాజ గతిలో సహజం
సమాజ పరిసరాలు వ్యక్తికి ప్రేరణ రూపాలయి
చీలికతో వైవిధ్యం విస్తరణకు అవకాశం!
పెరిగి పెరిగి జటిలతకు దారి తీయవచ్చు
లేంది మనుషులు మర బొమ్మలతో సమానం
ఎదుగు లేని నడత లేని విగ్రహ రూపాలు!

ఆలోచనలో సుమ గంధం వీచి
కత్తి పదునులో మెరపు తీగె మెరసి
సంపదతో శౌర్యంతో జీవన రూపం
సమాజ సంస్కృతిని బింబించే విభాగం!
విప్పారే మానవ శక్తికి నిదర్శనంగా
ప్రవహించే విజయానికి ఉత్సాహంగా
బిందువుతో మొదలై రేఖలతో చిత్రం!
ఘటనతో మొదలై చర్యలతో చరిత్ర!
ఒక సమయం ఏ దైవం గుర్తుకు రాదు
మనిషి తప్పు! బాధకుడు బాధితుడు మనుషులే!
ఇరువురి మధ్య ఎడం! పూడ్చరాని అఖాతం
ఘర్షణతో మొదలై యుద్ధానికి దారి తీయవచ్చు

❁

# 10. విశ్వమయం

మనిషికి మనిషికి మధ్య ఎడం
సన్నగ చీలిన ఆకాశం ముక్కలా
సమాజ గ్రంథం పేజిలో ఖాళిలా
దీనిపై చూపు ఎందరిదో! పడుతుంది

ఖాళీలను నింపే పనిలో విషయాలెన్నో
సామాజిక రాజకీయ వైయక్తిక పథాలలో
నింపే కొద్దీ ఖాళీలు ఏర్పడుతూనే ఉంటాయి!
ఖాళీలన్నీ నిండే అవకాశాలూ తక్కువ!

చట్టం నీతి నియమం సంస్కరణం దారానికి
ఎగిరే పతంగిలా! పేద బ్రతుకు!
ఎవరిదో చేయి ఎటు తిరిగితే అటు మరలుతూ
ఆ వచ్చే గాలి ఎటు వీస్తే అటు కదలుతూ

లోన అణగి ఉన్న కోరిక ఎగసి
తనకు తెలియకుండా పైకి ఎగురుతుంది
కనీసం ఎగిరేందుకు సిద్ధంగానైనా ఉంటుంది
ఉత్సాహానికి సమయం సందర్భం చేరాలిసి ఉంటుంది

నైతిక శక్తుల విలువలతో
పరిణామ చరిత్రలో సమాజం!
మనిషిని విజయ శిఖరంపై నిలుపుతుంది
దార్శనికానికి నడిపే ఉత్తమ సాధన మవసరం!

సంపదతో సంస్కృతి తీరాలు రెండు
వ్యక్తి నుండి సమాజానికి జీవన ప్రవాహం!
ఎండిన చెట్టుపై పూల గుత్తిలా
కవిత! వెడలుతుంది సృజన ప్రతిభతో
ఏ వృత్తి అయినా ఏ ప్రవృత్తి అయినా
సూర్యరశ్మిలా శిశువు నవ్వులా విశ్వమయమై

❋

# 11. రిజర్వ్‌లో

ఎవరి బ్రతుకు తీరు వారిది కావచ్చు, కానీ
కనీస స్థాయిలో మౌలికావసరాలు అందరికీ ఒకటే
సామాజిక దార్శనికంలో మొట్ట మొదటి ప్రాధాన్యం!
పాలనలో మాత్రం చివరిది కావడమొక దౌర్భాగ్యం

బీజం చిన్నది అది తరువుకు సృజన వరం
మనసు పైకి కనిపించదు! బ్రతుకులో కీలకం!

వర్తమానం ఆగదు, నిరంతర ప్రవాహమయం
ఆగిన వేగంతో ప్రక్కకు తొలగిన రూపం గతం!
మంచిని తలపించే రాగల కాలం! భవిష్యత్తు
జీవితం శిక్ష కాదు, ఒక సుందర అవకాశం

అగ్నిలో దగ్ధమై బూదిగ మారే సాయం సంధ్య
కల్పనలో పయనింప జేసే నావలా రాత్రి
పునర్భవంతో ఉత్తేజం కలిగించే ఉదయ సంధ్య
ఈ మూడు మానవ జీవన రూపాలకు ప్రతీకలు

నైతిక వర్తనలో ఓటమి ఒక విషాద విషయం
నీడలతో తలపెట్టే యుద్ధ రచన ఒక అవివేకం

ఓటమి లోయలోకి తోసేస్తుంది
విజయం కొండపైకి ఎక్కిస్తుంది
ఇవి రెండూ తప్పనివి జీవితంలో
తిరిగి తిరిగి సమతలంపైకి రావలసిందే

సంఘంలో తానొక పరాయి మనిషి భావన
నేలపై చూపును నింగి వైపు తిప్పుతుంది

నిజానికి ఉదయం ఒక వెల్‌కకు ఆర్చ్
గుడ్ మార్నింగ్ ప్రకటనతో వస్తుంది తొలి కిరణం

నిరాశలో ఆశ లోయ పక్కన శిఖరంలా
ఎప్పటికీ మనిషి కోసం "రిజర్వ్"లో ఉంటుంది

❈

## 12. ఎక్కడికక్కడే స్వేచ్ఛ

ఎక్కడి కక్కడే స్వేచ్ఛ, ఇష్టంలో
ఎక్కడి కక్కడే గాలి, ప్రియంగా

ఒక చోట మనసు కుసుమ గంధం విరిసి
ఒక చోట మనసు దోష చిహ్నం నిలిచి
ఎప్పటి కప్పుడు ప్రభావ పర్యవసానాలతో
ఎక్కడి కక్కడ కోరే మార్పుల భేదాలతో

నినాదాల మధ్య నిష్కల్మష త్యాగ మూర్తి
విరిసిన పద్మంలా, కొత్త దార్శనికంతో
పాలక వర్గం మరచిన హక్కుల పతాకతో
ప్రజల తలల అలలపై కదలే నావలా

పక్కన నడచే భటుల బూట్ల ధ్వని! కర్కశంగా
చేతిలో లాఠి రైఫిల్ ఏదైనా భయాన్ని దుమికిస్తూ
ఇరువైపుల నిశ్చల నిర్మాణాలు నిశ్శబ్దంగా
ముఖాన దుమ్ము క్రమ్మి! రంగు మారిన చెట్లు!

అధికారం పరమావధిగా రాజకీయ నేతలు
స్వేచ్ఛకు దుస్తులు మారుస్తూ, పలు రంగులలో
మారిన ఆశా రూపంతో నడచే దిశ మారుతూంది
ముసిరిన కోర్కెలతో మానవత మాయమవుతూంది

ఎక్కడి కక్కడ! గోడల వలె ఆలోచనలు
వీటిని కోటలుగా మార్చే యోచనలో కొందరు
ఆవలి ప్రపంచాన్ని అందుకొనే నీతిలో
తనకు మరో ప్రపంచంతో సంబంధం తప్పదు

బయటి నుండి పిలుపు వినిపిస్తుంది
పై నుండి వెలుగు ప్రసరిస్తుంది
త్యాగానికి ఫలం లక్ష్యాన్ని పొందడం
స్వేచ్ఛకు సార్థకం గమ్యాన్ని చేరడం

❃

# 13. పోస్ట్ పోన్

కాలి నడకన ఏర్పడిన మెలికల బాట
చదును చేసి సుగమంగా తీర్చిన రహదారి
రైలు పట్టాలపై ఏర్పడిన దారి
నీటిపై నావ వెళ్ళే దారి, గాలిలో విమానం సాగే దారి
దేని కది అవసరాలకు తోచిన ఉపాయాలు
మానవ సంస్కృతిలో అనుభవ రమణీయాలు

పయనానికి పగలు రాత్రి భేదం లేదు
మనసులో దారులనేకం ఆలోచనలో సాగేవి
అక్షర యానంలో పద పదం దారి పరుస్తుంది
నిప్పు రవ్వలు ఎదురు పడవచ్చు
మబ్బు ముక్కలు తోడు రావచ్చు
రెండూ అవసరమే! ఉత్తేజానికీ ఉపశమనానికీ

గాయంతో కవిత బయటికి వెడలదు
వేదనలో పొంగి పొరలి తరలవచ్చు
శబ్దంతో కవిత పని పూర్తి కాదు!
అర్థంతో ఉబికి జారి కదలవచ్చు

ఎపుడో మంటలపై నుండి దయ చేసిన కవిత
కురిసేనా? దాహం తీర్చేనా? పంటలు పండేనా?
ఏమయినా! కాకపోయినా! ప్రస్తుతానికి
జారే కన్నీటి చుక్క ఆగితే చాలు!

చేతిలో కవిత్వ పుస్తకం! బొమ్మలతో
పేజీలు తిప్పితే చదివినట్లేనా?
పరివర్తన తంత్రులు నినదించేనా?
ఆకాశం దిగి హృదయం విప్పారేనా?
ఇంతలో ఫోన్ కాల్! ఎవరో రాక! అర్జంటు పని!
చేతిలో పుస్తకం టేబిల్‌పై! కవి హృదయం తెలిసే మాట “పోస్ట్ పోన్”!

❁

## 14. 'సమాన మస్తు'

ఉదయం వస్తుంది "సమాన మస్తు" హృదయంతో
జీవన వేదికపై చీకటి తెర తొలగుతుంది
చుట్టూ వస్తువులన్నీ యథాతథంగా ఎక్కడిదక్కడ!
మందగించిన ఊపిరికి వేగం వస్తుంది
స్తబ్ధమైన మతికి ఉత్తేజం కలుగుతుంది

ఏ తీర్పుకూ లోను కాని సమస్య లేదు
ఏ మార్పుకూ లోను కాని జీవితం లేదు
పరిచయ బంధంలోనూ వైరుధ్యాలు! విభేదాలు!

రాజ మార్గం తప్పి డొంకలలో ప్రజాస్వామ్యం
ఎగుడు దిగుడు నేలపై పడుతూ లేస్తూ
దారి ఆగి పోతుంది, మరో బాట మొదలవుతుంది
తెలియని ప్రదేశంలో అనుమానపు బాణాలెదురవుతాయి
ధైర్యంతో ముందు సాగే నిపుణత అవసరం
ఉదార చరితతోనే చైతన్యానికి విజయం!

పాలితులు పాలకులు ప్రజలలోని వారే!
మనుషులనందరినీ బొమ్మలుగ మార్చాలనీ
సూది మొనంత తేడా! ఎడమై! శత్రుత,
రణ వ్యూహంలో పావుగ మారుస్తుంది!

గతం అంటే వీడని గౌరవ బంధంతో
నేడు అంటే ఎర్రని జీవన రేఖలతో
రేపు అంటే నల్లని సంశయ ఛాయలతో
అనుమాన జలాలపై నావలా జీవితం!

కత్తుల కాళ్ళపై నమ్మక మొకటే చాలదు
జన హిత హృదయంతో నడవాలిసి ఉంది,
శ్రమ శక్తికి చిహ్నమై మానుషం మెరవాలిసి ఉంది
ఇది ప్రజాస్వామ్య విజయానికి సార్థమైన గుర్తు

❋

## 15. నిదురలో యవనికపై

నిద్ర నుండి లేవగనే మనిషి
అర చేతుల లోనో అద్దం లోనో
తన ముఖం కనిపించినట్లు చూచుకోనిది
ఆ రోజు మొదలు కానట్లే మసకగా

సూరీడయితే ఉదయించే క్షణంలో
చెరువు లోనొ నదిలోనో జలధిలోనొ
ముందుగ తన ముఖం చూచుకొని
మొదటి కిరణం వదలుతాడు! సంతోషంగా

మండే బింబం! ఆ నీటి తలంపై
తళతళలాడుతుంది, హ్లాదమయంగా
అద్దంలోనయితే! మనిషి ముఖం
మతిలో ఆలోచనతో ధగధగలాడుతుంది

స్వర్గం మోక్షంపై ఆశలు బ్రతుకులో
సంఘం గురించి బాధ్యతను పక్కకు పెడతాయి
ఇవి ఆయువు పెంచేనా? కాలమే చెబుతుంది
ఆనందం! ఇచ్చేనా? వారికే తెలుస్తుంది

ఎత్తు వంపుల ఆధార తలాలపై బ్రతుకులు
పయనంలో భారం! దైవంపై మోపడం
అద్దంలో బింబంపై ఆరాటంతో శిశువు
చాచిన చేతుల్ని ఎదకు హత్తుకోవడం!

అద్దం గురించి ఊహ లేకపోయినా
కనిపించే వ్యక్తి ముఖంలో తన ముఖం!
అద్దం చేసే పని చేస్తుంది! ఆలోచనలో,
ఉదయ మయ్యేసరికి తెల్ల కాగితం లాంటి ముఖం
రాత్రి అయ్యేసరికి రంగు రంగుల బొమ్మలతో !
నిదురలో యవనికపై కనిపిస్తే కనిపించవచ్చు

❋

# 16. ఎవరి కథ వారిది

పగలు రాత్రి విభాగాలతో రోజులు రోజులుగా
గడియారంలో బంధింపబడినట్లున్న కాలం
యుగాల తరబడి ఏడాదికి ఏడాదిగా
క్యాలెండర్‌లో తిరుగుతూన్నట్లు ఉన్న కాలం
ఆయువు ప్రమాణంలో మనిషి కొక విధం
అనుభవ చలనంలో ఎక్కడా ఆగని కాలం

రాలే పూవులా క్షణం జారి పోతుంది
ఇసుకపై నీరులా క్షణం ఇంకి పోతుంది
ఎన్నిటికో సాక్ష్యంగా నిలిచి తరలిపోతుంది
ప్రేమ కథలు యుద్ధ వ్యథలు విజ్ఞానం నిర్వాకం
జనన మరణ సందర్భాలు పోరాటాలు నివాసాలు
అన్నీ కళ్ళముందే అదృశ్యమైన విశేషాలు ఎన్నో!

శూన్యాన్ని చిత్రాలంకృతం చేస్తాయి
బ్రతుకులో విలువల్ని స్థాపిస్తాయి
సార్థకంలో ప్రత్యేకత చూపిస్తాయి
ఏదీ నిరర్థకం కాదని నిరూపిస్తాయి

వెనక ఉన్న వస్తువుకై వెదకడమొక పని
చీకటిలో దీపం వెలుగు ఊహ ఒక విశేషం!

కళ్ళ ముందు రత్నాలకు బదులు
అనల రాసులు చేరిన సందర్భాలు ఉన్నాయి
గళంలో నుతులకు బదులుగ
నినాదాల బాకులు దూసిన సందర్భాలూ ఉన్నాయి

నాలుగు గోడల మధ్య బంది అయిన స్వేచ్ఛకు
విశాలమైన మైదానం లభించిన చరిత్ర ఉంది
ఊరుకు ఊరుకు మధ్య తేడా అంతగా ఉండదు
బ్రతుకూ బ్రతుకూ మధ్య తేడాతో ఎవరి కథ వారిది!

❊

## 17. ప్రేరణ శక్తులు

తనకు ఇష్టమైన వేషంలో పాత్ర కుదరదు
పాత్రలోని బరువు హరువు బ్రతుకు లోనిదే
మనిషి పట్ల ఆత్మీయం నటనలో అందంగా
నిజ వర్తనలో కాలి కింది పూవులా!

నటనలో స్వేచ్ఛ ఆ పాత్రకు పరిమితం
పరిమితులను 'మీరితే రసాభాస తథ్యం
ఒక విషయంపై ఎంత ప్రేమ పొంగినా
అవసర సమయంలో ఆమోదం ముఖ్యం!

రాత్రి అంతా మెలకువతో ఉంటే సరిపోదు
చీకటిలోను బ్రతికే ధైర్య మవసరం!

బంధనలో అభిమానం బందిగా ఉండలేదు ఉంచదు
పావురమై వచ్చి ముంగిలిలో వాలుతుంది
మయూరమై కదలి పురివిప్పి ఆడుతుంది
హంసమై వాలి సందేశం వినిపిస్తుంది
చీకటిలో వెలుగు దారి చూపుతుంది
కోల్పోయిన అమూల్యం తిరిగి దొరికినట్లు ఉంటుంది

మనిషి నుదుట తీర్చిన వెలుగు చిత్రం
అస్తితకు చక్కని గుర్తుగా నిలుస్తుంది
జీవితాన్ని నిలుపుతుంది, నడుపుతుంది
ఇంతకూ! నడవడిలో నైతిక శీలమవసరం

స్వేచ్ఛ పట్ల ఆవేశం సరిపోదు
అలంకరించి ఊరేగిస్తే సరిపోదు
అందంతో పాటు సంస్కారం విలువలా
స్వేచ్ఛతోపాటు జనహిత హృదయమవసరం

గతమొక స్వప్నం కాదు భవిష్యత్తు కల్పన కాదు
వర్తమాన చేతనకు కుడి ఎడమల అవసర శక్తులు

❊

## 18. ఏదైనా కావచ్చు

వర్తమాన సమాజం ఆశయాల నుండి
తర తరానికొక కొత్త భవిష్య దర్శనం

గమ్యానికీ గమ్యానికీ మధ్య తప్పని
వికాస భేదాలతో వేరు వేరు దారులు
రావలసిన రూపంలో నిర్ణయం ప్రజదే!
ప్రకటితమో! సూచితమో! ముందుకు వస్తుంది

ఎవరి జీవితం వారికి ప్రమాణమయినా
ఆశయాల సాధనలో జన సమ్మతి ముఖ్యం
రోజు గడచి రోజు ప్రగతికి చర్యలతో
ఆరోహణలో శిఖరం నుండి శిఖరంపై కోరిక!

సమస్య లెన్నో? పరిష్కార యోజనలన్ని!
ఆ సమయంలో సమస్య కారాదే మనిషీ!
శౌర్యం నుండి అనల శిఖలు విసరుతూ
కరుణ నుండి బాష్ప జలం జారుతూ
ఎదురుగ వస్తూ మనుషులు, క్రాస్ అయి పోయేరు
ఏ రసానికీ లోపం లేని ఇతిహాసం తలపిస్తుంది!

మంచిలో రోజులు విప్పారిన మొగలి రేకులు
ప్రక్కనే తోడుగ ప్రకృతి శక్తి సౌందర్యం
కలుషమై జటిలమై వికారమై సమాజం
మనుషుల అస్తితలు పరీక్షకు గురి అయ్యేను

పద పదాన గుణంతో అణువణువున శక్తితో
సృజన స్వేచ్ఛలో మార్పుకు 'ఛాన్స్' సమంగా
శాంతి చక్రం తిరుగుతూ స్వాగతం చెబుతుంది
ఉగ్ర వాదం ఖడ్గమై రుద్రమయం కావచ్చు

నిశ్శబ్దం నుండి శబ్దానికి కవిత! చేతన కళతో
కవికి నచ్చిన విధంగా, జనత హృదికి హ్లాదంగా

❃

# 19. తరగని అందం గంధం

ప్రసారమాన సంస్కృతి ఘనీభవించిన రూపం
ఆకర్షణ శక్తి నిండిన మహనీయుల విగ్రహం
చూపు పడిన మనసును తిప్పుతుంది ఎక్కడెక్కడో
గతంలోకి ప్రవేశపెడుతుంది మౌనంగా
వర్తమానాన్ని మరపిస్తుంది
గతానికి వశం చేస్తుంది

మనిషి జీవ కణాలలో పురా సంస్కృతి రూపం
అపుడపుడు కాస్త కాస్త బయట పడుతుంది
అడవి నుండి ఊరు వరకు అనుభవ ముద్రలతో
చిన్న పాటి మ్యూజియం మదిలో మెదలుతుంది

విగ్రహాల వెనక నుండి అనుపమ వ్యక్తిత్వాలు
చూచే ప్రతి మనిషిలో అనుకోని విశేష శిల్పం
తీగెలా అల్లుకొని ఆలోచన పూలను అందిస్తుంది
మబ్బులా కదలుతూ ఊహలు ఆర్ద్రత కూరుస్తాయి

ఇంటి ఆవరణంలో నాటిన పూల మొక్క
అందం గంధం ఆ మేరలలో నియతం కాదు
చూచే ప్రతి చూపును అందం అలరిస్తుంది
ఆవరణం దాటి గంధం ప్రసరిస్తుంది

ఇంట్లో హేంగర్‌కు భద్రంగా తగిలించిన బ్యాగ్‌లా
ప్రతి మనో నిలయంలో స్మృతి విశేష సంచిక
బ్యాగ్‌లో ఏముందీ? అందరికీ తెలిసేది కాదు
అమూల్య మేదో ఉంటుందని కొందరి నమ్మకం

జీవన గమనంలో ఆకర్షణ కేంద్రమై
సమాజ వేదికపై అక్షర విగ్రహం!
మూల శక్తిలో అపూర్వ జీవ కణంతో
తరగని, అందాన్ని గంధాన్ని పంచుతుంది

❃

# 20. తప్పని పని

శూన్య ముఖం ఎదురు చూస్తూ ఉంటుంది
అంకెలు చేరాలని విలువలు పెరగాలని
ఈహ తరువాత ఈహ అలలా వస్తూనే
లోతు తెలియని సముద్ర రూపం జీవితం

విసర బడిన రాయి తగిలి బాధ అయినా
గాయం లోలోన ప్రతీకార చేతన పుష్పిస్తుంది
నడవ గలిగి నంత మాత్రాన సరిపోదు
దారి దొరికి తన గమ్యం చేరాలిసి ఉంటుంది
ఏకాంతం కరిగి అదృశ్యమై పోతుంది
సమాజ దృశ్యంలో ఒకటయి పోతుంది

భయంతో మనిషి గతంలోకి పరుగెత్తేను
రాగల కాలాన్ని కల్పనతో నింపు కొనేను
రాత్రి కదలుతుంది జలధిలో పడవలా
పడవలో మనిషి! ప్రయాణ విరామంలో కునుకు తీస్తూ

గళం నుండి సుస్వరంతో మనసు నుండి మానవతతో
కొత్త మనిషి! ఉదయం! జీవన పరివర్తనలో

వాన మాట్లాడుతుంది సమాజంతో
చినుకు మాట్లాడుతుంది వ్యక్తితో
వాన విలువ విశ్వమయం
చినుకు విలువ ప్రాణ సమం

నీటిపై రాతను గాలి చెరపేస్తూ పోతుంది
కొత్త రాతలకు జగా చూపి పోతుంది
మట్టిపై అడుగులపై అడుగులు పడుతూ
మారుతుంది రూపం! గుర్తు పట్ట రాకుండా

ఒక సమయం యంత్రంలో పార్టు పని చేయదు
అది సరి చేయబడి, పని చేయించక తప్పదు

❋

## 21. అమూల్యం

శిలాత్వం మనిషి స్వభావం, కాదు
నదీత్వం బ్రతుకు స్వభావం, అవును
నీరు ఉన్నా లేకపోయినా
ఇసుక వేసినా బురద చేరినా
వేగవంతమయినా మంద చలితమయినా
దాట గలది అయినా దాట రాని దయినా

నదిని హ్లాద పరచే వాన చినుకు బదులు
ఉష్ణ స్పర్శతో తప్పని చలనం బాధాకరం,
ప్రభావ రూపంలో చుట్టూ మంటల దృశ్యం
జరగ రాని సందర్భం! పొంద రాని అనుభవం

రాత్రి చెక్కిలిపై జారుతూ ఆగిన
బాష్ప కణం చంద్రుడు! సానుభూతి నిలయం,
గాయపడిన హృదయానికి ఆప్తం!
వేదనలో మనుషుల సందేశానికి సిద్ధం

అగ్నిదీ ఆయుధానిదీ లక్ష్యం ఒకటే
నడతలో వీటికి తిరుగు లేదు
ఒకే మాట! ఒకే అర్థం! ఒకే లక్ష్యం
మృత్యువు వాహన రూపాలై! వర్తిస్తాయి

పొద్దునే రవి బింబంలో ముఖం చూచుకొని
కదలుతుంది ఉగ్రవాద గోళం
చంద్రునిలో ముఖం చూచుకొని నిద్రిస్తుంది శిశువు!
ఒకరు వర్తమానంలో దూకితే
ఒకరు భవిష్యత్తును వరించేదు

రాత్రి స్థానంలో వచ్చిన పగలు వెలుగులో
వెతకగా వెతకగా శిథిలాల నుండి ముక్కలైన నిజం
బయటపడీ, తిరిగి కొన్ని కలపబడీ మనోజ్ఞంగా
కవితలో కనబడేను, కాలానికతీతమైన అమూల్యం

❋

## 22. చీకటి స్తంభాలై

వ్యక్తి చేతిలో ఆయుధ సంస్కృతి ప్రమాదకరం
హింసకు ఉద్రేరణలో వశం తప్ప జేస్తుంది
వ్యక్తి నుండి ఆయుధం దూరమైన సమాజంలో
క్రియలో విరామం ఆవేశం పొంగును తగ్గిస్తుంది

వంచన రాలేదు నేరుగా సూటిగా
చాటు చాటుగా ముసుగుతో పని చేస్తుంది
చర్యలో స్వార్థం కాళ్ళకు సంకెల వేస్తుంది
తన వెంట తిప్పుతుంది, తన పని చేయిస్తుంది

జలధిలో చరణాలను అలల వెనక్కి పంపుతాయి
గట్టుకు చేరిన మనిషి శక్తి మానసికం
వనధిని దాటే దృఢ సంకల్పంతో

గగనంలో సంచారం చేయాలని కుతూహలం
అయితే పాదాలను భూమి సులభంగా వదలదు
రక రకాల వాహనాలు మనిషి వైపు చూస్తూ పోతాయి

కులం ప్రసక్తి లేని ప్రజాస్వామ్య సమాజంలో
కులం పేరు లేకుండా అడుగు కదలడం లేదు
లేబిల్ సమస్య అందరికి! జటిలమై విపరీతమై
బ్రతుకును అమాంతం సుడిగుండంలోకి దింపుతుంది

మనిషి స్తంభం కాదు శిలా ఫలకం కాదు
వివేచన గుణంతో, సమస్యకు జవాబు సులభం

ఆలోచనలో ఆదర్శం సక్రియలో పోరాటం
రెండూ సమాజాన్ని నడిపించే చరణ యుగం

చీకటిలో నిలిచిన స్తంభం భయపెడుతుంది
అదే! వెలుగులో ఆధారంగా తోస్తుంది
మనుషులు! నిలువున చీకటి స్తంభాలవడం విచిత్రం
విచిత్రాలతో షోకేస్‌గా మారలేదు కవిత్వం!

❋

## 23. అమాయకం

కవిత్వ రుచి తెలియని వారు లేరు
కవిత్వ రుచి కోరని వారు లేరు
ఏ భాష అయినా ఏ దేశమయినా ఏ మతమయినా
అనుభవ మొక జలధిలో అలను పట్టుకోవడం

సుముఖ మయిన విముఖ మయిన అలీన మయిన
మనసులో సరికొత్త నిలయ మేర్పడుతుంది
అనుకున్నవి అనుకోనివి వస్తువులు చేరతాయి
ప్రజాస్వామ్య స్వేచ్ఛలో ప్రశ్నించే హక్కు పుష్కలం
సమాధానం దొరికినా దొరక్క పోయినా
విమర్శకుల బాధ్యతలను విస్మరించనీయదు

నిశ్శబ్దంలో శబ్ద వాహనం కదలుతుంది నిర్భయంగా
ఆకాశాన విమానంలానో జలధిపై నావలానో
బుట్టలో పూవుల్లా ఎందరినో గమ్యం చేరుస్తుంది
మనసులో అనుభవ పరిమళాన్ని నింపుతుంది

ఆరోహణలో నిచ్చెన ఒకటే సరిపోదు
అది నిలిచే ఆధార తలం అవసరం
కవితను ప్రేమించే వ్యక్తికి హృదయ మూల మవసరం
విద్యుత్తూ విస్ఫోటమూ తెలిసేది, ప్రభావాల అనుభవాలతోనే

టేబిల్‌పై ఆహారం సిద్ధమై అతిథి రాలేక పోవచ్చు
శూన్యంలోకి చూస్తూ మిత్రుని రాక పోస్ట్ పోన్ కావచ్చు

మస్తిష్కశాలలో కిటికీ నుండి చకితంగా మెరపు
కళ్ళలో ప్రతిఫలించి గుండెలో సరించి
మెలకువపై పట్టుతో! ప్రయోజనం ఫలించవచ్చు
అన్వేషణలో సృజనకు కొత్త దారి దొరకవచ్చు

ఎదురింటి గేటు ముందు పదును చూపుతో 'క్రిటిక్' తారాడుతూ
అడ్రసు గుర్తులేకో, దారి తెలియకో, 'కీ' మరచి పోయో

❃

## 24 ఆశయ శిఖరం

ఆశయ మొక నిశ్చయ గమ్యం వరిస్తుంది
ఆశా మార్గాలలో మానవ పయనం
ఆశా రూపాల్ని బట్టి ఆశలు! తీరుతీరులుగా
జీవన వ్యూహంలో వ్యవహారపు టెత్తులతో
వదలిన బాణం ధ్వనికి పక్షి తప్పుకుంటుంది
జారే క్షణాన్ని ఒడుపుగ పట్టు కుంటుంది

ఆశయ శిఖరం చేరే దెందరు? బ్రతుకులో
ఏదో తక్కువగా అతృప్తిగా ఇంకా మిగిలి!
అందబోయే, అందుకో బోయే క్షణం
రెడ్‌లైట్! ఫుల్‌స్టాప్! బ్రేక్! ఏదైనా కావచ్చు

ఆశయ నిలయం కనిపించే దూరం నుండి
చూస్తూ దగ్గరవుతూ గమ్యం చేరబోయే అనుభవం!
దగ్గరై ప్రవేశం పొందడమొక సమస్య
అనుకున్నది నెరవేరడమొక ఆరోహణ రమణీయం

కవిలో కవిత అక్షరాల తొడుగుతో
బయటికి రాగానే వేరై విడిపోతుంది
తల్లి గర్భం నుండి శిశు రూపంలా
ప్రియ బంధం మిగులుతుంది స్వయం వ్యక్తిత్వంతో

నర్తకి నుండి నర్తనం వేరు కాదు
ఆచరణంలో రెండూ ఒకటయి పోతాయి
ఆధారం ఆధేయం పటమూ చిత్రంలా
బ్రతికినంత కాలం ఒక సుందర వాస్తవం

ప్రతి కవిలో తన కవితకు స్వయం నిర్వచనం
ప్రతి మతిలో తనదైన దిశా దృక్పథం,
గమ్యంపై ఆలోచన! సూచనగా ప్రేరణగా,
సహృదయ లోకంలో ఒక్కొక్కరిలో ఒక విధమైన ప్రభావం

❊

## 25. ఆశయ చిహ్నం

ఒకరిని రూపు మాపే పనిలో మరొకరు
వారిని తుడిచి వేసే పనిలో మరొకరు
అన్నిటినీ ధ్వంసం చేసే పనిలో ప్రకృతి
ఇదొక ఆవర్తం! ఆశయ చిహ్నాలతో!

బొగ్గు నిప్పయి మండి బూది అయ్యేదాక
ప్రభావ రూపాలెన్నో బ్రతుకులో వాస్తవాలు

దారి కిరువైపుల మంటలు నాటే పనిలో కొందరు
హృదయంలో కదలే జలద పంక్తులతో కొందరు
చలికాలం మంట అవసరం! తత్కాలికం
జలద గమన మవసరం! దప్పికలో వేదనలో

జన్మ నుండి ఒంటరి తనం లేని వాతావరణం
తల్లి తండ్రి పరివారం చుట్టూ ప్రకృతి రూపం!
పెరిగే శిశు దశ నుండీ సమూహాలతో సంబంధం
మనసు ప్రపంచమవుతుంది, సమాజ శక్తి పొందుతుంది

చితి మంటల నకళ్ళు, పొదలయి కనబడడం విషాదం
వైతరణీ నది పాయ లిచట కనిపించడం విచిత్రం!

ఆశయ చిహ్నాలొకటొకటీ! పదపదాన కాళ్ళలో
గుండె నిబ్బరంతో సాహస చక్రం! తిరుగుతుంది
ఆరోహణలో పొరబడితే జారితే ఆ క్షణంలో
లోయలో పడి పోవడమే, మృత్యు నిలయం చేరడమే

తాగేందుకు నీరు దొరకని ఈ స్థలంలో
బాధల కన్నీరుకు తక్కువ లేదు
విమర్శల నిప్పు రవ్వలకు కొదవ లేదు
ఇవి క్రోధానికి తేజం తెచ్చేనా?
బూడిద ముఖానికి అందం చూపేనా?
ఇవి దేనికి? సహకారానికా? సానుభూతికా?

❊

# 26 ఆశయ సాధనం

షర్టు మార్చినంత సులభంగా పార్టీ మారడం
ఒక వ్యాపార సరళిలో ప్రజాస్వామ్య విభవం!
నీలి రంగు ముఖంతో ఎదురుగ నైతిక రూపం
గాయపడిన హృదయంతో చరిత్ర పుట రెపరెపలాడుతుంది

మనిషి స్వేచ్ఛ దురుద్దేశ దురుపయోగ క్రియలతో
వ్యక్తి హక్కు కుటిల మతుల జటిల గతుల వరుసతో
ఇది భ్రష్టమౌ సమాజ దశకు చిహ్నం
నడుస్తూన్న రాజకీయ సంస్కృతికి కళంకం

మనుగడకు ఆధారం! మట్టి అయినా
మనిషి బుద్ధి బురదకు దూరమవడ మవసరం
మనిషి ఒక మొక్క కాదు, మానస చేతన రూపం
అణువు నుండి విశ్వానికి ఘన యశోమయం

ఏ క్షణం నడవదు ఏ క్రియ లేకుండా
దాని మంచి చెడులు! మానవ వర్తన పర్యవసానం
ఉక్కిరి బిక్కిరియై ప్రాణం! కష్టపడే స్థితిలో
కల్మష వాతావరణంలో పవమాన చలన మవసరం

సాయం సమయంలో వీడ్కోలు పొందే సూర్యుడు
మర్నాడు ఉదయం స్వాగత మందుకునేను
ఒక ఘట్టం నుండి విరామంతో మనిషికి
మరో ఘట్టంలో పాత్ర అంత సులభం కాదు

భౌతిక రూపానికి చివరి వీడ్కోలు తప్పదు
ప్రియ భావనలో యశోమూర్తికి ఆదరణ లభిస్తుంది
లలాటాన కృతజ్ఞ రేఖతో సమాజం!
మిగిలిన కర్తవ్యాన్ని ఏకీకరణ దృశ్యం బోధిస్తుంది
సంక్లిష్ట జీవితంతో నలిగిన చరిత్రతో కాలం!
సంక్షుబ్ధ సమాజంలో సంశ్లిష్ట కవిత్వం! తప్పదు

❋

# 27 ఆశయ గమ్యం

మాటల పోగులతో నేయడం కవి పని అనుకుంటే
ఇది కవితకు వస్త్రం కావచ్చు సన్మానంలో శాలువ కావచ్చు
అవసరాల కయినా అలంకారానికయినా మరి దేనికయినా
కవి సంకల్పంతో ఒకటై పోయే అంతరంగం ముఖ్యం

ఎవరి నుండి దార్శనికం ఏ దిశలో వచ్చేదయినా
కవి అనుభూతి రసంతో కవితయై నిలుస్తుంది
మనిషి శక్తి మూలమై మనో గుణ విశాలమై
సమాజ రూపానికి కొత్త దనం తెస్తుంది

మనిషి మనీషి కావడం కొంత కష్టంతో సాధ్యం
మనిషి మనస్వి కావడం నీతి చరిత తోనే
అన్వేషణలో మనిషి, దారి తప్పి పోవచ్చు
తన పని మరచి, మరో పనిలో చేరవచ్చు

పేదరికం పాములా చుట్టుకొని భయపెడుతుంది
అసహనం గద్దలా తలపై ముక్కుతో పొడుస్తుంది
తిరుగుబాటు జనత నుండి వచ్చే అవసర ఘట్టం
యుద్ధం ప్రభుత్వం నుండి వచ్చే సాహస కార్యం

పోరాటం! ముగుస్తుంది, పాత సమస్యల పరిష్కారంతో
యుద్ధం జరిగిపోతుంది, కొత్త సమస్యల వలలు విసిరి,
పోరాటంలో హింస కొన్ని పరిమితులలో
యుద్ధంలో హింసకు పరిమితులేవీ ఉండవు!

పొలంలో పని చేసే కర్షకునికి మతి కెక్కదు పోరాటం
యంత్రాగారంలో కార్మికునికి! ఇష్టం కాదు యుద్ధం
పయనంలో ముందుగ గమ్యం తెలిసిన మనిషికి
నడకలో గమ్యానికి భూమి దారి ఇస్తుంది
దారిలో కొండలు! ప్రవాహాలు ఎదురయితే
అన్నిటినీ పలకరిస్తూ ఖాళీ కాగితంపై సంతకంలా అడుగులు

❃

## 28

రాత్రి వస్తుంది జంకు గొంకు లేకుండా
పొందిన పిత్రార్జితమైన ఖజానా తలపిస్తుంది
చుక్కల నాణేలతో వెన్నెల సిరులతో
బయటపడీ ఇంకా దాగిన గౌరవ నిధులెన్నొ!

అద్దం  అబద్ధం చెప్పదు
చీకటి రహస్యం విప్పదు
అర్థ మవని అనువాద కవితలా చీకటి
దీప సహాయం కోరడమొక అవసరం

ప్రేయసి ఆగమనం స్పష్టంగా కనిపిస్తుంది
తన ముఖం వెనకబడీ! ఆమె ముఖం అద్భుతంగా

రాత్రి బహు ఆత్మీయంగా ఉంటుంది
విరామ వేళ అసలు వదల బుద్ధి కాదు
పగలు ఒంటరిగ నయినా గడుస్తుంది సులభంగా
రాత్రి అవడంతో మనిషి తోడు! తప్పదు

క్లాసులో పిల్లల నిశ్చల నయనాల వలె చుక్కలు
చూస్తూ ఉంటే ఇంకా ఇంకా చూడాలనిపిస్తుంది
చుక్కలలో గతాసువుల ప్రేమలు
వెన్నెలలో చిరాయువుల ఆశలు

విలు విద్యలో రాత్రి శబ్ద వేది కళతో
చీకటిలో లక్ష్యం ఛేదించిన గురిలో
ప్రవీణతకు పరీక్షగా ప్రతిభకు సాక్షిగా
చీకటిలో విజయ స్వరం బాగా వినిపిస్తుంది

చీకటిలో దూరాన ఎగసిన మంటల దృశ్యం
ఉగ్రవాదం, ఉనికి చిహ్నం ! కనబడి పోతూంది
నిందకు గురి అయ్యే చీకటి, నిజం రుజువు చేస్తూంది
మరో హృదయ స్పందన! హృదయానికి జత అవుతుంది

❋

# 29 శాంతికై

ఉషస్సు వస్తుంది! అంతరంగ ప్రకాశ రూపం
శుచిగా శుభ్రంగా అందంగా ఆత్మీయంగా
మనిషి లేచి నడక మొదలు! అవసరమయితే పరుగు!
షార్ట్ కట్ అవలంబించవచ్చు! కాలానికి షార్ట్ కట్ లేదు
కాలం ఆగదు ఎవరి కోసమూ ఎక్కడా
దాన్ని అందుకొని సాగే అవసరం మనిషిదే

మనసు నిలవదు, శాంతికై అన్వేషణ! తనువు నాశ్రయిస్తుంది
ఎవరి పనులలో వారు! జనాలోల సంరంభం! సముద్రం!

సముద్ర తీరం చేరితే! అలల హెూరు! లో
అలజడి ఆక్రందన హాహారవం! సమ్మేళనం!
ఎంత కష్టంలో ఉందీ ఇట్టే తెలిసిపోతుంది
ఉన్న స్థితిలో మరేదీ తలపుకు వచ్చే వీలు లేదు
నీరు! నీరు! చూపు మేర నీరు! దాహం తీరేనా?
పంటలు పండేనా? కరువులు తొలగేనా? శాంతి లభించేనా?

రైల్వే స్టేషన్ చేరితే ప్రయాణికుల కోలాహలం
అడుగు వేయనీయకుండా! అడుక్కునే వాళ్ళు
దరిద్రాన్ని దారికి అడ్డంగా దడి కడుతూ,
స్టేషన్‌లో బెంచి కింద ముడుచుకొని ఒకరు!
బెంచిపై కూర్చున్న వ్యక్తి జేబు కత్తిరించేనా?
అనుమానం పెను భూతం కాదు, ఇపుడు సన్మిత్రం!

సినిమా కెళితే! శాంతి ముక్క దొరుకుతుందనీ
చివర దొరకే సందేశం ఏమో కాని! స్క్రీన్‌పై
పడరాని పాట్లు! చూడరాని సీన్లు! ముఖాన విసరే అలల వలె!
మనిషిలో వికార రూపానికి పట్టం కడుతూ! దృశ్యాలు
శాంతికై బయలు దేరి తిరిగి తిరిగి ఇల్లు చేరి
నాలుగు మెతుకులు కడుపులో పడితే చాలుననీ, శాంతికై

❃

# 30. ప్లస్‌లో జీవితం

బడి నుండి వస్తూనే చదువుల బరువు
వరండాలో వదిలేసి లోపలికి పరుగెత్తే
లే లేత కళిక తన బ్యాగ్‌ను,
ఈ అవకాశానికి స్మిత వదనంతో
లోపలికి చేర్చే పెద్ద దిక్కు! పరిణత రూపం!
ఎప్పటికీ జ్ఞాపక సింహాసనంపై కూర్చొని!

చిన్ననాటి  ఇల్లూ ఊరూ మనసు నలంకరిస్తాయి
ఎప్పటికీ కొత్తగా జ్ఞాపకాల ఊయెలపై ఊపుతాయి

సుఖంలోనే కాదు కష్టంలోనూ కాలం గడుస్తుంది
బయట చెట్టు నుండి రాలే ఆకు ఊరట నిస్తుంది
కొమ్మకు భాగ్యమైన ఆకు శోభ! తృప్తిని ఇస్తుంది
తరాజులా మనసు అటూ ఇటూ సృజన విలయ రూపాలతో

పూవు రాలి పడుతుంది! ఎవరూ బాధ పడరు
కొత్త పూవు నవ్వు ముఖం! అందరికీ  సంతోషం!
జ్ఞాపకాల వెలుగు నీడలు వస్తూ పోతూ
అల్లరి పిల్లల్లా చుట్టు చేరతాయి వేళ పాళ లేకుండా

కిటికీలు సగం తెరచిన ఇంట్లో! ఆయువు దీపం
నిశబ్ద సంచారంలో మౌన రశ్మి ముఖంతో
తనకు తోడు గంటలు కొట్టే మాటలతో గోడ గడియారం
ఉండాలిసినవి లేని సమయంలో! ఇదో ప్రియ సూచిక
నిశబ్దాన్ని ఛేదిస్తూ మౌనానికి వెలుగు స్పర్శ నిస్తుంది
కాలాన్ని జయించే ధైర్యానికి తోడుగ నిలుస్తుంది

మెడలో హారంలో కూర్చిన ముత్యాల్లా క్షణాలు
అన్నీ ఒకే మోస్తరు! తెల్లగా హ్లాదంగా స్వచ్ఛంగా
మంచి చెడు జీవితంలో! చెక్కిలిపై బాష్ప బిందువు
ఆనంద రూపమా? వేదనా చిహ్నమా? ప్లస్+మైనస్‌తో ప్లస్‌లో


❊

స్వేచ్ఛా కవిత్వం-71

# ఇదే దారి

## (దీర్ఘ కవిత)

మాదిరాజు రంగారావు



2016

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

# IDE DAARI

## Sveccha Kavithvam

(Free-Verse Poetry)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

*Presented to*

*my wife*

**Smt. M. Indira**

*on her Birthday*

*28th March*

# పీఠిక

"ఇదే దారి" దీర్ఘ కవిత. చిన్న కృతి. కవిత్వ పరిమితుల్లో కవి దృక్పథంలో ప్రణాళికా బద్ధమైంది. స్వేచ్ఛా కవిత్వంలో నేను విశ్వసించే "ప్రజా స్వామ్య సామ్యవాద" దార్శనిక ఛాయల్ని కలిగింది. అందువల్ల సామాజిక రాజకీయ విషయ ప్రసక్తి అనివార్యం. దీనికి తోడు మానవ మనస్తత్వ కోణమూ కలిగింది. వీటికి సంబంధించిన భావనలో అభివ్యక్తిలో కళాత్మకతను పొందింది. వాక్య రచనతో పాటు భావరూపం ప్రతీకలతో సంపన్నమయింది. నవతను భావింపజేస్తూంది.

ఇది ఈనాటి వర్తమాన సందర్భాల్ని గుర్తుకు తెస్తుంది. దీని ఆవిష్కారంలో కవి దృష్టి భిన్నమైంది. దార్శనికంలో నైతికమైన విలువలకు ప్రాధాన్యంతో పరివర్తన దిశగా అభ్యుదయ మార్గం లక్షితమయింది. ఈ దీర్ఘ కవిత ఆధునిక స్వేచ్ఛా కవిత్వ పరంపరలో భాగమైంది, తన ప్రత్యేకతను నిలుపుకొంటూంది. ఇది విశిష్టంగా ఉండడంతో రచనకు స్థాయి సిద్ధిస్తుంది 1) మనిషి – జీవితం 2) సమాజం – లక్ష్యంలో విలువల్ని గురించి ఆలోచన స్ఫుటంగా కనిపిస్తుంది. మానవ హృదయానికీ ఆలోచనకూ ప్రాధాన్యమిస్తూంది. మొత్తం సమాజానికి సంబంధించిన పరివర్తన స్పృహనూ పై స్థాయికి చేర్చే ఉత్తమ వ్యక్తిత్వానికి ప్రేరణగానూ నిలుస్తుంది. మానసిక వికాసాన్ని కలిగిస్తుంది. కొత్త ప్రపంచం పరిచయమవుతుంది.

ఇందులో 1) సామాజిక స్పృహతోపాటు ఆంతర చైతన్యం 2) వ్యక్తి వికాసంతో పాటు మనిషి అస్తితకు సంబంధించిన విశాలత విశ్లేషణ కందుతాయి. ఈ కాలంలో ఎంతో వైవిధ్యంతో అడుగులు వేస్తూన్న కవిత్వంలో, ఇది వర్తమాన సమాజ స్పందనంతో మానవీయ భావనతో జీవన రూపాన్ని ఉత్తమమైన విలువలతో కూడిన ప్రగతి లక్ష్యంగా తీర్చబడింది. "ఇదే దారి" ఇప్పుడున్న దేశీయ స్థితిగతుల్ని బట్టి అంతర్జాతీయ పరిస్థితుల్ని బట్టి ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికతతో ప్రకాశిస్తూంది.

"ఏ సమస్యలేని బ్రతుకు లేదు ఆరాటం లేని మనసు లేదు"

ఇది హృదయ స్పందనతోపాటు వివేచనా ప్రకాశమూ ఉత్తమ కవిత్వానికి అవసరమన్న భావనకు బలమిస్తుంది.

– మాదిరాజు రంగారావు

## 1. దారి ఇదే

ఇదే దారి ఇదే!
మరో దారి లేదు!
ప్రగతి భావ చలనంతో ఊపిరిలో
ప్రజాస్వామ్య సామ్యవాద లక్ష్యంతో

దూరమెంత నడచింది కన్న
దూరమెంత నడవాలో ముఖ్యం

బద్ధమైన స్వచ్ఛమైన దార్శనికం వెలుగులో
సానుభూతి హృదయంతో సానుకూల చరణంతో
శత్రుత తెలియని మిత్రతతో జనహిత మొకటే

భయమూ బాధలు ద్వేషం మోసం పీడనలో
బ్రతుకును కాపాడుతుంది నైతిక వ్యక్తిత్వం
ఈ మనోజ్ఞ పథంలో నవ సమాజ భవితవ్యం

వేరు వేరు భావ స్థానాలతో సమాజం
చింతనలో సక్రియలో సృజనకు ఆధారం
ఎవరి కథ వారిది సందేహం లేదు
వ్యథ మాత్రం కష్టం తెలిసిన వారందరిలో

ఎవరి నడక విధం వారిది అయినా
ఇతరులతో కలిసి పయనం తప్పదు

క్షణం వెనకనే వస్తుంది మరో క్షణం
రోజు వెనకనే వస్తుంది మరో రోజు

పాతవి మార్పులతో గడుస్తుంది జీవం
కొత్తవి చేర్పులతో నడుస్తుంది సమాజం

ఏ మనిషి కామనిషి పెట్టెలోని వస్తువు కాదు
ఏ పుటకాపుటలో చరిత్ర! ముక్కలుగా నిలవదు

❄

## 2. మలుపులలో

నాలుగు గోడల మధ్య నుండి జీవితం
బయటి ప్రపంచంతో సంబంధం విస్తరించి
విశ్వ జనీన మవుతుంది
స్థాన చలనం పొందొచ్చు

ఈ విశాల పృథ్వీపై సమాజ పరివర్తనలో
ఎవరి మార్గ మేదయినా శ్రమ ఫలం అందరిదీ

గాలి కలుపుతుంది ప్రాణ సూత్రంతో అందరినీ
వెలుగు దిద్దుతుంది జ్ఞాన రేఖలతో జీవితాన్ని
నీరు కలుపుతుంది ఆర్ద్ర భావనతో ఎందరినో
భూమి నిలుపుతుంది వాస్తవ తలంపై ప్రతి ఒకరిని

అంతరంగ స్పందనతో మానవీయ రూపం
వేరు వేరు రంగులలో ప్రకటిత మవుతుంది
పలు దారులతో మనిషికి హద్దులు చూపుతుంది
పలు గాథల అల్లికతో ఇతిహాస మవుతుంది

ఉత్సాహం ఉద్వేగం పరియోజన ముప్పేటగ
పురోగమన రూపానికి అస్తిత కూరుస్తాయి
కిశోర దశలో మొదలై విశాలమై సుదీర్ఘమై
అనుభవ గతిలో బ్రతుకొక ప్రయోగశాల అవుతుంది

దారికి ఒక వైపున ఎత్తుగ నిలిచిన
స్తంభాల తలలపై వెలిగే దీపాలు
రాత్రులు నిర్భయతకు దారి చూపుతాయి
మనిషి చూపు కొక మనోజ్ఞ కళను అద్దుతాయి

రాత్రి పగలు భేదం మనసుకు లేకపోయినా
పరిస్థితుల మలుపులలో సాగుతుంది ప్రవాహం

❋

## 3. కవితలు పాత్రలుగా

కురిసే చీకటిలో వెలుగు గొడుగు దీప హృదయం
ఆ సమయంలో కొత్త ఊహ మెదలుతుంది మదిలో
పగలును మరపించే నును మెత్తని వెలుగులతో
ఉద్వేగం తగ్గి గుండె! శాంతిని వరిస్తుంది

దారికి ఇరువైపుల నిలయాలు నివాసాలు మౌనంగా
ఎక్కడ తిరిగినా రాత్రికి ఇల్లు చేర వలసిందే
మెరసే చుక్కలతో పోటీ పడుతూ దీపాలు
గాలి కదలుతుంది చల్లగా విరామ సందేశంతో

ఉదయంతో రెప్పలు మూతబడే దీపాలు
ఇపుడైతే భయాన్ని దూరం చేసే చూపులతో
అందరిపై సమ భావనతో వెలుగు నిస్తాయి
ప్రతి ఒక్కరి పనికి స్నేహ హస్త మందిస్తాయి

కాస్త కాస్త దూర దూరంలో దీపాలొకటొకటి
దేని కదే వెలుగులతో డ్యూటిలో భటుల్లా

కొన్ని బల్బులు సన్నని మసి కణాలతో
కొన్ని బల్బులు పల్చని ధూళి పొరలతో
మసక మసకగా అపుడపుడు డిమ్‌గా
మానసికంగా క్రుంగిన మనిషి ముఖంలా

ఒక మలుపులో భద్రతలో బాధ్యత పెరిగి
అందని ఎత్తు నుండి నేలపై ఆలోచనతో
ఎవరు తమను చూచినా చూడక పోయినా
తాము మాత్రం అందరినీ కనిపెడుతూ ఉంటాయి

సహృదయ లోకం మదిలో దీప స్తంభాల్లా
కవితలు! వెలుగులతో స్థిర పాత్రలుగా

❋

## 4. నిరీక్షణం

మనసుకు లేదు విరామం, నిదురలో లభిస్తుంది కాస్త
అందునా అపుడపుడు కలలు! చేరతాయి కాలక్షేపంకై
ఇష్టమైన పనిలో శ్రమకు విరామం లేదు
ఏ శ్రమ అయినా అన్నీ! సమాజ భాగ్యానికి దారులే

దైహిక మానస స్థాయిల్లో పలు విధాలుగా
వికాస సమాజంలో ఇంకా! పేదరికం ఖాళీలు

గాలి కదలుతుంది వ్యాపించే వర్తనతో
ప్రతి మనిషి హృదయంతో మాట్లాడుతుంది
ఇదొక అనుభవ రమణీయం బ్రతుకులో
మనో భూమికలో సుందర లోకం చిహ్నం

గాలిలో కదలే ధ్వనులెన్నో! ఎప్పటికీ
పిలుపు నుండి ఏడుపు సందడి వరకు
శబ్దం నుండి నాదం సంగీతం వరకు
ఇష్టమైంది వినిపిస్తుంది! ఆపై, దేని దారి దానిదే!

బంది పోటు దొంగల అలజడి శబ్దం వేరు
నినాదాల శబ్దాలు వేరు, బాధా స్వరాలు వేరు,
అన్నిటికీ ప్రకటన కవకాశం ప్రకృతిలో
అన్నిటికీ స్పందన కవకాశం కవితలో

బీటలు వారిన క్షేత్రంలో చినుకుల వలె
పేదల బ్రతుకులలో భాగ్య కణాలకై,
మనసులో నాటిన నమ్మకం మొలకెత్తే
వాస్తవ దృశ్యంకై నిరీక్షణం ప్రతి చోట!

దార్శనిక ప్రకాశంతో శ్రమ గౌరవ భావనతో
వర్తనలో పెరిగిన మానవ దశ తోనే భాగ్యం!

❊

## 5. భవితకు సుగమం

సమాజ స్పృహకు అతీతం కాదు కవిత
నేల వదలి అడుగులు సాగవు
ఒక స్థితిలో కల్పన కవకాశం విశాలమై
సూది మొన నుండి పర్వత పంక్తిగ మారవచ్చు

ఎంత మంది నడచినా ఆ వచ్చే వారికై
ఎప్పటికీ చేయి చాచి సిద్ధంగా దారి
ఎవరి పాద ముద్రలు నిరాకరింపబడవు
వీరునివీ భీరునివీ నేతవీ పేదవీ అన్నిటికీ స్థానం!

ఎందరు చేరినా ఆశ్రయమిస్తుంది అవని
పచ్చని హృదయానికి అదుము కుంటుంది
స్థలం నుండి స్థలానికి మనిషి తన భాగ్యంకై
కష్టంలోను జీవన రుచితో మానుష బంధంతో

డబ్బు ఉన్న చేతులలో పగలు ఆడుతుంది
డబ్బు ఉన్న పిడికిలిలో రాత్రి దాగుతుంది

వాలి పోయే రవి జేబులో రేపటి పొద్దుకు రిజర్వేషన్
కదలి పోయే మనిషి పర్సులో కొత్త అడ్రసు కార్డు

గాలికి రెప రెప లాడే తెలుపు కాగితంలా ఉదయం
శుభ్రమైన మనసు నుండి కవిత కెదురు చూస్తుంది

కవిలో పాఠకులు విమర్శకులు భావుకులు
కవికి ముందు వరసలో నిలిచిన దృశ్యం! ఫోటోలో

ఏ రోజుకు కారోజున కాలంతో పాటు కవిత
ఆధిపత్య నిరంకుశ పీడన లంతరించి
స్వేచ్ఛా సమాజంలోకి! తీసే దారి ఇదే!
ఇది మారక తప్పని జీవన భవితకు సుగమం

❈

## 6. నిప్పులపై

ఇదే దారి! ఈ దారిన వెళ్ళే స్వేచ్ఛా వ్యక్తిలో
ఇరుకు లేదు కరకు కాదు అనుభవ జగంతో
మలిన రహితమైన నైతిక చేతనతో
ఎప్పటికీ అవసరమై! నిరంతర పరిణామంలో

ఇదొక మజిలితో ముగిసేది కాదు
ఒక ఫల రుచి అనుభవ సీమకు మితం కాదు
బ్రతుకులో పైపై దశలే లక్ష్యంగా
శిఖరారోహణకు ఉత్సాహం అందిస్తుంది

శూన్యమైన హృదయాలతో శుష్కమైన వాగ్దానాలతో
తడవ కొక పార్టీలో, నేతల ఆగమనం నిష్క్రమణం
రాత్రులు పండిన చంద్ర బింబం హ్లాదంతో సరిపోదు
కనిపించని జీవన భాగ్యం చేతి కందినట్లు కాదు

సమాజ తరువు కొమ్మ లెపుడు నరకబడేదీ
మూల మెపుడు ఒరిగి పోయేదీ తెలియదు
కొమ్మపై వాలేందుకు గిరికీలు కొట్టే
పక్షిలా మనిషి మనసు! నగరంలో చోటుకై

ఎవరి గుండెలో కుంపటి వారు వహించక తప్పదు
ఇది మరో గుండెకు బదిలి చేసేది కాదు
ఇది మరొకరితో పంచుకునేది కాదు
ఎవరి నుండైనా ఒలికేది సానుభూతి మాత్రమే

కనిపించే దృశ్యం వెనక, కనిపించని వాస్తవం
మట్టిలో విత్తు వెనక దాగిన చెట్టులా! కవిత

జలధిలో తుపానులా సంక్షోభం! సమాజంలో
సామాన్యుల జీవితాల్ని నిప్పులపై నడిపిస్తుంది

❈

## 7. చూపులో దారి

సంఘంలో పేదరికంపై చిత్ర శిల్ప రచనలు
అందంగా తీర్చబడిన అలంకార శాలలు
వీటికి తోడుగ ప్రకాశమాన ముఖాలతో
చీకట్లను కప్పేసే రంగుల వెలుగుల బల్బులు

ఉదయం వరకు వేచి ఉండే కళ్ళకు
కంటి ముందు వెలిగే దీపంతో కాస్త తృప్తి
దివా నిశా భేదం లేనిది, అంతరంగ మొకటే
ఇది లౌకిక వ్యవహారాలకు బహు దూరం

సంకుల సమాజంలో వ్యక్తుల బ్రతుకులు
ఆవేదన పోరాటం నేరం అశాంతిలో
మరు భూములు! శిలా తతులు! దారులలో
అయినా జీవన యానం సాగుతుంది, ఆగదు

పైరు పంట భావనతో సంకల్పం దృఢమై
పెట్టని కోటలా నిలిచిన ధైర్యంతో ఒకరొకరు
అధిపతి అవాలని లోపల ఉబలాటం! ఎందరికో
ఇది తీరే పనిలో వ్యక్తి, కత్తి కావచ్చు, బాంబు కావచ్చు

అందని దూరంలో భావి కాలం! ఎప్పటికీ
అందమైన కల్పనలో జీవన భాగ్యం తలపులలో
వర్తమానం మాత్రం తెరచిన తలుపులతో ఎదురుగా
లోనికి వచ్చే వారితో బయటికి వెళ్ళేవారితో సందడిగా

మనోలోకాన్ని విస్మరించిన మనిషి బ్రతుకులో
ఏదో లోపంతో గడుస్తుంది కాలం నిశ్శబ్దంగా
అయినా గడచే సమయంతో మనిషి అడుగులు
వెనక్కి పడవు! ముందుకే! చూపులో ఉన్న దారి ఇదే !

❋

## 8. పోవలసిన దారి

ఉదయ బింబ మదే! వెలుగు రేకలవే!
మనో రూపాలు వేరు! రంగుల సహ యోగం వేరు
ఇతరులతో కలయికతో జీవన దృశ్యం మారుతుంది
మనుషుల చర్యలతో నడతలు వేరవుతాయి

గాలి కనబడదు కాని సులభంగా గుర్తించ వచ్చు
మనసు కనబడు కాని క్రియలో ప్రతిఫలిస్తుంది
నీరు ఆగదు కాని పాత్రలో నిలపవచ్చు
బ్రతుకంటే స్వార్థ జగం, దీనికి హృదయ మవసరం
ఇది! మూస పోత లోని నిర్ణయ రూపం కాదు
నిర్వచనానికి లొంగదు, ప్రవచనానికి అందదు

నాగలి వెనక నడుస్తూ యంత్రం ముందు నిలిచి
శ్రమ చేతనతో మనిషి! వాస్తవ రేఖలతో తీర్చబడీ
శ్రమ బిందువు సమాజ సంపదకు మూలం
శ్రమ తేజం వికాస దశలకు ప్రేరణం

తప్పని పరంపరా గత సమాజ పరిణామంలో
రావలసీ వచ్చేసీ చేరిన మార్పులతో
చూపులో మాటలో వర్తమాన స్పృహలో అపుడపుడు
ఊహల ఊయెలపై శైశవ దశ చేరేను

యుద్ధం ఎపుడో చిన్న తనంలోనే పరిచయం!
అంతో ఇంతో రుచి తెలిసిన విషయమే!
మధ్య మధ్య విరామ సమయంలో శాంతి!
రణ బుద్ధిని మరపున బడజేస్తుంది

చుట్టు ఉన్న సమాజ స్పందనతో కలిసీ
ఇదే! పోవలసిన దారి ఇదే! వ్యక్తిత్వంతో

❋

## 9. చుక్కలు తెలుపుతాయి

ఏ దారి అయినా కోరికలన్నీ తీరవు
ఏవొ కొన్ని మిగిలే ఉంటాయి
అవి అందమైన శిల్పాలుగ మారవచ్చు
అవి హద్దులలో ఏరులుగా తరల వచ్చు

నిద్ర అనేది రోజులో కొంత సమయమే
అందులో కొంత సేపు లో నుండి బొమ్మలతో
మెలకువలో పనులలో జీవన వాస్తవ తలంపై

చేతిలో బ్యాగ్‌ను నింపుకొని వస్తువులతో
దాచేవి దాచుకొనీ, మిగతావి వాడుకలో,
అర చేతులలో గీతల దిశలను పరిశీలిస్తూ
అద్దంలో తన వెనక నున్న మనుషుల్ని గుర్తిస్తూ
ఎదుట నున్న వ్యక్తి నిటలంపై చిత్రాలు విలోకిస్తూ

ఒక సందర్భంలో మనిషి దోష చర్యతో
వెలుగు నుండి తప్పుక పోవాలని చూచేను
సరాసరి చీకటి నిలయ మాశ్రయించేను
ఇది తన భద్రతకు రక్షణ కవచమని నమ్మకం!

దగ్ధమైన గుడిసె దృశ్య విషాదంలో
విశ్రాంతికి నిశి! అవకాశమిస్తుంది
ఆపదలో ఆదుకొనే మిత్రమవుతుంది
అనుకోని మానవతా తంత్రులు మీటుతుంది

పొగలు ఎగసి చీకటిగా మారిన రూపం
బాధా రవాన్ని దిశల చెవులకు చేరుస్తుంది
బూది అయిన గుడిసెతో! కోరిక నశించేనా?
పగలు బయట పడని వార్తను చుక్కలు తెలుపుతాయి

❋

# 10. పరివర్తన దృశ్యం

శ్రమ బిందువు శ్రమ తేజం రెండూ
భౌతిక మానస స్థాయిల్లో జీవన దిశలో
సమాజ చరిత్రను నడిపించే శక్తులు!
మానవ ప్రగతికి అవసర సోపానాలు!

పచ్చని పంటలతో కర్మాగారాలతో
సృజన కళా విద్యా విజ్ఞాన ధనంతో
ఇన్నిటి కలయికతో జీవన యానం
విశాల ప్రపంచాన్ని దగ్గరికి తెస్తుంది
బ్రతుకులో అర్థాన్ని విస్తరింప జేస్తుంది
మనసుకు వికాసాన్ని ప్రకాశాన్ని ఇస్తుంది

ఎండకు ఎండిన వృక్షం స్థితిలో మనిషికి
మెరపు చూచి ఉరుము విని చినుకుపై ఆశ సహజం!
ప్రేమ కరుణ వీర మోద భావ మయంతో
నిరాశ అంచులలో సంశ్లిష్టమైన బ్రతుకులో

ఒక వస్తువు త్యాగంతో మరో వస్తువు సిద్ధంగా
ఒక దశ నిష్క్రమణంతో మరో దశ ఆగమనం

జలధిని చూడక పోయినా
అది విడిచే నిశ్వాసం మేఘం!
గగనంలో కదలుతూ వర్షిస్తూ పోతుంది
ఇది కనిపించే రూపంలో అనుమానం లేదు

ఏ కోటలోనో బంధింప బడే వీలు లేదు
ఎవరి ఆజ్ఞ పైనో! ఆగి పోయే అవకాశం లేదు

సృష్టిలో ప్రియమైంది మనిషికి తన బ్రతుకు మాత్రమే
తరాల జీవన కళతో పరివర్తన నవ దృశ్యం

❋

## 11. కాలానికి అను స్పందనం

దారిన పోతూ మనిషి రూపం కనబడితే
దాహంలో నది చెంతకు చేరినట్లు ఉంటుంది
దగ్గరలో మనిషి స్వరం వినబడితే
గుండెకు సహ స్పందన పొందినట్లు ఉంటుంది

చీకటిలో కళ్ళు అలకిడితో మనిషిని గుర్తిస్తాయి
స్పర్శతో ఆకృతి, వెలిగిన బల్బు అవుతుంది
ఉత్సాహం పొంగి వ్యక్తి అలవోకగా
సమాజంలో భాగమై పాత్రగ మారేను

సమయం సందర్భం అవసరాల మేరలలో
చేపట్టిన ఉద్యమం అంచెలుగా సాగుతుంది
మొదలు నుండి చివరి దాక పాత్రల
మస్తిష్కంలో జ్వాలా తోరణం వేలాడుతుంది

శిశువు అయినా పెద్ద అయినా అనను కూల స్థితులలో
కాలం మీటుతుంది మనోమయం భయ భావం!
నిరాశలో మనిషిని పరిభ్రమింప జేస్తుంది
చీకటి దస్తీని ముఖాన కప్పి వేస్తుంది

ప్రగతిలో భయ దృశ్యం దూర దూరం జరుగుతుంది
ఎంత బరువు నైనా సంకల్పం రెక్కలపై వహిస్తుంది

రాత్రి వస్తుంది! ధైర్యం అవసరాన్ని చూపిస్తుంది
పగలు వస్తుంది! త్యాగం అవసరాన్ని సూచిస్తుంది

స్నేహ వశం ప్రేమ మయం హృదయంతో మనిషి
దైవానికి తన రూపం ఇచ్చే అనుపమ చైతన్యం!
కష్టంలో వేదనలో ఘర్షణ వాతావరణంలో
ఎదురు పడే కాలానికి అను స్పందన కవిత్వం

❋

## 12. మనిషి పట్ల మౌనంగా

దారిలో ఊరు బయట వదలేసిన
కోట గోడ అంచులలో శిథిలాలు
పగిలిన బొమ్మల ముక్కల్లా పడి పోయి
ఆలోచనలను ఎక్కడెక్కడో తిప్పుతాయి

వంగిన తలతో మానవం! దూరాన క్షితిజంలో
చరిత్ర విషాద పర్వంలో పేజీలు తిరుగుతాయి

కాళ్ళు విరిగి చేతులు తెగి తలలు తొలగి
జరిగిన రణ సన్నివేశం! చూడక పోయినా
శిథిలాలను చూస్తే వాస్తవ చిత్రం దిగుతుంది
ఇదంతా ఎవరి కోసం! దేని కోసం అంటే?
అంతరంగం సాక్షిగా! మనిషే నిలబడతాడు
కొత్త ముఖం తొడుగుతో అమాయకంగా

నిర్మాణంపై కోరికతో నిర్మాతలు కొందరు
విధ్వంసంపై కోరికతో వినాశకులు కొందరు
మరచిన చర్యలు! పాతవి, తలపుకు తెస్తూ
అసలు అంతరంగానికి అవకాశం దొరికితేగా?

జీవన వ్యవహారంలో ఎవరు మటుకు ఏమి చేస్తారనా?
మానవ రేఖలతో దైవం కూడా ఈ జీవిత కథనే కలిగేను!
బాధ్యత మరచిన ఘడియలో దైవం పేరున
చర్యలలో ఆటవికం తలపుకు రాకూడదు

బ్రతుకులో శిఖరం చేరాలనుకునే ముందు
ఎన్నో పరీక్షల మెట్లపై నడవాలిసి ఉంటుంది

గాలితో వెలుగుతో దిశలతో పూలు మాట్లాడతాయి
తీరిక లేని మనిషి పట్ల మౌనంగా ఉంటాయి

❋

## 13. పయనానికి సమాజంలో

సవిత కన్న ముందు లేచి దారి చూపుతుంది కవిత
బరువుగా మొదలయిన ఉదయం మబ్బులా తేలిక పడుతుంది
తెలుపుతో మొదలయిన కిరణం రంగులతో కిర్మీరమవుతుంది
మందంగా ఉన్న ఊహ పదునుతో వేగం పెరుగుతుంది

సన్యాసిలా ఎదురైన లిప్త! సంపదపై కొలువు దీరుతుంది
ఏక వచనంలో ఉన్న వ్యక్తి, బహువచనంలో సమూహమయ్యేను

శైశవం నుండి ఎదిగే వయసు! వెనక్కి వెళ్ళడం జరగదు
ఉన్న స్థితి నుండి ముందుకు వెళ్ళడమే, ఎవరైన చేయ గలిగేది
విభేదాల సమన్వయంతో వైరుధ్యాల సహ భావంతో
బహుళార్థ సమాజానికి, కాలం ఒక సముచిత వాహనం

కళ్ళు చిమ్మే నిప్పు రవ్వలకు జలదం దూరం జరుగుతుంది
నిద్రలో ఉన్నప్పుడు చీకటి వెన్నెలే కాదు పగలుతోనూ పని లేదు
లేచే సరికి ఇంటి ముందు వెలుగు! సంతోష ముఖంతో
చూపులో గమ్యం కనుకొసలకు వేలాడుతూ, ఊగుతూ

బయటికి వస్తే ఇతిహాసంలో పాత్రలు తలపుకు వస్తాయి
ఏ ముసుగు లేక పోయినా! ముఖాలు రహస్యం దాచిన పేటికలు
ఏ కుఫియా సహాయమక్కర లేదు తనలో ప్రకాశమవసరం
సెట్టింగ్ అదే! మనుషులు వేరు! నటన వేరు! మనస్తత్వ మొకటే

సజీవ ప్రపంచంతో వర్తమాన చలనంలో కవిత
వెనుక గతంలో ఛాయలు! ముందు  భావిపై వెలుగులు

అక్షరాల చినుకుల నెవరు ఆపగలరు?
వివిధ పాత్రలలో సిద్ధంగా కవితా మేఘం!
అక్షరాన్ని నమ్ముకున్న వ్యక్తి బ్రతుకులో
కరువులేదు చెడే ప్రశ్న లేదు,
పయనానికి దారి ఇదే! ఇదే!
ఇదే దారి! మనిషికి సమాజంలో!

❋

# 14. ఈ దారి అవసరం

ఈ దారి అవసరం ఎంతైనా
ఎవరి కెవరు తోడుగ ఉన్నా, లేకున్నా
దారిలో భిక్షువు! దీవెన గళం వినిపిస్తుంది
దారినే మరొకరి ప్రార్థన స్వరం స్వనిస్తుంది

ఏది తెలిసిన దయినా తెలియని దయినా
ఆ సందర్భంలో వెడలే శబ్ద తరంగం
మనసుపై చూపుతుంది! అనితర ప్రభావం

మాటలలో విషయంతో విలువలు మారీ
వినిపించే శబ్దం మౌనంలోకి తరుముతుంది
మౌనంలో అర్థం విప్పారుతుంది నిశ్శబ్దంగా

దారికి ఇరువైపుల ఒకటొకటీ
శిథిలాల నుండి నిర్మాణాలు వరసగా
కాల మహా గ్రంథంలో పేజీని చుట్టి అందిస్తాయి

ఒక మారు అనుభవంలోకి వచ్చింది
మరపున బడదు సరికదా! అనుకోకుండా
అపుడపుడూ బంతిలా ఎగురుతుంది మనసులో

శిథిలాలు నిశ్శబ్దంగా బాధను దింపుతాయి
నిర్మాణం ఉత్సాహంగా తృప్తిని నింపుతుంది
ఆరోహణ క్రమంలో లేచే నిర్మాణాలెన్నో
అవి తమ వశమయినా కాక పోయినా

శిఖరాలను చేరే యత్నంలో పోటీ!
కష్టాలు తీరాలనీ బాధలు పోవాలనీ
విధ్వంస కాండ నుండి సృజన దృశ్యం లోకి
ప్రజాస్వామ్య స్వేచ్ఛలో పయనానికి దారి ఇదే


❊

స్వేచ్ఛా కవిత్వం-72

# నవ మానవం

(దీర్ఘ కవిత)

మాదిరాజు రంగారావు



2016

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

# NAVA MAANAVAM

## Sveccha Kavithvam

(Free-Verse)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2016

Presented

to

my wife

**Smt. M. Indira**

on her Birthday

# పీఠిక

'నవ మానవం' దీర్ఘ కృతి, స్వేచ్ఛా కవిత్వంలో నేటి సమాజంలో కావలసిన రావలసిన కొత్త మానవ భావనా రూపాన్ని ఆవిష్కరిస్తుంది. ప్రజల సుఖ శాంతి భాగ్య వృద్ధికి సంబంధించిన భౌతిక మానసిక స్థాయిల్లో పరివర్తన – వికాసాలపై వెలుగు ప్రసరిస్తుంది. మనిషి తన జీవితంలో కోల్పోడానికి వీలు లేని ఉత్తమమైన విలువల్ని ఉదాత్తమైన చరితను వ్యంజింప చేస్తుంది.

కవిత్వానికి అవసరమైన స్పందన – అనుభూతి – భావన– అభివ్యక్తి – ప్రయోజనంతో పాటు ఇపుడు అదనంగా కొన్ని అంశాలు చేరాయి. సమాజంలో ప్రచలితంగా ఉన్నవీ క్రియాత్మకమైన పాత్రను నిర్వహించేవీ విశేష ప్రభావాన్ని నెరపుతున్నాయి. అవి బాహ్యంగా సామాజిక రాజకీయ పరమైన, అంతర్గతంగా తాత్త్విక మనస్తత్వ పరమైన అంశాలు. వీటి అవసరాన్ని ప్రభావాన్ని కవిత్వంలో సాహిత్య విమర్శలో విస్మరించడానికి వీలు లేదు.

కేవలం "అనుభూతి" మాత్రమైన కవిత్వంలో భావ సాంద్రత ఉండే మాట నిజం. ఇపుడు ఇది ఒకటే, కళామయమైంది, చాలదు. ఆ స్థితి పరిమిత రూపాన్ని తలపిస్తుంది. అందువల్ల అనుభూతి గుణాన్ని దాని ప్రభావాన్ని గుర్తిస్తూ, ఇతరమైనవి స్వీకరించడం జరుగుతూంది. దీనితో కవిత్వానికి స్కోప్‌తో పాటు facets పెరుగుతాయి purpose లో దిశా ప్రభావమూ ఎక్కువ కావడంతో స్వరూపం మారడం సహజం. పాఠకుల్లో వివిధ కోణాల్లో మంచి అవగాహనకూ ఆలోచనకూ మార్పుకూ వికాసానికి తోడ్పడుతూంది. ఇందులో సందేహం లేదు. ఇందులో ప్రకృతి సమాజమూ humanize చేయబడినాయి.

ఇతర భాషల నుండి అనువాదాల రూపంలో వస్తూన్న కవిత్వాల్ని పరిశీలిస్తే తెలుగులో ఎంత మంచి/ గొప్ప కవిత్వం వస్తూన్నదీ తెలుస్తుంది. ఈ కృతి విషయంలో – వర్తమాన స్థితులు ఆధారంగా, సృజన సహజమైన చేతన ప్రధానంగా చింతన– భావన – ప్రయోజనం – విశాలమైన పరిధులతో స్పందించే కవితారూపాన్ని పొందింది. సమాజ స్థాయిలో అవసరమైన 'నవ మానవ' రూపాన్ని ఆవిష్కరిస్తుంది. వ్యక్తి స్థాయిలో పరివర్తన భావాన్ని ప్రేరేపిస్తుంది. వ్యక్తిలేంది సమాజం లేదనవచ్చు, కాని సమాజంలేంది వ్యక్తి వికాసం లేదు ఒకరికి ఒక్కరి తోడుతోనూ మానవ సంబంధాలతోనే జీవితం. స్వేచ్ఛా కవిత్వంలో ఇది base. దీనిపై నిర్మాణ రూపమే ఈ "నవ మానవం".

వైయక్తిక సామాజిక స్థాయిలలో మానసికంగా ఆశా స్పందనల్ని చేకూరుస్తుంది. కవిత్వం ప్రధానంగా తన విలక్షణ చేత వివిధ విధానాల్ని ఆశ్రయించి కలిగే ఉత్తమమైన ప్రయోజనమిది. ఈ సందర్భంలో literary crticism వేరు, propagandistic criticism వేరు, అన్న విషయం మరచిపోకూడదు.

**– మాదిరాజు రంగారావు**

# నవ మానవం

## 1. శ్రమ కేతనమై

మెలకువ రాగానే మనుషుల కదలికలు
మనిషిని చూడాలని మనసున ఆరాటం

సప్త స్వర ఛాయలు చుక్కలుగా రేఖలుగా
శబ్ద గుణం మాటలు వినబడతాయి
లేచి చూస్తే పనులపై కదలే మనుషులు!
శిల్పం చిత్రం భంగిమలలో ఒక్కొక్క చోట

రాత్రి కారు మబ్బులా కమ్మిన చీకటి
ఉదయానికి వెలుగు జల్లు పరచి పోతుంది
ఎవరి మనోజగం వారి స్వంతం అయినా
బయట నున్న విశాల సమాజం అందరిదీ

మంచు నుండి ముక్తమైన
లే లేత కిరణాల సమూహాల్లా
బడులకు వెళ్ళే కథలలో పిల్లలు
ఆ సమయంకై గేటు ఎదురు చూస్తుంది
తెరవ బడుతూ మూయ బడుతూ
దాగుడు మూతల ఆటలా గడుస్తుంది

చేతిలో వేడి వేడి కాఫీ కప్పు నుండి
సన్నని ఆవిరి పొగ తీగెలు సాగుతూ
నాలుకపై చేదు తీపి కలిసిన రుచితో
దేహం కవోష్ణ రుచిర నవ మవుతుంది

నాలో కవిత! రసనపై జారుతూ
హిమ శిఖరం నుండి గంగ పాయలా
వర్తమానం మెట్లపై శ్రమ కేతనమై
దిగుతుంది! సమాజ శ్రేణులలో తిన్నగా

❋

## 2. దాచేస్తూ మరపిస్తూ

బ్రతుకంటే భాయి! సమాజ చిర బంధంతో
పలు స్థాయిలలో శ్రమ జీవన సంకలనం

మస్తిష్కానికి సూటిగ ఆపై పైన కదలే
నీలి మబ్బుకై భూమి ఎదురు చూస్తుంది
వాన రాక పోవచ్చు, మెరపులతో రావచ్చు,
జారే పిడుగులతో ధ్వంసం జరగవచ్చు
వరదలలో సర్వం కొట్టుక పోవచ్చు
చినుకుతో పచ్చదనం ఆశకు జీవన పత్రం
వర్షంతో హర్షం మానవ శక్తికి టానిక్
రుతువు నుండి రుతువుకు శ్రమాలోల సమాజం

నిరాశలో ఆశను నిలుపు కుంటూ
కష్టంలో భావిని తలచు కుంటూ
వస్తువులు పాతవే! కల్పనలు కొత్తగా
మనిషి మనిషిలో వేరు వేరు శాలా రూపాలు

స్వేద కణంలో తళుక్కున మెరుస్తుంది వజ్రం
స్వేద ప్రవంతిలో తటాలున తేలుతుంది పడవ
రాలే స్వేద రేఖ నుండి అగ్ని!
శ్రమ ఫల రాసులలో మంటలు!

శ్రమ వాదంలో జీవన చక్ర భ్రమణం
హక్కుల పోరాటంలో శర సంధానం

బ్రతికి ఉన్నంత వరకు అందరాని గగనంలో
బ్రతుకు ముగిసి కనిపించని స్థానంలో అడుగు క్రింద
పరచ బడిన తివాచిపై! కల్పనలో భ్రమలు!
వాస్తవాన్ని దాచేస్తూ, సమాజాన్ని మరపిస్తూ!

❊

## 3. సార్థకం

తన ఆంతర రూపం బింబిస్తూ ఆదర్శం
తన మాటలు మోసుకొనీ గాలులు
తన బ్రతుకును వహిస్తూ సమాజం!
కాలం కవితలో లోతును ఎత్తును చూపుతుంది

కళ్ళు మూస్తే చుట్టు ప్రాణులు ఒకటొకటీ
కళ్ళు తెరిస్తే చుట్టు మహాజన సందోహం
ఎదురు పడే మనిషితో మనిషి అనుబంధం
ఊహలో వదలని సమాజ సంస్కృతి రూపం

నడచి నడచి దూరం బహు దూరం
నీరు లేని నీరు అందని చోటు!
విప్పారిన నవ్వు ముఖంతో గులాబి
చూపు నల్లుకొంటుంది! ఆశామయమై

బీజంలో దాగిన శక్తి తప్ప
దీని నెవరు అందంగా బ్రతికించేరు!
జలద హృదయ స్పందన వినబడవలసిందే
సృజన లోకం భూమిపై చూడాలిసిందే

శ్రమ ఫలం దక్కేది! జల సేచనతోనే!
ఉదారత చూపేనా? హేతువు దొరకేనా?

ఎండలో ధగ ధగ లాడుతూ
బంగారం పరచినట్లు! ఇసుక నేల!

శ్రమ కణంలో రవి కిరణం మెరుస్తుంది
శ్రమ ధారలో భవిష్యత్తు కదలుతుంది
గుప్తంగానో సుప్తంగానో ఉన్న శక్తి
భ్రమావరణం తొలగితేనే సార్థకం!

❊

## 4. అభయం

మనిషిలో భయం, వెంట సాగే అనల సర్పం
ఇది తెలియక పోవడ మొక అదృష్టం
పలు ముఖాల అనుభవ చక్రంతో తిరుగుతూ
మనసులో ధైర్యం! విజయానికి సోపానం

చకితంగా పిడుగుతో తత్కాల భయం
దీనికి గొడుగు, పనికి రాదు
తలపై హెల్మెట్, పని చేయదు
దీనికే స్థాయిలో భేదాలు లేవు
తగినదీ, తగనిదీ ప్రసక్తి లేదు

భయాన్ని బోనులో నిలపాలనుకునేవారు
ఆయుధానికి గురి చేయాలనుకునేవారు
బోనులో మృగాన్ని చూచినట్లు ఆనందించే వారు
జాలితో అడవిలో స్వేచ్ఛగా వదలాలనుకునే వారు

నిరసన నినాదాలు వ్యక్తి హక్కు ప్రజాస్వామ్యంలో
ప్రశ్నల మంటలతో అలజడితో అశాంతి
దారులు మూతబడీ, దొరికిన దారిన పోవాలనీ
దార్శనికంతో గమ్యం చేరే భావన ముఖ్యం

నిర్దోషికీ దోషికీ రక్షకునికీ హంతకునికీ
వీరునికీ చోరునికీ రణానికీ శాంతికీ
సంఘంతో సంబంధం! మానవ చరిత్రను తీరుస్తుంది
ఎప్పటికీ మాయని గాయాలు మిగిలిపోవచ్చు

హేతువుతో విజయం పరితృప్తిని కలిగిస్తుంది
పన్నిన వల తొలగి శాంతి పావురం ఎగురుతుంది
భయం లేని సమాజం
మూడు నాళ్ళ ముచ్చట కారాదు
సంస్కృతి వనిలో ప్రతి హృదయం
మధు సుమమై తేనే అభయం

❊

# 5. నిర్వచనం మారుతుంది

"శాంతి" ఒక రోజున ఊడి పడేది కాదు
నిరంతర సహనంతో సమాజ సుందర ఫలం

ఏ ఆపద వచ్చినా తట్టుకొనీ నిలుస్తుంది
ఏ సౌఖ్యం లుప్తమైనా నిండుగ బ్రతుకుతుంది

తనలో జీవ శక్తి ప్రమాణంతోనే బ్రతికేది
కనిపించీ కనిపించని హేతు యుతం మనిషి జీవితం!

ఇల్లు ఎన్నటికీ కారాగార సదృశం కాదు
బాల సముద్రమై దాటే నావను కోరవచ్చు
రోజొక గట్టు దాటే భయ భావం
కదలే పడవ అడుగున చేరుతుంది

ఎవరి లోకం వారిదే! అయినా
మనిషి మనిషిలో తెరలు తప్పవు!
బయటికి వస్తే, గోడలు లేని సమాజం!
స్వేచ్ఛకు వీలనిపిస్తుంది, పయనానికి అనువనిపిస్తుంది

కానీ ఇక్కడ ఉన్నది కనిపించని గోడలు
పయనానికి అవరోధాలు! ఆటంకాలు నిబంధనలు
రాజ్యం పేరుతోనో సంఘం పేరుతోనో వ్యక్తి కాంక్షతోనో
నడకను మరలించే మలుపులు, మార్చేసే దారులు

విహగాని కన్నా సర్పానికి స్వేచ్ఛ ప్రమాదకరం
నిరసన కన్నా ఘర్షణలో స్వేచ్ఛ అశాంతికరం!

స్వేచ్ఛలో మబ్బు! పవన వశం
స్వేచ్ఛలో మనిషి! పరిస్థితుల వశం
ప్రతి క్షేత్రంలో లక్ష్యంలో నిర్వచనం మారుతుంది
కాలాతీతం నుండి కాల నియత మవుతుంది

❋

## 6. తన గుర్తుగ

ఇంటి గేటు దాటగనే బయట ముందుగా
మనిషి ముఖం కనిపిస్తే అదొక ఉల్లాసం
చెట్టు పక్షి కుక్క కూడా రోజూ కనిపిస్తాయి
బాల్యం నుండి పరిచయ పరిసరాల భాగాలు!

మనిషిలో గుణాలకు చిహ్నాలయి
బ్రతుకులో శూన్యాన్ని నింపేస్తాయి
చుట్టూ పరివారంతో అనుకోని మనుషులు
ఒంటరి తన మదృశ్యమవుతుంది, అనుభవం నిండుతుంది

వీధిలో నడచే ప్రతి ఒక్కరిలో
ఎప్పటిదో! భద్రంగా రహస్య పేటిక
దాన్ని విప్పజేసి అందులో ఏముందో
ఒకటొకటీ తెలుసుకునే కోరిక సహజం

ఇది ఎన్నిటికో పురికొల్పే జిజ్ఞాసతో
అన్వేషణ పరిశోధన ప్రయోగాలు సమాధానం
మానవ సంస్కృతికి ఉన్నత రూపం ఇచ్చాయి
ప్రాణి కోటిలో మనిషిని శిఖరంపై నిలిపాయి!

ఎవరి వారసత్వ విభవంతో వారు
మూలంతో పరిసరాల ప్రభావ సుందరంగా
వ్యక్తులలో అస్తిత దేనికది విశేషమై

కండె నుండి విడుదలయిన దారం అల్లికలో
పూలూ మణులే కాదు! తన బింబం వ్రేలాడుతుంది
తానెవరో తెలిపే గుర్తులలో, అభిమానం రాణిస్తుంది

గేటు దాటగానే కనిపించే
చెట్టు ఆత్మశక్తిని నిలుపుతుంది
పక్షి బరువును తేలిక పరుస్తుంది
పప్పీ రక్షణగా, కనిపెడుతుంది

❊

# 7. స్వేచ్ఛా జలదం

కాలాని కెవరి పహరాతో పనిలేదు
ఎవరి అధీనమూ కాదు, స్వతంత్ర రూపం
ఆకుల మధ్య పూవుల్లా క్షణాలు
ఊహలతో నిరీక్షింప జేస్తాయి

మనసు మౌనమూర్తి అయితే అది హిమ శిఖరం
చిన్నవో పెద్దవో! జారే జల ధారలతో
జీవిలో విలయ క్షణం, మృత్యు పదం
మనిషిలో సృజన స్థితి, జీవమయం

పలకలుగా చీకటి, ఆరోహణలో మెట్లుగా
శిఖరం చేరాక, చీకటి ప్రసక్తి లేదు! వెలుగే!
జీవన గమనంలో ఒక క్షణం వెనక్కి జరగదు
స్వేచ్ఛా పయనంలో దార్శనిక పథంలో ముందుకే

పక్షిలో దూర దృష్టితో అల్లిక గుణం
వచ్చే కాలం గురించి చింతనతో శ్రద్ధతో!
మనిషిలో రెండూ! ఊహలో చర్యలో
క్షణ క్షణం ఆలోచనతో కణ కణం నిర్మాణంతో

చెట్టు నుండి సంపద చెట్టులో ఉదారత
మానవ వికాస రూపానికి, అవసర రూపాలు!
బ్రతుకులో బరువు మూట! ఒకటి తరువాత మరొకటి
మనసులో సహన శక్తి! అన్నిటికీ ఒకే విధం

బాధ్యతతో చరిస్తుంది స్వేచ్ఛా జలదం
గగనానికి ఇలకూ హద్దులు చెరపేస్తుంది
లక్ష్యానికి కర్తవ్యం గుర్తుకు తెస్తుంది
అయినా మనిషి మనసు గడ్డి కప్పిన ఓదమో! నూయో!

❊

## 8. కన్నీటి చుక్క వెనక

ఒక కన్నీటి చుక్క వెనక
జ్వాలా రూపం సాయం సంధ్యను తలపిస్తుంది
మాటలో ధగ ధగ లాడుతుంది
చేతలో భగ భగ మండవచ్చు

ఒక కొన నుండి మరోకొనకు సమాజంలో
నిప్పంటిన వంతెనను తలపిస్తుంది
కాలం విపరీత వేషం వేసినట్లు అనిపిస్తుంది
కాలం కాదు! వేషంలో ఉండేది మనిషే!

ఇది ఆరేందుకు జల సమృద్ధి అవసరం
ఇది సమాజ ప్రవాహం నుండే సాధ్యం!
నీటిలో ఒడ్డున శిల లెన్నో!
వీటి నుండి స్పందన కెదురు చూడడం వ్యర్థం

ఉదయ సంధ్య సాయం సంధ్య ఒకటి కావు
రూపం లోనే కాదు ప్రకాశ ప్రభావంలోను

ఉదయ సంధ్య వెలుగు మూట విప్పుతుంది
కళ్ళ ముందు సంతోష సుమాలను పంచుతుంది
సీతాకోక చిలుకలు గుమ్ములుగా ఎగురుతున్నట్లుంటుంది

సాయం సంధ్య చీకటి మూట విప్పుతుంది
చూచే కళ్ళకు! అలసట క్రమ్మినట్లుంటుంది
ఎడారిలో శూన్యమేదో ఆవరించినట్లుంటుంది

తాపం భరించ లేని సూర్యుడు జలధిలో దూకేను
మర్నాడు మంచు తెరల సందేహాలను తొలగిస్తూ
వెళ్ళిన దిశ మారి శుభ్రంగా తూర్పున ఉదయించేను

సఫల విఫల కార్యాచరణ మయం జీవితం
సమాజ ప్రవాహ జలాల వినియోగం తెలిస్తేనే
కన్నీటి చుక్క వెనక జ్వాలా రూపం! ఆరేదీ

❊

## 9. తరువు - మనిషి

వ్యక్తి నుండి సుమ ఫల సమాజ వనంతో
క్షణం క్షణం నవం నవం వర్తమాన జీవితం

ఒక సమయం కత్తిలా ఎదురగ రావచ్చు
ఒక సమయం పూల మాలలా మెడలో పడవచ్చు
దేని కయిన సిద్ధంగా ఉండాలిసి వస్తుంది
రవి తేజం తోనో శశి హ్లాదంతోనో

ఉదయం నిచ్చెనపై ఆరోహణలో
సాయం వేళకు అవరోహణలో
నిశి అంతా ఈది ఈది జలధిలో రవి
పొద్దునే నిచ్చెనపై యథాతథంగా

చీకటి గర్భం నుండి బయట పడిన
మనిషికి! చివరి మజిలీ చేరేది చీకటియే!

ఈ మధ్య జీవన గమనంలో
సూర్యుని వెలుగో! దీపం వెలుగో
ఏ సమస్య ఫలితం ఎట్లా ఉన్నా
ఆత్మీయంగా కాలం గడుస్తుంది

తరువుకు తాను నడవాలని
గాలి వీచి కదలి కాస్త తృప్తి పడుతుంది
మనిషికి తాను ఎగరాలని
విమాన యానంతో కొంత తృప్తి కలుగుతుంది

ఇరువురిలో పూర్తిగ తీరని కోర్కెలు
ఊహ లోని చర్య, హద్దు మీరనంత వరకు
జలధి అలలు సాగి స్పృశించి పోతాయి
అనల శిఖలు చలిని కోష్ణ పరుస్తాయి

❊

# 10. దొరకని సమాధానంతో

ఇంటి నుండి బయటికి చేరే
శ్రమ జీవి ముఖంలో సూర్యుడు పొడిచేను
బయటి నుండి ఇంటికి చేరే
శ్రమ జీవి ముఖంలో చంద్రుడు మెరసేను

మనో గగనంలో సూర్యుని రాకకు
సమయంతో కన్న సందర్భంతో పని!

వేయి చేతులతో జీవితాన్ని అనుక్షణం
ముంచెత్తాలని కోర్కెలు! మనిషిలో నిరంతరం
నేల పైన మొలకల వలె ఎదుగుతూ
నింగిలోన చుక్కల వలె వెలుగుతూ

పగలు రాత్రి ఇరు రెక్కలపై కాలం
ఆశా జీవిని తిప్పుతుంది దిశ దిశలో
ప్రాణమున్నంత వరకు మనిషితో మనిషిలో
స్నేహమొ! వైరమొ! చూపుల నల్లుకొనీ!

వీథిలో తెలుపు ఎరుపు పచ్చ రంగు పతాకలతో!
ముఖాన సిగ్నల్స్! ఏ రాజకీయ పార్టీ పేరుతోనొ

ఊహలలో పెరుగుతూ చర్యలలో బ్రతుకుతూ
కళ్ళలో ప్రతి ఫలిస్తూ మనసు నుండి ఆలోచన!

ఎవరి వలయంలో వారు,
ఎవరి హద్దులు వారివి
వీటిని దాటగ జేసే కోరికలెన్నో
వీటిని దాటక తప్పని అవసరమెంతో?

ఇవి గీసేదెవ్వరు? ఎవరికి? ఎందుకు?
సమాధానమెక్కడుంది? చరిత్ర గతిలో!
సరియైన సమాధానం దొరకకనే
వలయాలను దాటడం హద్దులను మీరడం

❊

## 11. ధైర్యం వంతెనయై

రాత్రి నుండి ఉదయానికి వంతెనయై ధైర్యం
ఉదయం నుండి రాత్రికి వాహనమై కోరిక
ఊహల కన్నా, క్రియా శక్తి బలమై
ఇది జీవితంలో వర్తమాన వాస్తవమై

మెడలో వసంతం పూలదండ వేయవచ్చు
సంకెల ధ్వనిలో సంగీతం వినిపించవచ్చు
దయా భావంతో వీరం మనిషి ఎత్తు పెంచుతుంది
మానవతా స్పందనం మనిషి విలువ పెంచుతుంది

పారా షూట్‌లా కవిత! తిప్పుతుంది
మనిషి మతిని! చూడని పలు స్థలాలలో
అన్వేషణలో కొత్త జగం! మనసులో
అక్షర రూపంలో జీవన దృశ్యం! ఎదురుగా

కదలికలో నాలుక సుశిక్షిత మయితేనే
కవితలో మాటకు! బహుళ ప్రయోజనం
రేపు రావలసిన సమాజంపై నమ్మకంతో
ఈ రోజున కవి నుండి రేపటికి ప్రణాళిక!

కాలంతో బుజం బుజం కలిపి చింతనలో
తన అడుగే ముందు పడాలని ఆవేగం!

ఈ కాలాన కవిత! స్వేచ్ఛా! హృదయంతో
వర్తమాన సమాజ వేదన రూపం!
నవ మానవ వికాస లక్ష్యంతో
ప్రజాస్వామ్య భూమికలో చరిత్ర సారం

ఆదర్శ శిఖర తలం నుండి యదార్థ తలంపైకి
మట్టి పరిమళంతోనే మానవ వ్యక్తిత్వ వికాసం

❉

## 12. రావలసిన పూర్ణత

నిరంతర వేదనలో గడచే మనస్సు
హిమ శిఖరం నుండి ప్రవాహమవుతుంది
స్పందనచే చలనంతో తరలుతుంది
క్షణాల్ని వేగంగా తన వెంట నడిపిస్తుంది

లేమితో కణ కణ లాడే నిప్పులపై
తమ రొట్టెను కాల్చడ మొక చతుర విద్య,
మేల్కొన్న మనిషి మనసు హఠాత్తుగా
విరుద్ధ ముఖంతో ఆయుధ రూపం పొందవచ్చు

కళ్ళ ముందు నిలువెత్తున మంచు పొరలు
మనసులోన అలముకొన్న నీలి తెరలు
చీలుస్తూ తొలగిస్తూ హృదయంతో నడిపిస్తూ
అపుడపుడొక బుద్ధుడు! గాంధి! అంబేద్కర్

ఇప్పటికీ అడవులలో మారు మూల నివాసాలు
పంచ భూత ప్రభావాల తీవ్రతలకు వశమై
మధ్య మధ్య మృత్యు భయంచే తరుమ బడుతూ
రుతువు రుతువుకూ మారుతుంది జీవన వర్తన రూపం

బుజాన విల్లు! చేతిలో బాణంతో
ముఖాన నిర్ణయ రేఖల చిత్రంతో

రాళ్ళ మధ్య, ముళ్ళ మధ్య
ఎవరి కోసం ఎదురు చూడని
ఆది వాసుల! కళ్ళ ముందు ఆశ్చర్యంగా
నాగరక బింబం రావడమొక చారిత్రకం!

నవ మానవ విజయానికి రావలసిన
పూర్ణతతో! అంచులు చుట్టిన సుందర దృశ్యం!

❊

## 13. ఎప్పటికీ కొత్తగా

ఏండ్లుగా ఇందాక శరీరాన్ని
పోషిస్తూ తేలిగ్గా వహిస్తూ
గడచి గడచి ఇంకా గడవాలని
శత మానంలో ఉదయ బింబం చూడాలని
మధుర నిశా రాగం వినాలని
విజయ కథా భాగం చెప్పాలని

స్నేహం వైరం సుఖం బాధ బరువు బాధ్యత
కావడి కుండలు, తూకంలో వస్తువులు
ఏ రోజు కారోజు మార్కెట్ విలువలతో
వీధి నుండి ఇంటికి! కొత్త బ్రతుకుతో

గేటు దాటి బయటికి కదలి
గడప దాటి లోనికి చేరి
మనిషిలో రెండు అంతస్తులు
ఒక దాని కొకటి ఆసరాగా

ఆలోచన కవకాశ మిస్తుంది గడప
సంఘానికి దారి చూపుతుంది! గేటు

కొత్త మనిషి పరిచయంతో
మరో ముఖం! చేరుతుంది మనో దర్పణంలో
ఇది తొలగదు, బ్రతికినంత కాలం ఉండేది
అపుడపుడు జ్ఞాపకాల పేటి నుండి బయటికి వస్తుంది

కొన్నేళ్ళకు తనువు కాస్త వంగినట్లయినా
ఎట్టెదురుగ చెట్టు మనో బలాన్ని పెంచుతుంది

చేయి చాస్తే అందే ఎత్తు నుండి
చేయి ఎత్తినా అందని ఎత్తులోకి
ఎదిగే తరం నుండి తరం! పిల్లలు
అందరికీ తెలిసింది, ఎప్పటికీ కొత్తగా

❋

## 14. త్యాగ మవసరం

వాకిట్లో రాలిన పారిజాత సుమ పరిమళం
మరో లోకంలో తిప్పుతుంది అనుభూతి గుణంతో
స్వార్థాని కతీతమైన మనోజ్ఞ జీవనంలో
కల్మష  మెరగని మనసులకే సాధ్యం

మనిషి యంత్ర మయం కాదు
బటన్ నొక్కితే అనుకుంది జరగడానికి
తెలియని భావిలో మెరుపు దారులలో
ఎవరే దిశలో వర్తించేదీ తెలియదు

నీటిలో ఉప్పులానో శర్కర లానో
మనిషి  చర్యలు! సమాజంలో
నీటిపై పడవ లానొ హంసలానొ
మనుషులు అనుకున్నవి అనుకోనివి!

ఏడ్పుకు అరచేయి అడ్డు పెడితే
సుఖకర నాదం వినిపించేనా?
చేరాలిసిన చోటును పలుమార్లు పలికితే
ఎవరో విని గమ్యం! చేర్చేరా? చేరేమా?

అణగిన బ్రతుకులు స్వేచ్ఛగా
రెక్కలు చాచి చరించాలనీ! సహజం,
కనీసపు కోర్కెల సాధనలో
తప్పని పోరాటంలో విజయం! తమ దేనని!

ఎవరికైన స్థిరంగా హిమ శిఖరమై నిలవాలనే
ప్రవాహ రూపంపై కోరిక క్వాచిత్కం!
దీనికి సాహస గమనంలో త్యాగ మవసరం
అటు రణ పథమైనా, ఇటు శాంతి పథమైనా

❊

## 15. కాలం అద్దంలో

శిథిలాలలో పోగులు పోగులుగా కలలు
ఒకప్పటి అనుభవ జ్ఞాపకాల గుర్తులతో
కాలం నడుస్తుంది భవిష్యత్తులోకి
మంచులా పేరుకొనీ గతం! నిలిచిపోతుంది

శిథిలాలపై వర్తమానం ఆలోచనలో
సంస్మరణం గానో, పునర్ నిర్మాణంగానో

బాధల్ని పంచుకునే వెలుగులు
చీకటి మూటల్ని భద్ర పరుస్తాయి.
అనుకోకుండా ఆలోచన వంతెనలా
తన చేతులపై చూడని తీరాన్ని చేరుస్తుంది

పరుగు పందెం నుండి తప్పుకొని
అడుగులతో దూరాలను కొలుస్తూ
మధ్యలో ఆటంకం! ఎదురయ్యే అవకాశం
వర్షం! తుపాను! మంచు! కోసే చలిగాలులు,
అన్నిటికీ ఎదుర్కొనే ఉపాయాలతో
ఇవి మానవ కథలో భాగం! ఎప్పటికీ,

బ్రతుకులో చివరి క్షణం అపూర్వం
ఆ అనుభవం బయటపడే వీలే లేదు.
మృత్యువు వరిస్తుంది! ప్రాణిని ఒకేసారి
ఆ క్షణంతో జీవితం సమాప్తం, ఫుల్‌స్టాప్!

వీరుడు మనీషి ఉదారుడు, నిపుణుడు ఎవరైనా
ఎంత అవసరమయినా! తొలగి పోవలసిందే!

కాలం అద్దంలో కనిపిచే ముఖం!
అందరికీ కన్పించే మాట! వాస్తవం

❈

## 16. మానవతా హృదయంతో

పగలు ఎండలో గాలికి రేగే
బూది పొరల పై నుండి దూకుతూ
ఎప్పటికప్పుడు సరికొత్త ఉత్సాహంతో అశ్వం
సాయం వేళకు ఇంటి ముందు నిలుపుతుంది

దినమంతా  తిరిగి తిరిగి బయట
గడప దాటి లోనికి శరీరం! ప్రవేశిస్తుంది
పైన, గూటికి చేరే పక్షిలా
కింద, భద్రత కోరే ప్రాణిలా
ఇరు స్థాయిల్లో మనిషి!
ఒకే జీవన చలనం!

చిత్రం! వేసేందుకు! కలర్ బాక్స్‌లా కాలం
సమయ సమయం ఘటన ఘటన కొక దృశ్యం
చిత్ర శాలామయమైన అనుభవం
కవితలో భద్రంగా, కాలాంతర పాత్రలో

దేహంలో వెచ్చదనం కునుకు తీసినా
నరాలలో మంచు తీగె లల్లు కున్నా
తన దేహం తనకే బరువయి పోయినా
ఊపిరిలో కాలం పయనిస్తూ ఉంటుంది

ఎదురుగా  మంటలతో దృశ్యం
పరుగెత్తే, అశ్వానికి చిన్న బ్రేక్!
ఆర్పేసే ఆరాటంలో కొందరు
కారణాల ముచ్చటలో కొందరు

కవిత ఎపుడుబడితే అపుడు
ఎవరు బడితే వారిలో ఉదయించదు
కాలాశ్వంపై పయనించే సంకల్పంతో
స్పందమాన మానవతా హృదయంతోనే సాధ్యం!

❈

## 17. స్థితులూ - శాఖలూ

చెట్టు ఆకు రెప్ప చివర
పూల రేకు నుదురు పైన
ఆగి ఆగి వాన చినుకు! జారుతుంది
మోదమో? ఖేదమో? చూచే మనసుకు తెలుస్తుంది

చంద్ర బింబం తలగడ, తడిసిన
వెన్నెల జలం! వాస్తవమో? కల్పనో?
అనుభూతి దర్పణంలో బింబిస్తూ
చూచే దృష్టికి తెలుస్తుంది, వాస్తవం

ఉదయ మవుతూనే పై నుండి క్రిందికి
చుక్కలు దిగి చరిస్తున్నట్లు మనుషులు
ఔనో కాదో! చర్చలో తేలుతుందని కొందరు
కళ్ళు మూస్తే! చీకటిలో తెలుస్తుందని ఒకరు!

నిప్పు రవ్వ ఉత్తేజంతో వెలిగి
నేల రాలి బూది అవుతుంది
మంచు కణం శాంతంగా నిలిచి
గాలిలో ఆవిరై పోతుంది

సూర్యుని, అంశ లేని మనిషి లేడు
మార్పు వెనుక వెలుగు తలుపులు తెరచుకొనీ
కోరే పూర్ణతకు తెరచిన ద్వారం నిరసన
పొందనున్న మార్పుకు! సంకేతం పోరాటం

పాద రసం గుళికలవలె క్షణాలు దొర్లుతూ
ఒకటి నుండి రెండు మూడుగా విడిపోతాయి
ఇందులో మాయ మర్మం కన్నా వాస్తవం ముఖ్యం
ఉద్యమ స్థితులూ అంతే! చెట్టుకు శాఖల్లా!

❁

## 18. ఎవరి అస్తిత వారిది

ఎవరి అస్తిత వారిది
ఎవరి నడతలు వారివి
పోల్చి చూచే విషయ మెక్కడ?
దృష్టి కోణం దృశ్య భేదం వేరు వేరై

ఎవరు ఎవరిని మెచ్చినా
ఎవరు ఎవరిని చీల్చినా
ఎవరు ఎవరిని గెల్చినా
ఎవరు ఎవరికి వంగినా
చరిత్రలో అందరు మనుషుల చర్యలు
కాలానికి పలు రకాల ఆభరణాలు

దాహంతో దూపిల్లే గొంతుకు
గ్లాసెడు సలిలం అమృతం
జలధి లహరిని చూపిస్తే వేదన పోయేనా?
చెట్టు నీడన చరిస్తే దప్పిక తీరేనా?

రేపటి మబ్బులను తలచి
ఇప్పటి దాహాన్ని మరచి
స్వాగత రచనకు సిద్ధంగా
మోద ముఖం బయట పడేనా?

ఎంతటి తెల్లని వస్తు వయినా
చీకటిలో మరుగున బడిపోతుంది
ఒక్క వెలుగు ముఖం బింబం తప్ప
అన్నీ తమ ఉనికిని కోల్పోయేవే!

ఎప్పటినో విత్తులు స్మృతిలో నిలిచినవి
కవితా రూపంలో వన సుందరతను చూపేను

❋

## 19. మనిషి మనిషిగా

వంతెన క్రింద చీకటి ప్రవహిస్తుంది
ఇది వెన్నెల అయితే బాగని కొందరు!
నిశ్శబ్దంగా నిలిచి ఉన్న ఉపకృతి రూపం
అందరినీ అన్నిటినీ భరిస్తుంది వంతెన!

తన కఠినతలో ప్రయోజన గుణంతోనూ
ఉపయోగం లేని వస్తువు లేదని పిస్తుంది!
ఆలస్యం లేకుండా ఏ భేదం లేకుండా
ఇరువైపుల స్వాగత ముఖాలతో, మనుషులు
వంతెన దాటగానే జనపదాలు పట్టణాలు
జీవన సంరంభం, మనుషుల సమ్మర్దం

ప్రాణం ఉన్నంత వరకు బ్రతుకొక వాస్తవం
కల్పనలో అందని ఎత్తులో మరొక ప్రపంచం!

దాటాలిసి ఉన్న రూపాలెన్నో! బహు విధాలుగా
లోయలపై నుండి ప్రవాహాలపై నుండి
మానవీయ విజయ రూపాలకు చిహ్నాలై
జీవన యానంలో తప్పని సరివై! వంతెనలెన్నో!

ప్రవాహం రాకకై జలధి ఎదురు చూస్తుంది
వాగుల రాకకై నదులు ఎదురు చూస్తాయి

ఏదో ఒక రోజు జీవన గమనంలో
ఊరు విడిచి వెళ్ళక తప్పనిది కావచ్చు
పై చదువులకో ఉద్యోగం వ్యవహారం పైనో
మేలయిన బ్రతుకులకో! మరో మరో చోటికి

ఎక్కడయినా మనిషి మనిషిగా బ్రతకడంలోనే అందం
జంతువుగానో యంత్రంగానో మారడమొక! విషాదం

❋

## ౨౦. పచ్చని సిగ్నేచర్

సంఘంలో మార్పులకై తీవ్రవాద పథంలో
ఓటమి తలపుకు రాని మనో బలంతో
పోరాటం ఫ్రేములో నిలిచిన బ్రతుకులతో
అడవి లోకి! కొందరు
మూట కట్టిన అగ్నులై

భౌతిక  వాస్తవ శక్తులతో మానుషం
అంతరంగ సాక్షిగా మనిషిలో అస్తితను
మనస్విగా మనీషిగా తీర్చాలని సంకల్పం
ఎప్పటిదో? ఎందరిలోనో? ఎప్పటికీ కొత్తగా

తన ముఖం తన కళ్ళకు కనిపించదు
ఇతరుల కళ్ళకు బాగా కనిపిస్తుంది

క్షణ క్షణం నవం నవం సామ్యవాద రేఖలలో
వర్తమాన సమాజం ప్రజాస్వామ్య భూమికలో
అగ్నిలోని తేజం! జలంలోని ఆర్ద్రతతో
శ్వాసలోని ప్రాణంతో భూమిపై విశ్వంతో
నవ మానవ చేతన కొక
సృజన హృదయ మవసరం

తెలియాలిసిన దెంతో ఉన్నా ఎక్కడికక్కడే మజిలి
ఒక ఊరు! ఒక నగరం! ఒక దేశం! ఒక మనిషి

విషాద రేఖలతో దొరికిన ముక్కలతో గతం
ఎప్పటికీ! మనిషిలో పరిశోధనా నిలయం

ఉన్న స్థితుల ముద్రలతో మనిషి గురించి ఆలోచన
కవితయై! చెప్పదగిన గుర్తులతో మనిషిని చూపిస్తుంది

చినుకు పడిన ఆనవాలు పరివర్తనలో
తడిసిన నేలపై! కాలం సిగ్నేచర్ పచ్చగా!

❊

## 21. సారీ! ఒకటే మిగిలింది

ఉదయం ప్రతి వ్యక్తిలో
తనతోనే మొదలయినట్లు ఉంటుంది
అస్తమయంతో మాత్రం
తనకే సంబంధం ఉండదు

ప్రతి కంటికి చంద్ర బింబం
శిశువు నవ్వు ముఖంలా హ్లాదంగా
చంద్రునికి నిలయమైన రాత్రి
వృద్ధులా పక్కకు తొలగుతుంది

చెట్టు నుండి ప్రతి ఒకరికి
పూవు ఫలం నీడ కలప మరొకటీ
ఎండి పోయే ఎండలలో అయితే
విషయం తెలిసీ తెలియని స్థితిలో

వసంతాన్ని మరచి మనసు ఎంతకాలమయిందో?
శిశిరం ఇంకా తిష్ఠ వేసికొనే ఉంది
వర్షా నృత్యం చూచే ఉబలాటంతో
ఎదురు చూచి ఎదురు చూచి కళ్ళు వాలిపోయేను

ఎన్నికలై రాజకీయ నేతల సంరంభం
పీఠంపై అలవి కాని మోజుతో
నిరాశలో క్రుంగి మునిగిపోయే సమయంలో
ఉపద్రవం అంచులలో దేశం కనిపిస్తుంది

తమకు కావలసిన సైజులో
అవకాశాలను కత్తిరించి ముక్కలుగా
ప్రజల పట్ల సమానతకు బహుమానం!
రాజకీయ విజయానికి సన్మానం
తిరుగలబడిన ప్రజాస్వామ్యం! గుర్తుపట్ట రాకుండా
పొరపాటొ! గ్రహపాటొ! “సారీ” ఒకటే మిగిలింది

❈

## 22. అంతా మెలకువ లోనే

నిజ సుందర వనంలో మస్తిష్క శాల
పరిశోధనకు నిలయం! ప్రయోగాలకు ప్రేరణం
బాగుంది, మంచి విషయం! విజ్ఞాన మయం
అపూర్వమైన బాంబు! అన్వేషణలో బృందం

మేధావుల శ్రమ ఫలించింది
విజయం మేధను వరించింది
ఎగిరి గంతు లేసేంత ఆనందం
వైజ్ఞానిక కీర్తి, ఆకాశ పతాక అయింది

అంతా మెలకువ లోనే
ఇది కల కాదు సుమీ!

శత్రువుల వేట మొదలయి
అర్హతలో మొదటి దేశ మేదో?
బల నిరూపణంలో
ప్రదర్శన మొకటే మిగిలింది

ఇదో అనితరమైన బాధ్యత
అదీ జరిగింది! విస్ఫోటం!
ఒకటి కాదు, రెండు చోట్ల
పచ్చదనం పొగలతో నిండింది

ప్రాణులపై ప్రకృతిపై బీభత్సమొక విషాదం!
బూదిలో మానవత మరో జన్మకై చూస్తుంది!
నిప్పంటిన మానవతా ధర్మం
అగ్ని నుండి పొగల సందు నుండి
పరుగెత్తే భయ దృశ్యం!
ఫోటోలో భద్రంగా

ఇది కల కాదు సుమీ!
అంతా మెలకువలోనే!

❉

## 23. ఆశాపతాక

మనిషి చెట్టు కాదు
మనసు మబ్బు కాదు
ఇది ఒక భావనలో సంకేతం
ఇది ఒక కల్పనలో ఆనందం

మనిషి చూపు పైన! చుక్కల దాక
భూమి పైన అదే! ముఖాల దాక

మట్టిలో విత్తులా ఆశ మనసులో
నీటికై మొక్కలా నిరీక్షణంలో

ఎదగడానికెన్నిటి సహకారం కావాలో?
ఎదిగి తాను ఎందరికుపకారం చేయాలో?
శూన్యాన్ని ఆవహించి సంతోషంగా
తమ అస్తితను చాటుతాయి స్పష్టంగా

వ్యక్తి శక్తి పునాదిపై సమాజ రూపం
సంఘ శక్తి ప్రేరణతో వ్యక్తి వికాసం

అడవిలో గాలి వానకు గుహను చేరితే
హఠాత్తుగ భూకంపం బయటికి రప్పిస్తుంది
బీభత్స ప్రభావం నుండి
సంక్షోభ క్షేత్రం లోకి

తోటలో చెట్లపై గూళ్ళలో పక్షులు!
పేలిన తుపాకి ధ్వనికి అంతా ఖాళీ
అభయ నిలయ మనకునే సమాజం
మారణ భయ ముద్రలు వదలుతుంది

ఏదో కారణాన అడుగు బయట పడీ
గ్రామం దేశం సరిహద్దులు దాటి
మనిషి విశ్వమయమై, మనసు మానవంగా
అలవలె ఆశా పతాక! స్వేచ్ఛకు సంకేతం

❊

## 24. అమ్మ ఒడి నుండి

అమ్మ! ఒడిలో నుండి మొదలు
స్వర్ణ సింహాసనం పై కోరిక
ఊగే ఊయెలలో నుండి మొదలు
సుఖ జీవన యానంపై మక్కువ

చంద్రబింబం అందుకునే లేత ఊహ
శిఖర తలం మీరే ఈహకు సూచిక
రుచి తెలిసిన శైశవ స్మృతి గుర్తులలో
అంచులు తాకాలని మళ్ళీ మళ్ళీ

చిన్ననాటి అనుభవ మూలాలతో మనస్సు
మనిషిని నడిపిస్తుంది ఎపుడేపనికైనా
అవసరానికి చేతిలో సంచితో బయలుదేరి
తన కొర్కెల చిట్టా బయటకు తీసేను మనిషి!

ప్రవహించే కాలానికి కట్టలు కట్టి
పాయలు పాయలుగా తన వైపుకు
మరలించాలని బ్రతుకు పంటకై
మూసిన అరచేతిలో అదృష్ట రేఖలతో

దూరం నుండి గాలులు! ఎడారి వేదనలను
తీరిగ్గా మోసుకొచ్చి వినిపిస్తాయి
చల్లని ఊహకు వెచ్చని స్పర్శతో.

నిశీధి పోతూ పోతూ మరచిన బాగ్ లా నీడ
చెట్టు క్రింద, మనిషి వెనక, గోడ పక్క చేరి
మనిషిలోని ఆశకు ఊపిరి తాడు బిగించి నడిపిస్తుంది

ఉదయం వెలుగుకూ సాయం వెలుగుకూ తేడా
స్వాగత ముఖానికీ వీడ్కోలు ముఖానికీ ఉన్నంత !
శైశవం నుండి చివరిదాక!
ఎన్ని ఆశలో! పాత్రలన్ని !

❋

## 25. ఎవరి మజిలి వారికి ప్రియం

ముందుకు వెళ్ళే ఆలోచనలో
ఎవరి మజిలి వారికి ప్రియం

నుదురుపై అనల రేఖ
కనులలో నీటి చుక్క
ఏదో ఒక సందర్భంలో
తప్పనివీ జీవన గతిలో

తలపై సూటిగ పయోద శకలం
ఎప్పటికీ వేలాడేది కాదు
రావలసిన సమయంలో
అది! కనిపించక పోతే
కర్షకుని ముఖాన బూది రంగు చిత్రం
గుండెలో మాత్రం! అనల కణం తేజం!

రాత్రి ఎంత భయదమయినా
చల్లని స్పర్శకు కొదవలేదు
పగలు ఎంత అభయమయినా
బాధల తలుపులు మూత బడవు

శత్రుత నెవరూ ఆహ్వానించరు
అయినా చకితంగా చేరుతుంది
మిత్రత నెవరూ నిరాకరించరు
ఎక్కడ బడితే అక్కడ దొరకదు

నేలపై నీటి చుక్క ఇంకిపోతుంది
అశ్రుకణం వేడికి నేల కోష్ణమవుతుంది
నేలపై నెత్రు చుక్క కణకణలాడుతుంది
దారిలో అడుగుజాడ బంధువు అవుతుంది

ఉదయం పరచిన వెలుగు తివాచిపై
నడచే! అర్హత ఎవరికి ఉంది?
భయం లేని హృదయాలకు తప్ప!
మానవతా బంధువులకు తప్ప!

❋

## 26. వస్తువు కాదు మనిషి

స్టీలు అల్మైరాలో భద్రపరచే
వస్తువు కాదు! మనిషి అంటే
మనిషి తెలుసుకోవలసింది, ఉంది, ఒకటి
అది, తానొక వివణి వస్తువు కాదని

జీవ శక్తి మనోగుణం రెండూ కలిసి
వేరు జగత్తుతో ఒక స్వతంత్ర రూపం!

రోజూ పెరిగే సమాజ సంబంధాలతో
ఎప్పటికపుడు విస్తృతిలో జీవితం
విశ్వ సమాజ దృశ్యంలో భాగం
నలు వైపులలో క్రియాలోల రూపం

మెరపు, మనసులో ఊహను కదిలిస్తుంది
పిడుగు, పాటు ప్రాణానికి క్షతి అవుతుంది
రెండిటి పుట్టుక స్థానం ఒకటే
అది ప్రాణద జల నిలయం! మేఘం!
ఒక క్రియతో క్షణాలు వికసిస్తాయి
ఒక క్రియతో క్షణాలు స్తంభిస్తాయి!

అణగిన బ్రతుకులు అనల కణాలయ్యే బదులు
దండలో పూవుల వలె అలరాలి అని కోరిక సహజం

చూపులో అనుమానం పొర లొకటొకటీ
ఆపదో ఘర్షణో నేరమో హింసయో
సందేహం పూర్తిగ తొలగితేనే
కనిపించే ముఖంలో నీడలు! పోయేదీ

పయనంలో వర్తమాన మొక తప్పని వాహనం
తనలో మనిషిని తీసుకపోతూనే ఉంటుంది
ఎంత దూరమయినా గమ్యం చేరుస్తుందనే
నమ్మకం! ఇది వాస్తవ స్థితి రూపం!

❋

## 27. మానుష ప్రకాశం

వీధిలో పూర్వ మిత్రం హఠాత్తుగా ఎదురయి
మనసు వెలుగుతుంది. స్నేహ సుందర శిల్పంతో
ఎంత కాలమో మాగి మాగి పొందే విశేష రుచితో
అనుభవ రూపం! ముఖాన చిరునవ్వు మెరుపుతో

ఆ క్షణం మానవం విరిసిన హృదయ పుష్పం
బయట చీకటిలో వెలిగిన దీప మిత్రం
పరిచయమో! అనుబంధమో! గత మొక విప్పిన పొట్లమై
ఆ కాసేపు కాలం ఆగుతుంది పంజరంలో పక్షిలా!

బీరువా నుండి బయటికొచ్చిన పాత పుస్తకంలా
పొదిలో నుండి పైకి లేచిన బాణంలా
అమర్చడానికి సిద్ధమయిన మందు పాత్రలా
బయటకి తీసిన పాత సంగీత వాద్యంలా
ఒకరొకరు! అపుడపుడు ! ఇలా ఎందరో
ఒక్కొక్క నేపథ్యంలో విభిన్న రూపాలలో
ఇలా చెప్పుకపోతే, కవితలో దూరగలవి ఎన్నో!
అన్నీ ఒక చేట చేరిస్తే! పూర్వ సమాజం ప్రతి రూపం

మా మాటలు సన్నని తొలకరి చినుకులతో పోటీ పడుతూ
రహస్యమెరుగని శిశు హృదయంలా మనోరూపం.
పక్క నుండి వాహనం దూసుకపోతుంది
ప్రమాద మయినా మృత్యువయినా ఆగవలసిందే!
ఇది శుభ్రమైన అంతరంగ సందర్భం
కాలం తిరుగుతుంది దీని చుట్టూ!

గాలిలో ఎగురుతూ దారం తెగి పతంగి
గాలికి చెట్టు కొమ్మ అంచు నుండి మాపై
జారి తట్టి మరీ మా పనుల్ని గుర్తు చేస్తుంది
పరిమితులెరగని ఈ సందర్భం నుండి
కొత్త సృజన ప్రకాశంతో నేను,
కదలే కాలం అలలపై అడుగులతో తేలిగ్గా !

❋

## 28. కాలం అలలపై తేలిగ్గా

కవిత వస్తుంది చెప్పకుండా నిశ్శబ్దంగా
అశాంతిలో, అలజడిలో ఘర్షణలో, హర్షణలో
ఆ సమయం సృజనకు వశమవుతుంది
నిమిత్త మాత్రంగా కవి తన పాత్రను నిర్వర్తించేను

పలు వైపుల నుండి ఎన్ని దారులకో కేంద్రం!
తెలిసినవీ తెలియనివీ బ్రతుకులతో మనుషులు

అమాంతం వచ్చి పోరాడే శిశువులా
కవిత! గుండెపై కూర్చుంటుంది
గుండె అణగిపోయే భయంలేదు
మొత్తగ మనసును ముబ్బుల్లో చేరుస్తుంది.

చంక నెక్కుతుంది బుజం చేరుతుంది
దూర దూరం సైగలతో నడపిస్తుంది
ఎంత దూరమైనా ఏ సమయం అయినా
తన నిర్దేశంలో! అడుగు సాగవలసిందే!
కాలం గడచే కొద్దీ! ఒకటొకటీ అనుభవం!
జారిన సమాజ చరిత్ర శకలాల్లా స్మృతిలో

ప్రతి కవిత! మొదలు పెట్టగానే
అదే! చివరది! అనన్యమనిపిస్తుంది.

నిశ్శబ్దంలో శబ్దాన్ని ఆలకించడం ఒక పని
ఆలోచన ఆకాశం అంచులు చూపిస్తుంది
స్పందనలో మానవ కథలను వినడం ఒక పని!
ఏ మాట వ్యర్థం కాదు, అర్థం దారి తప్పదు

కవిలో మరో జగత్తు కొత్తది బయటికి
మార్పుకు సంకేతమై నవతకు నికేతనమై.

❋

## 29. మనోజ్ఞ తెలంగాణ

ఇది మనోజ్ఞ తెలంగాణ! జన చేతన ఖండం
ప్రతి ఉదయం వెలుగుతుంది! ప్రగతి కిరణ బింబం
చల్లబడిన అనల వేడి శాంతి కిరీటంతో
ప్రతి దినమూ కదలుతుంది! విజయాశయ రూపం

ఇది విభాత తెలంగాణ! ప్రతి పౌరుని హృదిలో
చీకటి రోజును తొలగించే మానవ తేజం
కత్తి బదులు ఎత్తిన పిడికిలి! దీక్షా రూపం
ముందుకు నడిపించే స్వేచ్ఛా సంకల్ప బలం

ఇది మనోజ్ఞ తెలంగాణ! నవ జీవన రూపం
ఊరు అడవి కొండలు నది పొలాలు తోటలతో
పరిమళ పవమాన యాన సుందరతర రుచితో
చరిత్ర కెక్కిన ఘన పద పురా స్మృతుల పేటిక.

ఇది వికాస తెలంగాణ! జన మత మార్గంలో
అమర వీర త్యాగ ఫలం! విశేష విజయంలో
స్వేచ్ఛ లేని పనికి రాని సందర్భం తొలగీ
సమత నవత భవిత కోరు సమాజ నిర్మాణం!

ఇది మనోజ్ఞ తెలంగాణ! రంగుల ఇంద్ర ధనుసు
ఆర్త రవం బదులు ఇపుడు! వీధులలో నుండీ
ఆర్ద్ర హృదయ స్వరం! విశ్వ విపంచీ నాదం
చివరి శ్వాస దాక తోడుగ! మానవ మొకటే.

❀

## 30. స్వతంత్ర తెలంగాణ

ఇది స్వతంత్ర తెలంగాణ! చుట్టూ వెలుగులతో
కళ్ళు తెరచి ఉన్న పగలు కూడ కనిపించని
క్రమ్మిన చీకటి తొలగిన దృశ్యం! రమణీయం
గుండెలపై నిప్పుల కుంపటి తొలగిన మోదం

ఇది మనోజ్ఞ తెలంగాణ! కాలానికి ప్రియమై
నేల గాలి నీరు విధులు నియామకాలన్నీ
నిజ కథలో పచ్చని బ్రతుకుల కవకాశంతో
ఇక్కడివీ! ఈ ప్రజలవీ! స్వేచ్ఛా చరిత్రలో

ఇది ప్రబుద్ధ తెలంగాణ! ప్రజ మేల్కొన్న నిజం
పాత కోట గోడలతో పనిలేలే లేదు
పాత కత్తి వాదరతో పని లేనే లేదు
కావలసిన శాంతి హంస! అది మన హృదిలోనే

ఇది మనోజ్ఞ  తెలంగాణ! హక్కుల రక్షణ మతి
దాచ బడిన నిజం గెలుపు ప్రజలది విశ్వానిది
ధ్వంస రచన మాటలేదు, తెరచిన తలుపులతో
మార్పుకు స్వాగతం! జన చరిత్రకు సన్మానం

ఇది నిశాంత తెలంగాణ స్వేచ్ఛకు పథ సూచిక
ప్రతి హృదిలో కిరణమొకటి, కలిసిన కిర్మీరం
అస్తమయం ఎరగని రవి బింబం తలపులలో
చరిత్రతో వెలుగు జీవితంలో నవోదయం!

❈

సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచనం సంస్మృతి– సందర్భంగా

“Poet is responsible for mankind and society” **- Lenin**

స్వేచ్ఛా కవిత్వం-73

# ప్రపంచీయం

## (దీర్ఘ కవిత)

మాదిరాజు రంగారావు



2017

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

SVECCHA KAVITHVAM - 73

# PRAPANCHEEYAM

## Long Poem

(Free-Verse)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2017

Presented

to

my wife

**Smt. M. Indira**

on her Birthday

# పీఠిక

ఎప్పటికపుడు కొత్తగా వికసించే భావన కవిత్వానికి జీవ ధాతువు. ఇది సృజన చేతనకు సంబంధించింది. దీని చేతనే రచనకు మౌలికమైన అస్తిత లభిస్తుంది. ఆధునిక కవిత్వం ఈనాటి జీవితమూ సమాజమూ స్థితులు సన్నివేశాలు ప్రయోజన దిశలుతో ఒక లక్ష్య సాధన కలిగింది. ఇది నిర్వివాదమైన అంశం. ఈ కారణంగా ఎంతో వైవిధ్యంతో కూడిన కవిత్వం వెలువడుతూంది. ఒక్కొక కవి ప్రత్యేకత ఒక్కొక విధంగా దృష్టికి వస్తుంది. ఇది కవిత్వ విమర్శకుల బాధ్యతను పెంచుతూంది. కవిత్వాభిలాషులకు పరిమితుల్ని విధిస్తూంది. ఇది చాలా ముఖ్యమైన విషయం. అయినప్పటికీ కవిత్వాభిమానులలో సహృదయత చేత కవి హృదయంతో సంవదించే గుణం చేత తాదాత్మ్యం చెందే మానసిక స్పందనం చేత ఆదరణను పొందుతున్నాయి. తమ అభిప్రాయాలకు దూరమయినప్పటికీ మన్ననల్ని పొందడం గొప్ప విషయం. ఇది ఉత్తమ సాహిత్య సంస్కార లక్షణం.

ఈ సద్భావనకు అధ్యయనం అనుభవం వివేచనంతో కూడిన మానసిక చేతన (Sensibility) బాగా ఉపకరిస్తూంది. ఈ భూమికలో 1) సామాజిక భావన – 2) ప్రజాస్వామ్య దార్శనికత 3) అనుభూతి విశేషం– 4) అభివ్యక్తి విధంతో కలిసిన విశిష్టమైన రూపం స్వేచ్ఛా కవిత్వంలో దృష్టికి వస్తుంది. ఈ సందర్భంలో ఒక మాట, ఒక్కొకరి కవిత్వంలో తమదైన పేర్కోదగిన ఒక్కొక్క విధమైన విలక్షణత వేరువేరుగా అనుభవానికి వస్తుంది. ఈ స్థితి complimentary proposition ను పొందింది. పరస్పరం ఉపయోగితను కలిగింది. ప్రజాస్వామ్యమయినా మరొకటి అయినా దార్శనికత స్వేచ్ఛా కవిత్వానికి వెన్నెముక లాంటిది. 1) సామాజికత 2) వాస్తవికత 3) మానవ శక్తి 4) మానవీయం నాలుగు చక్రాల వలె పని చేస్తాయి. ఈనాటి కవి మనోరూపం పలు దిశల నుండి దారులు కలిసిందీ, పలు దిశలలోకి దారులు కలిగిందీ కేంద్ర స్థానాన్ని వహిస్తూంది. ఇది కవిలో జాగరూకత అవసరాన్ని మరింత పెంచుతూంది. ఈ దృష్టితో ఇది వర్తమాన స్థితి చిత్రణ కావ్యం. ప్రజాస్వామ్య సమాజంలో వేగంగా వస్తూన్న పరివర్తనం మూలంగా విభేదాలు విభిన్నతలు వైరుధ్యాలు తప్పని సరి అవుతున్నాయి. ప్రత్యక్షంగానో పరోక్షంగానో కవి ప్రమేయం ఉండవలసి వస్తూంది,

ఉంటూంది. ఇది పూర్తిగా కళాత్మకం కాదు. ఇక్కడ మరో విషయం – స్థూలంగా 1) వ్యక్తి – సమాజం 2) జీవితం – మానవీయం 3) మనుషులు మనస్తత్వరీతులు 4) వాస్తవం – దార్శనికంతో సాగే ప్రధాన స్రవంతి (mainstream) కవిత్వానికి సమాంతరంగా ప్రాంతీయ దళిత స్త్రీ మైనార్టీ వాదాలకు సంబంధించిన ఉపశాఖలు సరిస్తూ కన్పిస్తాయి. కవిత్వ విషయంలో సృజన స్వేచ్ఛను రుజువు చేస్తూంది. ఇవి Complimentary Opposition గా, దృష్టికి వస్తాయి. పర్యవసానంలో ఇవి పరస్పరం పూరకాలుగా, పూర్ణత (Totality) కు దారి తీసేవిగా, ఆయా మార్పులకు దారిని సుగమం చేసేవిగా పరిణమించడాన్ని గమనించవచ్చు.

ప్రపంచీకరణం (globalisation) లేదా వైశ్వీకరణం ప్రభావం కవిత్వంపైనా ప్రసరించడం సహజం. దేశాల సరిహద్దులు దాటి వివిధ రంగాలలో మానవ సంబంధాలు పెరిగి "ప్రపంచీయ" భావనకు ప్రాధాన్యం పెరుగుతూంది.

"The poet must be at the centre of affairs and events"

–మాయాకొవిస్కీ –

ఈ మాటలు సామాజిక యాథార్థ్యంలో కవి కర్తవ్యాన్ని ఆవిష్కరిస్తాయి.

ఈ కృతి మనిషి నుండి సమూహాలకూ సంఘానికీ సంకుచితం నుండి విశాలతకూ వైవిధ్యానికీ  వ్యక్తి కోరికతో మానవీయ స్పందనకూ పయనింపజేస్తూంది. మనిషిలో మనస్వినీ మనీషినీ అవతరింపజేస్తూంది. మానవ శక్తి సంపన్నతను గుర్తుకు తెస్తూంది.

**"అడవిలో పులి నుండి బయట పడడం బహు సులభం**
**కనిపించకపోతే, తన దారిన తాను పోతుంది,**
**మనిషి నుండి మనిషి తప్పించుకోవడం కష్టం**
**కనిపించకపోతే దారులు కాచి వెదకి వెంటబడేను"**

ఈ స్థితిలో కవిత్వం మనిషిలో ప్రకాశానికీ వికాసానికీ ఉన్నతికీ ప్రగతికీ ఉపకరిస్తుంది. ప్రజాస్వామ్య దార్శనికతతో వెలువడే స్వేచ్ఛా కవిత్వంలో విపులతనూ వైవిధ్యాన్ని సందర్భానికి తగిన ప్రత్యేకతను భావింప చేస్తూంది దీర్ఘకృతి "ప్రపంచీయం".

**– మాదిరాజు రంగారావు**

## ఆలోకనం

# సృజన యాత్ర

"ప్రపంచీయం" – దీర్ఘకృతి, వస్త్వైక్యం కలిగింది. అవగాహనలో సౌలభ్యం కోసం ఖండాలుగా రూపొందింది. వస్తువు ఒకటే. విషయాలు వేరు వేరు. వర్తమాన సామాజిక వాస్తవికతను కలిగింది. మానవీయమైన భావనతో వ్యక్తిలో అవసరమైన విలువలతో తీర్చబడింది. ఏదో ఒక కోణంలో ఇప్పుడున్న స్థితిగతులు స్ఫూర్తికి వస్తాయి. ఇందులో దార్శనికతను గురించి మొదటి నుండీ నా రచనల్లో స్ఫుటంగా దృష్టికి వచ్చే ప్రజాస్వామ్య సామ్యవాద ఛాయలు కనిపిస్తాయి. కవితాత్మకమైన ఆవిష్కారంలో రచన ప్రత్యేకతను భావింపచేస్తుంది.

ఈ ప్రపంచం భూలోకానికి సంబంధించింది. "ప్రపంచీయం" ఇక్కడి సమాజానికీ, జీవితానికీ, మనుషులకూ, ప్రవర్తనలకూ, లక్ష్యాలకూ సంబంధించింది, ప్రశ్నించే హక్కు ప్రజాస్వామ్యంలో తప్పనిదీ, అవసరమైందీ. జవాబుదారీ తనం పాలనాపరంగా నిర్వాహకులదే. పౌరులుగా బాధ్యత వ్యక్తులదీ. ఇది సమాజ పరిణామంలో భాగంగా వర్తిస్తుంది.

"ప్రశ్నతో ముందుకు జవాబుతో వేగంగా
స్వేచ్ఛలో సమాజ ప్రగతి ఆచరణంలో"

ఈ రచన అంతరంగ ప్రకాశాన్ని కలిగింది. ఇప్పుడు ఏర్పడుతూన్న కొత్త అవకాశాలూ, విశాలతరమవుతూన్న వ్యవహారాలూ, వ్యాపకాలూ, సాంకేతిక ప్రభావంతో మారిన జీవన స్థితులూ, పెరిగిన మానవ సంబంధాలూ 'ప్రపంచీకరణకు' దారి తీస్తున్నాయి. కొందరిలో ఈ పరిణామం పట్ల భయాందోళన ఉన్న మాట నిజం. అయితే ఈ మార్పు ఎదుర్కొనే తత్కాల పరిస్థితుల్ని బట్టి వస్తుంది. ఇది అనివార్యమైన వాస్తవం కూడా.

కవిత్వ విషయానికి వస్తే కవి దృష్టి–భావన–వ్యక్తిత్వం– దార్శనికం– లక్ష్యంతో సృజన రూపాన్ని పొందింది. ఇది సృజన చేతనకు సంబంధించింది. స్వతంత్రమైంది. కవిగా ఇదొక సృజన యాత్ర. విశిష్టమైందిగా భావిస్తాను.

**– మాదిరాజు రంగారావు**

# ప్రపంచీయం

## 1. ప్రశ్నతో ముందుకు

బాల్కనిలో రోడ్ వైపు కూర్చున్న
నాలో కదలే ఆలోచనకు బ్రేక్
దగ్గరలో ఏదో వస్తువు కాలే వాసనో!
కాలం చెల్లిన వెహికల్ వదలే ఇంధనం పొగో!
కాకపోతే మరొకటి! మనిషి వికృత చర్యో
ప్రాణం ఉక్కిరి బిక్కిరి అవుతుంది!

పక్కనే ముట్టించిన అగరు బత్తి నుండి
సన్నని తీగెలుగా సాగే ధూపం
పరిమళ స్పర్శతో గాలి ఆదుకుంటుంది
స్నేహ సుందరంగా అసౌకర్యాన్ని తొలగిస్తుంది

వరండాలో రోడ్ వైపు నిల్చున్న
నాలో పొందే అనుభవానికి బ్రేక్
దైనందిన కాలుష్య సమస్యల్ని మించి
అపుడపుడూ అలజడిలో తేలుతూ
మారణ స్వరంతో ఆయుధ శబ్దం
చెవి పక్క నుండి దూసుకు పోతుంది

ఒక విధం భయం తొలగేందుకు
ఒక తీరు ఆయుధం! చేరుతుంది
ప్రతి దశలో భయం పెరుగుతూనే
విధ్వంసంలో హింసకు పట్టం లభిస్తుంది

సంక్లిష్టంగా మారిన సంశ్లిష్ట సమాజంలో
తప్పని మలుపులతో ప్రమాదకర యానం
వెళ్ళే మార్గంలో ఉపాయాలెన్నో! అపాయాలన్ని!
అనుకునేది ఒకటి! జరిగేది మరొకటి! అయినా

ప్రశ్నతో ముందుకు జవాబుతో వేగంగా
స్వేచ్ఛలో సమాజ ప్రగతి! ఆచరణంలో

## 2. అశాంతి విజయం

విరిగిన కొమ్మలతో చెదరిన అమరికతో
నాశన దృశ్యం నుండి! పునర్భవంపై ఆశ
వ్యక్తి స్వార్థ చింతనలో గడచే బ్రతుకులు
వికాస శోభ తెలియని శిలామయ రూపాలు

క్రోధంలో వికార చర్యల పర్యవసానం
అవతలి పక్షంపై నిప్పులు చెరగే దాడులు

ఘర్షణలో దూరమైన శాంతి చక్రం
ఎత్తిన చేతికి అందని చంద్ర బింబం
మానస సరస్సులో ఈదే హంస లాగ
ఆలోచనలో అందంగా అలరుతుంది

తనలో ఒదిగిన జగత్తుతో క్యాప్సెల్ వలె రాత్రి
ఎవరి అనుభవం వారికి సుందరం అమూల్యం

సూర్యుని కిరణంతో దూరం తొలగిన చీకటి
మనుషుల ఆలోచనలో దూరే అవకాశం!
దేని దారి దానిదిగా కదలిపోయే బ్రతుకులు
కనిపించని జీవన సత్యానికి వాఖ్యాన రూపాలు

పదును కత్తి మొనపై పూవు పూయ వచ్చు
శ్మశాన ఫాలంపై చివురు చూప వచ్చు
సంక్షోభం వెనక నుండి ఉదార మతితో
శాంతికి యత్నం! ప్రతి మానవ కర్తవ్యం

మానవ హిత చింతన లేని మనీష
ఎంతటి శౌర్యంచే దీపితమయినా
మనిషి బలం ప్రకటన కొరక అవకాశం తప్ప
ఒరిగే దేమీ లేదు! అశాంతి విజయం తప్ప!

నిరసన ప్రతిఘటనల మధ్య మానవీయ దళాలతో
“శాంతి” పద్మం విరియనీ ప్రజాస్వామ్య సంస్కృతిలో

## 3. చెక్ బుక్‌లా

ఎన్ని రోజులు గడచినా
ఏ రోజూ కొత్త మనిషిలా పరిచయం!

ఉదయం హృదయం విప్పి మాట్లాడుతుంది
ఆనాటికి, సరిపోయే చేతన నింపుతుంది
పగలు వీలు వెంట పలకరిస్తుంది
తప్పని ఆకలి సిగ్నెల్ గురించి

సాయం అనుకోకుండా మొదలు పెడుతుంది
తీరని బాకి గురించి మరచి,
చేసిన అప్పు గురించి ఓపికగా
రావలసిన డబ్బు గురించి తీరికగా

రాత్రి మాట్లాడుతుంది చనువుగా
విరామ వేళ కలలను గురించి
గతం కదలుతుంది స్మృతి పథంలో
నింగిలో ఎగిరే ఎయిరొ ప్లేన్‌లా

రోజుకు ఆరంభ బిందువు ఉషస్సు
పరుగెత్తే కాలం ఆగే జంక్షన్ స్టేషన్

ఎంతటి అధికారం భాగ్యం లోనూ
కాలం ఏ ఒక్కరి సొత్తు కాదు
అందరికీ చెందే అవకాశంతో
సామాజిక చలనంలో ప్రతి వ్యక్తిది!

జీవన వాస్తవ చరణాలపై
మారే చర్యలతో దుస్తులతో
మారే తలపులతో విలువలతో
విప్పారిన అనుభవ చిహ్నంతో
నాలో వర్తమానం
బ్యాగ్‌లో చెక్‌బుక్‌లా

# 4. డైరి పేజి

ఉదయం క్షితిజంలా తెరచిన డైరిలో పేజి
గగనంలో కనిపించే పక్షుల వరసల్లా పద పంక్తులు

రాబోయే సమయం! ఎట్లా ఎదురయ్యేదీ తెలియదు
మనిషి బ్రతుకు! ఏ రేఖా చిత్రంగా మారేదీ తెలియదు
డైరి పైజిలో ఏ విషయ మవతరించేదీ తెలియదు
తెలియని క్షణాల నుండి తెలిసే క్షణాలలోకి!

రోజొక జీవన దృశ్య నిలయ రూపం
వ్యక్తుల అనుభవ ఫల సంపుటి డైరి

ఒక సమయంలో అందిన కరెన్సి నోటు విలువ
ఒక సమయంలో విప్పిన మయూర పింఛ శోభ
ఒక సమయంలో ఎదపై నిదురించే శిశువు
ఒక సమయంలో అంతా తారుమారు మెరపు ఘటనతో!

ఒక స్థితిలో జారే కన్నీటి బిందువులు
ఒక స్థితిలో రాలే ఆనంద భాష్పాలు
పేపర్‌పై అక్షరాలలో అమరుతాయి
అనుభవ రూపం మళ్ళీ తలపుకు తెస్తాయి

ఏ రోజు కారోజు
ఊహలతో చర్యలతో
కొత్త రంగు రేఖలతో
మారుతుంది! నిజ రూపం

మనిషి ఊహ ఈహ రక్తి శక్తుల
అక్షర ప్రకటన రూపం! ప్రతి పేజి
ఎండలో వానలో మంచులో చలిలో
ఇది విహార యాత్ర కాదు, ఆర్త రవం హోరులో
గాలులు వినిపించే కథలతో తరలుతూ
రైలులా విమానంలా స్వేచ్ఛా కవితాయానం!!

❀

## 5. కొత్త ముఖం

అమానుషం అసహనం విధ్వంసం అశాంతిలో
ఏదో ఒక బిందువు నుండి సృజన రూప మవసరం

బ్రతుకు తెరవులో విభేదాలు వివిధ వర్గాలలో
హద్దులు దాటిన దుర్నయ చర్యలచే సంక్షోభం
భూకంపం పెను తుపాను మరొకటి మరొకటి
విరుచుక పడు పంచ భూత ప్రకృతితో సమంగా

రాగం వీరం కరుణం శాంతం స్తంభాలపై
సమాజ నిలయం మనోజ్ఞ సంస్కృతి నిలయం

శైల మెంత ఉన్నత మయినా చలనం ఎరగదు
చెట్టు ఎంత పనికి వచ్చే దయినా నడవలేదు
ప్రవాహ మెంత గొప్ప దయినా స్థిరత తెలియదు
ఏది ఎంతటి దయినా పరిమితిలోనే తన బలం!

ప్రతిభ చేత మేధ ఎంత పూర్ణమయినా
మనిషి శక్తి కూడ కొన్ని హద్దులలోనె!

కాల చక్ర భ్రమణంలో రుతువు వెంట రుతువులా
మానవ జీవన గతిలో ముందుగ నిర్ణీతం కావు దశలు!

వైరుధ్యం వైవిధ్యంతో తప్పని విషమతలో
జీవన క్షేత్రంలో దిశ దిశ నుండీ ప్రబోధాలు
ఏది నిజం? అన్న ప్రశ్న ఎప్పటికీ తీరనిదీ
అగ్గి పుల్ల వెలిగితే చీకటి పోయేనా?

మారిన తేదీలో ! బ్రతుకులో కొత్త రోజు
మారిన పాత్రలో డైరీలో కొత్త ముఖం!
ఒకటి తర్వాత మరొకటి, వీడని కలతోనో
కరగే మంచు గడ్డలానో, వెలిగే కర్పూరం లానో
ఉదయం పరచిన వెలుతురు పేజిలో
పలు రంగుల అనుభవాలతో అక్షర పంక్తులు

## 6. తానొక వెలుగై

ప్రకృతి నదులు భూమి పంటలు సంపదతో
రవి శశి సాక్షులుగా మనుషుల జీవితాలు

జీవన చలనంలో అనుభవాల జ్ఞాపకాలు
మానస గుణ వర్తన రీతులలో ఆనవాళ్ళు

స్నేహం వైరం బంధుత పరిచయ కథలతో
మనిషిలోని శక్తితో సాగే సమాజం!
మంచీ చెడూ కలిసిన జీవన రూపం
మృత్యువుతో తప్ప! అన్నిటిపై యుద్ధానికి సిద్ధం!

శబ్దం పరబ్రహ్మ మేమో తెలియదు కాని
ప్రస్తుత మయితే! మనిషి హృదయ వశం!
బ్రతుకులో ఎన్ని స్థితులు ఎదురవుతాయో
కవితలో అన్ని ఊహలు వినబడతాయి!

నిశ్శబ్దం ఎక్కడుంది? నిద్రలో తప్ప!
మెలకువలో శబ్ద మయం! కాలం సర్వం
శబ్దంలో అర్థం ఆలోచన అన్వేషణలో
ఊహలు కవిలో నవ శబ్దమయంగా

ఒకే చోటు నుండి రావు ప్రేరణలన్నీ
వేరు వేరు దారులలో తీరులలోనే!

చీకటిలో కనులు మూత బడే వారూ
అంతలోనె నిదురలోకి దిగే వారూ
మెలకువలోనూ కనులు తెరచి ఉన్నా
సూక్ష్మమైన ఇంద్రియానుభవం లేని వారూ

ప్రతిభ పొద్దు పొడిచే దాక
ఎవరైనా వేచి ఉండవలసిందే!
ఆ వేళకు వెలుగుల ఆవాహనతో
తానొక వెలుగై పోవలసిందే
కవితకు ప్రేరణగా
బ్రతుక్కి సార్థంగా

❀

## 7. కాలం కవితయై

భౌతిక మానస జీవన స్థాయిలలో
కనిపించేవీ కొన్ని కనిపించనివీ కొన్ని
మనిషిని నిలిపేవీ ఆలోచనలో దింపేవీ
చుట్టూ గోడ తలుపు తెరిస్తేనే ముందుకు సాగేది

చైనా గోడ మనిషి క్రియా శక్తికి చిహ్నం
తాజ్ మహల్ గోడలు! కళా హృదయ రూపం
కోట గోడ! రక్షణలో భద్రతకు సంకేతం
ఇంటికి ప్రహరీ! జీవన స్థాయికి సూచిక

ఆలోచనలో గోడ! స్వేచ్ఛకు ఆటంక రేఖ
దొరికిన అవకాశాన్ని సృజన వదలుకోదు
శిలల మధ్య మొక్కలా ఎదుగుతుంది
చీకటిలో చంద్రునిలా వెలుగుతుంది

పంజరాన బోనులో ఖైదులో బంధనలో
పలు హద్దులలో! స్వేచ్ఛతో కొందరి బ్రతుకులు
మితి మీరిన స్వేచ్ఛలో! విపరీతపు పోకడలు
ఏ సమయంలో ఏమి జరిగేదీ తెలియదు!

మానవతా స్నిగ్ధత కోల్పోయిన సందర్భం
మనిషిని ఆటవికం వైపుకు నడిపిస్తుంది

చుట్టూ ఉన్న సమాజంలో సమత నవత ప్రగతితో
మనసును క్రమ్మిన వెలుగులతోనే కవి వ్యక్తిత్వం

మార్గాలు వేరు అయినా గమ్యాలు వేరు అయినా
కనిపించని గోడలు, పయనంలో ఒక శాపం!

నా క్షేత్రం నడకలో విశాలవని
నా లక్ష్యం బ్రతుకులో నవ సమాజం
చేతనతో కాలం కవితయై నాలో
మనిషిని తీర్చేను మనస్విగా, మనీషిగా

❀

## 8. తరంతరంపై

పడవైనా వాహన మయినా పయనం
దారి సాగినంత వరకు సాగదు
పోవలసిన దిశలో గమ్యం ముఖ్యం
ఇది జీవన గమనంలో అవసరం

పయనంలో చూడక తప్పదు దృశ్య పరంపర
అనుభవ జగతికి కొత్త రూపం చేరుతుంది

ఓటమిపై కోరిక! ఎవరికి ఉంటుంది?
వెనుక నుండి కనులు మూసి కౌగిలించుకుంటుంది
చీకటి ఎదలో బరువులు దింపుతుంది
విజయం! హృదిలో వెలుగులు నింపుతుంది

చీకటిలోనూ స్పర్శకు కన్నీరు తెలుస్తుంది
విషాద గిరులపై నుండి జారే
కన్నీరుకు జన్మ భూమి చీకటియే,
మొదటి పరిచయం ఇదే! దీని తరువాతనే వెలుగు!

అమావాస్య రాత్రి చంద్ర కళలా ఆశ!
సినివాలి యై నమ్మకాన్ని నిలుపుతుంది

మనిషి మనిషి మధ్య వంతెనలా పిల్లలు
చీకటి అవతలి గట్టుకు సులభంగా చేర్చేరు
కబోదితో పాటు కళ్ళు ఉన్న వృద్ధునూ
చేయి పట్టుకొనీ రోడ్డును దాటించేరు

పొద్దు పొడుస్తూనే బడికి బదులు
పొట్టకై బయలు దేరే పిల్లలు! ఇప్పటికీ
అమ్మతోనో నాన్న తోనో కదలేరు
పొలం దారినో తోట బాటనో నడచేరు

కొత్త తరంపై ఆశ
సమాజంపై నమ్మకం పెంచుతూంది
సాటి తరంపై ఈహ
జీవితంలో అభిలాషను నిలుపుతూంది

## 9. ఛాలెంజ్ అయినా

ఒంటరి తన మంటే ఎడారిలో
ఒకరే ఒకరు! ఒంటెపై పయనంలా
అపుడపుడూ జరుగుతుంది జీవితంలో

సందర్భం వాహనమై అనుకోకుండా
మనిషిని తిప్పుతుంది, కాలం తరలుతుంది
పలువురితో కలిసి బ్రతకడం! సామాజికం!

ఎడారిలో పయనం అవసరమనుకునే వారూ
అలసి పోయి నపుడు నీడ కనబడదు
దప్పి వేసి నపుడు నీరు లభించదు.
దారిలో తోడు దొరికే ప్రసక్తి లేదు
ఎవరైనా కనబడితే తన బోటి వారే
చుట్టూ వలయం మధ్యలో ఒంటరిగా

ఎండలో ఇసుకపై తళ తళ మాత్రం
ఆశగా ముందుకు లాక్కొని పోతుంది
అప్పుడున్న స్థితిని బట్టి ముందుకు పోవలసిందే
ఎక్వేరియంలో కదలే చేపలా మనో రూపం

"చినుకు పడక పోతుందా?" అని మనసులో
ధైర్యంతో పయనం ముందుకు సాగుతుంది

వర్షా లోల రాగం వినిపించకపోయినా
నాల్కపై నీటి చుక్క ఒలికితే చాలుననీ
పక్షుల కల రవం వినిపించకపోయినా
మనిషి మాట చెవిని పడితే చాలుననీ

ఇది కరువు కాలం కాదు
ప్రకృతి సహజమైన పరితాప విభాగం

పచ్చదనం కలగానే మిగిలేనా?
మానవ శ్రమ బిందువుతో నిజమయ్యేనా?
నిజమవుతుందనే! విజ్ఞాన శక్తిపై నమ్మకం
తరం నుండి తరానికి ఛాలెంజ్ అయినా!

## 10. శ్రమ సంరంభంలో

పచ్చని తలపులతో మైదానం పరచబడీ
ఉల్లాసంతో హృదయం జన విలోలమవుతుంది
చల్లని మాటలతో గాలి శ్రమను ప్రోత్సహిస్తుంది
జన సౌభాగ్యం దిశలో ఆలోచన ప్రసరిస్తుంది

మైదానంలో మనిషి! శ్రమ జీవన చక్రంలో
కాలానికి తగిన పనులలో కర్షకులు!
ఎడారి తనం ఒక కల్పనగా మిగిలేనా?
కాలెండర్ తగిలించే కొక్కెంగా మారేనా?

మనిషిలో ఒంటరితనానికి
మనిషితో సామాజికానికి
మధ్య! ఒక పల్చని తెర!
ఇది తొలగే యత్నమవసరం

అగాధం లేదు, వంతెన అవసరం లేదు
సరిహద్దుల బాధలేదు, ఆటంకం ఎదురు పడదు

ఒంటరి తనంలో ఏడ్పులు! కేకలు!
కనిపించని దూరంలో దృశ్యం!
ఆదుకునే మానుష శక్తికి అవకాశం మూతబడీ!
సామాజికంలో అరపులు! పిలుపులు!
కనిపించే దూరంలో దృశ్యం!
ఆదుకునే మానుషక్తుల కవకాశం తెరవబడీ

ఏ వినతికి వదలని పీఠం ఒంటరితనం
అనుకునేంతలో కదలే వాహన రూపం సమాజం
రెండిటి ప్రయోజనంలో ఎవరి దారి వారిది
వ్యక్తుల అస్తితకు చెరో వైపు అమరీ!

ఒంటరి తనం ఒంటెపై ఎడారి పయనం
వెచ్చని కిరణ స్పర్శతో ఉత్తేజం వికసిస్తుంది
కదలే జన పరిచయ రూపం! సామాజికం
శ్రమ జీవన సంరంభంతో పరివర్తన దృశ్యం!

❀

## 11. సార్థక లక్ష్యం

పలు దారులలో జన వాహన చలనంతో
జీవన ప్రేరణ నిలయం ప్రగతికి చిహ్నం నగరం
ముందుకు ఊగిసాగే అలలతో బాల సముద్రం
కలవక తప్పని మనుషులతో రహదారులు

ఘర్షణలో హింసను అణచేందుకు కర్ఫ్యూ
ఎరుపు రేఖల మధ్య నీలి రంగు బొమ్మలా
నిన్నటి ఆగ్రహ జ్వాలల మధ్య
కాలిన విషాద ఛాయా రూపం

మండే గాయాలతో కాలం
చల్లని పవన స్పర్శ కోరుతూంది
తీగెలు తెగిన సితార్ వాద్యంలా
సమయం! నిశ్శబ్ద ముద్ర వహిస్తూంది

చదువులు విపణులు కార్య కలాపాలన్ని బంద్
ఆయుధాల వాహన ప్రదర్శనం లేకుండా
రోజు గడచేట్టు లేదు! శిలా మౌనంలో మనుషులు!

సాయం సంధ్యతో పోటీ పడి విషాద దృశ్యం
ఉదయం! పత్రికలో అక్షర చిత్రంలో ప్రత్యక్షం
పొగ చూరిన ముఖంతో ప్రజాస్వామ్య తంత్రం

చీకటి చంద్రుని మింగేయ చూచేను
మబ్బులు సూర్యుని దాచేయ చూచేను

నిలిచిన కొద్దీ కాలం బ్రతుకును బెదిరిస్తుంది
నడచిన కొద్దీ కాలం బ్రతుకును నడిపిస్తుంది

బిగిసిన పిడికిలితో హక్కుల ప్రకటనం
విరిసిన చేతనతో మనుషుల పయనం

రాగం శౌర్యం కరుణ కలిసి మనిషిలో
జీవన రూపానికి సార్థక లక్ష్యం! కిర్మీరం

## 12. లెక్క పెట్టువలసి వస్తుంది

నాలో నిశ్శబ్దం మబ్బులా అలముకొనీ
అంతలో మెరపుతో పిడుగు వదలవచ్చు
మెరపులో రాగం పిడుగులో శౌర్యంతో
కరుణ జలం వదలుతుంది! ఆపై పచ్చని కవితకై

ఎక్కడో కేక! నిశ్శబ్దాన్ని చీలుస్తూ ముక్కలుగా
అంతలో! దిశావలయంలో నిశ్శబ్దం! యథాతథం
మౌనంలో నిశ్శబ్దం అణగి మణగి ఉంటుంది
ఎప్పటివో స్మృతులను బయటికి వదలుతుంది!

నిశ్శబ్దం శబ్దం చీకటి వెలుగుల
నాలుగు స్తంభాలపై జీవన నిలయం
కిటికీ తెరిస్తేనే గాలి వెలుగు లోనికి వస్తాయి
తలుపులు తెరిస్తేనే లోనికి మనుషుల కవకాశం

చుట్టూ వెలుగులు! పలు రంగులలో
నిజ రూపాలను కప్పేస్తూ బ్రతుకులో
వాస్తవం తెలిసేందుకు ఆరాటం! ఎంతో!
తెలిసిన దానిపై అనుమానం! సందేహం!

రెప్పపాటు మెరపు, కొత్త మనిషిని చూపుతుంది
మల్లె దండలా రాగం లోనో
కత్తి అంచులా వైరం లోనో
మనసుల నలంకరిస్తూ పోయేను!

సడలిన పిడికిలి నుండి జారే మట్టి
కర్షక జీవన చిత్రం తలపిస్తుంది
చినుకులకై మొగం వాచి ఉన్న భూమి
మనిషి శక్తి పరిమితులను గుర్తుకు తెస్తుంది

ఇపుడు రాత్రి చుక్కల్ని లెక్కపెట్టే కన్నా
స్వేచ్ఛలో హంతకుల్ని లెక్క పెట్టవలసి వస్తూంది

## 13. మేల్కొన్న చేతనతో

ఏకాంతంగా రాత్రి చీకటిలో
చుక్కలతో మాటలు నిర్భయంగా
ఎంత భావ సుందరంగానో
మసక వెలుగులో వ్యక్తుల పరిచయాన్ని తలపిస్తాయి

కదలే సముద్ర జలానికీ నిశ్చల తట భూమికీ
నిశీథి అంచుకూ సూర్యోదయ బిందువుకూ
ఊహకూ చర్యకూ దేశానికీ దేశానికీ
మనిషికీ మనిషికీ మధ్య విభజన రేఖ!
ఒక వైపు వెలుగుతో మరో వైపు నీడతో
ఉన్న మనసు మానవ శక్తిగ మారుతుంది

పాత పెట్టెలో ఎప్పటివో వస్తువుల్లో
స్మృతిలో వెలుగు నీడల అనుభవాలు!
ఎప్పటికీ వదల లేని సంగ్రహ రూపాలు
ఇప్పటికీ జీవితాన్ని ప్రభావితం చేస్తూ

విరామ సమయంలో జ్ఞాపకాలు మబ్బుల్లా
శ్రమ అవసరం లేకుండా ఒకటొకటీ
కొన్ని మౌన సుందరంగా కదలుతాయి
కొన్ని బాష్ప బిందువులు రాలుస్తాయి

గళం వరకు బాధలో ఎత్తిన ముఖాలతో
నివురు తొలగి మెరసే నిప్పు కనులతో

ఏకాంతంలో రాత్రి చుక్కలతో
ఎప్పటిదో ఈ పరిచయమన్నట్లుగా
కరుణ స్పర్శతో మాటలు!
విశ్వ బంధు రూపంలో!
పడమటి సూర్యుడు జలధిలో మునిగి
తూర్పున "శుచి"గా పైకి తేలినట్లు
చుట్టూ మేల్కొన్న జన చేతనతో
నాలో కవితా రూపం! ఆత్మీయమై

❀

## 14. సత్క్రియతో

ఆయుధం ఏ ఒకరి సంపద కాదు
ఎవరి స్వంతంగా నిలిచిపోదు
నలువైపుల చేతులలో వీలు వెంట
భద్రత రక్షణ పేరిట మారుతుంది

అందరికీ అందుబాటు లోది కాదు
అవసరానికి తగిన ఉపయోగం లోనే
ఘర్షణలో విజయానికీ శాంతిని కాపాడేందుకో
శిక్షణలో ఆరి తేరి ఉన్న మనిషి అధీనంలో

ఎపుడో వచ్చే యుద్ధానికి సిద్ధంగా ఉంటుంది
దైనందిన క్రమంలో శాంతి పాత్ర వహిస్తుంది
పరిరక్షణలో ఎక్కడికయినా బాధ్యతతో
మనిషిలో సదాశయాన్ని  సఫలం చేస్తుంది

మంచికే చెడుకీ కణ కణాన ఉత్సాహంతో
తన ఉనికితో చరిత్ర గతిని మారుస్తుంది

ఒకరు తరువు చాటు నుండి
ఒకరు గగన తలం నుండి
ఒకరు మనిషి కెదురు తీర్చి
గెలుపుకు సాధనమవుతూంది

రాయి నుండి మిసైల్ వరకు
శరం నుండి బాంబు వరకు
శత్రువు ఓటమియే లక్ష్యంగా
కాల జలధిలో కీర్తి నౌకగా

ముందుకు సాగవచ్చు మునగ వచ్చు
ఆయుధ బల తంత్రం పైనే ఇతిహాసం!
స్వార్థంలో జీవ కళకు ప్రేత రూపమిస్తుంది
సత్క్రియతో శ్మశానాన్ని పూల వనం చేస్తుంది

❁

## 15. ఆయుధాన్ని మరపిస్తుంది

మేల్కొన్న క్షణాలలో రక్షణ కవచంగా
నిద్రకు ఒదిగిన వేళ శాంతికి కాపలగా

పూలతో అందంగా ఉన్న తరువు
పెను గాలికి కూలిన విధంగా
నాశన కారణమై ఘర్షణలో
ఉన్నతి నుండి అవనతికి చేరుస్తుంది

భాగ్య దశలను మార్చిన ఆయుధం
ఎదురెదురు గానో చెట్టు చాటు నుండో,
ముందు నుండి రణ భటులను నడిపిస్తుంది
వెనక నుండి తగు చర్యకు ప్రేరేపిస్తుంది

ఆయుధం మనిషిని బంధిస్తుంది శాసిస్తుంది
చర్యలో ఏ మృగమో! తలపుకు రావచ్చు
చకితంగా జీవన దృశ్యం మారుతుంది
నెత్తురు రేఖలతో చిత్రాకృతి పొందుతుంది

స్వేచ్ఛలోకి బంధనలోకి
దీని నుండి మోచనలోకి
తల రాతలు మారతాయి
నిజ భూమిక మారుతుంది

మనిషి కనే కలలను సాకారం చేసేనా?
మానవ శ్రమ ఫలాన్ని సార్థక మొనరించేనా?

మనసులో పన్నే ఉపాయాలెన్ని విధాలో
రణంలో చేరే ఆయుధాలన్ని విధాలు

వేడి పాల పొంగులా సందేహాలు
సన్నని జల్లుల వలె సమాధానాలు

మేల్కొన్న కాలం కవితయై నాలో
హృదిని స్పృశిస్తుంది ఆయుధాన్ని మరపిస్తుంది

## 16. రుజురేఖలో

చేతినిండా పని ఉన్న మనిషి
బుజాలపై బాధ్యత ఆకాశమంత
స్నేహ గతికి గాలి ఉత్సాహమిస్తుంది
కాలంతో కాదిపుడు! మనిషి వెంట కాలం!

చీకటి పూర్తిగ అంతటా తొలగిపోదు
పోయినట్లయి మళ్ళీ మళ్ళీ వస్తూ పోతూంటుంది
వెలుతురుతో పాటు చీకటికీ ప్రవేశం!
నీడలా ఓడలా మబ్బులా మనసులో

కళ్ళలో నీరు పశ్చాత్తాపంలో
మనసులో మాలిన్యం తొలగిస్తుంది
కళ్ళలో వెలుగు! సదాశయ రుచితో
విషాద రేఖలను తుడిచి వేస్తుంది

అదే పనిగా గతాన్ని పట్టుకొని కూచుంటే
వర్తమానం కదలని శిల్పం అవుతుంది
నిరంతరం భావిని ఊహిస్తూ కూచుంటే
వర్తమానం అందని విహంగమవుతుంది

డైరిలో రోజు పేజికి
కవితను పొందాలని ఉబలాటం
ఆలోచనలో నావ లాగ తేలుతుంది
అనుభవ గతిలో విమానమవుతుంది

చేతిలో పని అయిపోగానే
కాళ్ళ కింద అవని తనకు వశం కావాలని
అడుగు తీసి అడుగు వేసే ఆ సమయానికి
పైని నింగి రాజ ఛత్రంగా అమరాలని

ప్రదక్షిణంలో పరిమితమవుతుంది స్వేచ్ఛ
రుజు రేఖలో స్వతంత్రమవుతుంది అదే

## 17. భవితకు సంకేతం

రైలు అయితే పట్టాల పైన వెళ్ళాలిసిందే
బస్సు అయితే తీర్చిన దారిన పోవలసిందే
నావ అయితే జలాల పైన తరలాలిసిందే
విమాన మయితే పవన పదవి ఎగరాలిసిందే

పయనానికి మార్గాలెన్ని విధాలో
మనుషుల నడతల కన్ని ప్రకారాలు
ఒకదాని కొకటి పోషకాలుగా
అలాగే దార్శని కాదర్శాలు! కూడా

నది కదలుతుంది పల్లంలో దారినే
రోజు కొక కొత్త దారిని ఎంచుకోదు
మలుపులుగా సాగుతూ పాయలుగా చీలుతూ
మానవ సమాజ చలన రూపం బింబిస్తుంది

మట్టిలో భాగమై పెరిగే మనిషి
మేడలో వాసమై ఎదిగే వ్యక్తి
హృదయ మొకటే! విశ్వ మయం
మతిలో ఊహలు! వేరు వేరు

బుజాలపై ఎత్తుకొని తిరిగినా
భవితకు సూచన కాదు గతం!
వర్తమాన చలనంలో మనిషి జీవితం
భవితపై ఆశతో నడిపిస్తుంది

జ్ఞాపకాలు పూవులై పరిమళిస్తే ప్రమోదం
జ్ఞాపకాలు మంటలై వెంటబడితే ప్రమాదం
జ్వలనం హననం నాశన రూపానికి కాళ్ళు
సమన్యాయం సమ భావం నిర్మాణానికి చేతులు

వర్తమాన చేతనలో భాగమైన కవిత
భవిష్యత్తు దర్శన రూపానికి సంకేతం

## 18. కవిత మారుతుంది

ఈ బ్రతుకు ఆరు రుచుల సమాకలనం
ఎవరికేది ఇష్టమో? అది వారి అధికారం
సృష్టి ఉన్నంత వరకూ ఏ ఒకటీ తొలగదు
బ్రతికినంత వరకూ! అన్నీ అనివార్యలే!

వర్తమానం వెనకనే సముద్రంలా గతం
ఎప్పటి నుండో నిన్నటి వరకూ పొంది
అనుభవంలో తేలిన సంస్కృతి శిఖరాలతో
మానవ జీవితాన్ని ప్రభావితం చేస్తుంది

వ్యథలో బ్రతుకు వృథా అనిపించవచ్చు
ఎదుర్కొనే శక్తి తోనే మనిషికి అస్తిత్వం
సానుకూల విజయ సాధనతో వ్యక్తిత్వం
నడక ఆగినంత మాత్రాన కాలం ఆగదు

ప్రపంచం తలుపులు తెరవబడీ ఎప్పటికీ
అయినా అనుమానం! సందేహం! వెనకాడే మనిషిలో
ఎక్కడ బడితే అక్కడ నిలిచేను! నిశ్శబ్దం వరించేను
చుట్టూ శబ్ద మయం! మాటతోనో! క్రియతోనో!

చీకటి వస్తుందని, ముందుగా కళ్ళు మూతబడేనా?
అంతలో వెన్నెల! ప్రత్యక్షం! మనిషికి ఊరటనిస్తుంది
ఇంటి ముంగిలిలో దీపం! మనసుకు ధైర్యం ఇస్తుంది
ఏ కల అయినా! మానసికంగా కాలక్షేపానికి మాత్రమే!

ఏది కవిత? ఏది కాదు!
ఎవరు మనిషి? ఎవరు కాదు!
ఏది బ్రతుకు? ఏది కాదు!
ప్రశ్నలకు జవాబులు ఎప్పటికీ సశేషంగా
వ్యక్తి నుండి వ్యక్తికి జవాబు మారుతుంది
కవి నుండి కవికి కవిత మారుతుంది

❀

## 19. రెండిటి సంబంధంతో

రాత్రికి వీడ్కోలు ఉషసుకు స్వాగతం
రోజూ ఉండే కార్యక్రమమే, అయినా
రోజు గడచి మనిషి వ్యక్తిత్వంలో మార్పు
చేతిలో మరో రంగు విలువ కార్డుతో

మనిషి వెనక గతం రాసులుగా
చరిత్ర వార్తలతో నిండిన మూటలతో
చిందర వందరగా పడి, కలిసిపోయి!
గతానికి చెందిన నిజం! కనిపించదు, వాస్తవం!
ఎక్కడో సమాచారం మెరపులా అందుతుంది
గుహలో సింహంలా అడవిలో దారిలా తెలుస్తుంది

ఎవరు శ్రమించినా ఎంత శోధన జరిపినా అన్నీ!
దొరికిన దారానికి గుచ్చిన కల్పనా సుమాలే!
దారిలో ఎగుడు దిగుడు! ప్రకృతిలో సహజం
ఎగుడులో ఆరోహణంగా దిగుడులో ప్రవాహ సమంగా
నడక సాగడ మొకటే! మానుష కర్తవ్యం!
నడకలో వర్తమానం పరచుకొనీ దారి ఇస్తుంది!

కూర్చొని కూర్చొని ఊహ జడమై
మార్పులేని శిలా రూపమయితే!
లేచి పది అడుగులు వేస్తే చాలు సమాజంలో
ఊహ కదలుతుంది, కవిత వెదలుతుంది, చేతనతో!

నడచి నడచి మనసు అలసి మందగిస్తే
మలుపు తిరిగితే చాలు! దిశ వేరవుతుంది
కొత్త దనంతో మనసు పునర్జవం పొందుతుంది
సమాజ మెప్పటికీ మార్పునే కోరుతుంది

భౌతికమూ మానసికం రెండిటి సంబంధంతో
సమ రస భావనతోనే! బ్రతుకుతుంది సమాజం!

❀

## 20. వర్తమానం నుండి

వర్తమానం నుండి భవిష్యత్తులోకి
లిప్త నుండి లిప్తకు రోజు నుండి రోజుకు
కాల విభజనతో జీవన గమనం ఒక లయలో

సుప్తంగా గుప్తంగా సూచనగా గతం
వెనక నుండి మనిషిలో అదృశ్య పాత్రలో
ఆది నుండి క్రితం వరకు ఎప్పటికీ

శిథిలాలను మరచి నిర్మాణం వైపు
వికలాలను వదలి నవ రూపం వైపు
అవసరాలలో రావలసిన మార్పులకై
అన్వేషణలో మానవ పయనం! నిరంతరం

నిద్ర నుండి నిస్త్రాణత నుండి నిస్సహాయత నుండి
బయట పడి మెలకువలో సక్రియలలో మానవ చేతన

జీవితంతో సమాజం సమాజంలో జీవితం
రెండూ కలిసిన రూపం వైవిధ్య ప్రపంచంతో

ఉన్న వారు లేని వారు చిన్న వారు పెద్ద వారు
ఏ స్థాయికి చెందినా, ఏ గుణాన్ని కలిగినా
ఎంతటి అడంబరంలో ఎంతటి విడంబనంతో మసలినా
మనిషి చివరి నిష్క్రమణం! సమాజంలో అతిథిగానే

వాస్తవం దార్శనికం భౌతికం మానసికం
కలిసి పని చేస్తేనే సమరస జీవితం

కాలి కింద భూమి పచ్చని పంటల భాగ్యంతో
శిరసు పైన నింగి మేఘ తతిని భవిష్యత్తుతో

మనిషిపై బాధ్యత మనిషిలో స్పందనం
మనిషి గురించి మనిషిలో చింతనం, నిర్మాణం!
కాలం నాలో జీవితమై కవితయై
ప్రతి హృదినీ స్పృశిస్తుంది, స్వేచ్ఛగా

## 21. నేడు నుండి రేపుకు

తీగెల వలె అల్లుకున్న చిక్కు సమస్యలకు
ఆకుల వలె పూవుల వలె నిర్ణయాలు సమాధానాలు

పరిమితులను దాటిన వ్యాపార వ్యవహారం
జీవితాన్ని శాసిస్తే మహా ప్రమాదం

పేదరికం లేని దేశం లేదు సంఘం లేదు
ఆశలపై మోజు చూపని మనిషి లేదు

ఆగని ప్రవాహం కాలం ఒడ్డున
భయపడి శిలలై నిలిచే వారూ
తోటి మనుషుల్ని మరచి పోయేరు
శిల్పికై ఎదురు తెన్నులు చూచేరు

ఇపుడు మతం ప్రాధాన్యం లేని విషయం
వ్యక్తి చుట్టూ వలయాకారంలో! మాత్రమే
వీటిని దాటిన అవసరమైన సమస్యలెన్నో!
వ్యక్తి వికాసం నుండి సంఘ పురోగమనం వరకూ

రణ మారణ పథం నుండి దూరమై
సామాన్యుని బ్రతుకులపై వెలుగులతో
స్వార్థానికి వ్యతిరేకంగా త్యాగానికి ఉత్సేకంగా
అభిమానం సంస్కరణంతో ప్రగతి శీల సమాజం!

అలజడి ఘర్షణ బాధలు మరపున బడి
సహనం ఆర్ద్రత కరుణం బయటికి వచ్చి
కవితలో వస్తువు మారుతుంది, నవ్యంగా
వర్తమాన సమాజ చింతన కేంద్రంగా

బయట శక్తి శబ్ద మయం
లోన శక్తి భావ మయం
నేడు నుండి రేపుకు పయనంలో
సందిగ్ధం తొలగి దార్శనిక పథంతో

## 22. నియతం నుండి

వర్తమానం వెనక కనిపించని గతం
బృహదాలోచనలో రాత్రి నక్షత్ర ముఖాలతో

అక్కడక్కడ శీర్ణమైన జీర్ణమైన శూన్యమైన
నిశ్శబ్ద స్థితులు! పలు విధాలుగా స్మృతి చలనంలో
ఇది తలుపులు తెరవబడని ఖజాన, ఇందులో
మనిషి వదలి పోయినవీ దూరమైనవీ ఎన్నో!

వర్తమానంలో ప్లాట్ ఫార్మ్‌పై మనిషి
ప్రతి సమయం పయనం భవితలోకి
స్టేషన్‌లో స్టాప్ లేని చోట అవసరమై
స్టాప్ ఉన్న చోట! అది పోయే దిశ వేరై

తాము  వెళ్ళే దిశ పొసగిన అనుకూలంలో
సిగ్నల్ వాలని స్థితిలో నిలిచిపోతుంది రైలు

పంక్తులుగా ప్రజలు! కూర్చొని రైలులో
తనలో ఏకాంతం! విహరణ సుందర వనం

రైలు పరు గిడుతూంది కవితా వేశంలా
స్టేషన్ నుండి స్టేషన్‌కు దృశ్యాలు మారిపోతూ

బయలులో పయనం నిరంతరాయంగా
సమాజ శక్తిని ప్రతి ఫలించే సవేగ రూపం

సమయానికి వికసించిన పద్మ దళాలతో
పయనంలో స్వాగత రూపంతో ఎదురవుతుంది

నిర్దిష్టమైన స్టేషన్ చేరుకొనీ రైలు
బయటికి రాగానే జన కోలాహలం
వివిధ గళ ధ్వనుల సంకలనం ఆర్కెస్ట్రాలా
ఏ స్వరం ఎవరిదో గుర్తించే వీలు లేదు
స్టేషన్ ఆవరణం దాటిన స్వేచ్ఛలో
నియతం నుండి ఆయతానికి పయనం

❀

## 23. ప్రపంచీయం

చూపు చూపిస్తుంది దృశ్యం
మనసు ఊహిస్తుంది నవ్యం

బాధకు ప్రేరణ రూపం కారాదు పాలన
స్థిర సంకల్పంతో ప్రగతి పథం అవసరం

భూమిలో సజీవమైన మూలంతో
పైన చివురు ఆకు పూలు ఫలాలతో
ఎదిగే వృక్షంలా జీవన రూపం
భౌతిక మానస సహ భావంతో అస్తిత!

వ్యక్తి దృష్టి భేదంతో మారే విలువలతో
ఏ ప్రమాణాలకూ పూర్తిగ అందనివీ బ్రతుకులు
ఎక్కడ మునిగి తేలేదీ తెలియదు
ఎప్పుడు మజిలి చేరేదీ తెలియదు

కొందరికి  దైవ మొక వ్యవహార సాధనం
కొందరికి లోలోపలి శక్తికి ప్రేరణం
కొందరికి రాజ్య తంత్రానికి, వ్యాపారానికి
మరి కొందరికయితే! ఆరోహణలో శిఖరం!

అంధకార విమోచనంతో కాలం ఉదయాన్ని పొందినా
మానవీయ కిరణ ప్రసారం ఎరగని బ్రతుకులు ఇంకా!

బాగ్య దశను పొందే అభిలాషతో
ఎంత దూరమయినా ఏ పని కయినా
సుగమ సుందర జీవనంపై ఈహతో
ప్రపంచీయ వేదికపై చోటుకు యత్నం

దీర్ఘమైన సమాజ పరిణామంలో
అనుకోని మార్పులకు సిద్ధంగా
తమ కలలను సాకారం చేసే! పనిలో
సామాజిక పథకం! ప్రపంచీకరణం!

❁

## 24. అనివార్యం

ఒక ఆర్థిక రంగానికి మితం కాదు ప్రపంచీకరణం
ఇది ఆర్థిక నీతి రేఖ నాశ్రయించి
జీవన విభాగాలన్నిటికీ వర్తిస్తుంది
మానవ జీవన చక్రంలో "డబ్బు" పాత్ర కీలకమై
శాసించే దశలో హృదయ మవసరం
ఇది జీవన స్థాయిని రూపిస్తుంది గ్రాఫ్‌లో

ప్రపంచీకరణంతో సర్వం తలక్రిందులయ్యే
అనుమానం ఛాయలతో కొందరిలో ఆలోచన
మార్పుల పద్ధతిలో వాద వివాదాలలో
ఎవరి అభిప్రాయం వారికి బహు ప్రియం

తరాల రీతుల మనుగడపై అనుమానం కమ్ముతుంది
స్వీయమైన వ్యక్తిత్వం పోయేనని వేదన కలుగుతుంది
పనికి రాని దేదో పై బడేనని భయం ప్రబలుతుంది
భవితను గురించి నిరాశ సందేహం రేగుతుంది
ఇది బహు ముఖీన పరివర్తన సంకేతం
వీలు వెంట కొత్త విధానాలు చేరడమూ సహజం

అస్తిత పోయేనని ఆందోళన తొలగే
గుర్తులు చెదరేనని ఆవేదన తగ్గే
కొత్త దాని పట్ల! విశ్వసనీయ క్రమంలో
సంశయ విలోలమౌ మనసుకు స్తిమితం ముఖ్యం
కాలం గడచే కొద్దీ తరం నుండి తరం!
కొత్తదనంలోకి సులభంగా వెళుతుంది

సమాజ హృదయానికి సన్నిహిత రూపాలు
సాహిత్యం సంస్కృతి కళలు జీవితంలో
ఎదుర్కోక తప్పనిదీ ప్రపంచీకరణం!
వేగం తగ్గవచ్చు కాని పరివర్తన అనివార్యం!

❀

## 25. తెరచిన అవకాశం

ప్రపంచీకరణ మొక మహా ప్రమాదకారిగా
తలచేరు కొందరు! భయాక్రాంతమైన అపోహలతో
హేతువుకు సరిపడని నమ్మకాలను వదలలేక
ఉద్రేకం పొందేరు! క్షోభకు గురి అయ్యేరు

ప్రాచీనం నుండి పలు క్షేత్రాలలో చరిత్రలో
ప్రతి దశలో మార్పులు! నాగరక వికాసంలో
ఇవి సంస్కృతి శిఖరాలకు సోపానాలయినాయి
ఇవి సమాజ పరంపరలో భాగాలయినాయి

స్థానీయం ప్రాంతీయం దేశీయం హద్దులు
చెరగిపోయి వైశ్వీకరణానికి చోటు లభిస్తూంది
తలుపులు తెరచిన సాంకేతిక విజ్ఞానం తోడై
ప్రతి దిశలో ఉత్తేజం విరియ పూసి
సమాజ చరిత్రలో కొత్త పుటలు చేరేను
సక్రియలో వేగం పెరిగి జీవనాధారం అయ్యేను

యథాస్థితిని కోరుతుంది ప్రతికూల స్పందనం
సంస్కరణలు కోరుతుంది అనుకూల విధానం
వికాస కారణ ప్రేరణతో ప్రపంచీకరణం
ఆర్థిక సామాజిక శక్తుల విశ్వ బంధు ప్రదర్శనం

తప్పని పరివర్తన స్థితుల పట్ల భయ భావంతో
అలవాటును వదలలేని చిత్తంతో కొందరు
అందరికీ అవకాశం ఉన్న ప్రజాతంత్ర స్వేచ్ఛలో
ప్రజలకు హితమైందీ పోటీలో నిలిచిందీ మిగులుతుంది

వ్యక్తిలో కష్టాల నెదుర్కొనే సహజ శక్తి
కుంఠితమై ఎక్కడి దక్కడ నిలిచే స్థితి రాకూడదు
ఆర్థిక సంస్కరణలో కొత్త ప్రణాళికతో
తెరచిన అవకాశం వినియోగంతోనే భవిష్యత్తు!

❀

## 26. వర్తమాన క్షణం

చెట్టుకు నిండుగ పూలలు చూచి ఒక బాలిక
పరుగున వచ్చేసి తెంచేందుకు చేయి చాచింది
ఆ దారిన పోయే పెద్ద మనిషి చూచాడు
"అమ్మాయి! ఈ పూలు కోయకు
అలాగే! ఉండనీ! నిండుగా" అన్నాడు
"రేపు ఉదయానికి రాలి పోతాయి
మట్టిలో కలిసి పోతాయి" అన్నది
వీటి ఆయువు ఈ రాత్రి వరకే
ఈ సాయం వేళ కోస్తే -
ఈ రోజు అవసరం తీరుతుంది"

అతడు వింటూనే నడుస్తూ మౌనంగా వెళ్ళాడు,
ఆమె క్షణాలలో పూలు కోసింది
సంచిలో వేసుకొని బయలు దేరింది
ఎవరి అవసరం! కోరిక వారిది! వర్తమానంలో

ఈ పూలు దేని కయినా కావచ్చు
అలంకరణకు కావచ్చు అమ్మకానికి కావచ్చు
కనిపించని దైవం ప్రతినిధి ప్రతిమకు కావచ్చు
ఇది పూర్తిగ వ్యక్తిగతం, స్వేచ్ఛా క్షేత్రంలోనిది

చెట్టుకు దిగులు లేదు, కోపం లేదు
స్తిమితంగా ఉంది, ఒక తల్లిలా శాంతంగా

రేపు ఉదయం మళ్ళీ పూలతో కనిపిస్తుంది
మళ్ళీ పూలు పూయడానికి అవరోధం లేదు
మళ్ళీ పూలు తెంచడానికి అవకాశం ఉంది
పూలతో నిండుగా కనిపించడం సంతోషకరం
అడవి తన గాథను గాలికి చేర్చేను
జలధి తన క్షోభను గట్టుకు తెలిపేను
చెట్టు తన హృదయం భూమికి చూపేను
మనిషి తన వేదన మనిషికి చెప్పేను

❁

## 27. స్వేచ్ఛలో

ఆకు లేని ఎండిన చెట్టును చూస్తే
పేదరికంలో శుష్కమైన బ్రతుకును చూపిస్తుంది
ఏడుపు చూపే కరుణ దశను దాటింది
కోపం ఎగసే ఉగ్ర దశను చేరింది

చేతిలో గొడ్డలి! ఉంటే? ఒకరి ఆలోచన
ఈ ప్రశ్నకు ఎవరి సమాధానం వారిది
కటువైన చర్యలకు చర్చలతో పని లేదు
చేతిలో కలశ జలంతో చివురించ వచ్చు

ఏడుపు సందర్భం, జ్వాలా సదృశ మయితే
సానుభూతి పవనాలు వీస్తాయి, చల్లార్చేందుకు
మంటలు చెలగి ఆందోళన వ్యాపించనూ వచ్చు

జారి పడిన కన్నీటి బిందువులో
దాగిన విద్యుదగ్ని ప్రకటితం కావచ్చు
స్వేచ్ఛలో అనల సంచారం! దారుణం

స్వేచ్ఛా చరణం చర్యలలో తగిలిన గాయం
గర్వపడే పనికి చిహ్నంగా మిగల వచ్చు
ఇది ఘర్షణలో పొందే మార్గం ఒకటి
రాజ నీతితో చేరే మార్గం ఒకటి

స్వేచ్ఛా మూలం నుండి వెలువడే ఉద్యమాలు
ప్రాంతీయ స్త్రీ దళిత విప్లవ వికాస ముఖాలు
నిష్క్రియ నుండి చేతనకు ప్రేరణలై
సమాజ ప్రగతికి విలువలు వేగం పెంచేను

తప్పని మార్పును సంకేతించే వెచ్చని కవిత
ముడుచుకున్న మనసును విప్పారగ జేసేను
మాటలో శబ్దం గాలిలో కలిసి పోతుంది
శబ్ద శక్తి ప్రభావం మనసులో సార్థమవుతుంది

❀

## 28. నిదర్శనం - సంకేతం

ఎన్నెన్నో! అభిలాషల అభిరుచుల సమాజంలో
కొనడానికి బేరం కుదరాలి తప్ప!
అమ్మకంలో చెల్లని వస్తువు లేదు విపణిలో
ఒక అంతరంగ స్ఫూర్తిలోని, కవిత తప్ప

కవితకు వెల ఎవరు కట్ట గలరు?
శ్రమకు వెల ఉంది, మేధకు వెల ఉంది,
తిండికి వెల ఉంది, మనిషికి వెల ఉంది,
ఒక అంతరంగ స్పర్శలోని కవితకు తప్ప!

అంతరంగ మెప్పటికీ బయటికి కనిపించదు
దీని ప్రభావంలోని కవిత కెవరు స్పందిస్తారు

ఆర్త రవం వినబడగానే
మబ్బు అల్లుకొని జల కళికలు జారేనా?
ఉగ్ర స్వరం వినబడగానే
గ్రీష్మ చండ కిరణ పంక్తి పైకి దూకేనా?

స్నేహ స్వరం వినగానే
చంద్ర కాంతి హ్లాద రేఖ మనసు నిండుతుంది
శాంతి స్వరం వినగానే
మానవతా పరిమళాల అలలు తరలుతాయి

గందర గోళంగా ఉన్న మాట నిజమే
ఇక్కడి నుండి ఎక్కడికి? చేరడం?
అక్కడ కూడ ఇదే స్థితి! విషయం మరొకటి!
ఉన్న స్థితిని ఎదుర్కొనే సంకల్పం ముఖ్యం! మనిషిలో

ముఖాముఖి వాదంతో మారణ రణాభిలాష కన్నా
ప్రశాంత సమాజ రూపంపై చింతన అవసరం,
ఇది మానవ శక్తికి అపూర్వ నిదర్శనం!
సమాజ శ్రేయంకై యత్నానికి సంకేతం!

❀

## 29. సరికొత్త డిజైన్‌లో

సృజన యశో రూపానికే కాదు, విధ్వంసానికీ
వికాస గతులకే కాదు, మార్పు ఎరగని స్థితులకూ
శిఖరాయమాణంగా మానవ రూపం! చరిత్రలో
స్త్రీ పురుషుల సహ యోగం! సంఘానికి అస్తిత్వమై

స్తంభంలా మనిషి ఉండడం కుదరదు
కదలికతో నడకలు, తప్పనివీ బ్రతుకులో
విప్పారిన చేతులలో పూలకు బదులుగ
కన్నీటి చుక్కలు రాలడ మొక విషాదం

నడచే కాళ్ళకు కనిపించని గొలుసులు పడడం
స్వేచ్ఛకు ప్రమాదం! అందరికీ తెలిసిన వాస్తవం
అరుపులు కేకలు దౌర్జన్యం హింస! స్వేచ్ఛలో
రక్త చిత్రాలు! కాకపోతే! బాధా దృశ్యాలు

ఒక డ్రెస్ కోసం గుడ్డను కత్తిరించి
పడేసిన ముక్కల్ని ఏరి, ఒక చోట చేర్చి
సరికొత్త డిజైన్‌లో, మరొక డ్రెస్ సిద్ధంగా
"ఇది బాగుంది" అని, అసలును పక్కకు పెట్టి
దీన్ని పొందేందుకు ఆరాటం! ప్రతి మనిషిలో,
అవసరాల్ని బట్టి అభిరుచిలో మార్పులు

వేటు పడిన ప్రేమ కరుణ శాంతి సహనం
ముక్కల్ని ఏరుకొనీ, వాటిని జత పరచీ
పలు రీతులలో ఓపికగా, మరొకటి తయారుగా
చిత్రమైన పనులలో మనిషి ఆయువు గడుస్తోంది

చూడ ముచ్చటగా పలు రంగుల కలయికతో
మొజయిక్ ఆకర్షణ! మారిన ఆలోచనతో
ప్రేమ కరుణ శాంతి సహనం! మోడల్స్‌గా
పుస్తకాలలో ప్రవచనాలలో హోర్డింగ్ ప్రకటనలలో!

❀

## 30. మానవీయ వాస్తవం

ప్రతి ఒకరికీ! ఉదయం తన కోసం వచ్చినట్లు,
ఎవరి కోసమో! నిశీథి గుప్తంగా వచ్చినట్లు,
చుట్టూ ప్రకృతి సంపద! రుతువుల దృశ్యాలతో
సకల ప్రాణి కోటి శ్రేయంకై అన్న విధంగా

ప్రకృతి ఎన్ని రూపాలో! మనుషులన్ని తరహాలు
పచ్చని ఆకుల వలె సుఖాలు, ఎండిన ఆకుల వలె బాధలు
పీడ లేని బ్రతుకులకై, ఎందరి ఆలోచనలో
మృత్యువు పోస్ట్ పోన్ కోసం అన్వేషణ లెన్నో!

అందరికీ పుట్టుకతో, ఊగే ఊయల ఒకటే
ఆపై నడచే విశాల భూమి తలం ఒకటే
బ్రతుకులో దారులు వేరు, నీతిలో నడతలు వేరు
అందరినీ కలుపు తుంది, మానవీయ దృఢ బంధం

దీని అవసరం లేని సందర్భం లేదు
అనుక్షణం పరీక్షకు గురి చేస్తుంది
మనుషులు కాలం చేతిలో ఆయుధాలు కావచ్చు
స్వాగత కరాలలో పూల దండలూ కావచ్చు

సన్నని కాలి బాట అయినా, రహదారి అయినా
పయనంలో గమ్యం ఒకటే! అది మారదు
నదిపై నావలో తీరం వెంబడి యానం
ఒడ్డున తన మజిలీ చేరినట్లు కాదు

రావలసిన కవిత గూర్చి అనుకుంటూ ఉండగనే
గేటు దాటి లోనికి రాబోయే అతిథిని తలపిస్తుంది,

మనిషి స్వరం ముఖం మాట నడత ఇష్టంలో
దాని వెనుక నున్న ఉజ్వల రత్నం కవి అంతరంగం
అమ్మేందుకు మార్చేందుకు అవకాశం లేనిది,
అమూల్యం! అపూర్వం! ఇది మానవీయ వాస్తవం!


❀

స్వేచ్ఛా కవిత్వం-74

# హృది కిటికి నుండి

## (దీర్ఘ కవిత)

మాదిరాజు రంగారావు



2017

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

**SVECCHA KAVITHVAM - 74**

# HRUDI KITIKI NUNDI

## Long Poem

(Free-Verse)

by

Prof. Maadiraju Ranga Rao

©: Dr. M. Santhosh Kumar

Y.P. : 2017

*Presented*

*to*

*my wife*

***Smt. M. Indira***

# పీఠిక

"No Poem is an end
No Poem is a begining either"

ఇది "హృది కిటికి నుండి" స్వేచ్ఛా కవిత్వ పరంపరలో 74వ కృతి. ఇందులో విషయం ఇపుడున్న స్థితులు రావలసిన మార్పులు కావలసిన నైతికమైన విలువలు సూచితమైంది. మార్పు భౌతిక తలం పైనే కాక మానసిక తలం పైనా ప్రతి వ్యక్తిలో అవసరమన్న భావన కలిగింది. ఈ దిశలో ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికతను పొందింది. కవిత్వానికి అవసరమైన భావ రూపాలు, ప్రతీకలు, అభివ్యక్తి విధాలతో నవ్యతను భావింపజేస్తూంది.

"ఆర్త రవం"తో మొదలయింది. ప్రస్తుతం విస్మరించలేని దయనీయస్థితిని చిత్రిస్తూంది. వెచ్చని స్పర్శ మంచులా పేరుకున్న స్థితిని ద్రవింపజేసి, ప్రవహింపజేసే మార్పు, ప్రభావశీలమైన చేతనను జ్ఞప్తికి తెస్తుంది. ఇది ఆలోచనకు ప్రోత్సాహాన్నీ, ఆచరణకు ప్రేరణనూ కలిగించే అంశం. మానసికంగా అనుభూతి సాంద్రమైంది.

లిప్త నుంచి లిప్తకు సహజమైన ప్రయాణంలో లయము, వినాశనము నుండి సృజనకు నిర్మాణానికీ దారి తీసే భావన, ప్రజాస్వామ్య దార్శనికతను కలిగింది, వ్యక్తి బిందుస్థానం నుండి సమాజ రంగానికీ, సంక్షోభం నుండి శాంతికీ, యథా స్థితి నుండి పరవర్తనకూ నడిపిస్తుంది. సమాజంలో తృప్తికరంగా లేని విపరీత పరిస్థితుల్లో మార్పు కోరే వారిలో కవి మొదటి వరుసలో నిలుస్తాడు. సామాజికమైన రాజకీయమైన దార్శనికమైన తాత్త్వికమైన అంశాలు ఆయా సందర్భాల్ని బట్టి కలుస్తాయి. ఒకే లక్ష్యంతో పని చేస్తాయి. కవిత్వం పరివర్తనకు ప్రేరణగా పరిణమిస్తుంది. ఇది ఆధునిక యుగంలో బాగా అనువర్తిస్తుంది. సంక్షుబ్ధ స్థితుల్లో మరీ అవసరమవుతుంది.

ఈ రచనలో అక్కడక్కడ తాత్త్విక ప్రకాశం అంతరంగ ప్రమేయాన్ని తలపిస్తుంది. మొత్తం మీద హృదయ స్పందనతో మానసికమైన పరివర్తనతో సామాజిక వికాసానికీ ఉన్నతికీ భాగ్యానికీ ఆయత్తం చేసే ఆశా దిశ కనిపిస్తుంది.

ఇది స్వేచ్ఛా పథంలో స్వీయ వ్యక్తిత్వంతో స్వతంత్రమైన సృజన రూపం. తనదైన ప్రత్యేకతను కలిగింది.

**– మాదిరాజు రంగారావు**

# హృది కిటికి నుండి

## 1. ఆర్త రవం

ఆర్త రవం నుండి వెచ్చని నును స్పర్శతో
కరుణ జలంలో కమలం వలె కవిత!
సాటి వ్యక్తి కన్న రాత్రి చుక్క లెంతొ ఊరటగా

అక్షరాల దీప శిఖలు వరసగ
వెలుగు దారి పరచినట్లు
కవితకు పయనం! సులభ సుందరంగా
లక్ష్యానికి దార్శనికం ప్రేరణగా
ప్రజల నుండి పగలు! నినాదాల తరంగాలు
స్వేచ్ఛకు తలుపులు బారగ తెరవ బడీ
వీధులలో ప్రదర్శనలు తమ తమ హక్కులకై

కష్టం నష్టం రెక్కలపై ప్రతి సమస్య
ఎగసి వచ్చి వాలుతుంది కవి ఎదపై
జడత వీడి ఆలోచన చలన గుణంతో
వ్యక్తి నుండి సమాజ రూపానికి తరలుతుంది

రాత్రి వేళ రవి ఉనికిని కోల్పేయేను
పగలి వేళ శశి తలపుకు రానే రాడు
సంఘంలో పెద్దలు నేతలు మౌన తరువు లయితే
గాలి నీరు వెలుతురులే! జన సన్మిత్ర గణం

సత్యం ధర్మం న్యాయం నిజ బింబాలొకటొకటి
మనిషి మనిషి కొక కోణంలో పలు రంగులలో

ఆర్తిలో మనిషి పట్ల ఉదార చరిత నీతికి
ప్రాంతం వర్గం వర్ణం సమయంతో పని లేదు
హంస లాగ మనస్సు! రెక్కలార్చి తేనే
చర్యలోని ఆయుధం! విరామ దశను పొందుతుంది

❁

## 2. సన్మిత్రం - డైరి

డైరీ ఒక సన్మిత్రం! జీవిత మంతా
సందర్భ సూచనలతో జ్ఞాపక నిలయం
గతంతో తన అనుబంధం నిలుపుతుంది
ఫిల్మ్‌లా అనుభవ దృశ్యం దొరలిస్తుంది

బయటి తలుపు తెరచి ఉంచితే
గాలీ వెలుతురుతో పాటుగ
మానుష రూపం లోనికి రావచ్చు
మనసులో స్నేహ వల్లి పూయవచ్చు

రోజులు గడచే కొద్దీ
పుటలు తిరిగే కొద్దీ
వర్తమాన బింబాలొకటొకటీ చేరతాయి
డైరీ కొక స్మృతి శాలా రూపం సిద్ధిస్తుంది

మాట కలుపుతుంది వంతెనలా
మానస నదులను దాటిస్తుంది
ఆవలి తీరం చేరుస్తుంది
సుందర దృశ్యం అలరిస్తుంది

మాటతో మనిషి ముఖం వెలుగుతుంది దీపంలా
నచ్చితే మనసులో ప్రకాశం
కాకపోతే! పొగల వాలకం!
డైరీ పేజీలో నిజ జీవన ప్రతిఫలనం
వెలిగించిన కర్పూర కళిక లిప్తలతో
అందరికీ హ్లాదం మోదం పంచుతుంది

అందరినీ కలిపే మైత్రీ కేంద్రం
అందరికీ ఉపయోగ పడే నిలయం
శబ్దంలో నిశ్శబ్ద సమాజ వీధులలో
చదివే వ్యక్తిని డైరీ గతంలో తిప్పుతుంది

# 3. వదలని మిత్రం

రాత్రి వేళ చీకట్లను తరిమే దీపాలను
ఉదయం కాగానే ఆర్పివేయడం సహజం
రేపు దీని అవసరానికి భద్రంగా
చీకటి ఉన్నంతవరకు వదలని మిత్రం!

తలపై ఆశీః ఛత్రం వలె గగనం
చెవులకు కథలను వినిపిస్తూ పవనం
కావలసిన వస్తువుకై ఆరాటం అన్వేషణ
రహస్య వలయాలను ఛేదిస్తూ పురోగమనం

ఎదురింటికి నిప్పంటుకొనీ
మంటలతో దృశ్యం! భయదం
అది! తమ ఇల్లు కాదని,
ఎవరు? ఊరకుంటారు! తప్పుకుంటారు!

ఇల్లు దగ్ధమైన వ్యక్తిలో చల్లగా
నిరాశ చివర ఆశ చివురిస్తుంది
పగలు సూర్యునికీ రాత్రి చంద్రునికీ
కప్పులేని పేద ఇల్లు! బహు ప్రియం

నాలో ఎదిగే తరువుకు పూవు పండులా
నాలో మ్రోగే తంత్రికి నాద ఝరిణిలా
మంచులో సూర్య రశ్మిలా
ఎండలో మబ్బు గొడుగులా
డైరీలో కవిత! అపుడపుడూ
మంటల గులాబి పుష్పవనిలా

నిన్న ఆపదలో తగిలిన గాయం
నేడు! డైరీలో శీర్షిక అవుతూంది

❀

## 4. కాలం చేతిలో

మరణ మొక విశేష మిత్రం
అంత వరకు కనబడనిది, ఇది
కెరటంలా! ఉత్సాహంగా
ఒక సారే! వచ్చేస్తుంది
అనుమానం అక్కర లేదు
విచ్చేయని ప్రశ్న లేదు!
శాశ్వత విరామ హేతువైంది
ఎపుడైనా పోస్ట్ పోన్ కావొచ్చు

తనతో కలుపుకొని దూరం వెళుతుంది
అంతా మన మంచికే అన్నట్లుగా
వెళ్ళేది ఎక్కడికి? అది తెలియని రహస్యం
ఎవరి ఊహలో వారు! ఎవరి నమ్మకం వారిది

దిశలలో అయితే గాలుల పైనో?
జలధిపై అయితే తరగల పైనో?
నింగిలో అయితే మబ్బుల పైనో?
బ్రతుకు ముసుగు తొలగి జీవి క్షణంలో

రాత్రి వేళ చంద్రుని వెన్నెల కాని
పగటి వేళ సూర్యుని వెలుతురు కాని
అందని ఆయువు చివరి మెట్టుపై
కాలం చేతిలో ఆరిన కర దీపిక!

వెలుతురు చీకటి దోబూచులాడే
ముఖం అసలు రంగు తెలియ దెవరికీ!
రంగుల కలయికతో ఇంత వరకు
ఉన్న ముఖం, పనికి రాదు ఈ సమయం!

మెలకువతో కవిత! స్వాగత హృదయంతో
నిదుర ముందు అదే! వీడ్కోలు ముఖంతో

❀

## 5. అనుమాన భయంలో

మెలకువతో మనిషి ఒక జ్ఞాన ప్రకాశం
స్పందించే హృదయ మొక జీవన చిహ్నం
హ్లాదం రాగం శౌర్యం కరుణం
విరిసిన జీవన కమలం రేకులు

కల్పనలో ఎదురుగ దారులెన్నో
వాస్తవాన నడచే దారి ఒకటే!
శబ్దంతో మొదలై నిశ్శబ్దంతో ముగిసే
జీవిత మొక మానుష ఘర్షణ అభియానం

విధ్వంసంలో చేతులు! ఎందరివో?
సృజనకు మాత్రం చేతులు ఒక్కరివే!

అందమైన తివాచి క్రింద అమాయకంగా
దూరిన సర్పం గురించి తెలియదు
మెత్తని రెడ్ కార్పెట్‌పై అవలీలగ
స్వాగత సంరంభంలో అతిథి గణం

తెలియనంత వరకు అంతా ఉల్లాసంగా
తెలియక పోవడమే "మంచిది" అనిపిస్తుంది
అది ఎపుడో తన దారిన వెళిపోవచ్చు
తెలిసిన క్షణంలో భయంతో అలజడి
ఆ ప్రాణి చుట్టు తీర్చిన మనుషుల తెలువులు
తెలియనంత వరకు సర్పమైనా పూల మాలాసమం
అసలు పూల మాలపైనా అనుమానం! భయావహం

అనుమాన భయాలతో మనిషి జీవితం
చేయని ఊహలేదు, వేయని అడుగు లేదు
తన రక్షణకై భద్రతలో క్షేమంకై ఎప్పటికీ

సమస్య ఎదురై ప్రశ్నలకు జవాబులుగా
రోజు లెన్నొ కలిసి డబ్బు నోట్ల కట్టగా విలువలతో!

❁

## 6. అద్దం తొలగీ

అద్దంలో చిరు నవ్వు ముఖంలో
రేకులు విరిసిన పూవు శోభ
ఎగసే పావురాన్ని తలపిస్తుంది
కదలే జల లహరిని తలపిస్తుంది

అద్దం నుండి తొలగి వేరొకరికి కనబడేది నూయో!
ముళ్ళ కొమ్మో! అనల కణమొ! లోతు గోయో!
వెలుగు దారిలో చీకటి శకలమొ!
డబ్బుకై చూచే మనీ పర్సు వాలకమొ!

మనుషుల నిజ రూపం తెలియదడ మొక పరీక్ష
ఎపుడు చూచినా ఏదో ఒక పాత్రలో
ఏ స్థానం మారేదీ తెలియదు
ఏ ఒడ్డుకు చేరేదీ తెలియదు

ఈ బ్రతుకొక శిక్ష కాదు, జైలు కాదు
స్వేచ్ఛా గమనంలో తెలియని దిశలో యానం
తనలో ప్రశ్నలకు మరొకరి జవాబులతో
అంచనాలు తప్పేను వివాదాలు రేగేను

స్వేచ్ఛకు మితం లేదు గగనం వలె మనిషిలో
మనిషికి మనిషి తోడు విజయానికి తోడ్పడేను
పగటి వెలుగు ఆశకు దారులు చూపుతుంది
నిశి వేళల దీపం ధైర్యానికి పీఠం

పగలు నీడలు తనకు తోడుగ ఉండేనా?
రాత్రి చుక్కలు తనకు దారులు చూపేనా?
చీకటిలో అందే మనిషి చేయి స్పర్శతో
మనసుకు అమూల్య మేదో దొరికిన దవుతూంది,
పగలు! రాత్రి! పాతవి ఎప్పటివో? అయినా
పొందే మనుషులతో జీవన దృశ్యాలు వేరు

❁

## 7. నోరు తెరచి చేయి చాచి

పేద గుడిసె ముందు విరిసిన పూల చెట్టు
పూలకు తర తమ శ్రేణుల భేదం లేదు
నిలయం ముంగిలిలో శిల్పంలా నిల్చొని మనిషి!
మనిషి నుండి చిరునవ్వుకై మాటకై ఎదురు చూచేను

కంచెతో గుడిసె అయినా, గోడతో మేడ అయినా
గాలి కదలుతుంది తాకుతూ, పూల పరిమళాన్ని అద్దుతూ
వెలుగుకు తెలియని ప్రపంచంలో వస్తువు లేదు
చూపుకు తగలని జీవన దృశ్యం లేదు

వానకు తెలుసు! ఏ నిలయమెంత భద్రమో
ఎండకు తెలుసు! ఏ కప్పు ఎంత చల్లనో
చెట్టుకు తెలుసు! తన నీడ ఎంత ముఖ్యమో
దేని కయిన స్థాన బలంతో, కవిలో కవిత్వం

స్మృతిలో పరిచయమున్న సమాజం నుండి
అనుభవ రుచి కొత్త దైన వర్తమానంలోకి
నది తొలి అడుగులా మొదలవుతుంది కవిత
సృజనలో ఎక్కడ ఆగితే, అదే! చివరి దశ!

చిత్రం శిల్పం నృత్యం కావ్యం ప్రభావ రూపంతో
పరివర్తన దిశలకు తలుపులు తెరుస్తాయి
సమాజ భావనలో మానస వికాసమయమై
చెదరని ప్రజాస్వామ్య సంస్కృతి ఒకటే లక్ష్యం

వీథి వీథిలో బిక్కులు తిరుగుతూ ఇండ్లు
నీడ నీడలో పేదలు చేరుతూ చెట్లు
రస బిందువుకై చాచిన చేతుల కొమ్మలతో!
విరిసిన మానవ పుష్పవనం ఎక్కడ?

పేద ఇల్లు! భూమి వైపు నోరు తెరచీ
లేని మనిషి! నింగి వైపు చేయి చాచీ

## 8. అవసర నాణెం

కొమ్మ నుండి రాలే పరిణత ఫలం
మనిషిని తాత్త్విక స్పృహకు లోను చేస్తుంది

ఏ సమయం ఏ మనిషి స్వంతం కాదు
దాని ననుభవించే హక్కు అందరిదీ

అది తనది కాకపోయినప్పటికీ
తనదిగా అనిపించడంలోనే ఉంది
అందని రహస్యంతో తమాషా!
స్వంతం చేసుకొనే కోరిక అందరిలో

ఉదయం మహనీయమైంది, రోజూ కనిపిస్తుంది
గోడకు వేలాడే పెయింటింగో ఫోటోనో
హేంగర్‌కు వేలాడే సరికొత్త డ్రెస్‌నో
బ్రతుకు తెరువు వ్యూహంలో తలపిస్తుంది

ఉదయం వస్తుంది హృదయానికి ఊరటగా
ఇది ఎవరి తోనూ పంచుకునేది కాదు
ఎవరికి వారు తమ స్వంత మనుకునేది కాదు
ఇది పేదల కళ్ళకు అత్యవసర రూపం

చుట్టూ దారు లనేకం పగలు వెలుగులో
ఆకలిలో పచ్చని చెట్టు ఎదురైనట్లు
దప్పికలో జలధి అలలు పిలిచినట్లు
జీవన రుచి కయితే, దేని కదే దూరం!

చీకటిలో కావలసిన దారి ఒకటే
పరిమితిలో దీపం వెలుతురుతో

నిద్రకు ఉదయ మంటే చిరాకు
మరపుకు గతం! అంటే ఇష్టం
ఏ పెట్టెలోనో దాచ బడేది కాదు క్షణం
ఎప్పటికినీ! ఉపయోగపడే అవసర నాణెం!

❀

## 9. మసిబారిన రేఖలతో

రోజు మొదలవుతుంది ఉత్సాహ క్షణాలతో
చేతిలో లాటరీ టికెట్‌లా ఆశామయంగా
లాభ నష్టాల బేరీజుతో, గుణ దోషాల పట్టికతో
రోజు గడుస్తుంది, మిశ్రమ సంచికగా తేలుతుంది!

వాస్తవానికి వసంతం అందరికీ పట్టదు
కొందరి కయితే ఈ స్పృహయే ఉండదు
శ్రమ జీవన లిప్తలలో కఠిన జీవితాలలో
ప్రకృతిలోని సుందరతకు దూరంగానే

ఎప్పటి మాటలో "ఆకలి" "దాహం"లోన సెగలతో
వివిధ స్థాయిల్లో సత్యానికి ధర్మానికి పరీక్షలో
లేమిలో మంటల పుటలతో జీవిత పుస్తకం
కళ్ళలో చిరు మబ్బులు విడిచే చుక్కలతో

పొగ కమ్మిన దీపంలా మనసు నుండి
మసక బారిన ఆలోచనలు వరసగా
తానేమి చేసేది తెలియని అయోమయంలో
ఆవేశం ముంచుతుంది తుపాను కెరటంలా

తాపంలో కోపానికి అవకాశం దొరకుతుంది
మనసును మండే జ్వాలగా మారుస్తుంది
ఏ నికృష్ట చర్యలకో పురి కొల్పుతుంది
ఏది ఒప్పు! ఏది తప్పు! ఏ పీఠం చెప్పగలదు?
అప్పటి తప్పుని అవసరాలు తీరడం ముఖ్యమై
మంచి చెడులు తెలిసేదొక! కనిపించని అంతరాత్మకే

మంచు పొరలు ఒలి చేస్తూ ఉదయం వస్తుంది
హంగులతో ఆర్భాటంతో సమాజ కోలాహలం!
మానవ జీవన సమస్య పొందిన సంక్లిష్టతలో
చెదరిన ప్రజాస్వామ్యం! మసిబారిన రేఖలతో!

# 10. కొత్త దారులలో

నిద్రను కప్పుకున్న మనిషిని
మెలకువలోకి తెస్తుంది! అవసరం!
మేల్కొన్న మనసులో
కరగిన మంచు నీటి పాయలా
అనుభవం! తళతళ మెరుస్తూ
నవ్యంగా శుభ్రంగా వెలుగులో!
కాల్పనిక జగతిని వదలిన ఆలోచనతో
యథార్థమైన వ్యథలను వినవలసిందే!

వెలుగులో కిటికీ నుండి 'దృశ్యం!' మనుషులతో
చూపులో అందరూ ఒకటే! పాత్రలలో భేదం
ఒకరి నుండి ఒకరు, వేరు వేరు విశేషాలతో
పోత పోసిన శిల్ప సమూహం కాదు సంఘం

వెలుగులో నీడల వలె కదలే మనుషులు
వెలుగగ మారేందుకు బ్రతుకంతా ప్రయత్నం
అవసరాల వరకు రాత్రి దీపాల వెలుగులు
చీకటిలో మనిషి తానొక దీపమై వెలగాలని

గుడిసెలోని పేద! మొదటి ఉదయ కిరణంతో
మేడలోని మనిషి కన్న ముందుగ లేచేను
వాస్తవాన బీజ మంత వాస్తవం
కల్పనలో మహా వృక్ష మవుతుంది!

ఉన్న దారిని చూపిస్తుంది గతం
కొత్త దారిని సూచిస్తుంది ప్రస్తుతం
పూర్వజుల మహానిధిలా గతం
ఎప్పుడేది అవసరమో! దానికే విలువ!

సమాజ శ్రేయంకై బయటపడిన వ్యక్తి శక్తి
స్నేహం ఘర్షణ ప్రతి ఘటనకు దారులు తీయవచ్చు

❀

## 11. పెట్టెలో భద్రంగా

ఉషః కాంతిలో మనిషికి కొత్త బలం జవంతో
ఏదో ఒరుగుతుందని ఆశలు! తమ బ్రతుకులో
తెలుపు పసుపు ఎరుపు వెలుగు రేకులతో విప్పారిన
కమలం మానవ జీవిత రూపం విభవం తలపిస్తుంది

ప్రతి క్షణం అవసర రమణీయం వాస్తవం
దీని ప్రయోజన మయితే మనుషుల చేతలతోనే
ఏ విధం వర్తన మయినా మనిషి హంతవ్యుడు కాదు
దారులన్ని మూసి, ప్రాణం తీసే హక్కు లేదెవరికినీ!

నేరంలో క్షమకూ కష్టంలో కరుణకూ
ఘర్షణలో శాంతికీ అర్హత గల మనిషికి
తన హద్దులు తెలియక పోవడ మొక విషాదం
ఆ హద్దులు తెలిసే బాధ్యత, తానున్న వ్యవస్థదీ

ఉద్రేకంలో ఆలోచన! విపరీత క్రియకు దిగుతుంది
తీవ్రమై నిశితమై క్రూరమై ప్రమాదభరమవుతుంది
నిప్పంటిన చర్యలతో మనస్సు
వినాశన ముద్రను వదలుతుంది
మరణ ఛాయ నుండి దూరంగా
వచ్చే దారుణాన్ని నిలిపి వేయడం
మనిషిలో! విశేష శక్తి కీర్తికి నిదర్శనం
ఎవరో చెప్పే దాకా! తెలియదు, దౌర్భాగ్యం

పాపం! పుణ్యం! మాటలెంతో విలువైనవి! వజ్రాల్లా
ఎప్పటికీ అవి గట్టి పెట్టెలో భద్రంగా, మనసులో
విశేష సందర్భంలో బయటికి వస్తాయి
ప్రచార ప్రకటనలో ప్రదర్శితమవుతాయి
ఇది తత్కాల మనోహర దృశ్యం!
తిరిగి అదే పెట్టెలోకి ప్రవేశిస్తాయి

## 12. కవితలో వెలుగు

తుపానుకు తెలుస్తుంది ఏ చెట్టు ఎంత బలమైందో
గడ్డి పోచ వాలుతుంది, కాని మూలం కదలదు

నగరానికి తెలుస్తుంది మనిషి ఎంత శ్రమ జీవియో
సంఘానికి తెలుస్తుంది మనిషి ఎంత క్రియాశీలో!
సమస్యల గనిలో దూరిన మనిషికి ఎప్పటికయినా
వజ్రం దొరికే నని బయటికి రాబుద్ధి కాదు

మనిషి ముఖాన చీకటి రేఖలు! చిత్రంగా
రేఖల మధ్య! ఖాళీలో పూచిన నిప్పు పూలు!

ఒక ఊహలో తంత్రం విడుదలవుతుంది
ఒక మాటలో బాణం వదలబడుతుంది
ఒక చర్యలో అసి! మెరుస్తుంది వాడిగా
ఒక చూపులో అల కదలుతుంది చల్లగా

పైన మబ్బులు! ప్రపంచ దూతల వలె
కింద జిప్సిలు దేశ దేశ ద్రిమ్మరులు!
పరచిన పచ్చదనంతో విరిసిన పూల వనంతో
ఆకలి తీరదు! ఉద్రేకం చల్లార వచ్చు

అరుపులు పిలుపులు బాధల గాధల మధ్య
ఎవరి కయినా స్వాగతం పలుకుతుంది నగరం
ఎవరెవరో చొరవతో వీథులలో దిగేరు
తెలియని పాత్రకు సిద్ధంగా ఉండేరు

నాలుగు దారుల కూడలిలో విగ్రహాలు
శాంతి కరుణ ప్రేమ త్యాగ దిశలు చూపుతూ
ఎదపై వేటు నుండి సహనం కాపాడేనా
తుపాను భూకంపం, మనిషికి హద్దులు చూపుతాయి
చినుకుతో! భూమిపై పచ్చదనం లాగా
కవితతో మనిషిలో వెలుగు సుమించేనా?

❀

## 13. చేతనతో సిద్ధంగా

ఒకరితో మరొకరు భేదించే గుణ చర్యలతో
ఘర్షణతో రణానికి స్వార్థ పథంలో
మనో జగాలు వేరుగా పోటీకై సిద్ధంగా
సహనానికి సెలవు పలికి! శత్రువు పాత్రలలో

స్నేహ వల్లి కరువై మానుష కుసుమం లుప్తమై
తత్కాలంలో అవసరాల ఒత్తిడిలో చిక్కుకొనీ
సంక్షోభంలో సమస్య జటిల మవుతూంది
ఇది ముగిసే సమయం తెలియదెవరికీ

కాలం అందరి పట్ల సమానమే
ఇది తన వశమైపోవాలని మనిషిలో

పలు ఎత్తులలో శిఖరాలెన్నో
ఆరోహణలో ఎవరికి వారు ముందుగ చేరాలని

అద్దం అందరి పట్ల ఒకే విధం
ఒకరి ముఖం విరిసిన పుష్పమై
ఒకరి ముఖం ఎత్తిన రైఫిలై
ఎవరి మెప్పు కోసమో! మారదు
లేనిది ఉన్నదిగా చూపలేదు
ఉన్నది లేనిదిగా దాచలేదు

బయటికి రంగులతో తీర్చిన వేషంతో
మనుషులలో నిజ రూపం! కనిపించని నిజం

కాలం కదలుతుంది, అద్దం కదలదు
కాలం తలపిస్తుంది, అద్దం బింబిస్తుంది

కదిపించని స్వర్గం గురించి అట్లా ఉంచి
కనిపించే జీవన రూపం, ఆలోచనలో!
మబ్బుల్లా ఊహలు ఒకటొకటీ వస్తూ పోతాయి
చేతనతో మానసికం ఎప్పటికీ సిద్ధంగా

# 14. పరిమళ కవితయై

ఇంటి ఆవరణంలో పెరిగే మొక్కల వలెనో
బయట తోటలో ఎదిగే చెట్ల వలెనో
ఆయుధాలు సులభంగా జీవన గతిలో
మనిషిని భయ శిఖరంపై అడుగులు వేయించేను

అడవి లాగ సమాజం పెరగడ మొక విచిత్రం
మృగ స్వభావ రూపాలకు స్వేచ్ఛ ప్రమాదకరం!
ఉదయం రాబోయే సూర్యునికై ఎదురు చూస్తూ
రాత్రి మెలకువలో కళ్ళు తెరచి ఎవరు గడుపుతారు?
వెలుగు లేని రాత్రులు చీకటి రాజ్యానివే
నిదుర లేని రాత్రులు! జవాబు ఎరగని ప్రశ్నలతో!

దీపం ధైర్యం ఇచ్చే మాట నిజం!
అది ఇంట్లో బయట అవసరాల మేరకే
అతిథి రాకకై తలుపులు తెరచి ఉంచితే
దొంగ ప్రవేశం ఒక విచిత్ర విషయం

కుడి ఎడమల తీర భూమి! మధ్యలో
నీరు లేని నది! ఇసుకతోనో మట్టితోనో
నదిని దాట జేసే వంతెన! మాత్రం
ఇరు తీరాలను కలిసే అవసర రూపం!
ఉపయోగం లోకి వచ్చే నిర్మాణం
అవసరాలు తీర్చే సృజనకు సంకేతం!

పోవలసిన దారి చూపుతుంది సెంటర్‌లో సైన్‌బోర్డు
పోయే పనితో వేళలతో వంతెనకు పని లేదు
కలను వాస్తవ మొనర్చి చూపే వంతెన!
సమాజ చరిత్రలో! ఘర్షణ బదులు వికాసం!
గొప్ప ప్రభావంతో మనిషి నలంకరిస్తుంది
నెత్తురు చుక్కల కన్నా అడుగు జాడలకే ప్రాధాన్యం

❀

## 15. గతమై నగమై

అంతరాత్మ చేతనతో మిన్నయైన మనిషి కూడ
గడ్డి పోచ కన్న అల్ప దశను పొంద వచ్చు
మంచు గడ్డలోని జడ హృదయం చూపవచ్చు
చెట్టు లోని త్యాగ శీల చరిత నేర్వవచ్చు

అందమైన యశోబింబం మానవ వికాసం
మచ్చల వలె పీడిత జన బాధల విషాదం
అంతలో శుష్కమై మానవతా రస శూన్యమై
దారు శిలా శిల్ప సమంగా మానవ జీవితాలు

ఎపుడో చివురించి సుమించేనని ఆశలు
ఎండిన ఆకుల వలె గల గల వార్తలు
గమనం తగ్గిన నది హృదయంతో కాలం
వర్షం రాక కయి నిరీక్షణలో గడుపుతూ

వచ్చే స్వప్నం  వాస్తవ సూచన కాదు
విధ్వంసం నుండి నిర్మాణ క్రమం అవసరం

మతి విభవంతో మనుషుల ఊహలు చేతలు
ఎవరికి? దేనికి? అంటే సుందర సమాజ విధంకై
నేను నీవు మనం జనం అనుబంధంతో
మనిషి మనిషిలో తమ తమ అస్తిత రూపం!

గురిలో బాణంతో హరిణంకై
చెట్టు నీడ నుండి ఒకరు
గురిలో తుపాకితో వ్యాఘ్రంకై
చెట్టు కొమ్మ పైన ఒకరు

అపుడపుడూ గురి తప్పి! అనుకోకుండా
ఎవరికైన! తగల వచ్చు! అకారణంగా

చేతిలో వెలిగే సిగార్ బూది క్షణాలతో
కాలం గతమై నగమై మన వెను వెనుకనే!

❁

## 16. కవితలో జవాబుగా

ప్రశ్నలెన్నో చెవి పక్క నుండి జారతాయి
జవాబు లయితే! కొన్నిటికి మాత్రమే

కుర్చీలో కూర్చొనో
కిటికి కడ నిల్చొనో
కురిసేందుకు సిద్ధంగా ఉన్న నిండు మబ్బులా
అనుభవాల బరువుతో మెల్లగ అడుగులు వేస్తూ
కనిపించే వారిపై మెరపు చూపులతో
పెద్ద మనిషి ప్రబోధ వర్షం! విసరే ఉత్సాహంతో

ఆ వినిపించే మాటలెవరు వింటారు?
అవి తమలో మంటలుగా మండేనని
అవి తమపై వరదలుగా సాగేనని
అనుమానం సందేహం భయం ఒకటొకటీ
గాలిలో ఏవో మాటలు వినిపిస్తాయి
అర్థం తెలిసే లోపల! సమస్య! ఊడి పడుతుంది

పొరలి వచ్చే స్మృతులపై తేలుతూ
చంద్ర బింబం అందకుండా పోతుంది!
పేరు కొన్న అనుభవ శకలాలొకటొకటి
చేతనలో కిరణ స్పర్శతో కవితలో సరిస్తాయి

క్లాస్‌లో పాఠం వింటూ
నోట్ బుక్‌లో బొమ్మలు వేసే పిల్లల మనో రూపంతో
నాలో నవ కవితా లోకం
డూప్లెక్స్ నుండి మల్టిప్లెక్స్ చేరుతుంది

ఎక్కడి కక్కడ తోచేవీ చేరేవీ
కలుపు కొని పోవడమే కర్తవ్యంలా ఉంది
ప్రశ్నలతో, శబ్ద మయం కాలం
కవితలో కిర్మీరమై జవాబుగా

❁

## 17. ఆయువు సూత్రానికి

తనలో బాధను నీడలోకి విసరేసి
సెగలు లేని మనసుతో పయనించడమే!
ఎన్ని రంగులలో వస్తువులున్నా
చూపులోని తెలుపు రంగు మారదు

రాతిరి కళ్ళు తెరచిన లెక్కలేని తారలు
భూమి వైపు చూపులతో ఊరట నిచ్చేను
చీకటి స్పర్శతో చల్లబడిన వాతావరణం
ఉదయ కిరణ స్పర్శకై కోరిక పెంచుతుంది

చంద్రుడు బాధను మరపించేను
హృదిలో భయాన్ని తొలగించేను
పశ్చాత్తాపానికి రాత్రి మంచి అవకాశం
చీకటి నిశ్శబ్దంగా విశ్రాంతికి స్వాగతమిస్తుంది
చుట్టూ ప్రకృతితో పాటు సమాజం
కవితకు మౌనంగా తల వంచుతుంది

తెలుపు నలుపు లోని భావ ప్రపంచం కవిత
అక్షర పంక్తులలో సృజన గుణంతో దిగేను

అగ్ని నుండి బయట పడి తేజంతో
నీరు నుండి నేలపైకి శుభ్రంగా
స్వచ్ఛమైన గాలి చేత ప్రాణితమై
ప్రకృతి సమంగా సమాజ రుచులతో కావ్యం

మట్టి అంటకుండా మనిషి నడక సాగేనా?
నీరు సరించేనా? పైరు పంట చూచేమా?

పగలు రాత్రి వలె మనసుకు తోచే
తెలుపు నలుపు మంచి చెడుల భేదంలో
ఏ క్షణమూ కాలిన బొగ్గు కణం కాదు
ప్రతి క్షణం ఆయువు సూత్రానికి కుసుమం

❀

## 18. ఏ క్షణానికా క్షణం

బ్రతుకులో సగం పగలు సగం నిశ
చల్లని నిశ లేంది పగలు సెగలు ఆరే దెట్లా?
విరామ సుఖం లేంది, శమనం లభించేనా?
మరునాటికి ఉదయ క్షణం వెలుగుతుంది కర్పూరంలా

పగలయినా నిశ అయినా కాలం!
మనిషి దుస్తులకు కావలసిన వస్త్రం
దుస్తుల వాడుకలో ఎన్నికలో
మనిషి రుచులు భిన్న భిన్నం!

మబ్బు క్రమ్మి ఉదయం రవి కనిపించక పోతే
జీవన చక్ర భ్రమణం పోస్ట్ పోన్ అవదు
ఏ రోజూ రవి ఆగమనం! తప్పదు
బ్రతుకులో సమస్య నెదుర్కోక తప్పదు

రవి కిరణం మనిషికి ఉత్తేజకరం
మెలకువలో శక్తికి సంప్రేరణం
ధైర్యంగా ముందుకు నడిపిస్తుంది పగలు
ఉన్న స్థితిని చెదరకుండ నిలుపుతుంది రాత్రి

ఎపుడో వచ్చే కష్టానికి ఇపుడే
ఏడుపు! మానవ శక్తికి అపచారం
ఆలోచనలో చీకటి కుటి
వదలక పోవడ మొక దౌర్భాగ్యం

కాలం తుడిచేయలేని అక్షర రూపం
అశాంతిలో హ్లాదమయం ప్రబోధ యుతం
ఏ క్షణాని కాక్షణ మొక అమృత బిందువుతో
మనసును నింపుతుంది వర్తమాన కవిత్వం

❀

## 19. తీరని కోరికలు

ఎడారిలో పచ్చని తివాచిపై
చీకటిలో వెన్నెల పందిరిపై
కోరిక సహజం మనిషిలో
ఎప్పటికీ ఏదో మిగిలీ!

కలలు లేకపోతే మనసు గడ్డ కడుతుంది
ప్రవాహకతను కోలు పోతుంది! క్రమంగా
కలల ప్రేరణతో పయనించే వారూ ఉన్నారు
కలలు నమ్మి నిరాశను పొందే వారూ ఉన్నారు

రెక్కలు లేని మనిషి కలలో ఎగురుతాడు
ఇదో పెద్ద విమోచనం! మానసికంగా
మేఘ వాహనమయినా హంస వాహనమయినా
కల్పన లోనుండి వాస్తవానికి చేరక తప్పదు

తాను భూమిపై నడవాలనీ చెట్టులో కోరిక
గాలి బుజాలపై కొమ్మల చేతులు చాచి
ఇది పగటి కలగానే మిగులుతుంది
గాలి! ఎంత సహకరించినా
వేరులలో ఎగసే తీరు బలం ఉండదు
కోరిక తీరే అవకాశం విహగంలోనే
నింగిలో కోరిక! ఎప్పటికీ తీరనిదీ
తాను భూమిపై పరచుకొని
కార్పెట్‌లా అందంగా విలసిల్లాలనీ
మబ్బులు మెరపులు ఇంద్ర ధనుసు
రవి శశి చుక్కల సంపదతో!
జలధిలో బింబిస్తుంది! ఆశాలోకం!
ఆశాలోకం లేని బ్రతుకు లేదు
మానుష యత్నంతో సాధ్యం కొన్నే!

❁

# 20. వ్యక్తి రేఖలతో

వ్యక్తి గతంలో కల్పన రుచి వేరు
సంఘ పథంలో ఆలోచన వేరు
మౌన ముద్రలన్ని ఒకే వాలకం
లోని భావ జగం, దేని కదే భిన్నం

మెలకువలో సృజనకు లేదు విరామం
ఇది కవితకు బాగా అనువర్తిస్తుంది
ప్రతి క్షణమొక అనుభవ రమణీయం
మరొకరి కందే! నవ శబ్ద సాధనంతో

భూమి నుండి విత్తు వేరుతో మొలకై
ఎదిగే పరిణామ మొక రహస్య ప్రసారం
కనిపించే రూపంలో విధాలనేకం!
వస్తు శక్తి రేఖలతో ప్రాపంచికం

పూవు కోసినంత సులభం కాదు కవిత
ప్రతిమ చెక్కినంత కఠినం అసలు కాదు

మంచును స్కేటింగ్ పలకగ తీర్చాలని ఒకరు
నిర్ఘరిణీ రూపంలో చూడాలని మరొకరు
కవిత మాట్లాడుతుంది తీరంతో ప్రవాహంలా
తన హృదయం తెలిసిన మనుషులతో ఆర్ద్రంగా

చీకట్లను పూర్తిగ ఎవరూ పోగొట్టలేరు
వెన్నెలతో వెలుగులతో అదుపులో పెడుతుంది
ఆలోచనకు తన వెలుగు చేయి నందిస్తుంది
వెచ్చదనంతో అనుభూతిని మేల్కొలుపుతుంది

ఇది హృది కిటికీ నుండి దృశ్య సమాకలనం
వ్యక్తి శక్తి రేఖలతో సామాజిక వాస్తవం

❀

## 21. ప్రవేశం వ్యక్తుల ఇష్టం

అలల హస్త స్పర్శతో శిలలకు
ప్రవాహ హృదయం తెలిసేనా?
నింగి నలంకరించే స్తంభానికి
గాలుల మాటలు వినిపించేనా?

స్మృతి చిహ్నంగా ప్రతిమకు స్థానం
శిలను శిల్పంగా మార్చే కళతో మనిషి!
మస్తిష్క శాల నుండి తరలిన రూపాలెన్నొ
సమాజ పరిణామ వికాసాలలో ప్రతీకలై

ప్రతి మతిలో ఒక సమాజ దర్శనం
దిశ దిశలో పలు దృక్ కోణాలలో
అన్నిటినీ కలుపుతుంది మానవ తేజం
సృజన జగతిలో అన్నిటికీ ప్రవేశం

హింసలో ఒక నెత్తురు చార చాలు
బాధలో అనల పథం చూపుతుంది
కంటి నుండి ఒక బాష్పకణం చాలు
ఆర్తిలో అనల శిఖను నిలుపుతుంది

తొలి జీవన దశలో మొదలైన కథాంశం
ఇప్పటికీ! జన మానసికానుభవంలో
తరం నుండి తరం సర్గలు సర్గలుగా
ముగింపు లేనిదీ! సమాజ ప్రస్థానం

ఎన్నిసార్లు తొలగజేసినా పక్షి గూడు
అందని ఎత్తులో నిర్మితి జరుగుతూనే ఉంటుంది
జీవన క్రియలో విసుగులేదు విరామమూ లేదు
స్వేచ్ఛకు తెరచిన తలుపులతో ప్రజాస్వామ్యం
హృదిలో ఖడ్గంతోనా? పుష్పంతోనా?
ప్రవేశం మాత్రం పూర్తిగ వ్యక్తుల ఇష్టం!

❀

## 22. సృజన వరం

కవితలో చోటు దొరకని విషయం లేదు
చెట్లు మాట్లాడతాయి నడుస్తాయి కూడా
మబ్బుల వలె గగనంలో ఎగరనూ వచ్చు
కల్పనలో జీవితాలు గమనంలో వాస్తవాలు

మనిషి బుజాలపై చేతులేసి
చంద్రుడు భూమిపైన నడవచ్చు
నడవడిలో వాస్తవ కేంద్రాలతో
ఊహలతో కల్పనలు కవితలో

ఆకలిలో నోరు తెరచిన గగనానికి
చందమామ ఒక పెద్ద ఐస్ క్రీం కాండిల్
స్వర్గం నరకం ప్రసక్తిలో ఎన్నో!
భాషా దుస్తులతో, ఈ జాబితాలో

జీవన రూపంలో భాగమైన మనిషి
సంశ్లిష్ట సమాజంలో ఒత్తిడిలో బ్రతికేను
ఎంత వరకో అంత వరకు
శరీరంలో పనికి రానిది తీసివేసి
సరి చేయడ మొక ఘన కార్యం!

ఎక్కడికక్కడే  ముక్కలు చేసి
ఆగ్రహంలో బీభత్స దృశ్య పరంపరలతో
సందడి చేయడం! అనుచితం! అకార్యం
సమాజ నిర్మాణంపై పథక మవసరం
శస్త్ర చికిత్స పేరుతో ప్రచార ప్రకటనం,
కొందరి ఆర్భాటం! సమాజ విషయంలో ఇది అసహజం

స్వేచ్ఛలో నష్టానికి అవకాశంతో
వెంటనే నిర్మాణానికి ప్రాధాన్యం!
ప్రజాస్వామ్య దార్శనికంలో సృజన వరం
ప్రాణానికి హృదయంలా కవితకు కీలకం!

❀

## 23. మూల గుణం

ప్రకృతి ముఖ్య భూమికతో కాలం
కాలం నేపథ్యంలో మానవ జీవితం

విరిసిన ఉదయ మనోజ్ఞ పద్మం ఒక వైపున
దీని కెదురుగ సాయం జ్వాలారుణ చిత్రం
వెనుక నుండి వస్తువులను దాచే చీకటి
వస్తువులను బయట పెట్టే క్రియలో వెన్నెల!

అలలతో సముద్రం వలె వ్యక్తులతో సమాజం
జలధిని చేరే నదీ నదాల వలె, మానవ మతాలు

తొలి మానవ సంస్కృతి నిలయాలు తీరాలు
వాత్సల్యం ఉరక లేస్తూ కదలే జలాలతో
చూపే జల బిందువులో సృజన కళ మెరుస్తూ
ప్రేమను అందరికీ పంచుతూ ప్రవాహాలు

మనిషిలో దాహం తీరుస్తూ
అవనిపై క్షామం బాపుతూ
అనాథుని శ్రీనాథుని చేస్తూ
నిరాశకు తృప్తి రేఖ చూపేను

వ్యక్తిలో కఠిన పర్వత శ్రేణులు వరసగా
ఏదో ఒక శిఖరతలం నుండి కరుణ జలం!

కాత తగ్గవచ్చు ఆకు రాలవచ్చు
కొమ్మ వంగవచ్చు చెట్టు ఎండవచ్చు
రుతువులలో వసంతం చెట్టుకు ధైర్యం ఇస్తుంది

చివురు ముఖంతో పచ్చని హృదయం చూపుతుంది
చోరుడయినా హంతకుడయినా స్నేహ ఫలంతో
మానవ జాతికి అవసర మూల గుణం మిగులుతుంది

❀

## 24. హృదయం మాట్లాడుతుంది

హృదయం మాట్లాడుతుంది సూటిగా
తరువుతో మొయిలుతో నింగితో
మానుషీయం గురించి కవిత!
తనలో అంతరంగ రశ్మి స్పర్శతో

అస్తమించే రవికై ఎవరు దిగులు పడేరు!
రేపు ఉదయం తప్పక కనిపిస్తాడని నమ్మకం
చంద్రుడు హ్లాదంగా మనసు నలంకరించేను
రాత్రి గడిచిపోతుంది నిర్వ్యాపారంగా నిద్రలో

ఒక జాతి పక్షులన్నిటి పలుకులు ఒకటే
ఒక జాతి జంతువుల ధ్వనులు కూడ ఒకటే
మనుషుల విషయంలో మాత్రం ఎవరికి వారు!
ఎవరి మాట వారిది! వేరు వేరు వ్యక్తిత్వాలతో

ఇనుప ముళ్ళ కవచ ధారిని
గుండెకు హత్తుకునే దెవరు?
నాశన కర రణ పర్వంలో
వ్యూహానికి నాయకుడెవ్వరు?

ప్రమోదంలో కన్నా విషాదంలోనే
చరిత్రలో మనిషి పాత్ర దృష్టిని ఆకర్షిస్తుంది
ఎవరో గెలుస్తారు? తోటలో పూలు వస్తాయి
ఊరు చివర నున్న గుడిసెలు యథాతథం

ఒక మనిషి బ్రతుకు మరో మనిషి చేతిలో
ఒక మనిషి భవిత మరో మనిషి చేతలో
ఒక దశ వరకే లౌకిక జీవన వ్యవహారం
మానస విజయంతోనే నిజ భావనా జగం

❁

## 25. సంఘంలో పెద్ద పీట

కొండలతో సమంగా మనసులో బాధలు
చెలిమెలతో సమంగా కళ్ళలో బాష్పజలం
ఆయుధ క్రియ సమంగా మనిషిలో విద్వేషం
బ్రతుకొక విధంగా పీడన చణ బంధనం

వీటిని తొలగజేసే పూర్తిగ మాపజేసే
వీరు లెవరు? నేత లెవరు? విజయు లెవరు?

అవని తలం ముక్కలై రాజ్యాలుగ మారేను
మనిషి మనసు చెక్కలై వైరాలను పెంచేను
భూమి ఎంత ఇష్ట పడక పోయినా
నెత్తురు రుచి చూపుతుంది రణ పర్యవసానం

ముఖ మెంత నీడన ఉన్నా
గ్రీష్మంలో తాపం! చండచండమై
మనిషి ఎంత చికాకు పడినా
కుంభ వృష్టి వరదలు ఇంటిని చుట్టేను

ఎంత ముడుచుకొని కప్పుక పడుకున్నా
చలి స్పృశిస్తుంది, నిశిత నిశితంగా
రుతువుల ప్రభావ రూప మెవరు ఆపగలరు?
సమాజ పరివర్తన దశల నెవరు ఆపగలరు?

అవనితో అనుబంధం జీవితమంతా
మనిషితో సంబంధం అవసరాలలో
చేతిలో ఆయుధం భూమిని చేజిక్కించింది
గుండెలో మానవత మనసును వశ పరుస్తుంది

నావకు సుడి గుండం సమస్య అయితే
ఇది నడిపే నావికుని నిపుణతకు పరీక్ష
ఏ కాల మయినా ఏ రంగమయినా
సాహస గుణ హిత శక్తులకే పెద్ద పీట

❀

## 26. అంతర్జాల నవం

కీ బోర్డు
కలాలకు విరామాన్ని కలిగిస్తే
ఎస్ ఎమ్ ఎస్
లేఖలకు గుడ్ బై పలికిస్తుంది

సెల్ఫీ
చిత్రాల్ని ఫోటోల్ని మరపిస్తే
రొబొట్
మైనస్‌లో మతితో మనిషి ప్రతిని అందిస్తుంది

ఫేస్ బుక్
ఎవరెవరెరినో కలిసే పని తొలగిస్తే
ప్రింట్ అవుట్
ముద్రణ శాల చుట్టు తిరిగే పని తప్పిస్తుంది

ఇ- మెయిల్
దూరాన్ని తగ్గించీ వేగాన్ని పెంచేస్తే
సి.డి.
ఎదురుగ మనిషి బింబం నిలుపుతుంది

మతి విభవం మార్కెట్‌లో విరివిగా
హృదయం ఎక్కడి దక్కడ పదిలంగా

అంతర్జాల మయం కొత్త యుగం
సాంకేతిక విజ్ఞాన ప్రదర్శన రూపం
మనిషి ఎత్తు పెరిగి పోవడంతో
జీవన సంస్కృతిలో నవ పరివర్తనం

పై మెట్లను చేరడమంటే
క్రింది మెట్లను వదలడమేగా!
స్క్రీన్‌పై దృశ్యం శ్రవణం భేదాలతో
కవితోపాటు కవిత అంతర్జాల నవం
సరికొత్త అనుభవ రమణీయం
కుర్చీలో ఒంటరి ముందు ప్రపంచం

❁

## 27. శాంతి హృదయమొకటే

మనిషి మాట అంటే! మరొకరు వినాలనీ
సమాజ కథ అంటే! అది తన ప్రతిరూపం !
ఏ ఊరయినా! ఏ కథ అయినా !
మనుషుల జీవన ప్రకటన రూపం

తెరచిన హృదయం కిటికీ నుండి
కనిపించే మనుషుల ముఖ వేదిపై
ఉదయ కిరణ నృత్యం చూడాలని
ఆలోచన నవమై జన సంగతమై

శత సహస్ర దళ లలాటాలతో
కాల మహా రూప మెదురు పడుతుంది
శత సహస్ర పథ వికాసాలతో
నిజ సమాజ దృశ్య మెదురుపడుతుంది

మెలకువలో కనులు తెరచి నంత మాత్రాన
అంత శుభమే ! వరమే ! కనిపించేనా?
అలసటలో కనులు మూతబడే క్షణంలో
ప్రీతమైన కలలు గంతేసేనా?

ఇష్టమైన మనిషి మాట ఇంతలో అంతగా
నిప్పు రవ్వ వాడి ముల్లు కావడం విశేషం
కిరణ మెన్ని రంగులలోనో?
ఉదయ సూర్యబింబ మొక్కటే !
మహిపై మొలక లెన్ని విధాలో ?
కురిసే వాన చినుకు లొక్కటే!

వీచే గాలిని బట్టి మేఘం కదులుతుంది
పొందే ఊహను బట్టి  పయనం సాగుతుంది
సాగే నదులెన్నో? భూమి తలం ఒకటే !
రణ పథకాలెన్నో ? శాంతి హృదయ మొకటే !

## 28. మనసుకు వినిపించేది

ఏ వ్యక్తి ఒంటరి కాదు, బ్రతుకులో
తన వెనక పురా చరిత్ర విభవం
చుట్టూ వర్తమాన సమాజ చలనం !
నడతను తీర్చే సంస్కృతి గుర్తులు !

ఏ మనిషీ ఒక్కడు ! ఏదీ కాదు
సమాజ స్థితులకు ప్రతి బింబం
ఎన్నో అనుభవాల మధ్య ! పయనం
కల్పనలో పూర్ణత లేదు ! ఒంటరిగా

కమల నుండి జారే అశ్రువులో
సాయం సంధ్యా కిరణం జారుతూ
మనసు పై నిశీథి అడుగులతో
నీలి నీడ పొడవు సాగుతూ

వీరం జ్వలిస్తుంది, కరుణం నదిస్తుంది
ఇది అందరికీ కనిపించే భావ ప్రపంచం
ఎవరికి తోచిన అర్థంలో వారు
ఎవరికి నచ్చిన వర్తనలో వారు
ప్రమేయమో? ప్రభావమో? ప్రమాదమో?
ఏదయినా! తప్పనిదీ! చివరి రౌండు వరకూ

ఎంతమెచ్చినా ఎంత దూరినా
ఎంత మెరిసినా ఎంత నలిగినా
ఎవరి ప్రయోజనంలో వారు
చివరి మాట ఇదే ! ఎవరైనా !

మనిషి మనిషే ! మృగం కాదు, దైవం కాదు
హృదయమదే ! స్పందనమూ ! మానవమూ!
మోదమైనా ఖేదమైనా ఆయువులో
మనసుకు వినిపించేదొక పవన హృదయమే !

## 29. చరిత్ర పుటలో

తప్పని అమావాస్య రాత్రి చీకటిలో
బయటి తలుపు మూసినా తెరచినా ఒకటే
అన్నట్లుగ ఉన్న వేళలో సినీవాలి దృశ్యం
కను చూపులు ఆ సమయం దూసుకపోయేను

మనిషి లోని అనుభవ శక్తికి పరీక్షయై
ఇది ! సీమలు తెలియని కాల మహా రూపం
గీయ బడిన అగ్గి పుల్ల వెలుగు చాలు !
దారి చూపడానికీ కాలు వేయడానికీ

వివేకంలోను మనోమయమైన క్షోభ
నీలి రంగు రుమాలయి ముఖం కప్పుతుంది
జారే అశ్రువులో ప్రశ్న మెరుస్తుంది
లోపలున్న సమస్యను బయటికి తెస్తుంది

ఎవరి తొందరలో వారు
దీనిపై చూపు పడే దెవరికి?
ఒకరి దృష్టి పరచింతనపై
ఒకరి దృష్టి పరివారంపై
ఒకరి దృష్టి అధికారంపై
ఒకరి దృష్టి ధన సంపదపై

వాన చినుకు కోసం చెట్టు పరితపిస్తుంది
గ్రీష్మం గట్టెక్కే ఆశతో బ్రతుకుతుంది
నాశనకర మతితో ఖజాన గొడ్డలితో
వచ్చే మానిసికై చూడదు ! కోరిక వీడదు
బాధలో ఆలోచన ! సమాజ పథం చూపుతుంది
ఆర్తిలో పరితాపం ! సమాజ శక్తి నింపుతుంది

ఈ రోజే కాదు! రేపయినా ఒకటే
సూర్యుడదే ! కర్మసాక్షి! ఎప్పటికైనా
చరిత్ర పుటలో రాతను మార్చేసేది!
పరివర్తన గుణమొకటే మనుషులలో

## 30. ప్రగతి చేతనతో

శ్రమ జీవన శక్తితోనె ఏదేనీ నిర్మాణం
వెనుక నుండి సంకల్పం ఉత్తమ లక్ష్యంతో
చరిత్ర కొొక నవ సమాజ రూపం ఇస్తుంది

మానవ సత్వంతో ప్రతి గొప్ప పనీ
క్రియా శక్తి స్పందనతోనే సాధ్యం !
బాధలో అనల కణం ఎగిరితే ప్రమాదం
వ్యక్తి హింస మానవ సంస్కృతి కపచారం

ఊరు విడిచి పోయేదొక బ్రతకడానికే కాదు
సాధించే విజయాలకు సంప్రేరణ మవసరం
భౌతికావకాశంలో మెట్లను అధిరోహిస్తూ
సాధించే విలువలు విస్తరణం పొందడం!

చరిత్రలో మిగిలిన చెల్లని శాసనాల
నధిగమించి మును ముందుకు సాగడం!
ఏ సమస్యకూ జవాబు రెడిమేడ్‌గా దొరకదు
ప్రతిదీ ఆయుధ బల గతితో సమకూడదు

ఒక వస్తువు ప్రయోజనం మరో వస్తువులో ఒదగదు
బ్రతుకులు సంక్షోభంలో గిలగిల లాడవచ్చు
ఇది పేదరికం! ఆకలి ! విషయాలకు మితం కాదు
అభిమానం సమభావంతో మానవ విజయం లక్ష్యం

మానసికంగా ! ముందు స్వేచ్ఛ అవసరం
చరిత్రలో ఇది ! పూర్తికాని సంరంభం

చర్చలతో విభేదాల సమన్వయ నీతితో
నిర్ణయ గుణ రూపంతో ప్రజాస్వామ్యం
ప్రగతి బంధు చేతనతో సమాజ రూపమై
సహనం శాంతి వివేకంతోనే సాధ్యం

❀

## 31. మానుష గంధం - 1

**1**

మనిషి ! మనసు నొక పరిమళ కమల మనుకునేను
బ్రతుకు సరసులో అడుగున ఉన్నవి! మరచేను
జన్మకు జీవితమిది ! మోద ఖేద భావ సమం
తెలియని భావితమిది ! మరో జన్మ గగన సుమం

**2**

ఎప్పుడు ఎక్కడ ఇలపై మోదం కనిపించేను?
మండే గ్రీష్మం తలపై వర్షం సూచించేను !
తిమిరంలో స్నేహంతో దీపిక నడిపిస్తుంది
పయనంలో దాహంలో రసధుని బ్రతికిస్తుంది

**3**

మితిమీరిన స్వేచ్ఛలో చుట్టుకున్న వరదలలో
తన దారిన సాగుతూ పట్టులేని నడతలలో
వలయై అల! ఊగుతూ ఖేదం వినిపిస్తుంది
జల ఖడ్గం ! దూకుతూ విపదను విసరేస్తుంది

**4**

ఊహలో, అందిన వైపు నుండి మోదం
నడతలో, అందని వైపు నుండి ఖేదం
దారులు కలిసిన నగరం ! భవ్యం అనిపిస్తుంది
ఒకటై వెలసిన చరిత్ర ! నవ్యం తలపిస్తుంది

**5**

నిద్దురలో ముద్రలతో శిల్పమై తలపులతో
మెలకువలో లిప్తలతో ఝరిణియై మలుపులతో
ఊరటచే మోదం ! తాపంచే ఖేదం,
మానుష మొక గంధం ! చేతన ఒక స్పందం

## 32. మానుష గంధం - 2

**1**

పాముకు పక్షి భయం, నిప్పుకు నీటి భయం
మనిషికి మనిషి భయం, విప్పని మూట! నిజం
నాటిన విత్తుల నుండి కత్తులు మొలిచేనా?
ఎదిగిన కత్తుల చివరన వత్తులు వెలిగేనా?

**2**

అగ్నికి గాలి ప్రియం, ప్రాణికి గాలి ప్రియం
మనిషికి మనసు ప్రియం, విప్పిన మూట! నిజం
ఏ రుతువు నుండి బ్రతుకు తప్పుకోజాలదు
ఏ తలపు నుండి మనసు దూరమవజాలదు

**3**

పీడన మోచన వికాస చరిత్ర రూపం
వాదన విభవం కాదిది, చేతన విజయం.
పయనం మొదలైన స్థలం నుండి దారులెన్నొ
గమనంలో లక్ష్యానికి ఉన్న తీరులన్ని!

**4**

ఎప్పటివొ ! ఉత్తరాల దొంతరులుగ జ్ఞాపకాలు
అప్పటి కపుడొకటొకటి! అంతరువులు వదిలేసీ
సమాజ చలనంలో జన నిరీక్షలో సమస్య
మానస జ్వలనంలో ఒక పరీక్షగా అస్తిత

**5**

మనసు ఎన్నుకొనే అనుభవ లహరులు లేవు
మనిషికొక విధంగా ! దారులు మలుపులు పోవు !
బహు కాలం ఆనందం నింపే భావ జగం కవిత
క్షణ కాలం ఉల్లాసం ఒంపే! ఆట పదవ కాదు.

❀

స్వేచ్ఛా కవిత్వం - 75

# కార్నర్ కవితలు

మాదిరాజు రంగారావు



2017

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

**FREE VERSE**

**CORNER KAVITHALU**

by

Prof. Maadiraju Ranga Rao

© : Dr. M. Santhosh Kumar

Y.P. : 2017

Presented

to

my wife

**Smt. M. Indira**

on

her Birthday

# ఆలాపం

ఇది స్వేచ్ఛా కవిత్వం, "కార్నర్ కవితలు" ఒక ప్రయత్నం. పాటకాదు. ఆ లక్షణం వేరు. గేయం కాదు, ఆ పద్ధతిలో ఒదగదు. పద్యానికి దూరం. అయితే కవిలోని బలమైన కవిత్వ నేపథ్యం చేత ఆ ప్రక్రియల్లోని మౌలికమైన ప్రభావ స్పర్శ కనిపిస్తుంది. ఒక ప్రత్యేక విధంలో సృజన చేతన సాగుతూన్నప్పుడు, సరే సాగనీ! సహజతను పొందనీ! అన్న మనో రూపానికి స్వేచ్ఛనీయడం జరిగింది. నిర్దేశం పొందలేదు. నియతం కాలేదు. అందువల్ల ఈ కవితల్లో అనుభవానికి వచ్చే ఆవిష్కార రూపం స్వేచ్ఛా కవిత్వంగా భావిస్తాను.

కవిలో సంకల్పం అభిలాష అభిరుచితో కూడిన మనోవిధం, ప్రత్యేకమైన అస్తితకు ఆధారమైంది. ఇందులో 1) మానవ జీవితం – చుట్టూ ఉన్న సమాజం 2) ఎదుర్కొనే స్థితులు – రావలసిన మార్పులు 3) వాస్తవికత – దార్శనికతతో ప్రకాశించే "మానవీయం" ప్రధానంగా ఉంది. ఇది కృతిలో ఏక సూత్రతను నిలుపుతూంది. అందువల్ల ముక్త రూపంతో పాటు దీర్ఘ రచనగాను తలపుకు వస్తుంది.

"వాస్తవమూ కల్పనతో కవిత రెండు రెక్కలపై

నేడు నుండి రేపులోకి జీవన నవ యానం" గా సాగింది. నిర్వహణంలో ఒక విశిష్టతను గమనించవచ్చు.

ఇందులో బయటికి కనిపించే శబ్ద చలన ప్రసారాల వెనక నుండి, లోన "ఆలాప"స్వరం, ఒక్కొక్క కవితలో ఒక్కొక్క విధంగా అనుభవానికి వస్తుంది. దీనిచేత అభివ్యక్తిలో సులభతకూ సుగమతకూ శ్రావ్యతకూ చోటు లభించింది. ప్రవాహకత ఏర్పడింది. ఒక ఆకర్షణ అనుభవానికి వస్తుంది.

అనుభవాన గగన సుమం రేకులు విచ్చుకొనీ

మనసులోన మానవీయ గంధం నిలుపుతుంది."

ఆధునిక తెలుగు కవిత్వంలో ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనిక నిబద్ధతతో సామాజిక లక్ష్యంతో వచ్చే స్వేచ్ఛాకవిత్వానికి ఈ కృతి ప్రాతినిధ్యం వహిస్తూంది.

"విధ్వంసం ఏ స్థితిలో ప్రగతికి రూపం కాదు

నిర్మాణం ప్రతిస్థితిలో విజయానికి సంకేతం.

– మాదిరాజు రంగారావు

# 1. మీటే హృదయమవసరం

లోన మనసు సంవేదన గాథలలో పొరలేను
బయట ఉషసు స్వర్ణాకృతి అక్షరమై తరలేను.

ఒక సమయం తానొక శిలయై కదలనిది
మరు సమయం హత్తుక అలయై కదలేను

ప్రశ్నలు వేలాడుతూ లిప్తలు ఎదురయ్యేను
ఎదలోన జవాబుగా శిశురూపం మెదలేను.

కవిలో మానస నయనం వెలుగులు వదలేను
జన భావనతో సమస్య ప్రగతి వరించేను.

పెదవి వెనుక మాట ఆగుతుంది హఠాత్తుగా
జలధి గట్టు దాటలేని కెరటం లాగా,
ఇది విపదను ఆపుతుంది, ఆవేశంలో
ఇది వరదను నిలుపుతుంది, ఆ వేగంలో

జరిగిన కాలం
ఒకరికి మంచు బొమ్మ అవుతుంది
జరిగే కాలం
ఒకరికి అగ్ని చిత్రమవుతుంది

మౌనంలో ఆకాశం పరచిన ఆదర్శంలా
తిమిరంలో కనిపించని వస్తువు గుప్తంగా
ఇది బయట పడే అవకాశం ఎప్పటికీ
స్వేచ్ఛా కిరణంతో జనగణ స్వామ్యంలో

మనుషులలో మానవీయ తేజో రూపం
వెలుగుల తంత్రులు మీటే హృదయ మవసరం

# 2. సమస్య ఉరియై

తొలి కిరణం తాకగనే మౌనాకృతిలోని శిలలు
పులకరించి రావలసిన శిల్పి కెదురు చూచేను.

శ్రమ జీవన కళలో ప్రతి జడమొక విషయం
సృజనకు ప్రేరణలో ఒక సుందర శిల్పం

కష్టంలో బ్రతుకు జరిగినా, నష్టంలో మనసు చెదరినా
కాలం ఒక అర్థంలో స్మృతి చక్రం వదులుతుంది.

తమకేదీ తెలియనట్లు బ్రతకడమొక అమాయకం
తమ కన్నీ తెలిసినట్లు మెలగడమొక విడంబనం

గట్టు నుండి దూరమైన నావను చూచే, ఆ
చూపులోని బంధన మొక అనుభవ రమణీయం.

నీడను పట్టుకొని పోవాలని ఒకరు
అడుగు సాగనపుడు! మనిషి చేసే పని ఇదియే.

చూపులేని మనిషికి దీపంతో పనిలేదు
వెలుగు ఉన్న మనసుకు సాక్ష్యంతో పనిలేదు.

చెట్టు నీడ ఎంతో భద్రం! అనిపిస్తుంది
మనిషి నీడ సందేహంలో ఊగిస్తుంది.

తొలి కిరణం
తీగెకు కుసుమ ముఖం విప్పేను
ఉదయ రశ్మి
మనిషికి బ్రతుకు దారి చూపేను.

పూవు లేని తీగెలా నీరు లేని సరసిలా
శూన్యమైన బ్రతుకులో సమస్య ఒక ఉరియై

# 3. రోజుకొకటి నవ్వేను

ఎపుడో తగిలిన గాయం నుండి మచ్చ ఇపుడు
మరో విషమ ఘటనకు దారి తీయవచ్చు.

ఒక సమయంలో మౌనం కవచావృతమవుతుంది
మనసును నిశ్శబ్దంగా దారిలోన పెడుతుంది.

ఏదో చెప్పాలని, గగన మతికి ఉబలాటం
వాన చినుకుతో అది బయటికి వచ్చేస్తుంది.

ఏదో చెప్పాలని ధరణి ఎదకు పరితాపం
విత్తు నుండి మొలకతో బయటికి వచ్చేస్తుంది.

మనిషి కేదొ చెప్పాలని హృదిలో ఆరాటం
వినే మనిషి దొరకని ఒక సమయంలో
జలదమొ! చంద్రుడొ! హంసయొ! మరొకటొ
చివరకు మిగిలేదొకటే! అది స్వగతం.

ఆశా ఝరి ప్రవహిస్తూ ఆలోచనలో
నిండుగనో సన్నగనో జీవితమంతా
బాధల్ని కష్టాల్ని మోసుకపోతుంది
మోదాల్ని బంధాల్ని పంచుతుపోతుంది.

ఎచటి కెపుడు తరలేదీ తెలియని సంచారులు
గుడారాలలో గడచే, స్థిరత లేని బ్రతుకులు

జీవన సంకల్పంతో శిశిర ముఖంలోనూ
ఆయువుకు నవ కుసుమం రోజుకొకటి నవ్వేను.

ఌ

# 4. ప్రతి హృదిలో

భూమి లోన జలధి లోన నిధుల వోలె
లోన దాగి ఉన్న వెన్నొ మనుషులలో
ఇవి తెలిసిన రూపం తోనే పూర్ణత
ఇవి పొందిన విలువలతోనే అస్తిత

నేను నీవు ప్రజ కలిసిన సందర్భం
లౌకిక భూమికలో పాత్రల తోనే !
మానవ బంధంతో బ్రతుకులు సాగాలనీ
మానవ గంధంతో ఎదలను నింపాలనీ.

పుటక మొదలు పెంపకాన చిలుక లాగ
మాట నేర్చి చేత తెలిసి బ్రతుకు సాగి
ఉదయం వెలుగులతో మెరసే దినమణియై
చీకటిలో మానస హంసను మరచేరు.

కలుషమైన జలాలలో మునకవేసి పైకి తేలి
తమ స్వచ్ఛత శుభ్రతను లోకానికి చూపేరు.

మృగమొ! ఆయుధమో! నాశనకర రూపమొ!
మనసును వికార పరచి వదలుతుంది స్వార్థం.

వాస్తవమూ కల్పనతో కవిత ! రెండు రెక్కలపై
నేడు నుండి రేపు లోకి జీవన నవ యానం.

అక్షర కలశంతో కవి మనో విహగం
అమృత బిందువులను వదలుతుంది హృదిలో

# 5. క్షణం బ్రేక్

నీటిలో పడవలా నింగిలో మబ్బులా
నేలపై ప్రాణిలా కవితలో అనుభవం
బ్రతుకులో అపూర్వమైన అస్తిత చిహ్నం
అక్షరాల వెలుతురులో ఆశయ రూపం

ఉదయ సంధ్య సింహంలా అడుగులు వేస్తుంది
బంగరు జాలును విదలిస్తూ నడుస్తుంది
ముని మాపున చీకటి! ఏనుగులా మౌనంగా
మెల్లగ నడచే చిరు గిరిలా, మబ్బు తునకలా.

ఆగమనంలో వెలుతురు నిష్క్రమణంలో చీకటి
మనిషి బ్రతుకు! ఇరు కొసలను మనసు కలిపివేస్తుంది.

మనసులోని సూర్యుని తేజస్సు మానవం
ఇది కప్పబడే దొక నేర చరిత తోనే.

స్నేహలతకు పూవు! అందానికి తావితో
చేతి కంద నంత ఎత్తులోన సాగేను
ఇది ఏ జంతువుకో ఆహారం కావచ్చు.
పరాగమొ! పరిమళమొ! బాధకు గురి చేయొచ్చు.

ఆరోహణలో జీవితమొక సుందర వాస్తవం
నలువైపుల దాట రాని వైతరణులు కూడ

నిరంకుశం అణువణువన నిలిచిన స్తంభం ముందు
తల వంగిన క్షణ సమయం ! మానవ చరితకు బ్రేక్

చేతి నుండి జారిపోయి మానుషం
రాయి లాగ నిలిచిపోయి పదయుగం
ఏ విజయం సాధించేరు?
ఏ ప్రాణం వికసించేను?

# 6. గాలికి దగ్గరగా

నేల ఎక్కడయినా నిలిచేందుకు ఒకటే
నీరు ఎక్కడయినా దాహంలో ఒకటే
అగ్ని ఎక్కడయినా దహనంలో ఒకటే
వేరు వేరు కథలతో మనషుల బ్రతుకులు

శ్రామిక జీవన కారణ మౌషసి కిరణం
మానవ శక్తుల ప్రకటన పలు రీతులలో
రోజుకొక అపూర్వమైన అనుభవ రూపం
మనసుకు వికాస పూర్ణత కవకాశంతో

నివురు తోడ నిప్పులా నిజం మనిషిలో
నివురు నూదివేయు శక్తి ఎవరి కుంది?

నివురు లేని నిజం! ఎవరు భరించేరు?
కవి ! మనీషి! నేత! యోగి దార్శనికంతో

జారే బాష్ప కణం అదుము కొనీ
ఎగసే తాప శిఖల నణచు కొనీ
కదలుతుంది! మనీష! జలద పంక్తియై
అక్షర మయమౌ చినుకులు వదలుతుంది.

అందేదయినా అందనిదయినా
పుష్పంతో ఒకటై కవి హృదయం
సమాజ బంధంతో బ్రతుకుతుంది
బురదకు దూరంగా, గాలికి దగ్గరగా.

ఌ

# 7. పవన స్పర్శ

ఎర్రని గాయం రవి శకలం వలె నైన వేళ
కరుణ లహరితో పవనం ! ఊదుతు పోయేను
క్షామంలో బ్రతుకు ముఖం దీనమైన స్థితిలో
జలధి అలలపై పవనం! మొయిలు వార్త తెచ్చేను.

గడ్డ కట్టి నట్టి ప్రవాహం ఎదను దువ్వుతూ
బద్దలయిన అగ్ని పర్వతం తల నిమురుతూ
కష్టం నష్టం బాధలు స్పర్ధలు యుద్ధంలో
శాంత మనోమయ పవనం! కణకణం సమార్ద్రమై

పిడికెడు మృత్తికలో విత్తునుండి మొలకలా
పెరిగే జీవన కథ శాఖలతో ఆప్తమై
ప్రాణశక్తి పవనం భుజం తట్టి పోయేను
మనుషుల హృదయంలో బంధుతను నిలిపేను

కత్తులు తలపించే కొమ్మలతో తరువులు
నెత్తురు చారల చిత్రంలో వన దృశ్యం
తీవ్రవాద దార్శనికం ! పత్రికలో పతాకగా
సమాజ పరికల్పనలో భవితకు ప్రతినిధిగా

అడవిలోన ప్రకృతి పరిమళాలతో పవనం
కాడు లోని కోష్ణ ధూమ పంక్తి నందుకొనీ
జారిపడే ఆకులోని ఊపిరి వేదనతో
మనిషి శిరసు తాకి, గుండె నూపి పోయేను.

నాలో పవనం సమాజ చలనానికి సంకేతం
దిగంబరంలో మనిషిని కప్పే, అభినవ వసనం

౨౨

# 8. ప్రాణానికి పయనానికి

అద్దంలో తన ముఖ మెప్పటి కప్పుడు
కొత్తగ పరిచయమయిన విధంగా

మనసులోన వెలిగే రవి ఏమో కానీ
ముఖంలోన అయితే ! శశి బింబం తోచేను

ఎవరెవరో కలిసేరు క్షణాలు వెలిగించేరు
ఎవరెవరో కదలేరు క్షణాలు మండించేరు

జ్వలనంలో జీవన చలనానికి ఉత్తేజం
విధ్వంసం వెనుక నుండి, సృజన రచన అవసరం

అగ్గి బూది అయ్యేనని తెలియదెవరికి?
తెలిసిన నిజమయినా అవసరాలు తప్పనివి.

వాడుకలో వస్తువు కొక తప్పని స్థానం
కోరికతో భద్రమైన పేటిక తెరవబడీ.

వెలుగు పూల గుత్తితో ఉదయం ఎదురయి
ఆశల విస్తరణ మొక జీవన సహజం.
ఆహారం తప్పనిదీ! ఆకలి తీర్చేందుకు
ఇతరాలెన్నో చుట్టూ ధైర్యం ఇచ్చేందుకు

ఎవరి పనులలో వారు ! అనుమతితో పనిలేదు
అగ్గి పెట్టడం ఒకరు! గాలి విసరడం ఒకరు

ఏ దిశ నుండయినా గాలి!
ప్రాణానికి ఒకటే!
ఏ దిశ నుండయినా వెలుగు!
పయనానికి ఒకటే

ఌ

# 9. జ్ఞప్తికి వస్తుంది

కాలంతో ఒక లయలో పరుగెత్తే బ్రతుకులో
అనుభవ రమణీయమైన గుర్తు లొకరొకరిలో

స్ఫటికంలా ఆరంభం పొందిన జీవన రూపం
కిర్మీరంగా మారడమొక పరిణామ వికాసం

పొరలు తెరలుగా తీర్చబడీ
ప్రతి సమస్య ఒక బంధనమై
మానవీయ సుందరతను భగ్నం చేసే
నాశన గుణ మూలం, మనసున గుప్తంగా

మంచి నీరుతో నది ఎంతటి దయినా
ఉప్పు నీరులో చివరకు కలిసేదే.

కనిపించే ఏనుగుదంతాల్లా సత్యం ధర్మం
అవసరమైనది మాత్రం! పరీక్ష ఎదురైనపుడే.

ఫలితం తెలిసీ మరణంతో రణ పర్వం
తప్పని దవడం ఒక కటు వాస్తవ రూపం

ఒకరికి మరణం స్వాగత తోరణ మవుతుంది
సమాజ లహరులపై కదలే నావవుతుంది
ఒకరికి ఎప్పటి కపుడు పోస్ట్‌పోన్ అవుతుంది
అన్నిటికీ సంసిద్ధంగా ఉండే వారూ కొందరు!

అసలు రూపు కన్న బింబం, రమణీయమై
అసలు మనిషి కన్న పాత్రలు, కమనీయమై
ఏ వస్తువు కనబడినా జ్ఞప్తికి వస్తుందేదో
ఎప్పటిదో ! చరిత్రలో మరుగున పడిపోయింది!

# 10. ఒక మనిషి తప్ప !

మథనంలో పైకి ఏది తేలేనో!
విషమో! సుధయో జ్వాలా మాలయొ!

సమస్య నెదుర్కొనే సంకల్పం ముఖ్యమై
ఇది మానవ విజయానికి తొలి సోపానం

పట్టణమంటే, కోలాహల సంరంభం
నివాస మంటే, బంధు గణంతో బంధం

గడప దాటి బయటికి రాగానే
ఎదురుగ! ఆరాటంగా శునకం !
అడ్డంగా పరుగిడే బిడాలం!
రెక్క లార్చుతూ ఎగిరే విహగం.

వీటిని మరిపిస్తూ తొందరలో బ్రతుకులు
అవశ్య భోగ్యంగా ఎన్నిటినో వదలీ

గాయం అయినా ! సహనంలో ధైర్యంగా
కత్తిని కౌగిలిలో నిలిపే వారొకరు
పూల మాల చుట్టిన బాణంతో ఒకరు !
పెదవులపై తేనె పూత సూదులతో ఒకరు!

మేఘానికి విశ్వం సర్వం ఒకటే
ఎడారి మైదానం గిరి శిలలన్నీ

నింగి కప్పుక్రింద అవనీ హృదయంపై
అన్నీ భద్రంగా శిశువుల వలె! మనిషి తప్ప.

ॐ

# 11. డైరిలో పేజీ

జలనిధి తనలో బింబించే నింగిని
బహు తేలికగా వహిస్తుంది అలలపై

ధారుణి బుజాలపై వాలిన నీడ
శాలువలా సమలంకృత మవుతుంది.

ఎగిరే పతంగి! ఆకాశం ఎత్తులు పొడవులు
యోచన చేయదు ! ఆ లెక్కలతో పనిలేదు.

మనిషి బ్రతుకు వాలు వెంట ధునియై సాగేను
అననుకూలమైన చోట మలుపులు తిరిగేను

పైన సూర్య చంద్రులు! అయనంలో
కింద మనిషి ! జీవన యానంలో

రాజకీయ సమీకరణ రేఖలతో సమాజాలు
ప్రభావాల ప్రసారాల దృశ్యంతో జీవితాలు

మట్టి పొరలలో, విత్తు నుండి మొలక
సంశయ డోలికపై, ఊగదు ఆగదు
నవ్వు ముఖంతో బయటికి వచ్చేస్తుంది.
సృజనలోని జీవ కృతిని ప్రకటిస్తుంది.

రోజు కదలుతుంది ఆయువుతో
పేజి తిరుగుతుంది డైరీలో

# 12. వెలుగుతో నీడలా

చూడ తలచుకున్న ముఖం కనబడకుండా
పక్క నుండి మరో ముఖం అనుకోకుండా
వీధిలోన ఎవరెవరో ఆటంకంగా
చూపు వెనక నున్న మనసు స్థగితమవుతుంది.

జన సమ్మర్ధంలో దూరమైన మనిషితో
తోచే శూన్యత! మానసికంగా ! ఎప్పటికీ

పొంద దలచుకొన్నదేదొ! వశమవకుండా
పక్క నుండి మరో మనిషి! సడి లేకుండా

స్వేచ్ఛకు సంకేతం జలనిధిలో కెరటం
ఉత్సేకంతో పురోగమన శీలంతో
జన హిత భావనతో చెలియలి కట్ట హద్దుగా
అడుగు వెనక్కి పడే దొకసారే! పయనంలో

ఏదో ఒక ఈహ తలపు మెరవని ముఖం లేదు
ఏదో ఒక రాగ లహరి కదలని మనసు లేదు.

మనసు రాయిగ మారడమొక ఖేద కరం!
మనసు గాలిగ సాగడ మొక మోదకరం!

వివిధ వాద్య ధ్వనుల సంకలనం జీవితం
దేహ భాష హృదయ భాష రెండూ కలిసీ

మనుషుల మదిలో వెనక నుండి మరో మనిషి
జీసస్‌తో జూడాస్! వెలుగుతో నీడలా!

ఌ

# 13. తప్పనివీ బ్రతుకులో

శిశు దశ నుండి వృద్ధత వరకు
తమ తమ స్థాయిలలో శ్రేణులలో
సంఘానికమూల్యం ప్రతి బ్రతుకూ
క్షుద్రం కాదు, వ్యర్థం కానే కాదు

తమకు తాము లోయ లోన పడిపోయే
అపమతిలో మనుషులు! నింద లోకరిపై

తెలుపు నలుపు ఎరుపు రంగుల వెలుగుల మధ్య
ప్రభావాలతో మనుషులు గుర్తులు చెదరీ
గిరి శిఖరంపై నడచే ఆరాటం!
మబ్బులపై విహరించే ఆలోచన!

తెలియని అపాయ రేఖల అంచున
కాలంతో పరుగులతో బ్రతుకులు
మానవ చరిత్ర చలనంలో భాగాలై
సమాజ జీవన హృదయానికి వాల్వులయి!

ఎపుడో! ఎచటో! జారే పిడుగు భయంతో
రావలసిన వాన నెవరు నిరసిస్తారు?

ఆ వచ్చే మబ్బు నెవరు నిందిస్తారు?
ప్రకృతి ! మనిషి! కలిసే సన్నివేశ మొకటే!

దిశల తలుపు లెప్పటికీ తెరచి స్వేచ్ఛలో
చల్లని వెచ్చని గాలులు తప్పనివీ బ్రతుకులో

౦

# 14. వ్యక్తి నుండి

స్వేచ్ఛా కవితా రూపం శిల్పశాల కాదు
ఊహలు చేరతాయి. రేఖలు మారతాయి.

మాటల తరగల కదలికలో శబ్ద ప్రసారం
జీవన స్పందన భావనతో సృజన అపూర్వం

కవిత్వమూ సంగీతం వెలుగు పాత్ర లొకటే
మేఘంలా వేదనలో భావ ధార జారుతూ
చినుకుల తడితో చేతనలకు నిలయమై
అంతరంగ స్పృహతో సాకారం పొందేను.

జీవన నదిపై వంతెన కిరు కొసలతో
మోదం ఖేదం దృశ్యం పలు కథలతో

ఆరోహణతో అవరోహణ ! యానంలో
రెండిటి ప్రభావ స్థానం! అనుభవ దృశ్యం

అర్థయుతం నాదమయం ఆంతర ప్రేరణతో
వ్యక్తి నుండి విస్తరణం సమాజ బంధువై

కదలి పోవు గాలిలో తరలుతుంది శబ్దం
వెలుగుతూన్న మనసులో నిలుస్తుంది భావన

ఆకాశ చరిత్ర తనకు తెలియనిదయినా
పవన పథంలో విహగం యానం ఆగదు.

జలనిధి చరిత్ర తనకు తెలియనిదయినా
ఉపరి తలంపై పడవల యానం ఆగదు.

౨౨

# 15. ఒకే చేతన పార్శ్వాలు

అణచిన కోపం, రాతిరి స్వప్నంలో
జ్వాలా రూపంలో పై పై కెగసేను
ఉదయం మెలకువతో బూది పొరల నుండి
స్వర్ణ ప్రతిమయై మనసును మురిపించేను

నగరంలో దారుల కిరువైపుల నిలయాలెన్నో
గడప దాటి లోనికెవరు తలుపులు తెరుస్తారు !
తన ఇంటిలోని స్వేచ్ఛా చలనం దొరకేనా?
చెట్టు నీడ తోనే ! విశ్వ మానవీయం.

ఎవరు బదులు పలికినా, బదులు రాకపోయినా
పంజరాన చిలుక మాటాడుతుంది మనిషితో

మండే ఎండకు బీటలు వారిన భూమి తలం
వాన చినుకుతో ఒకటై సృజనకు సిద్ధంగా

కాలం ఆగదు, ఆగినట్లు! తోచేను
మనస్సు నిలవదు, నిలిచినట్లు! తోచేను

ఆశ లేవి అణగవు ! పూలను పూస్తాయి
దేని కోసమో ? చెట్టుకు తెలియని విషయం

హృదయ స్పందనతో, జీవితమొక ప్రవాహం
జల పాతానికి, నేలను తడపడమే లక్ష్యం

అనల కేతనం ! మనుషుల హక్కులకు దీపనం
కవుల బ్రతుకు కవిత ఒకే చేతన పార్శ్వాలు!

# 16. నను వెదకదు

నను వెదకదు ! వెంటాడదు ! మృత్యువు
దాని మెడకు చేతు లేసి శిశువులా!
గుండెకు హాయిని ఇస్తూ నేనుంటే
నను వెదకే దెక్కడ? ఏ తావులలో

మృత్యు భుజంపై అందంగా నేనొక వరంలా
తుపాకి గొట్టం చివరన సీతాకోక చిలుకలా

ఎన్ని పాట్లో ! గడచి గడచి వృద్ధాప్యం
సానలు తీరిన వజ్రంలా! సుందరమై
ఆల్బంలో ఫోటో ఎప్పటిదో బయటపడీ
కబురు లెన్ని ! చెబుతుందో ! అంతులేదు !

రవి కిరణం శశి కిరణం రెండూ తప్పనివీ
తేజం హ్లాదం రెండూ బ్రతుకున కవసరమై

కాలానికి ఇరువైపుల జీవన వాస్తవమై
వెలుగు నీడ ! మంచి చెడులు ! చలన విరామం!

శుభ నాదం రణ రావంతో చరిత్ర
పలు రంగులలో చర్యలతో మనుషులు

ఆయువు గడచే కొద్దీ ! అస్తిత్వం పలు విధాలు
సమాజ సంబంధంతో చిరునామా మారుతుంది.

పిడికిలిలో నీరు ఆగదు,
జారి బయట పడుతుంది
పెదవులపై కవిత నిలవదు,
సాగి బయటికొస్తుంది.

# 17. ఎత్తుల చదరంగంలో

తెలిసిన దారైతే పయనంలో పాతగా
తెలియని దారైతే పయనానికి కొత్తగా

చలనం లేని మనిషి బ్రతుకు లేదు
శిల వలె ఎచటో పడి ఉండలేరు

స్పందనలో చలన గమన శక్తులతో నిరతం
నవ సమాజ నిర్మాణం కల ! చేరువ అవుతూ
ఎప్పటికప్పుడు గమ్యానికి దూరం మిగిలీ
అసమత విషమత వైరం ద్వేషం జ్వాలలుగా

కులం కులం మధ్య చిచ్చు పొగ పందిరి నిలుపుతూంది
సూర్య రశ్మి నడ్డుతూంది! ఈ నేలకు సోకకుండ,
గతిలో వాస్తవ రూపం ! అలజడుల సమాజంలో
బాధిత జన భావనలో పరివర్తన సూచనయై

సూర్యుని కిరణంతో పోటీగా క్రమ్మి హిమం
తెరలు తెరలుగా నై నిజ దృశ్యం దాచేను

ఆ సమయం ఒక విషాద శకల ముఖంతో
ప్రేలనున్న అగ్ని పర్వతం లా అశాంతి !

లౌకిక సంరంభంలో గడచే మనుషులలో
వెలుగు నీడ కదలికలో ఎత్తుల చదరంగం!

పిల్లలతో పాటు పండు వయసు ముఖంలో
ఉదయ క్షణం వెలుగుతుంది పుష్ప గుచ్ఛమై

ꕥ

# 18. ప్రియవాద్యం

జలధి పైన గాలిలా ఆలోచన మనసులో
అలలు లేపుతుంది ముసు ముందుకు నడిపిస్తుంది.

ఏ అల ఎక్కడిదయినా! అప్పటికది అక్కడిదే
వర్తమాన సూచనతో భవిత వైపు పయనం

స్వేచ్ఛ కోరుతుంది మనసు ! జీవన ఫలాలకై
రాజకీయ సంఘ నీతి ప్రగతికి దారులలో

అడవులు ఎడారి గిరులు నదులు దాటి
విస్తరించి రాజ్యం హద్దులలో ఒదిగేను.

ఎప్పటికప్పుడు లోపలి సెన్సార్‌తో జీవితం
లేనిది! సమాజ రూపం! కటు సంక్షుబ్ధంలో

దేవతలయినా సరె! యుద్ధాలకు దూరం కాదు
బాధలకూ వేదనకూ లోనయి పోయిన వారే.

పూల గుత్తిగానో, వాలు కత్తిగానో
ఏది దేనికన్నది! సమయ భావ విషయం.

సమభావం వైరుధ్యంలో ఇరువైపుల
సందర్భం మనసుకు గమ్యం చూపుతుంది.

ఎవరి మనసు వారికి ప్రియ వాద్య విశేషం
అన్నిటితో సంబంధం కలిగి సమాజం

తుమ్మెద ఝుంకారంతో వచ్చి కుట్టి పోతుంది
సీతాకోక చిలుక మృదువుగ స్పృశించిపోతుంది.

ာ

# 19. జవాబులై వెలుగులు

కనిపించే ముందు వైపు నుండి ప్రశ్న
కనిపించని వెనుక వైపులో జవాబు

ఇరువైపుల లోని భిన్న వాద వివాదాలు
మారే విలువలతో నవ సమాజ రూపాలు

ఆరంభం ప్రశ్నతో అంతం తుది ప్రశ్నతో
మధ్య లోన సమాధాన ఖజానా జీవితం.

ప్రశ్నకు సమయం తీరికతో పనిలేదు
జవాబు కయితే ఎన్ని కలిసి రావాలో!

దీర్ఘంగా నడచి నడచి మహా నదులు
జలనిధిలో చేరి తృప్తిని పొందేనా?

ఎండిన కొమ్మలతో తరువొక ప్రశ్నయై
రుతువు మారి చివురు నవ్వుతో జవాబుగా

విత్తు నుండి ప్రశ్న! మొలకతో జవాబు
కొమ్మ నుండి ప్రశ్న! పూవుతో జవాబు
పుటకతో ప్రశ్న! బ్రతుకుతో జవాబు
దేనికదే నిజం! సమయ వాస్తవంలో.

సమస్య బంధం నుండి జవాబు ముక్తంలోకి
హద్దు లేని స్వేచ్ఛలో నవ సృజన చేతనం

పళ్ళెంలో కర్పూరం బిళ్ళలవలె ప్రశ్నలు
వెలిగించిన హారతిలో జవాబులై వెలుగులు.

ఌ

# 20. బ్యానర్‌తో

కాలం విషయంలో అంతా బయలే
మనిషిలో రహస్య పేటిక భద్రంగా

కాలానికి సృజన విలయ భేదం లేదు
మనిషికి మాత్రం దేనికదే ప్రత్యేకంగా

కాలమేది అవసరమో! అది మనిషికి ఇస్తుంది
మనిషి మాత్రమెన్నెన్నో! పూవుల వలె కోరేను.

కాలం కథ చెబుతాయి శిథిల సశేషాలు
వినేవారు దొరికితే బరువులు దింపుతాయి.

కనులలో నీరుతో విషాద ముఖాలతో
నెత్తురు రేఖలతో వెచ్చని చేతులతో
వాడిన తీరులలో మనుషుల రూపాలు
చూపులో వెలుగుతో; మాటలో నీడతో.

గ్రీష్మంలో ఎండకు గుడ్‌బై చెబుదామనుకుంటే
పగలు వీధిలో మామిడపండ్లు పిలుస్తాయి.

ఆమనికి ఆహ్వానం పలకాలని వస్తే బయటికి
గేటుముందు భిక్షువు, దీన ముఖంతో పొద్దునే.

కాలం చేతులలో పెరిగిన వ్యక్తులు
కాలాన్ని అధిగమించి పైకెదగాలని

మనిషి వెనక! మలి సంధ్య
చల్లని వీడ్కోలు బ్యానర్‌తో
మనిషి ఎదుట! తొలి సంధ్య
వెచ్చని స్వాగతం బ్యానర్‌తో.

# 21. నవ యుగమిది

నవ యుగమిది కోరుతుంది అందరిలో అపూర్వం
జీవన పథ సూచనతో దిన దిన మాశయ లక్ష్యం

ఎవరి కీర్తి పొగ కాదు ఎవరి సొంత ఆస్తి కాదు
ఎవరి మాట పైనొ స్వర్ణ కవాటం తెరవబడదు

వెలుగు షామియాన నీడన శ్రమ శక్తుల మేళనం
జలధి తరంగాల వోలె కదలే జన సమూహం

వ్యక్తి నుండి సామాజిక వలయాలకు చేరుతూ
శిశు దశతో మొదలై చివరి దాక సాగేను.

మంచు బొమ్మలా మారిన రాత్రి తరలిపోతుంది
వెలుగు బొమ్మలా మారిన పగలు కదలిపోతుంది.

మనిషి ముఖం దార్శనికతకు పతాకయై
మనిషి నడత పనులలో ఆగని యంత్రమై
నిశీథి నిశ్శబ్దం, ఉదయంతో శబ్దమయం
చేతనతో లిప్తలు మనిషిని నడిపించేను.

ఉదయ సంధ్యలో మొదటి చూపులో గులాబి
ముళ్ళ మధ్య బ్రతుకును తలపుకు తెచ్చేను.

జరుగుతూన్న బ్రతుకులో విలువలె ముఖ్యం
రాజ్యం ధర్మం విభవం అన్నీ ఆ తరువాతే.

విధ్వంసం ఏ స్థితిలో
ప్రగతికి చిహ్నం కాదు
నిర్మాణం ప్రతి స్థితిలో
విజయానికి సంకేతం.

## 22. ఆరదు చంపదు

అనల గోళ భ్రమణం వంటి పరిస్థితులలో
పద పదాన మానవతా స్పంద మవసరం

ఆయువు గడచే కాలం, వెనకకు మరలదు
పయనంలో వేసే అడుగులు మును ముందుకే

అనుభవాలు కదలుతాయి జీవన చర్చల గతిలో
ఆలోచన! సాగుతుంది, కల్పనలో భ్రమణంలో

ఆకృతిలో పోలిక లెన్ని కలిసినా
మానస క్షేత్రంలో మొలకలు వేరే!

గొడ్డలి వేటుకు కూలే చెట్టు కాదు
జీవిత మొక మానస చేతన రూపం!
అపాయాలు విఘాతాలు సహిస్తుంది
చిన్నదో! పెద్దదో ! కొద్దో! గొప్పో!

మంటల వలె ఎగసే వాదాల కిరువైపుల
కట్టిన హిమ తోరణ పంక్తి నుండి దారులు!

సార్థం స్వార్థం బంధం ఛిన్నంతో మనుషులు
మంటల వెను వెనుక నుండి శీతల పవమానం

రావలసిన కవిత కెదురు చూచేను హృదయం
వచ్చేసే నవత కెదురు పోయేను రూపం!
పోరాడే శిశువు లాగొ కదలాడే మబ్బులాగొ
ఆ సమయంలో అది ఒక కమనీయం, నవ దృశ్యం!

దీపం గాలికి ధగధగలాడుతుంది, ఆరదు
నిశి చీకటి మనిషిని భయపెట్టవచ్చు; చంపదు!

# 23. స్మృతిలో గంధం

ఇది స్వేచ్ఛా యానం జీవన రుచి నిర్దేశం
అవసరమూ అభిలాషల రెక్కలపై సంకల్పం

నడకనో వాహనమొ! అశ్వ రయమొ పథ పథం
భూమిపై నీటిపై గాలిలో పయనం సుగమంగా

ఊరు దాటి అడవి దాటి ఎడారి మైదానం నుండి
పరంపరా దృశ్య నవంతో నగరం రంగుల చిత్రం.

కాలి బాట ఎప్పటిదో సాచిన వేణువులా
సరిగమ పద నిస ధ్వనితో ముందుకు వెళ్ళడమే.

కశ్మలమూ! కంకాళం! అగ్నులు ! ధూమం
తెలిసిన వ్యథలూ, తెలియని కథలూ దారిన.

బంగరు వెలుగును చుట్టేసే పొగ దండలు
ఊపిరికై సతమతమయ్యే వాతావరణం.

పయనం కోరని చేయని మనిషి లేడు
గమనంలో విప్పారని మనసు లేదు
ఇది భౌతిక స్థాయిలో ఉత్తేజం ఇస్తుంది
ఇది మానస స్థాయిలో ఉత్ప్రేరకమవుతుంది.

అస్తితలో అనుభవ సుందరమౌ మార్పులతో
స్వేచ్ఛా యానం, స్మృతిలో పాయని సుమ గంధం.

అనుభవాన గగన సుమం రేకులు విచ్చుకొనీ
మనసులోన మానవీయ గంధం నింపుతుంది.

## 24. వికాస మతితో

ఆయుధాల ఉనికి లేని చరిత్ర లేదు
కనుల నీరు ఒలకన నట్టి బ్రతుకు లేదు.

అంగారం చే అలంకృతి పొందే సమరంలో
మరణానికి స్వాగతం పలుకుతుంది ఆయుధం.

బాష్ప కణం! శక్తి లేని మతి చిహ్నం కాదు
జీవ వంతమైన హృదయ స్పందన రూపం
బాధ వెనక కదలే దుఃఖ ఝరిణిలోని
విద్యుత్ చేతనయే మనిషిని నిలిపేను.

బాష్ప కళిక చివర నుంది ! వెలుగా? చీకటియా?
దీవెనయా? శాపనమా? రుచిరమా? కఠినమా?

బాష్ప ముఖం ఆర్త రవం లోని ప్రభావం
శిశిరమొ! తాపమొ! బయటికి విడుదల అయ్యేను.
దశల నుండి దశలకు చేరే పయనంలో
ఆశల దారుల రేకులు విప్పారేనా?

బాణ మయిన కత్తి అయిన సూది అయిన
ఏ ఒకరి నుండి ప్రశ్న! శత్రు సమం కాదు.

రెక్కలు విప్పిన శబ్దం
వెలుగులు విసరే అర్థం
పరిమళ లహరుల భావన
మనిషి మనిషికీ భిన్నం!

జీవన సంక్షోభంలో జన వికాస మతిలో
“శాంతి” స్వరంతో నవ మానవ రూపం!

# 25. మానుష హృదయంతో

ఏ సహనం శాంతి ప్రేమ కన్నీరును ఆపలేవు
ఏ విభవం ధనం విద్య కన్నీరును దాచలేవు.

శబ్ద తంత్రి పై వినిపించే రాగం హృదిదే
వెలుగు నీడ లోని మనిషి రూపంలో మర్మం.

శాఖలుగా చీలి నిలవడం తరువు గుణం
గుంపులుగా చీలి బ్రతకడం మనిషి విధం.

దైవం బదులుగ ప్రతిమను నిలపడమొక తృప్తి
ఆ రూపంలో మనిషిని దింపడమొక మాస్టర్ స్ట్రోక్

కారణమేదయినా స్నేహంలో వైరంలో
పూవు విసరినా నిప్పు చిమ్మినా! చర్య మనసుదే.

సిద్ధాంతం ఆదర్శం పైని వెలుగు బింబాలు
పయనంలో ఎవరైనా కింది నుండి మాత్రమే!

న్యాయం ధర్మం సంస్కృతి రాజ్యం ప్రతినిధులందరు
వరదలు వస్తే గాలులు వీస్తే చెదరే బొమ్మలు

పీడనలో అణచిన జన బాధారుణ శకలం
మానవ హక్కుల ధునిచే హ్లాదాకృతి పొందేను.

హింస చరితలోని పులులు! ఉగ్రవాద కణికలు
హంసల వలె తోచేదీ ! మానుష హృదయంతో

నిశీథి తళతళలాడే చుక్కలవలె ప్రశ్నలెన్నో
ఉదయం కళకళలాడే కళికలవలె జవాబులన్ని

౭౭

## మాదిరాజు రంగారావు కృతులు - 1953-2025

### A) స్వేచ్ఛా కవిత్వం

**❖ I.స్వేచ్ఛా కవిత్వం - మొదటి సంపుటం రచనా కాలం 1953 - 2002**

**i. స్వేచ్ఛా నవం :** 1. మానవీయం 2. పడగెత్తిన ఉదయం 3. ముక్తధాత్రి 4. ఇది వియత్నాం 5. యుగ సంకేతం **ii. 6. ఆవాహనం iii. 7. ముక్తకాలు. iv. సమయ దర్పణం :** 8. నాలో ప్రవహిస్తోంది నది 9. నాకు జ్ఞాపకముంది **v. 10. కిర్మీరం** 11.మనోభూమికలు **vi. వర్తమానం స్క్రీన్ పై :** 12. వెలుగులో ఈ నేలపై 13. మేల్కొన్న ఈ సమయం 14. శబ్దమయి ప్రాణమై 15. అగ్నిమయం జీవితం 16. కాలాన్ని నిలిపి క్షణం 17. ఈ తరం స్వరచిత్రం 18. అశాంతి ఆర్కెస్ట్రా 19. వర్తమానం స్క్రీన్‌పై **vii. 20. అగ్ని నుండి ఆనందానికి viii. ఈ శాతాబ్ది రెక్కలపై** 21. జైలు కార్నర్ నుండి 22. ప్రయాణం నుండి ప్రయాణం 23. డైరి దర్పణంలో 24. ఈ శతాబ్ది రెక్కలపై 25. శాంతి స్వప్నం **ix. అగ్నిపిఠం** 26. క్రాస్ ఫైర్ 27. సీజ్ ఫైర్ 28. నేడు రేపు మధ్య **x. 29. కిరణ పథం** 30. స్వేచ్ఛకు సిగ్నెల్

**❖II. స్వేచ్ఛా కవిత్వం - రెండో సంపుటం రచనా కాలం 2003 - 2012**

31. అభిషేకం 32. ఆగమనం 33. ఎప్పటికీ కొత్తే 34. సృజన దర్శనం 35. మరో వైపు 36. హృదయ మేఘం 37. సమకాలీనం 38. అభినవ యానం 39. ఆత్మ బంధం 40. సృజన మేఘం 41. ఉగ్ర చరణం 42. సవారంభం 43. గిఫ్ట్ ప్యాకెట్ 44. నవ దర్శనం 45. పునర్దర్శనం 46. నడిచే వెలుగు చుట్టూ 47. అపూర్వ 48. అజ్ఞాతం నుండి 49. రోజు వస్తుంది 50. ఉద్యమ చరణం 51. ఆల్బంలో ప్రజాస్వామ్యం 52. అద్దంలో ప్రజాస్వామ్యం 53. ప్రవాహంలో ప్రజాస్వామ్యం

**❖III.స్వేచ్ఛా కవిత్వం - మూడో సంపుటం రచనా కాలం 2013-2015**

54. ఖడ్గం కన్నీరు కార్చదు 55. చార్ ధామ్ 56. ఆల్ ఇన్ వన్ 57. ఉద్యమ పథం 58. అడవిలో ఆయుధం 59. చెదరిన ప్రజాస్వామ్యం 60. గాయ పడిన ప్రజాస్వామ్యం 61.ఈనాటి నిజం 62. ఇంకా బహు దూరంలో ప్రజాస్వామ్యం 63. సంస్కృతి & హృదయం నుండి 64. తెలంగాణ స్వరం, ఆత్మబంధం

**❖IV. స్వేచ్ఛా కవిత్వం - నాలుగో సంపుటం రచనా కాలం 2015 నుండి 2018**

65. వర్తమాన స్వనం 66. లైన్ క్లియర్, 67. వర్తమాన వాస్తవం 68. వర్తమాన లహరి 69. వర్తమాన యానం 70. వర్తమాన సంకేతం 71. ఇదే దారి 72. నవ మానవం 73. ప్రపంచీయం 74. హృది కిటికి నుండి 75. కార్నర్ కవితలు

**❖V. స్వేచ్ఛా కవిత్వం - ఐదో సంపుటం రచనా కాలం 2017 నుండి 2019**

**ఇది జీవితం :** 76. ప్రశ్నలతో ఇప్పటికీ 77. బ్రతుకులో కవితయై 78. గమ్యంపై గురితో 79. అస్మితలు, అస్తితలు 80. వాస్తవ చక్రంపై 81. ఎవరి దారి వారిది 82. అశాంతి పరిచయం 83. కవిత నా ఆత్మ 84. కాలం కప్పులో 85. నిప్పు రెక్కలపై 86. సమాప్తి కాదు 87. కాలానికి కృతజ్ఞతలు 88. సమయ పథం 89. ఇది అందరిదీ 90. సమాంతరం 91. ప్రాణం కన్న మిన్న 92.

వర్తమానం ఆనవాలు  93. నీడ నుండి వెలుగులోకి 94. అక్షర ముకురం 95. జీవితం స్వతంత్రం 96. కాలంతో నేను 97. కర్తవ్యంలో కవిత

**❖VI. స్వేచ్ఛా కవిత్వం – ఆరో సంపుటం రచనా కాలం 2019 నుండి 2020**

98. ఏది కవిత 99. వర్తమానం ముందుకే 100. మార్పుకు సిగ్నల్ 101 కవిత ప్రభుతతో 102 హృదయ దర్పణం 103. నేను నేనే 104. స్వేచ్ఛలో స్వతంత్రం 105. భవితకు సంకేతం 106. అక్షరంలో స్వేచ్ఛ – సమాజ యానం 107. స్వేచ్ఛలో బంధనం 108. కాక్‌టెయిల్

**❖VII. స్వేచ్ఛా కవిత్వం – ఏడో సంపుటం రచనా కాలం 2020 నుండి 2022**

109. రేపటికి రిజర్వులో 110. అక్షతం 111. లాక్‌డౌన్ 112. వర్తమానం మెట్లమీంచి 113 అజేయం 114 ఈ వారం కవిత 115. గుడ్ బై 116. అక్షర హృదయం 117. గాయ పడిన శాంతి  118. వార్తలో కవిత 119. నిప్పులపై మేఘం 120. తెలియని వాస్తవం

**❖VIII. స్వేచ్ఛా కవిత్వం – ఎనిమిదో సంపుటం రచనా కాలం 2022 నుండి 2023**

121. మార్నింగ్ వాక్ 122. విప్లవ ప్లవనం, స్వేచ్ఛలో మనోజ్ఞం 123. అదృష్టం 124. మేల్కొన్న కవిత 125. ఆగని పయనం 126. కవిత్వమొక థెరపి, తెలంగాణ స్వరం

**❖IX. స్వేచ్ఛా కవిత్వం – తొమ్మిదో సంపుటం రచనా కాలం 2023**

127. హృది నుండి హృదికి 128. రౌండ్ టేబుల్ 129. మానస తంత్రులపై 130. సరికొత్తగ 131. ఆశానవం 132. మౌనం మాట్లాడుతుంది 133.శిల నుండి రసాకృతి 134. అశాంతి చక్రంపై 135. మేనిఫెస్టో

**❖ X. స్వేచ్ఛా కవిత్వం – పదో సంపుటం రచనా కాలం 2024**

136. కవిత సర్వ స్వతంత్రం 137. ఇది మలి తెలంగాణ 138. నిజయానం – (బొన్సాయ్ అనంతం)  139. స్వేచ్ఛామేఘం, మెరపులు తలపులు  140 స్వేచ్ఛా పవనం

**❖ XI. స్వేచ్ఛా కవిత్వం – పదకొండో సంపుటం రచనా కాలం 2025**

141. జీవన దర్శనం 142. అద్దంలో అనల చిత్రం 143. ముక్తకాలు 144. ఆశాబన్ధం

**B) పరిశోధన – సమాలోచనం**

1. కవిత్రయం సృజనకళ (సిద్ధాంత గ్రంథం) 2. నవల స్వరూపం 3. పరిశోధనా స్వరూపం 4. అధికార భాష 5. అనువాద కళ 6. దాశరథి కవితా సమాలోచనం 7. ఆలోకనం 8. సమదర్శనం 9. సృజన రూపం–మానవీయ భావన 10. సృజన చేతన–భావ రూపాలు 11. Facets of to Free-verse 12. శ్రీశ్రీ మహా ప్రస్థానం–సమాలోచనం 13. రామాయణ కల్పవృక్షం–సృజన చేతన 14. స్వేచ్ఛా కవిత్వం ప్రజాస్వామ్య దర్శనం 15. స్వేచ్ఛా కవిత్వం – మానవీయ దర్శనం 16. స్వేచ్ఛా కవిత్వం–సహృదయ స్పందనం 17. గురజాడ ఆధునిక చేతన (2013) 18. కవితా సమాలోచనం–2017 19. కవితల సమాలోచనం 2019 20. సాహిత్య విమర్శ వ్యాసాలు

# సంక్షిప్త పరిచయం



మాదిరాజు రంగారావు గారి జననం జూన్ 8, 1935న పండితాపురం గ్రామం, ఖమ్మం, తెలంగాణ రాష్ట్రం. మాదిరాజు రంగారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసి నిజాం కాలేజీ ఉస్మానియా యూనివర్సిటీ (O.U), హైదరాబాద్, తెలంగాణలో చేరారు. మాదిరాజు రంగారావు తెలుగు మరియు సంస్కృత సాహిత్యంలో M.A. సంస్కృతం 1960 (O.U), M.A. తెలుగు 1962 (O.U), Ph.D. తెలుగు 1966 (O.U) మరియు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యు.జి.సి, UGC) యొక్క పరిశోధనా పండితులు.

డాక్టర్ మాదిరాజు రంగారావు ఆంధ్ర మహాభారతం మరియు ఆంధ్ర మహాభాగవతం యొక్క విమర్శనాత్మక సంచికా సంపాదక మండలిలో సభ్యులుగా ఉన్నారు. 1964లో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో డాక్టర్ రావుకు మొదటి విద్యా సంబంధ నియామకం లభించింది. ఆ తరువాత తెలంగాణలోని వరంగల్‌లో ఉన్న కాకతీయ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా మరియు డీన్‌గా సుదీర్ఘ కాలం పనిచేశారు. ఆచార్య రావు యు.జి.సిచే మంజూరు చేయబడిన రెండు ప్రధాన పరిశోధన ప్రాజెక్ట్ గ్రాంట్‌లకు మరియు భారత ప్రభుత్వ మానవ వనరుల శాఖ, న్యూఢిల్లీచే స్పాన్సర్ చేయబడిన ఒక పరిశోధన ప్రాజెక్ట్ గ్రాంటుకు ప్రధాన పరిశోధకులుగా ఉన్నారు. ఆచార్య రావు 'రసధుని సాహితీ పరిషత్తు' అనే సాహిత్య సంస్థకు వ్యవస్థాపకులు మరియు అధ్యక్షులుగా ఉన్నారు. ప్రముఖ కవి, రచయిత మరియు సాహిత్య విమర్శకులైన ఆచార్య మాదిరాజు రంగారావు, సాంప్రదాయ సాహిత్యం, ఆధునిక కవిత్వం మరియు విమర్శతో సహా తెలుగు సాహిత్యం యొక్క వివిధ ప్రక్రియలకు విస్తృతంగా సేవలనందించారు. మాదిరాజు రంగారావు గారు తమ స్వేచ్ఛా కవిత్వం మరియు సాహిత్య విమర్శ రచనల ద్వారా సమకాలీన ఆధునిక తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నారు. ప్రముఖ పత్రికలైన భారతి, స్వతంత్ర, స్రవంతి, జయంతి, ఆకాశిక, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి మరియు ఆంధ్రభూమి వంటివి, మాదిరాజు రంగారావు గారి సృజనాత్మక రచనలను క్రమం తప్పకుండా ప్రచురించాయి.

ఆచార్య మాదిరాజు రంగారావు కవిత్వానికి మూల స్తంభం మానవతా ఆదర్శాలు మరియు శాంతికి ప్రతీకగా నిలిచే ప్రజాస్వామ్య దృక్పథం. ఇదే వారి స్వేచ్ఛా కవిత్వానికి ఆయువు పట్టు. మాదిరాజు రంగారావు గారు స్వేచ్ఛా కవిత్వ ప్రక్రియలో సాగించిన ప్రస్థానం వారి విశిష్ట వ్యక్తిత్వం, సామాజిక స్పృహ, మానవతా భావాలు, ప్రజాస్వామ్య సామ్యవాద సామరస్య దృక్పథం మరియు శాంతి సందేశం ద్వారా సుసంపన్నమైంది. మాదిరాజు రంగారావు గారి 'పరిశోధన మరియు సాహిత్య విమర్శ' రచనలు సాంప్రదాయ సాహిత్యం, సాహిత్య ఇతివృత్తాలు, భావజాలాలు, మానవ అంశాలు మరియు సార్వత్రిక దృక్పథం యొక్క సృజనాత్మక మరియు కళాత్మక విశ్లేషణపై దృష్టి పెడతాయి. తన సుదీర్ఘమైన మరియు అత్యంత ఫలవంతమైన సాహిత్య జీవితంలో, ఆచార్య మాదిరాజు రంగారావు యొక్క సృజనాత్మక రచనలు జూన్ 21, 2025న వారు కాలధర్మం చెందిన నాటికి 'స్వేచ్ఛా కవిత్వం' పై 150కి పైగా, సాహిత్య విమర్శపై 20కి పైగా, మొత్తం సుమారు 170 పుస్తకాలుగా వెలువడ్డాయి.

## BRIEF SKETCH



Madiraju Ranga Rao was born on June 8, 1935, in Pandithaapuram village, Khammam, Telangana. Madiraju Ranga Rao completed High School Education from Govt. High School, Khammam and joined Nizam's College Osmania University (O.U), Hyderabad, Telangana. Madiraju Ranga Rao was a student of Telugu and Sanskrit literature, obtained M.A. Sanskrit 1960 (O.U), M.A. Telugu 1962 (O.U), Ph.D. Telugu 1966 (O.U) degrees and was a research scholar of the University Grants Commission (UGC).

Dr. Madiraju Ranga Rao was a member of the Editorial Board for the critical editions of Andhra MahaBharatham and Andhra MahaBhagavatham. Dr. Rao's first academic appointment in 1964 was with the Department of Telugu, O.U, Hyderabad, then a long tenure at Kakatiya University, Warangal, Telangana as Professor, Chair Board of Studies, and Dean for Faculty of Arts followed. Prof. Rao was the Principal Investigator on two major research project grants awarded by UGCand one research project grant sponsored by the Department of Human Resources, Govt of India, New Delhi. Prof. Rao was the Founder and President of 'Rasadhuni Sahithi Parishath' literary organization.

Prof. Madiraju Ranga Rao, an acclaimed poet, writer and a literary critic, contributed extensively to various literary genres of Telugu literature including classical literature, modern poetry, and criticism. Prof. Rao established his niche in contemporary modern Telugu literature through his literary works in 'Free Verse'(Swecchaa Kavithvamu) and Literary Criticism. Popular journals published his creative writings on a regular basis and this list includes Bharathi, Swathanthra, Sravanthi, Jayanthi, Akashik, AndhraPathrika, AndhraPrabha, AndhraJyothi, AndhraBhoomi and several others.

Central to Prof. Madiraju Ranga Rao's poetic purpose was humanistic ideals and a democratic ideology that symbolized peace. This was the very essence of his 'free verse' poetry. Prof. Madiraju Ranga Rao's journey in the genre of 'free verse' poetry is enriched by his unique personal spirit, social consciousness, humanitarian feelings, a democratic ideology, and a message of harmony. A substantial number of Prof. Rao's contemporary modern 'free verse'poetic works are based on his creative mindset pertinent to historical development, existing situations, social realism, element of reason and reform, humanistic sentiment with a sign of peace and harmony. Prof. Rao's 'literary criticism' works focus on creative and artistic analysis of classical literature, literary ideologies, human elements, and universal outlook. During his long and highly productive literary career, Prof. Madiraju Ranga Rao's creative writings culminated in more than150 books on 'free verse' poetry and over 20 books on 'literary criticism' – a total of about 170 books – published until his departure on June 21, 2025.

9 789356 550902